www.andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI

చిట్టెమ్మ..
రోబో టీచర్!
భారత్ తయారీ రోబోలతో హైదరాబాద్‌లో బోధన
కృత్రిమ మేధతో పని చేయనున్న రోబోలు
సాంకేతికతను చిన్నారులకు చేరువ చేసేందుకే..
రాష్ట్రంలో తొలిసారిగా నెక్స్ జెన్ స్కూల్‌లో ఏర్పాటు 14



రోబో టీచర్లు

మంగళవారం | 11-6-2024 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 65 సంచిక (Issue) : 56 | హైదరాబాద్ సిటీ

శ్రీ క్రోధి నామ సంవత్సరం, ఉత్తరాయణం, గ్రీష్మరుతువు, జ్యేష్ఠమాసం, శుక్లపక్షం; తిథి: పంచమి సా. 5.28 తదుపరి షష్ఠి; నక్షత్రం: ఆశ్లేష సా. 5.28 తదుపరి మఖ
వర్జ్యం: ఉ. 11.31-1.15; దుర్ముహూర్తం: ఉ. 8.20-9.12, రా.10.20-11.03; అమృతఘడియలు: రా. 9.55-11.39; రాహుకాలం: మ. 3.00-4.30; సూర్యోదయం: 5.44; సూర్యాస్తమయం: 6.45

Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

అదిగో పులి?
రాష్ట్రపతి భవన్ వీడియోలో గుర్తింపు
పిల్లిగా అనుమానిస్తున్న అధికారులు
సోషల్ మీడియాలో వైరల్‌గా వీడియో 2


మంత్రులు ప్రమాణం చేస్తుండగా వెనక వెళ్తున్న జంతువు

అమిత్ మాలవీయ స్త్రీలోలుడు
పశ్చిమ బెంగాల్‌కు వచ్చినప్పుడల్లా పలువురితో శారీరకంగా గడిపేవాడు 12
బెంగాల్ బీజేపీ నేతలు పదవుల కోసం అమ్మాయిలను సరఫరా చేస్తూనే ఉంటారా?
బెంగాల్‌కే చెందిన శంతను సిన్హా సంచలన ఆరోపణ.. ఆరెస్సెస్ ప్రతినిధిని వ్యాఖ్య
తీవ్రంగా ఖండించిన మాలవీయ.. శంతనుపై రూ.10కోట్లకు పరువు నష్టం దావా
మాలవీయను వెంటనే బీజేపీ ఐటీ సెల్ చీఫ్ పదవి నుంచి తొలగించాలి: కాంగ్రెస్



బొగ్గు, గనులతో దేశానికి ఆదాయం
మిషన్-100 డేస్ అజెండాతో ముందుకెళ్తా
సమర్థంగా బాధ్యతలు నిర్వహిస్తా: కిషన్‌రెడ్డి
పార్టీ రాష్ట్ర శాఖల అధ్యక్షుల మార్పు ఉంటుందన్న కేంద్రమంత్రి 13

మరో 3 కోట్ల ఇళ్లు
ప్రధానమంత్రి ఆవాస్ యోజన కింద నిర్మాణం.. గ్రామాలు, పట్టణాల్లో మంజూరుకు ఆమోదం

కేంద్ర మంత్రివర్గ తొలి సమావేశంలో నిర్ణయం
కోట్లాదిమంది జీవితం సుఖమయమే లక్ష్యం
ప్రతి పౌరుడికి మెరుగైన జీవితమే కర్తవ్యం
'పీఎం కిసాన్'పై ప్రధాని మొదటి సంతకం
రైతు సంక్షేమానికే మా ప్రాధాన్యం: మోదీ
వచ్చే ఐదేళ్లు వ్యవసాయంపై ప్రత్యేక దృష్టి
నిత్య విద్యార్థిగా ఉండడమే విజయ రహస్యం
ఇది ప్రజల పీఎంవో: ప్రధాని మోదీ వ్యాఖ్య
రాష్ట్రాలకు రూ. 1.40 లక్షల కోట్లు విడుదల
తెలంగాణకు రూ. 2,900 కోట్లు మంజూరు


కేంద్ర మంత్రివర్గ సమావేశంలో మాట్లాడుతున్న ప్రధాని మోదీ. చిత్రంలో మంత్రులు

న్యూఢిల్లీ, జూన్ 10(ఆంధ్రజ్యోతి): ఎన్నికల మ్యానిఫెస్టోలో ప్రకటించిన విధంగా భారీ ఎత్తున ఇళ్ల నిర్మాణానికి బీజేపీ సారథ్యంలోని కేంద్ర ప్రభుత్వం అడుగు ముందుకేసింది. మూడో విడత ప్రభుత్వం ఏర్పాటయ్యాక.. సోమవారం ప్రధాని మోదీ నివాసంలో మొదటి సారిగా సమావేశమైన మంత్రివర్గం ఈ మేరకు నిర్ణయం తీసుకుంది. ప్రధానమంత్రి ఆవాస్ యోజన (పీఎంఏవై) కింద గ్రామీణ, పట్టణ పేదలకు మూడు కోట్ల ఇళ్ల నిర్మాణానికి సంబంధించిన ప్రణాళికను ఆమోదించింది. కోట్లాదిమంది గృహావసరాలను తీర్చేందుకు పీఎంఏవై దోహదం చేస్తుందని, పథకం విస్తరణ.. సమ్మిళిత వృద్ధి, సంక్షేమం పట్ల తమ ప్రభుత్వ నిబద్ధతను చాటుతుందని మోదీ ట్వీట్ చేశారు. దేశంలో ప్రతి పౌరుడు మెరుగైన జీవితం పొందేలా చూడడమే తమ కర్తవ్యమని పేర్కొన్నారు. కొన్నేళ్లుగా ఇంటి నిర్మాణానికి అర్హులైన కుటుంబాల సంఖ్య పెరిగిందని, అందుకుతగినట్లుగా సాయం అందించాలని నిర్ణయించినట్లు అధికారులు తెలిపారు. పదేళ్లలో పీఎంఏవై కింద 4.21 కోట్ల ఇళ్ల నిర్మాణం జరిగింది. కాగా, లోక్ కల్యాణ్ మార్గ్-7లోని నివాసంలో జరిగిన సమావేశంలో మోదీ మొత్తం క్యాబినెట్ మంత్రుల పరిచయ కార్యక్రమం నిర్వహించారు. ఒక్కొక్కరి నేపథ్యాలను తెలుసుకున్నారు. 18వ లోక్‌సభ ఏర్పాటు చేయవలసిందిగా

మిగతా 2వ పేజీలో...

పాతవారికి అవే శాఖలు
శాఖల్లో ప్రయోగాలు చేయని మోదీ 2
షా, రాజ్‌నాథ్, నిర్మల, గడ్కరీ, జైశంకర్, గోయల్‌కు మళ్లీ పాత బాధ్యతలే
రామ్మోహన్‌కు పౌర విమానయానం
గ్రామీణాభివృద్ధి, కమ్యూనికేషన్స్ సహాయ మంత్రిగా పెమ్మసాని చంద్రశేఖర్

కిషన్‌రెడ్డికి బొగ్గు, గనులు 14
హోంశాఖ సహాయ మంత్రిగా సంజయ్

అమిత్ షాతో ఈటల భేటీ 14

నేను వైదొలగట్లేదు
నా వ్యాఖ్యలను పూర్తిగా వక్రీకరించారు
మోదీ క్యాబినెట్‌లో చోటు గర్వకారణం
నటుడు, కేంద్ర మంత్రి సురేశ్ గోపీ




విద్యార్థినికి ప్రతిభా పురస్కారం అందించి, అభినందిస్తున్న సీఎం

సర్కారు బడుల్లో .. సెమీ రెసిడెన్షియల్!
కొత్త విధానాన్ని అమలు చేసే అంశాన్ని పరిశీలిస్తున్నాం
రెసిడెన్షియల్ స్కూళ్ల వల్ల తల్లిదండ్రులు, పిల్లల మధ్య బంధాలు బలహీనపడుతున్నాయి 13
ఇది సామాజిక సమస్యగా మారే ప్రమాదం
మోదీ, బాబు, నేను సర్కారు బడుల్లోనే చదువుకున్నాం
సింగిల్ టీచర్ స్కూళ్లను కొనసాగిస్తాం: సీఎం రేవంత్
పదో తరగతిలో 10 జీపీఏ సాధించిన విద్యార్థులకు.. వందేమాతరం ఫౌండేషన్ ప్రతిభా పురస్కారాల ప్రదానం

రుణమాఫీకి విధివిధానాలు!
రూపొందించాలంటూ అధికారులకు సీఎం ఆదేశం
ఆగస్టు 15 లోగా రుణమాఫీ చేసి తీరాల్సిందే
బ్యాంకుల నుంచి రైతుల వివరాలు సేకరించండి 13
నాలుగు రోజుల్లో ప్రతిపాదనలు పంపండి
వ్యవసాయ శాఖపై సమీక్షలో సీఎం రేవంత్‌రెడ్డి

ప్రభుత్వ నిర్ణయాలే అమలు చేశా!
ఛత్తీస్‌గఢ్ విద్యుత్తు, యాదాద్రి, భద్రాద్రి విద్యుత్కేంద్రాలపై సొంత నిర్ణయాల్లేవ్ 14
జస్టిస్ నర్సింహారెడ్డి కమిషన్‌కు తెలిపిన ట్రాన్స్‌కో మాజీ సీఎండీ ప్రభాకర్‌రావు


సర్టిఫికెట్ వెరిఫికేషన్‌కు హాజరైన అభ్యర్థులు

ఈసెట్ కౌన్సెలింగ్‌లో గందరగోళం
నగరంలోని 6 సహాయ కేంద్రాల్లో సర్టిఫికెట్ల పరిశీలన షురూ
ఫీజు బకాయిలుంటే సర్టిఫికెట్లు ఇవ్వని ప్రైవేట్ కాలేజీలు 12
6వ సెమిస్టర్ మెమోలను ఇంకా జారీచేయని టెక్నికల్ బోర్డు
పత్రాలు లేకుండా ఎలాగంటున్న కౌన్సెలింగ్ సిబ్బంది

'గొర్రెల' అక్రమాల వెనక ఎవరున్నారు?
దారి మళ్లిన సొమ్ములో ఎవరి వాటా ఎంత?
రాంచందర్, కల్యాణ్‌కు ఏసీబీ ప్రశ్నలు 14
కీలక ప్రశ్నలకు జవాబివ్వని నిందితులు

25 ఎకరాల్లో వనదేవతల స్మృతి వనం



సమ్మక్క-సారలమ్మ ప్రాశస్త్యం, శాసనాలతో మ్యూజియం
భవిష్యత్తు తరాలకు చరిత్రను తెలియజేయడమే లక్ష్యం
చిలకల గుట్ట సుందరీకరణ, భక్తులకు మరిన్ని సౌకర్యాలు
పర్యాటక ప్రాంతంగా మేడారం.. గిరిజనులకు ఉపాధి
డీపీఆర్‌పై సర్కారు కసరత్తు.. వివరాలతో కేంద్రానికి లేఖ

హైదరాబాద్, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): వనదేవతలైన సమ్మక్క-సారలమ్మ చరిత్రను భవిష్యత్తు తరాలకూ తెలపాలని, ఇందుకోసం మేడారంలో వనదేవతల స్మృతి వనం ఏర్పాటు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం సూత్రప్రాయంగా నిర్ణయించింది. గద్దెల వెనుకవైపు ఉన్న 25 ఎకరాల స్థలంలో ఈ స్మృతి వనాన్ని నిర్మించాలని భావిస్తోంది. తల్లుల జాతర విశేషాలతోపాటు అప్పటి వస్తువులు, శాసనాలు, వనదేవతల ప్రాశస్త్య వివరాలతో మ్యూజియంను ఏర్పాటు చేయనుంది. చిలకల గుట్టను సుందరీకరించడంతోపాటు భక్తులకు మరిన్ని సౌకర్యాలను కల్పించేందుకు కసరత్తు చేస్తోంది. ఇందుకు సంబంధించిన సమగ్ర ప్రాజెక్టు నివేదిక(డీపీఆర్)పై అధికారులు

మిగతా 13వ పేజీలో...




4 కాదు.. 8 ఏళ్లు!
అగ్నివీర్‌ల సర్వీసు వ్యవధిని పెంచాలి
70 శాతం మందిని రెగ్యులర్ చేయాలి
ప్రవేశ వయస్సుని 23 ఏళ్లకు పెంచాలి
అగ్నిపథ్‌ను సమీక్షించాలని ఆర్మీ సిఫారసు

న్యూఢిల్లీ, జూన్ 10: లోక్‌సభ ఎన్నికల అనంతరం ఎన్డీయే మిత్రపక్షాలైన జేడీయూ, ఎల్‌జేపీ (రామ్ విలాస్) అగ్నిపథ్ పథకాన్ని పునఃసమీక్షించాల్సిన అవసరం ఉందని సూచించాయి. తాజాగా భారత సైన్యం కూడా ఈ పథకాన్ని సమీక్షించి దాన్ని మెరుగుపర్చాలని సిఫారసు చేసింది. నాలుగేళ్ల సర్వీసు పూర్తయిన తర్వాత రెగ్యులర్ సర్వీసుల్లో చేరే

మిగతా 2వ పేజీలో...

ప్లేటు తిప్పేసిన స్వరూపానంద!
నాడు జగన్, కేసీఆర్ కోసం యాగాలు
నేడు చంద్రబాబు, పవన్‌కు ఆశీస్సులు
తమ వల్లే మోదీ హ్యాట్రిక్ కొట్టారనేలా వ్యాఖ్యలు



విశాఖపట్నం/పెందుర్తి, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): మొన్నటిదాకా వైఎస్ జగన్మోహన్ రెడ్డితో మురిపెంగా మాట్లాడి, ఒక సందర్భంలో బుగ్గమీద ముద్దు కూడా పెట్టిన విశాఖ శారదా పీఠాధిపతి స్వరూపానంద ఒక్కసారిగా ప్లేటు ఫిరాయించారు. జగన్ కోసం ప్రత్యేక యాగాలు చేసిన ఆయన... చంద్రబాబు, పవన్ కల్యాణ్, లోకేశ్‌ల కోసం యాగాలు నిర్వహిస్తామని ప్రకటించారు. కూటమి పరిపాలన బాగుండాలని ఆకాంక్షిస్తూ, వారికి ఆశీస్సులు అందించారు. చినముషిడివాడ శారదా పీఠంలో సోమవారం

మిగతా 3వ పేజీలో...

పవన్‌కు డిప్యూటీ సీఎం!
ఆంధ్రప్రదేశ్‌లో చంద్రబాబు మంత్రివర్గ కూర్పుపై ఉత్కంఠ



లోకేశ్, నారాయణ, మనోహర్‌లకు బెర్తులు ఖరారు
పూర్తి మంత్రివర్గమే కొలువుదీరుతుందని అంచనాలు
నేడు శాసనసభాపక్ష నేతగా చంద్రబాబు ఎన్నిక
17 నుంచి అసెంబ్లీ సమావేశాలు? 3



వైసీపీ విధ్వంసం నిజమే
ఎన్నికల రోజు, ఆ తర్వాత ఏపీలో రెచ్చిపోయిన వైసీపీ మూకలు
టీడీపీ అభ్యర్థులు, సానుభూతిపరులపై హత్యాయత్నాలు.. పల్నాడులో ఈవీఎం ధ్వంసం చేసిన పిన్నెల్లి
గుర్తుతెలియని వ్యక్తులంటూ బీఎల్‌వో, వీఆర్వో ఫిర్యాదు.. ఆధారాల సేకరణలో పోలీసులు విఫలం
జూలకంటి కారుపై పెట్రోలు పోసి తగులబెట్టారు.. నరసరావుపేటలో టీడీపీ అభ్యర్థుల కార్ల ధ్వంసం
తాడిపత్రిలో కేతిరెడ్డి, ఆయన అనుచరుల వీరంగం.. తిరుపతిలో నానిపై చెవిరెడ్డి మనుషుల దాడి
డీజీపీ గుప్తాకు పూర్తిస్థాయి నివేదిక అందజేసిన ప్రత్యేక దర్యాప్తు బృందం 12


బాధ్యతలు చేపట్టిన రవీందర్‌రావు 13

టెస్కాబ్ చైర్మన్‌గా మార్నేని రవీందర్‌రావు
వైస్ చైర్మన్‌గా కొత్తకుర్మ సత్తయ్య
సీఎం రేవంత్, మంత్రి తుమ్మల అభినందనలు

బాబు ప్రమాణానికి మోదీ, అమిత్ షా
తరలి వస్తున్న అతిరథ మహారథులు
ప్రత్యేక ఆహ్వానితులుగా జగన్ బాధితులు 3
వినూత్నంగా ప్రమాణ స్వీకార ఏర్పాట్లు
ఎన్డీయే సీఎంలు, కేంద్రమంత్రులకు ఆహ్వానం
50 వేల మంది కూర్చునేలా ప్రాంగణ నిర్మాణం

ఏపీలో జే బ్రాండ్లకు చెక్..!
తొక్కేసిన బ్రాండ్లు వచ్చేస్తున్నాయ్
నిబంధనల ప్రకారమే కంపెనీలకు ఆర్డర్లు ఇస్తున్న బేవరేజెస్ కార్పొరేషన్ 3

మంత్రులకు కేటాయించిన శాఖలు ఇవే

పేరు	పార్టీ	శాఖ
1) రాజ్ నాథ్ సింగ్	(బీజేపీ)	రక్షణ శాఖ
2) అమిత్ షా	(బీజేపీ)	హోం మంత్రిత్వ, సహకార శాఖ
3) నితిన్ గడ్కరీ	(బీజేపీ)	రోడ్లు, జాతీయ రహదారులు
4) జగత్ ప్రకాశ్ నడ్డా	(బీజేపీ)	ఆరోగ్యం, సంక్షేమం, రసాయనాలు, ఎరువులు
5) శివరాజ్ సింగ్ చౌహాన్(కొత్త)	(బీజేపీ)	వ్యవసాయం, రైతు సంక్షేమం, గ్రామీణాభివృద్ధి
6) నిర్మలా సీతారామన్	(బీజేపీ)	ఆర్థికం, కార్పొరేట్ వ్యవహారాలు
7) సుబ్రహ్మణ్యం జైశంకర్	(బీజేపీ)	విదేశీ వ్యవహారాలు
8) మనోహర్ లాల్ ఖట్టర్ (కొత్త)	(బీజేపీ)	గృహనిర్మాణ, పట్టణాభివృద్ధి, విద్యుత్
9) హెచ్ డి కుమారస్వామి(కొత్త)	(జేడీఎస్)	భారీ పరిశ్రమలు, ఉక్కు
10) పీయూష్ వేద్ ప్రకాశ్ గోయల్	(బీజేపీ)	వాణిజ్య, పరిశ్రమలు
11) ధర్మేంద్ర ప్రధాన్	(బీజేపీ)	విద్య
12) జీతన్ రామ్ మాంఝీ (కొత్త)	(హెచ్ఏఎం)	సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలు
13) రాజీవ్ రంజన్ సింగ్ (కొత్త)	(జేడీయూ)	పంచాయతీరాజ్, మత్స్య, పశు సంవర్ధక
14) సర్బానంద్ సోనోవాల్	(బీజేపీ)	షిప్పింగ్, పోర్టులు, వాటర్‌వేస్
15) వీరేంద్ర కుమార్	(బీజేపీ)	సామాజిక న్యాయం, సాధికారత
16) రామ్మోహన్ నాయుడు (కొత్త)	(టీడీపీ)	పౌర విమానయానం
17) ప్రహ్లాద్ వెంకటేష్ జోషి	(బీజేపీ)	వినియోగదారుల వ్యవహారాలు, ఆహార, ప్రజాపంపిణీ, నూతన, పునరుత్పాదక ఇంధనం
18) జుయెల్ ఓరం (కొత్త)	(బీజేపీ)	గిరిజన వ్యవహారాలు
19) గిరిరాజ్ సింగ్	(బీజేపీ)	జౌళి పరిశ్రమ
20) అశ్విని వైష్ణవ్	(బీజేపీ)	రైల్వే, సమాచార ప్రసారాలు, ఐటీ, ఎలక్ట్రానిక్స్
21) జ్యోతిరాదిత్య సింధియా	(బీజేపీ)	కమ్యూనికేషన్స్, ఈశాన్య ప్రాంత అభివృద్ధి
22) భూపేంద్ర యాదవ్	(బీజేపీ)	పర్యావరణ, అటవీ, వాతావరణ మార్పులు
23) గజేంద్రసింగ్ షెకావత్	(బీజేపీ)	పర్యాటక, సాంస్కృతికం
24) అన్నపూర్ణాదేవి (కొత్త)	(బీజేపీ)	మహిళా, శిశు సంక్షేమాభివృద్ధి
25) కిరణ్ రిజిజు	(బీజేపీ)	పార్లమెంటరీ, మైనారిటీ వ్యవహారాలు
26) హర్దీప్ సింగ్ పురీ	(బీజేపీ)	పెట్రోలియం, సహజవాయువులు
27) మన్సుఖ్ మాండవీయ	(బీజేపీ)	కార్మిక, ఉపాధి కల్పన, క్రీడలు- యువజన వ్యవహారాలు
28) గంగాపురం కిషన్ రెడ్డి	(బీజేపీ)	బొగ్గు, గనులు
29) చిరాగ్ పాసవాన్ (కొత్త)	(ఎల్జేపీ-పీ)	ఆహార శుద్ధి పరిశ్రమలు
30) సీఆర్ పాటిల్ (కొత్త)	(బీజేపీ)	జల్ శక్తి

సహాయ మంత్రులు (స్వతంత్ర హోదా)

పేరు	పార్టీ	శాఖ
31) రావ్ ఇంద్రజిత్ సింగ్	(బీజేపీ)	గణాంకాలు, కార్యక్రమాల అమలు, సాంస్కృతిక
32) జితేంద్రసింగ్	(బీజేపీ)	శాస్త్ర సాంకేతిక, సిబ్బంది వ్యవహారాలు, అంతరిక్షం
33) అర్జున్ రామ్ మేఘ్ వాల్	(బీజేపీ)	న్యాయం, పార్లమెంటరీ వ్యవహారాలు
34) ప్రతాప్ రావ్ జాదవ్ (కొత్త)	(శివసేన)	ఆయుష్, ఆరోగ్య- కుటుంబ సంక్షేమం
35) జయంత్ చౌదరి (కొత్త)	(ఆర్ఎల్డీ)	నైపుణ్యాభివృద్ధి, విద్య

సహాయ మంత్రులు

పేరు	పార్టీ	శాఖ
36) జితిన్ ప్రసాద (కొత్త)	(బీజేపీ)	వాణిజ్య, పరిశ్రమలు, ఐటీ, ఎలక్ట్రానిక్స్
37) శ్రీపాద్ యశో నాయక్	(బీజేపీ)	విద్యుత్, కొత్త, పునరుత్పాక ఇంధనం
38) పంకజ్ చౌదరి	(బీజేపీ)	ఆర్థికం
39) క్రిషన్ పాల్	(బీజేపీ)	సహకారం
40) రామ్ దాస్ అథావలె	(ఆర్ పీఐ)	సామాజిక న్యాయం, సాధికారత
41) రామ్‌నాథ్ ఠాకూర్ (కొత్త)	(జేడీయూ)	వ్యవసాయ, రైతు సంక్షేమం
42) నిత్యానందరాయ్	(బీజేపీ)	హోం వ్యవహారాలు
43) అనుప్రియ పటేల్	(అప్నా దళ్)	ఆరోగ్య, కుటుంబ సంక్షేమం, ఎరువులు, రసాయనాలు
44) వీ సోమన్న (కొత్త)	(బీజేపీ)	జల్ శక్తి, రైల్వే
45) పెమ్మసాని చంద్రశేఖర్ (కొత్త)	(టీడీపీ)	గ్రామీణాభివృద్ధి, కమ్యూనికేషన్స్
46) ఎస్పీ సింగ్ బఘేల్	(బీజేపీ)	మత్స్య, పశుసంవర్ధక, డెయిరీ, పంచాయతీ రాజ్
47) శోభా కరంద్లాజే	(బీజేపీ)	సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలు, కార్మిక, ఉపాధి
48) కీర్తివర్ధన్ సింగ్ (కొత్త)	(బీజేపీ)	పర్యావరణ, అటవీ, వాతావరణ మార్పులు, విదేశాంగ
49) బీఎల్ వర్మ	(బీజేపీ)	వినియోగదారుల వ్యవహారాలు, ప్రజా పంపిణీ, సామాజిక న్యాయం
50) శాంతను ఠాకూర్	(బీజేపీ)	పోర్టులు, షిప్పింగ్, వాటర్ వేస్
51) సురేశ్ గోపి (కొత్త)	(బీజేపీ)	పెట్రోలియం, సహజ వాయువులు, పర్యాటకం
52) ఎల్ మురుగన్	(బీజేపీ)	సమాచార ప్రసారాలు, పార్లమెంటరీ వ్యవహారాలు
53) అజయ్ టమ్టా	(బీజేపీ)	రోడ్డు రవాణ, హైవేలు
54) బండి సంజయ్ (కొత్త)	(బీజేపీ)	హోం వ్యవహారాలు
55) కమలేష్ పాశ్వాన్ (కొత్త)	(బీజేపీ)	గ్రామీణాభివృద్ధి
56) భగీరథ్ చౌదరి (కొత్త)	(బీజేపీ)	వ్యవసాయ, రైతు సంక్షేమం
57) సతీశ్ చంద్రదూబే (కొత్త)	(బీజేపీ)	బొగ్గు, గనులు
58) సంజయ్‌సేథ్ (కొత్త)	(బీజేపీ)	రక్షణ
59) రవనీత్ సింగ్ బిట్టూ (కొత్త)	(బీజేపీ)	ఆహార శుద్ధి, పరిశ్రమ, రైల్వేలు
60) దుర్గాదాస్ ఉయికె (కొత్త)	(బీజేపీ)	గిరిజన వ్యవహారాలు
61) రక్షా నిఖిల్ ఖడ్సే (కొత్త)	(బీజేపీ)	యువజన వ్యవహారాలు- క్రీడలు
62) సుఖాంత మజుందార్ (కొత్త)	(బీజేపీ)	విద్య, ఈశాన్య ప్రాంత అభివృద్ధి
63) సావిత్రి ఠాకూర్ (కొత్త)	(బీజేపీ)	మహిళా, శిశు సంక్షేమాభివృద్ధి
64) టోకన్ సాహు (కొత్త)	(బీజేపీ)	గృహ నిర్మాణ, పట్టణ వ్యవహారాలు
65) రాజ్ భూషణ్ చౌదరి (కొత్త)	(బీజేపీ)	జల్ శక్తి
66) శ్రీనివాస వర్మ (కొత్త)	(బీజేపీ)	భారీ పరిశ్రమలు, ఉక్కు
67) హర్షా మల్హోత్రా (కొత్త)	(బీజేపీ)	కార్పొరేట్ వ్యవహారాలు, రోడ్డు రవాణ, హైవేలు
68) జయంతిబాయ్ (కొత్త)	(బీజేపీ)	వినియోగదారుల వ్యవహారాలు, ఆహార ప్రజా పంపిణీ
69) మురళీధర్ మొహోల్ (కొత్త)	(బీజేపీ)	సహకార, పౌర విమానయానం
70) జార్జ్ కురియన్ (కొత్త)	(బీజేపీ)	మైనారిటీ వ్యవహారాలు, మత్స్య- పశుసంవర్ధక- డెయిరీ
71) పబిత్ర మార్గరిటా (కొత్త)	(బీజేపీ)	విదేశీ వ్యవహారాలు, టెక్స్‌టైల్స్

మరో 3 కోట్ల ఇళ్లు

(మొదటి పేజీ తరువాయి)

రాష్ట్రపతి ద్రౌపది ముర్మును అభ్యర్థించాలని నిర్ణయం తీసుకున్నారు. రాబోయే ఐదేళ్లలో వ్యవసాయ రంగంపై ప్రత్యేక దృష్టిసారిస్తామని ప్రధాని మోదీ స్పష్టం చేశారు. రైతు సంక్షేమమే తమ ప్రభుత్వ తొలి ప్రాధాన్యమని ఉద్ఘాటించారు. ప్రధానిగా సోమవారం బాధ్యతలను స్వీకరించాక.. 17వ విడత 'పీఎం కిసాన్' నిధుల విడుదలకు సంబంధించిన ఫైలుపై సంతకం చేసి విధులను ప్రారంభించారు. దీంతో 9.3 కోట్ల మంది రైతులకు రూ.20వేల కోట్ల మేర ఆర్థిక సాయం అందనుంది. తన కార్యాలయం ప్రజలకు కేంద్రంగా ఉండాలని ప్రధాని ఆకాంక్షించారు. మోదీ కేంద్రీకృతంగా ఉండకూడదని సూచించారు. 2014కు ముందు పీఎంవో కార్యాలయం అధికార కేంద్రంగా ఉండేదని వ్యాఖ్యానించారు. దేశమే ప్రథమమని, అదే తన లక్ష్యమని తెలిపారు. 2047 నాటికి వికసిత భారత్ లక్ష్యాన్ని సాధిస్తామని ఆశాభావం వ్యక్తంచేశారు.

నా జీవితం దేశానికి అంకితం..

తన జీవితంలో ప్రతిక్షణం దేశం కోసమేనని మోదీ పునరుద్ఘాటించారు. అధికారం కోసమో, పదవి కోసమో తాను రాలేదని స్పష్టంచేశారు. 140 కోట్ల మంది ప్రజలు తనకు పరమాత్మతో సమానమని తెలిపారు. అభివృద్ధికి పీఎంవో ఉద్యోగులు వారధి అని, దేశాన్ని మరింత ముందుకు తీసుకెళ్లాల్సిన బాధ్యత వారిదేనని పేర్కొన్నారు. పీఎంవోపై దేశమంతా ఎంతో నమ్మకంతో ఉందని, ఎంతో విశ్వాసంతో ఉందని వ్యాఖ్యానించారు. రాబోయే ఐదేళ్ల వికసిత్ భారత్ కోసం కలిసి పనిచేద్దామని పిలుపునిచ్చారు. ప్రధానమంత్రి కార్యాలయం ఎప్పుడూ ప్రజల కోసమే పనిచేయాలని మోదీ సూచించారు. "మనం సమయం చూసుకొని, కాలానికి కట్టుబడి పనిచేసే వ్యక్తులం కాదు. మన ఆలోచనలకు పరిమితి లేదు. ఎటువంటి పరిమితులు లేకుండా పని చేసేవారే నా జట్టు. అటువంటి



పీఎం ఆఫీసులో ఉద్యోగులతో మోదీ

ఆలోచనలు ఉన్న వారినే ఈ దేశం విశ్వసిస్తుంది" అని ప్రధాని వ్యాఖ్యానించారు. ప్రపంచంతో పోటీపడుతూ ముందుకెళ్లాలని, ఏ దేశం అందుకోలేనంత ఎత్తుకు భారత్‌ను తీసుకెళ్లాలని చెప్పారు. గత పదేళ్లలో చేసిన దానికంటే, ఈ ఐదేళ్లలో మరింత ఎక్కువ చేయాల్సిన బాధ్యత తనపై ఉందన్నారు. "ఎక్కువ మంది నా విజయ రహస్యం ఏమిటని అడుగుతుంటారు. నిత్యవిద్యార్థిగా ఉండటమే ఆ రహస్యం" అని మోదీ వివరించారు.

మోదీకి పాక్ ప్రధాని శుభాకాంక్షలు

భారత ప్రధానిగా మూడోసారి బాధ్యతలు చేపట్టిన మోదీకి పాక్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ సోమవారం శుభాకాంక్షలు తెలిపారు. సార్వత్రిక ఎన్నికల ఫలితాలు వెలువడిన 6 రోజుల తర్వాత మోదీకి ఆయన అభినందనలు తెలిపారు.

సిక్కిం సీఎంగా తమాంగ్ ప్రమాణం

ఈశాన్య రాష్ట్రం సిక్కిం ముఖ్యమంత్రిగా సిక్కిం క్రాంతికారి మోర్చా(ఎస్‌కేఎం) అధినేత ప్రేమ్‌సింగ్ తమాంగ్ ప్రమాణ స్వీకారం చేశారు. పల్జోర్ స్టేడియంలో సోమవారం నిర్వహించిన ప్రమాణ స్వీకారోత్సవంలో ప్రేమ్‌సింగ్‌తో గవర్నర్ లక్ష్మణ్ ఆచార్య ప్రమాణం చేయించారు. సీఎం సహా 12 మంది మంత్రులు కూడా ప్రమాణాలు చేశారు. ఇదిలా ఉండగా, ఒడిశా కొత్త సీఎం ఎంపిక కోసం మంగళవారం పార్టీ శాసన సభా పక్ష సమావేశం నిర్వహించనున్నారు. దీనికి, కేంద్ర మంత్రులు రాజ్‌నాథ్, భూపేంద్ర యాదవ్ పరిశీలకులుగా వెళ్లనున్నారు. సీఎం రేసులో సురేశ్ పుజారీ, మన్మోహన్ సామల్, మోహన్ మాంఝీల పేర్లు ఉన్నాయి.

పీఎం కిసాన్ నిధుల విడుదల

హైదరాబాద్, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): పీఎం కిసాన్ 17వ విడత నిధులు సోమవారం విడుదలయ్యాయి. తెలంగాణలో మంగళవారం రైతుల ఖాతాల్లో రూ.2 వేల చొప్పున పీఎం-కిసాన్ నగదు జమకానుంది. ప్రతి మూణ్నెల్లకు ఒక విడత చొప్పున, ఏడాదికి మూడు విడతల్లో రూ.6 వేల మేర కేంద్రం నగదుబదిలీ చేస్తోంది. రాష్ట్రంలో ఈ పథకంతో 33 లక్షల మంది రైతులు రూ.660 కోట్ల మేర లబ్ధి పొందుతున్నారు.

తెలంగాణకు 2,900 కోట్లు


మోదీ ప్రభుత్వం కొలువుదీరిన తొలి రోజే రాష్ట్రాలకు పన్నుల పంపిణీలో భాగంగా రూ.1,39,750 కోట్లు విడుదల చేసింది. ఆంధ్రప్రదేశ్‌కు రూ.5655.72 కోట్లు, తెలంగాణకు రూ.2937.58 కోట్లు కేటాయించింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి గానూ మొత్తం రూ.2,79,500 కోట్లు విడుదల చేసినట్లైంది. జూన్ నెలకు పన్నుల విడుదల చేయడంతో పాటు మరో విడత ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది.

పాతవారికి అవే శాఖలు

మంత్రుల శాఖల్లో ప్రయోగాలకు వెళ్లని మోదీ.. షా, రాజ్‌నాథ్, నిర్మల, గడ్కరీకి గత బాధ్యతలే

- విదేశాంగం జై శంకర్‌కే.. వాణిజ్యం గోయల్‌కే..!
- కీలకమైనవి ఎక్కువ శాతం సొంత పార్టీ వారికే

న్యూఢిల్లీ, జూన్ 10(ఆంధ్రజ్యోతి): పాతవారిపై నమ్మకం.. కొత్త మంత్రులకు ప్రాధాన్యం.. మాజీ సీఎంలందరికీ చోటు..! ఇదీ మోదీ మూడో విడత క్యాబినెట్ స్వరూపం. మంత్రులుగా ప్రమాణ చేసినవారికి సోమవారం శాఖల కేటాయింపు పూర్తయింది. కీలకమైన వాటిని ఎన్డీఏ పెద్దన్న బీజేపీ తనవారికే ఇచ్చింది. ప్రధాని మోదీ తర్వాత కేంద్ర ప్రభుత్వంలో శక్తిమంతమైన అమిత్ షా (హోం)తో పాటు కీలక నేతలు రాజ్‌నాథ్‌సింగ్ (రక్షణ), నిర్మలా సీతారామన్ (ఆర్థికం), జైశంకర్ (విదేశాంగం), గడ్కరీ (రహదారులు)ని అవే శాఖల్లో కొనసాగించారు. బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా.. మోదీ తొలి విడతలో వైద్య శాఖ మంత్రిగా పనిచేశారు. పార్టీ బాధ్యతల రీత్యా రెండో విడతలో అవకాశం ఇవ్వలేదు. ఇప్పుడు మళ్లీ రసాయనాలు, ఫర్టిలైజర్స్‌తో కలిపి వైద్య శాఖ ఇచ్చారు. రైల్వేను అశ్విని వైష్ణవ్ వద్దే ఉంచుతూ.. ఐటీ, సమాచార, ప్రసార, ఎలక్ట్రానిక్స్ శాఖలను జోడించారు. జ్యోతిరాదిత్య సింధియాను మాత్రం పౌర విమానయానం నుంచి టెలికాంకు మార్చి.. ఈశాన్య రాష్ట్రాల అభివృద్ధినీ కట్టబెట్టారు. భూపేంద్ర యాదవ్ మరోసారి పర్యావరణ, అటవీ, వాతావరణ మార్పుల శాఖను చూడనున్నారు. జలశక్తి శాఖను సీఆర్ పాటిల్‌కు కేటాయించారు. బీజేపీకే చెందిన హర్దీప్‌సింగ్ పురీ, మన్‌సుఖ్ మాండవియాకూ మంచి శాఖలే లభించాయి. ఒడిసాకు చెందిన జుయల్ ఓరమ్‌కు గిరిజన వ్యవహారాలను కేటాయించారు. కాగా, మిత్రపక్షాల్లో టీడీపీ యువ ఎంపీ రామ్మోహన్‌నాయుడికి పౌర విమానయానం, జేడీయూ నేత లలన్‌సింగ్‌కు పంచాయతీరాజ్, మత్స్య, పశు సంవర్ధకం దక్కాయి. జేడీయూ ఎంపీ కుమారస్వామికి భారీ పరిశ్రమలు, ఉక్కు మంత్రిత్వ బాధ్యతలు ఇచ్చారు. ఈ మూడు పార్టీలు గత ఏడాదిలోనే ఎన్డీఏలో చేరాయి. కాగా, హిందుస్థానీ అవామీ మోర్చా (హెచ్ఏఎం)కు చెందిన జీతన్‌రామ్ మాంఝీకి సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలు దక్కాయి. లోక్‌జనశక్తి నేత చిరాగ్ పాసవాన్‌కు ఆహార ఉత్పత్తుల పరిశ్రమలు అప్పగించారు. స్మృతీ ఇరానీ చూసిన మహిళా సంక్షేమం అన్నపూర్ణాదేవికి లభించింది. జయంత్ చౌదరి (ఆర్ఎల్డీ)కి స్వతంత్ర హోదాలో నైపుణ్యాభివృద్ధి శాఖను కేటాయించారు.



మాజీ సీఎంలందరికీ చోటు

రాజ్‌నాథ్ (యూపీ), కుమారస్వామి (కర్ణాటక), మాంఝీ (బిహార్), శర్బానంద సోనోవాల్ (అసోం)తో పాటు ఇటీవల మాజీలైన సీఎంలు శివరాజ్‌సింగ్ చౌహాన్ (మధ్యప్రదేశ్)కు వ్యవసాయం, రైతు సంక్షేమం, గ్రామీణాభివృద్ధి, ఖట్టర్ (హరియాణ)కు విద్యుత్తు, గృహ నిర్మాణం, పట్టణ వ్యవహారాల వంటి ప్రధానమైన శాఖలు లభించడం గమనార్హం. కాగా, గతంలో ఎర్త్ సైన్సెస్, ఆహార శుద్ధి శాఖలు చూసిన కిరెన్ రిజిజుకు ఈసారి పార్లమెంటరీ వ్యవహారాలతో ప్రమోషన్ లభించింది. గతంతో ఈ శాఖను చూసిన ప్రహ్లాద్‌జోషిని ఆహార, వినియోగదారుల వ్యవహారాల శాఖకు మార్చారు. కాగా, స్వతంత్ర హోదాలో సహాయ మంత్రులుగా బాధ్యతలు చేపట్టినవారిలో డాక్టర్ జితేంద్ర సింగ్ (కశ్మీర్) అత్యంత ముఖ్యమైన సైన్స్ అండ్ టెక్నాలజీ, ప్రజా ఫిర్యాదులు తదితర శాఖలను పర్యవేక్షించాల్సి ఉంది. అర్జున్ రామ్ మేఘ్వాల్ (న్యాయ).. మరో కీలకమైన పార్లమెంటరీ వ్యవహారాల శాఖ సహాయ మంత్రిగానూ కర్తవ్యం నెరవేర్చాలి ఉంటుంది.

ఎన్నికలున్నచోట..

ఈ ఏడాది మహారాష్ట్ర, హరియాణా, జార్ఖండ్ అసెంబ్లీలకు ఎన్నికలున్నాయి. వీటిలో పదవుల కేటాయింపుపై మహారాష్ట్ర అధికార భాగస్వామ్య పార్టీలు శివసేన (శిందే), ఎన్సీపీ (అజిత్ పవార్) ఇప్పటికే అసంతృప్తి వ్యక్తం చేశాయి. ఖట్టర్‌ను కేంద్రంలోకి తీసుకొచ్చి హరియాణలో ఇబ్బంది లేకుండా చూసుకున్నారు. అన్నపూర్ణాదేవికి మంత్రి పదవి ఇవ్వడం ద్వారా జార్ఖండ్‌కూ ప్రాధాన్య కల్పించారు.

లోకం తీరు



4 కాదు.. 8 ఏళ్లు!

(మొదటి పేజీ తరువాయి)

అగ్నివీర్‌ల శాతాన్ని ప్రస్తుతం ఉన్న 25 నుంచి 60-70 శాతానికి పెంచాలనే సిఫారసు కూడా దీనిలో ఉంది. అగ్నివీర్‌ల సర్వీస్ వ్యవధిని 4 ఏళ్ల నుంచి 7-8 సంవత్సరాలకు పెంచాలని, సాంకేతిక రంగంలో అగ్నివీర్‌ల ప్రవేశ వయస్సుని పెంచాలని ఆర్మీ సూచించింది. అలాగే శిక్షణ సమయంలో అంగవైకల్యానికి గురైన అగ్నివీర్‌లకు కూడా నష్టపరిహారం ఇవ్వాలని, ఒకవేళ యుద్ధంలో మరణిస్తే వారి కుటుంబానికి జీవనభృతి ఇవ్వాలని సిఫారసు చేసింది. యువతకు అవకాశాలు కల్పిస్తూనే సైన్యంపై ఆర్థిక భారం తగ్గించే ఉద్దేశంతో మోదీ నేతృత్వంలోని బీజేపీ సర్కారు 2022లో అగ్నిపథ్ పథకాన్ని తీసుకొచ్చింది. అప్పట్లో దీనిపై సర్వత్రా ఆందోళనలు వెల్లువెత్తాయి.

అదిగో పులి?

- రాష్ట్రపతి భవన్ వీడియోలో జంతువు

న్యూఢిల్లీ, జూన్ 10: ప్రధాన మంత్రిగా మోదీ మూడో సారి ప్రమాణ స్వీకారం కార్యక్రమంలో అనుకోని అతిథి కనిపించింది. ఆదివారం రాష్ట్రపతి భవన్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో.. మధ్యప్రదేశ్ నుంచి బీజేపీ తరఫున ఎంపీగా విజయం సాధించిన దుర్గాదాస్ ఉయికె ప్రమాణ స్వీకారం చేసే సమయంలో ఆయన వెనక.. మెట్లపైన ఓ జంతువు వెళ్తూ కనిపించింది. ఆ వీడియో ఇప్పుడు వైరల్ అయ్యింది. చిరుతపులి అని కొందరు.. కాదు పులికూన అని మరికొందరు కామెంట్లు పెట్టారు. ఇంకొందరైతే ఏకంగా అంత ఠీవీగా నడిచి వెళ్తోందంటే.. అది పెంపుడు పులి కూన అయ్యి ఉంటుందంటూ వ్యాఖ్యానాలు జోడించారు. అది పిల్లి అని అధికార వర్గాలు అనుమానిస్తున్నాయి. రాష్ట్రపతి భవన్ నుంచి మాత్రం ఈ అంశంపై ఎలాంటి అధికారిక ప్రకటన వెలువడలేదు. ఈ వీడియోను తొలుత డీప్‌ఫేక్ అయ్యి ఉండొచ్చని అనుమానించినా.. రాష్ట్రపతి భవన్ అధికారిక వీడియోలోనూ జంతువు కనిపించింది!

ఎవరు తీసిన గోతిలో వారే..

- ఏపీలో వైసీపీ, ఒడిశాలో బీజేడీ పార్టీలే ఉదాహరణలు: సుప్రియా శ్రీనతే



న్యూఢిల్లీ, జూన్ 10(ఆంధ్రజ్యోతి): "ఏపీలో వైసీపీ, ఒడిశాలో బీజేడీ పార్టీలను చూస్తుంటే.. ఇతరుల కోసం గొయ్యి తవ్వేవాడు ఏదో ఒక రోజు అదే గుంతలో పడిపోతాడు అని స్పష్టమవుతోంది" అని కాంగ్రెస్ సోషల్ మీడియా విభాగం చైర్‌పర్సన్ సుప్రియా శ్రీనతే ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. వైసీపీ అధినేత జగన్మోహన్‌రెడ్డి, బీజేడీ చీఫ్ నవీన్ పట్నాయక్‌లు మోదీతో కలిసి ఉన్న ఫొటోలను ఆమె ఎక్స్‌లో షేర్ చేశారు. ప్రజావ్యతిరేక చట్టాలను రూపొందించడంలో మోదీకి వైసీపీ, బీజేడీ ఎంతగానో మద్దతిచ్చాయన్నారు. గతేడాది మోదీ సర్కారుపై పెట్టిన అవిశ్వాస తీర్మానాన్ని ఈ రెండు పార్టీలు వ్యతిరేకించాయని తెలిపారు. ఢిల్లీ సర్వీసెస్ బిల్లు, సీఏఏకు మద్దతిచ్చాయని, వివాదాస్పద వ్యవసాయ చట్టాలకు వైసీపీ మద్దతు పలికిందని సుప్రియ ఈ సందర్భంగా గుర్తు చేశారు.

పరుగు ప్రారంభించిన 3.0 సర్కారు

- వచ్చే మూడు నెలలకు లక్ష్యాల నిర్దేశం
- అగ్నిపథ్‌ను సమీక్షించనున్న రక్షణశాఖ
- జూలై నుంచి కొత్త క్రిమినల్ చట్టాల అమలు

న్యూఢిల్లీ, జూన్ 10: భారత ఆర్థిక వ్యవస్థను పరుగులు పెట్టించడం కోసం ఒకేసారి 71మందికి తన కేబినెట్‌లో ప్రధాని మోదీ చోటు కల్పించారు. ప్రమాణం చేసిన రెండోరోజే కేంద్రప్రభుత్వంలోని కీలక శాఖలు పరుగు ప్రారంభించేశాయి. రాబోయే వంద రోజుల కోసం కార్యాచరణ ప్రణాళిలను సిద్ధం చేసుకునే పనిలో ఉన్నాయి. ఉదాహరణకు, అగ్నిపథ్ పథకాన్ని సమీక్షించి, అందులో అవసరమైన మార్పులను చేసే పనిని రక్షణ శాఖ ప్రారంభించేసింది. ఎగుమతుల రంగంలో రక్షణ పరికరాలకు మరింత ప్రచారం కల్పించేలా కొత్త వ్యవస్థకు రూపకల్పన చేస్తోంది. భారత్ నుంచి ఆయుధాలు, మందుగుండు కొంటున్న మిత్రదేశాలకు సహాయకంగా కార్పస్ ఫండ్‌ను ఏర్పాటుచేయనున్నారు. రక్షణ ఆయుధగారం అమ్ములపొదిలోకి అదనంగా కే9 వజ్రా ఆర్టిలరీ తుపాకులు, విదేశీ జెట్లలో వాడే ఇంజన్లు చేరనున్నాయి. నౌక దళం కోసం కొంటున్న రఫేల్ ఎమ్ ఫైటర్ జెట్లపై చివరి దశ చర్చలను వెంటనే ప్రారంభించాలని రక్షణ శాఖ నిర్ణయించింది. రక్షణ పరికరాల అభివృద్ధి సంస్థ అయిన డీఆర్‌డీవోలో సంస్కరణలకు శ్రీకారం చుట్టనున్నారు.

అంతర్గత భద్రత: కొత్త క్రిమినల్ చట్టాలను జూలై ఒకటి నుంచి అమలుచేసేందుకు కేంద్ర హోం శాఖ సిద్ధమవుతోంది. సెప్టెంబరు 30 లోగా సుప్రీంకోర్టుకు హామీ ఇచ్చినట్టుగా జమ్ము, కశ్మీర్‌లకు అసెంబ్లీ ఎన్నికలు నిర్వహించడం హోంశాఖ ముందున్న ముఖ్యమైన సవాల్. మణిపూర్ జాతి కలహాలను అదుపులోకి తీసుకురావడం మరో క్లిష్టమైన లక్ష్యం. ఈ పనులన్నీ మూడు నెలల్లో పూర్తయ్యేలా హోం శాఖ ప్రణాళికలు రచిస్తోంది.

సుపరిపాలన: జీవన సౌకర్యాల మెరుగుదలపై కేంద్ర ప్రభుత్వం దృష్టి పెట్టింది. పౌర సమస్యల పరిష్కారాన్ని మరింత సులభతరం చేస్తూ కొత్తగా పర్యవేక్షణ వ్యవస్థను ఏర్పాటుచేయనున్నారు. ప్రక్రియలోని జాప్యాన్ని, ఉద్యోగుల పింఛనులోని సమస్యలను నివృత్తి చేస్తూ.. అన్ని ప్రభుత్వ శాఖల్లో ఉమ్మడి పెన్షన్ నిబంధనలను ప్రవేశపెట్టనున్నారు. రక్షణ శాఖను దీనినుంచి మినహాయించారు. ప్రభుత్వ సేవల పూర్తిస్థాయి డిజిటలైజేషన్, స్వతంత్ర ప్రతిపత్తి కలిగిన సంస్థల్లో ఈ-ఆఫీస్‌ను ప్రవేశపెట్టనున్నారు.



విద్య, నైపుణ్యం: విద్యారంగంపై మండలస్థాయి నుంచీ సమగ్ర పర్యవేక్షణకు వీలుగా పాఠశాల విద్య స్థాయిలో డిజిటలైజేషన్‌ను సాధించడం కేంద్ర విద్యాశాఖ పెట్టుకున్న అతి ముఖ్య లక్ష్యం. ఇక రెండో ప్రాధాన్య లక్ష్యం డ్రాపవుట్ల నివారణ. స్కూల్‌బోర్డుల స్థాయిలో సమగ్ర మూల్యాంకన విధానాలను ప్రవేశపెట్టనున్నారు.

వ్యవసాయం: సుదీర్ఘకాలంగా అపరిష్కృతంగా ఉన్న విత్తన బిల్లులను క్లియర్ చేయడాన్ని వ్యవసాయ శాఖ ప్రథమ లక్ష్యంగా ప్రకటించింది. దీనికోసం రాష్ట్రీయ కిసాన్ వికాస్ యోజనకు వచ్చే మూడునెలల్లో రూపకల్పన చేయనుంది.

పంచాయతీరాజ్ శాఖ: ఇంటి కప్పు పదిమీటర్లు ఎత్తు ఉండేలా పక్కా గృహాలను ఉచితంగా పేదలకు కట్టి ఇవ్వాలని పంచాయతీరాజ్ శాఖ లక్ష్యంగా పెట్టుకుంది. పీఎమ్ సూర్యఘర్ ముఫ్త్ బిజిలీ పథకం కింద ఈ పనులు చేపట్టనున్నారు.

కీలక నియామకాలు: కొత్త ఆర్మీ చీఫ్‌ను త్వరలోనే కేంద్ర ప్రభుత్వ నియమించనుంది. ప్రస్తుత ఆర్మీ చీఫ్ జనరల్ మనోజ్ పాండే పదవీకాలం ఇప్పటికే ముగిసినా, ఆయన సర్వీసును మరో నెలరోజులకు పొడిగించారు. కొత్త ఆర్మీ చీఫ్ ఎంపిక ప్రక్రియను వచ్చే మూడు నెలల్లో పూర్తి చేయనున్నారు.

ఇతర ముఖ్యమైన నిర్ణయాలు: కేబినెట్ కార్యదర్శి రాజీవ్ గబ్బా, కేంద్ర హోం శాఖ కార్యదర్శి అజయ్ భల్లా వచ్చే ఆగస్టు వరకు కొనసాగనున్నారు. ఐటీ చీఫ్ తపన్ డేకా పదవీకాలం జూన్ 30తో ముగుస్తోంది. తపన్ విషయంలో ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాల్సిఉంది.

రాయబారులు: అమెరికా, ఫ్రాన్స్‌తోపాటు ఐక్యరాజ్యసమితిలో పనిచేసేందుకు కొత్త రాయబారులను కొత్తగా ప్రకటించనున్నారు. విదేశాంగశాఖ కొత్త కార్యదర్శిని అక్టోబరు నాటికి నియమిస్తారు.

జీ-7 శిఖరాగ్ర సదస్సుకు మోదీ

(ఆంధ్రజ్యోతి గల్ఫ్ ప్రతినిధి)

ప్రధాని మోదీ మరో రెండు రోజుల్లో తొలి విదేశీ పర్యటన చేపట్టనున్నారు. ఇటలీలో గురువారం నుంచి మూడు రోజుల పాటు జరిగే జీ-7 శిఖరాగ్ర సదస్సుకు ప్రత్యేక ఆహ్వానితుడిగా ఆయన హాజరు కానున్నారు. సదస్సులో భాగంగా అమెరికా, జపాన్, బ్రిటన్, ఫ్రాన్స్, ఇటలీ, కెనడా దేశాధినేతలతోపాటు సౌదీ యువరాజు మొహమ్మద్ బిన్ సల్మాన్, అబుదాబి రాజు షేక్ మొహమ్మద్ బిన్ జాయద్, మరి కొందరు అరబ్ రాజకుటుంబీకులను మోదీ కలుసుకోనున్నారు. మోదీ పర్యటన, సమావేశాలకు సంబంధించిన ఏర్పాట్లను ఇటలీలోని భారత రాయబారి ఎస్.వాణి రావు దగ్గరుండి పర్యవేక్షిస్తున్నారు. మూడో సారి ప్రధానిగా బాధ్యతలు చేపట్టిన మోదీకి ప్రపంచ దేశాధినేతలందరూ శుభాకాంక్షలు చెప్పే అవకాశం ఉండడంతో.. అందుకు తగ్గట్టుగా ఏర్పాట్లు చేస్తున్నారు. హైదరాబాద్‌కు చెందిన వాణి రావు.. తెలుగు రాష్ట్రాల నుంచి రాయబారిగా నియమితులైన ప్రథమ మహిళ కావడం విశేషం. కాగా, రాబోయే త్వరలోనే జరిగే బిమ్‌స్టెక్, జీ-20, ఆసియన్- ఈస్ట్ ఆసియా సదస్సులకు మోదీ హాజరు కానున్నారు.

నేను వైదొలగట్లేదు

- మోదీ క్యాబినెట్‌లో ఉండటం అదృష్టం
- నటుడు, కేంద్ర మంత్రి సురేశ్ గోపీ



న్యూఢిల్లీ, తిరువనంతపురం, జూన్ 10: కేంద్ర మంత్రి పదవి విషయంలో ప్రముఖ నటుడు సురేశ్ గోపీ మాట మార్చారు. మోదీ క్యాబినెట్‌లో కొనసాగడం అదృ ష్టం అని.. తాను రాజీనామా చేయనున్నట్లు వచ్చిన వార్తలు పూర్తిగా తప్పు అని పేర్కొన్నారు. కేరళలోని త్రిసూర్ నుంచి గెలిచిన సురేశ్ గోపీ.. ఆదివారం రాత్రి కేంద్ర సహాయ మంత్రిగా ప్రమాణం చేశారు. అయితే, కాసేపటికే.. "నేను సినిమాలు చేయాలనుకుంటున్నా. ఈ బాధ్యతల నుంచి త్వరలోనే విముక్తి చేస్తారని భావిస్తున్నా" అని వ్యాఖ్యానించారు. ఇవి కాస్త చర్చనీయాంశం కావడంతో ఆయన ఫేస్‌బుక్‌లో పోస్ట్ పెట్టారు. కేరళ ప్రతినిధిగా మోదీ క్యాబినెట్‌లో చోటుదక్కడం గర్వకారణమని, కొన్ని మీడియా సంస్థలు తాను రాజీనామా చేస్తున్నట్లు తప్పుడు కథనాలు రాస్తున్నాయన్నారు.

మాకు క్యాబినెట్ బెర్తులేదా?

కేంద్ర మంత్రివర్గంలో స్వతంత్ర హోదాలో సహాయ మంత్రి పదవి మాత్రమే దక్కడం పట్ల మహారాష్ట్ర అధికార పార్టీ శివసేన (శిందే) తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది. ఐదుగురు ఎంపీలున్న ఎల్జేపీ (పాసవాన్), ఇద్దరున్న జేడీఎస్, ఒక్కరే ఉన్న మాంఝీకి క్యాబినెట్ ర్యాంక్ దక్కిందని.. బీజేపీకి సుదీర్ఘ కాలంగా మిత్రపక్షంగా ఉన్న తాము మాత్రం అర్హులం కాదా? అని ప్రశ్నించింది. కాగా, మహారాష్ట్రలో మహాయుతి కూటమి సర్కారులో భాగమైన అజిత్ పవార్ ఎన్సీపీకి సహాయ మంత్రి పదవి ఇవ్వబోగా తిరస్కరించిన సంగతి తెలిసిందే.

13 అసెంబ్లీలకు ఉప ఎన్నికలు

న్యూఢిల్లీ, జూన్ 10(ఆంధ్రజ్యోతి): దేశవ్యాప్తంగా ఏడు రాష్ట్రాల్లో 13 అసెంబ్లీ నియోజకవర్గాలకు జూలై 10న ఉప ఎన్నికలు నిర్వహించనున్నట్లు కేంద్ర ఎన్నికల సంఘం సోమవారం ప్రకటించింది. జూలై 13వ తేదీన ఫలితాలు వెల్లడవుతాయి. 10 అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఎమ్మెల్యేలు రాజీనామాలు చేయగా, మూడుచోట్ల ప్రజాప్రతినిధుల మృతితో ఉప ఎన్నిక అనివార్యమైంది. రుపౌలీ (బిహార్), రాయ్‌గంజ్, రాణాఘాట్ దక్షిణ్, బాగ్దా, మానిక్‌తలా (పశ్చిమ బెంగాల్), విక్రవాండీ (తమిళనాడు), అమర్వాడా (మధ్యప్రదేశ్), బద్రీనాథ్, మంగ్లౌర్ (ఉత్తరాఖండ్), జలంధర్ వెస్ట్ (పంజాబ్), డెహ్రా, హమీర్ పుర్, నాలాగర్ (హిమాచల్‌ప్రదేశ్) అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఉప ఎన్నికలు నిర్వహించనున్నట్లు ఈసీ వెల్లడించింది.

బాబు ప్రమాణానికి మోదీ, అమిత్ షా

- తరలి వస్తున్న అతిరథ మహారథులు
- వినూత్నంగా ప్రమాణ స్వీకార ఏర్పాట్లు
- ఎన్డీయే ముఖ్యమంత్రులకు ఆహ్వానం



అమరావతి, జూన్ 10(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రిగా చంద్రబాబు ప్రమాణ స్వీకార కార్యక్రమానికి ప్రధాని మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా హాజరు కానున్నారు. అధికార వర్గాలు సోమవారం దీనిని ధ్రువీకరించాయి. మోదీ, అమిత్‌షా ఇద్దరూ వస్తుండడం ఎన్డీయే కూటమిలో టీడీపీ అధి నేత ప్రాధాన్యానికి ఇది నిదర్శనంగా చెబుతున్నారు. వీరిద్దరితో పాటు మరి కొందరు కేంద్రమంత్రులు, పొరుగు రాష్ట్రాల ముఖ్య మంత్రులు కూడా హాజరవుతున్నట్లు టీడీపీ వర్గాలు తెలిపాయి. తమిళనాడు నుంచి కొందరు మంత్రులతో ఒక సౌహార్ద్ర ప్రతినిధి బృందం హాజరవుతోంది. ప్రమాణ స్వీకారోత్సవానికి ఆహ్వానాలను ఎన్డీయే కూటమి ముఖ్యమంత్రులకు మాత్రమే పరిమితం చేయ డం తో పొరుగు రాష్ట్రాల సీఎంలు రావడం లేదు. వస్తున్న అతిరథ మహారథులను దృష్టిలో ఉంచుకొని అధికార యంత్రాంగం భారీస్థాయి ఏర్పాట్లు చేస్తోంది. 12 హెలికాప్టర్లు దిగడానికి వీలుగా ప్రత్యేక స్థలం కేటాయిస్తున్నారు. వర్షం వచ్చినా ఇబ్బంది రాకుండా పెద్ద పెద్ద షెడ్లు మాదిరిగా గుడారాలు నిర్మిస్తున్నారు. ప్రధాన వేదికను బాగా విశాలంగా ఏర్పాటు చేశారు. సుమారు 50 వేల మంది కూర్చోవడానికి వీలుగా ప్రాంగణంలో కుర్చీలు ఏర్పాటు చేస్తున్నారు. అంతకు మించి వచ్చిన వారు ప్రాంగణం బయట ఉండాల్సిన పరిస్థితి నెలకొంది. వారి కోసం డిజిటల్ తెరలు ఏర్పా టు చేస్తున్నారు. వివిధ జిల్లాల్లో వస్తున్న స్పందనను బట్టి ఈ సభకు లక్ష నుంచి లక్షన్నర మంది హాజరు కావచ్చునని టీడీపీ వర్గాలు అంచనా వేస్తున్నాయి. పది వేల వాహనాలు రావచ్చునన్న లెక్కతో వాటికి సరిపోను పార్కింగ్ సదుపాయం ఏర్పాటు చేస్తున్నారు. చంద్రబాబు ప్రమాణ స్వీకార వేదిక సిద్ధమైంది. 62మంది ఆశీనులయ్యేలా నిర్మాణం జరిగింది. వేదికకు అభిముఖంగా 36గ్యాలరీలు ఏర్పాటు చేస్తున్నారు. 800 అడుగుల పొడవు, 420 అడుగుల వెడల్పు ఉన్న జర్మనీ హ్యాంగర్స్ టెంట్లు వేశారు.

జగన్ బాధితులకు ప్రత్యేక ఆహ్వానం

ప్రమాణ స్వీకారానికి ప్రత్యేక అతిథులుగా జగన్ బాధితులు హాజరవుతున్నారు. జగన్ ప్రభుత్వంలో వేర్వేరు కారణాలతో బాధితులుగా మారిన 112 మందిని గుర్తించి, వారికి ప్రత్యేకంగా ఆహ్వానాలు పంపించారు. వారందరి కోసం సభా వేదిక సమీపంలో గ్యాలరీని ఏర్పాటు చేస్తు న్నారు. కర్నూలు జిల్లాలో పోలీసులు వేధిస్తున్నారంటూ కుటుంబంతో సహా సామూహికంగా ఆత్మహత్య చేసుకున్న అబ్దుల్ సలాం బంధువులను ఈ కార్యక్రమం కోసం పిలిచారు. అలాగే, ఎమ్మెల్సీ అనంతబాబు హత్య చేసి డోర్ డెలివరీ చేసిన దళిత డ్రైవరు సుబ్రహ్మణ్యం కుటుంబసభ్యులకు ఆహ్వానం అందింది. కరోనా సమయంలో మాస్కులు అడిగిన నర్సీపట్నం డాక్టర్ సుధాకర్‌ను వేధించి ఆయన చావుకు సర్కార్ కారణమైంది. ఆయన కుటుంబసభ్యులు ఈ కార్యక్రమంలో పాల్గొననున్నారు. అలాగే, జగన్ హయాంలో హత్యలకు బలైనవారి కుటుంబాలను పిలిపిస్తున్నారు.

ప్లేటు తిప్పేసిన స్వరూపానంద!

(మొదటి పేజీ తరువాయి)

ఆయన మీడియాతో మాట్లాడారు. 'శారదా స్వరూప రాజశ్యామల' ఆశీస్సులతోనే ప్రధానిగా నరేంద్రమోదీ మూడోసారి అధికారంలోకి వచ్చారన్నారు. అంటే.. తమ పీఠం చేసిన పూజల వల్లే మోదీ గెలిచారన్నట్టుగా మాట్లాడారు. కూటమి ప్రభుత్వం ఏర్పాటుతో రాష్ట్రాభివృద్ధి జరుగుతుందని ఆకాంక్షిస్తున్నానని స్వరూపానంద అన్నారు. "చంద్రబాబు అంటే నాకు గౌరవం. రాజకీయ నాయకులకు, ఈ రాష్ట్రానికి ఆయన పెద్ద. అనుభవజ్ఞుడైన ఆయన ఆధ్వర్యంలో రాష్ట్రం సర్వతోముఖాభివృద్ధి సాధిస్తుంది" అని పేర్కొన్నారు. తాను శ్రీకాకుళం జిల్లాకు చెందిన వాడినని, అదే జిల్లాకు చెందిన కింజరాపు రామ్మోహన్‌నాయుడుకు కేంద్ర మంత్రి పదవి వచ్చిందని, దీనికి చంద్రబాబే కారణమని పొగిడారు. తెలంగాణలో కేసీఆర్, ఆంధ్రప్రదేశ్‌లో జగన్మోహన్‌రెడ్డిల రాజ్యం నడవాలని అనేక సార్లు స్వరూపానంద 'రాజశ్యామల యాగం' చేశారు. ఒకసారి కేసీఆర్, అనేకసార్లు జగన్ స్వయంగా పీఠానికి వచ్చి పూజల్లో పాల్గొన్నారు. ఏ ఆలయానికి ఎవరిని ఈఓలుగా నియమించాలో కూడా పీఠాధిపతే నిర్ణయించేవారంటారు. స్వరూపానంద.. జగన్ ప్రభుత్వం నుంచి వేద పాఠశాల పేరు చెప్పి భీమిలి మండలం కొత్తవలసలో 15 ఎకరాల ప్రభుత్వ భూమిని నామమాత్రపు ధరకు తీసుకున్నారు. ఆ కొండపైకి వెళ్లే మార్గాన్ని వీఎంఆర్‌డీఏ నిధులతోనే వేశారు. వేద పాఠశాల పేరుతో పొందిన భూమిని.. ఆ తర్వాత దేనికైనా వినియోగించుకునేలా ఉత్తర్వులు ఇప్పించుకునేందుకు కూడా ప్రయత్నించారు. ఇక గతంలో చంద్రబాబుపై అనేక విమర్శలు చేశారు. ఇప్పుడు అవన్నీ మరిచిపోయి.. పక్కా రాజకీయ నాయకుడిలా మాట్లాడటం విశేషం.

పవన్‌కు డిప్యూటీ సీఎం!

లోకేశ్, నారాయణ, మనోహర్‌లకు బెర్తులు ఖరారు.. ఏపీలో పూర్తి మంత్రివర్గమే కొలువుదీరుతుందని అంచనాలు

- నేడు శాసనసభాపక్ష నేతగా చంద్రబాబు నాయుడు ఎన్నిక

అమరావతి, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): చంద్రబాబు నాయుడు మంత్రివర్గ కూర్పుపై టీడీపీ కూటమి పార్టీల శ్రేణుల్లో ఉత్కంఠ నెలకొంది. చంద్రబాబుతోపాటు టీడీపీ, జనసేన, బీజేపీలకు చెందిన మంత్రులు ప్రమాణ స్వీకారం చేయనున్నారని కూటమి వర్గాలు తెలిపాయి. ఈ మూడు పార్టీలు ఎన్నికల ముందు కూటమిగా ఏర్పడి కలిసి పోటీ చేసిన విషయం తెలిసిందే. మిత్రపక్ష పార్టీలను కూడా మంత్రివర్గంలోకి తీసుకోవాలని చంద్రబాబు నిర్ణయించారు. జనసేన పార్టీ అధ్యక్షుడు పవన్ కల్యాణ్ మంత్రివర్గంలో చేరుతున్నారు. ఆయనకు ఉప ముఖ్యమంత్రి ఇవ్వబోతున్నారని కూటమి వర్గాలు తెలిపాయి. ఆయనతోపాటు అదే పార్టీకి చెందిన రాజకీయ వ్యవహారాల కమిటీ చైర్మన్ నాదెండ్ల మనోహర్ కూడా మంత్రివర్గంలో చేరనున్నారు. ఆ పార్టీ నుంచి మరొకరికి కూడా మంత్రివర్గంలో స్థానం ఇవ్వడానికి అవకాశం ఉంది. మూడో ఎమ్మెల్యేకు ఇప్పుడే అవకాశం ఇస్తారా లేక తదుపరి విస్తరణలో చాన్స్ ఉంటుందా అన్నది చూడాల్సి ఉంది. బీజేపీ నుంచి చంద్రబాబు మంత్రివర్గంలో ఎవరికి చోటు లభించబోతోందన్నది ఇంకా తేలలేదు. దీనిపై నిర్ణయాన్ని బీజేపీ జాతీయ నాయకత్వం తీసుకోవాల్సి ఉంది. మంగళవారం దీనిపై స్పష్టత వస్తుందని అనుకొంటున్నారు. తన మంత్రివర్గ బృందంతో కలిసి చంద్రబాబు ఈ నెల 12న ఉదయం 11.27 నిమిషాలకు విజయవాడ సమీపంలోని గన్నవరం విమానాశ్రయం ఎదురుగా ఉన్న మైదానంలో ప్రమాణస్వీకారం చేయనున్న విషయం తెలిసిందే. టీడీపీ నుంచి చంద్రబాబు మంత్రివర్గంలోకి ఆయన తనయుడు లోకేశ్, మాజీ మంత్రి పొంగూరు నారాయణ చేరడం ఖరారైంది. చంద్రబాబు గత మంత్రివర్గంలో కూడా ఈ ఇద్దరూ మంత్రులుగా ఉన్నారు. వీరు గాక టీడీపీ నుంచి ఎవరెవరికి అవకాశం వస్తుందన్నది ఇంకా ఉత్కంఠగానే ఉంది. ఎన్నికల్లో గెలిచిన టీడీపీ ఎమ్మెల్యేలు అనేక మంది చంద్రబాబును కలిసి తమ ఆసక్తిని వ్యక్తం చేసినా, ఆయన నుంచి వారికి ఏ సంకేతాలూ అందలేదు. ఈసారి ఎన్నికల్లో టీడీపీ నుంచి 135 మంది ఎమ్మెల్యేలు గెలుపొందడంతో మంత్రి పదవులకు భారీ పోటీ నెలకొంది. రాజ్యాంగ పరిమితుల ప్రకారం చంద్రబాబు మంత్రివర్గంలో పాతిక మంది వరకూ ఉండవచ్చు. మొత్తం ఎమ్మెల్యేల సంఖ్యలో పదిహేను శాతానికి మించి మంత్రులు ఉండరాదని రాజ్యాంగ పరిమితులు సూచిస్తున్నాయి. ఇందులో మిత్రపక్షాలకు ఐదు లేక ఆరు మంత్రి పదవులను టీడీపీ ఇవ్వనుంది. మిగిలినవి టీడీపీ కోటాలోకి వస్తాయి. రాష్ట్రంలోని అన్ని ప్రాంతాలు, అన్ని సామాజిక వర్గాలకు ప్రాతినిధ్యం కల్పిస్తూ టీడీపీ నాయకత్వం తన కసరత్తును చేస్తోంది. ప్రాతినిధ్యం ఇచ్చే సమయంలో కొత్త జిల్లాలను కాకుండా ఉమ్మడి జిల్లాలను పరిగణనలోకి తీసుకొంటున్నారు. మిత్రపక్షాలతో కూడిన మొత్తం మంత్రివర్గంలో బీసీ వర్గాలవారికి ఎనిమిది, ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన వారికి రెండు, ఎస్టీలకు ఒకటి, ముస్లిం, మైనారిటీ వర్గానికి చెందిన వారికి ఒకటి ఇచ్చే సూచనలు కనిపిస్తున్నాయి. మొత్తం మంత్రివర్గంలో ఇవి సగ భాగానికి వస్తాయి. మిగిలిన వాటిని కమ్మ, కాపు, రెడ్డి, వైశ్య తదితర సామాజిక వర్గాల వారికి ఇచ్చే అవకాశం ఉందని అంటున్నారు. మొత్తం మంత్రివర్గంలో మహిళలకు కనీసం మూడు బెర్తులు దక్కుతాయని అంటున్నారు. ఉత్తరాంధ్ర, రాయలసీమ, గోదావరి జిల్లాలు, కృష్ణా, గుంటూరు, ప్రకాశం, నెల్లూరు జిల్లాలకు ప్రాతినిధ్యం కల్పిస్తూ కసరత్తును చేయాల్సి ఉంటుంది. మిగిలిన అన్ని జిల్లాలతో పోలిస్తే ఉమ్మడి గుంటూరు జిల్లాకు ఎక్కువ మంత్రి పదవులు దక్కే సూచనలు కనిపిస్తున్నాయి. చంద్రబాబు తన తొలి ప్రమాణ స్వీకార కార్యక్రమంలో తొమ్మిది మందితో చేస్తారా లేక పూర్తి స్థాయి మంత్రివర్గాన్ని ఏర్పాటు చేస్తారా అన్నది ఇంకా తేలలేదు. మంత్రివర్గ ఎంపికను ప్రమాణ స్వీకారం జరిగే రోజు ఉదయం వరకూ రహస్యంగా ఉంచటం గతంలో టీడీపీలో ఆనవాయితీ. ఈసారి మాత్రం జాబితాను ముందుగానే ఖరారు చేసి, ఎంపిక చేసిన మంత్రులతో మంగళవారం సాయంత్రం ఒక సమావేశం కూడా నిర్వహించాలన్న ఆలోచనలో చంద్రబాబు ఉన్నారు. ఇది ఎంతవరకూ సాధ్యమో మంగళవారం తేలనుంది.



ఏపీలోని గన్నవరం సమీపంలోని కేసరపల్లిలో చంద్రబాబు ప్రమాణ స్వీకారానికి శరవేగంగా సాగుతున్న ఏర్పాట్లు

ఉపన్యాసాలు ఉండకపోవచ్చు...

ఈ ప్రమాణ స్వీకార కార్యక్రమంలో ఉపన్యాసాలు ఏవీ ఉండవని టీడీపీ వర్గాలు తెలిపాయి. ప్రధాని కూడా మాట్లాడబోరని, ప్రమాణ స్వీకార కార్యక్రమం కాబట్టి ఉపన్యాసాలకు అవకాశం ఇవ్వడం లేదని ఆ వర్గాలు పేర్కొన్నాయి.

నేడు కూటమి ఎమ్మెల్యేల భేటీ...

టీడీపీ కూటమి తరపున గెలిచిన ఎమ్మెల్యేల సమావేశాన్ని మంగళవారం ఉదయం విజయవాడలోని బృందావన్ కాలనీలో ఉన్న ఎ కన్వెన్షన్‌లో నిర్వహిస్తున్నారు. దీనికి టీడీపీ, జనసేన, బీజేపీ ఎమ్మెల్యేలను పిలుస్తున్నారు. శాసనసభాపక్ష నేతగా చంద్రబాబును ఎన్నుకొంటున్నట్లు ఈ సమావేశంలో తీర్మానం ఆమోదిస్తారు. మూడు పార్టీల లేఖలను ఈ తీర్మానానికి జతచేసి గవర్నర్‌కు అందజేస్తారు. దాని ఆధారంగా ప్రభుత్వ ఏర్పాటుకు రావాలని చంద్రబాబును గవర్నర్ ఆహ్వానిస్తారు.

17 నుంచి అసెంబ్లీ!

నూతనంగా ఎన్నికైన శాసనసభ్యులతో అసెంబ్లీ సమావేశాలు ఈ నెల 17 నుంచి ప్రారంభమయ్యే సూచనలున్నాయి. ఏకాదశి కావడం వల్ల ఆ రోజు మంచిదని కొందరు సూచించారు. ఈ సమావేశాలు 4 రోజులు జరిగే అవకాశం ఉంది. మొదటి రోజు ఎమ్మెల్యేల ప్రమాణ స్వీకారం, రెండో రోజు స్పీకర్ ఎన్నిక జరుగుతుంది. లాండ్ టైట్లింగ్ చట్టం ఉపసంహరణ బిల్లును ఈ సమావేశాల్లో ఆమోదించే అవకాశం ఉందని ప్రచారం జరుగుతోంది. అధికారంలోకొస్తే వైసీపీ ప్రభుత్వం తెచ్చిన ఈ చట్టాన్ని రద్దు చేస్తామని టీడీపీ ఎన్నికల సమయంలో హామీ ఇచ్చింది.

రాజకీయాలకు కేశినేని నాని గుడ్‌బై!

- రెండు సార్లు ఎంపీగా అవకాశమిచ్చిన ప్రజలకు కృతజ్ఞతలు

విజయవాడ, జూన్ 10(ఆంధ్రజ్యోతి): రాజకీయాలకు స్వస్తి పలకాలని నిర్ణయించుకున్నట్టు వైసీపీ నేత, విజయవాడ మాజీ ఎంపీ కేశినేని నాని వెల్లడించారు. సోమవారం సామాజిక మాధ్యమాల్లో ఈ మేరకు ఆయన పోస్టులు పెట్టారు. రెండు సార్లు విజయవాడ ఎంపీగా సేవ చేసే అవకాశాన్ని కల్పించిన ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. రాజకీయాలకు దూరమైనా విజయవాడ అభివృద్ధికి తన సహకారం కొనసాగుతుందని పేర్కొన్నారు. నాని 2009లో ప్రజారాజ్యంలో చేరడం ద్వారా రాజకీయ ప్రస్థానాన్ని ప్రారంభించారు. అనంతరం టీడీపీలో చేరి 2014, 2019 ఎన్నికల్లో ఎంపీగా గెలుపొందారు. 2024 ఎన్నికల ముందు వైసీపీలో చేరి అదే నియోజకవర్గంలో సొంత తమ్ముడు కేశినేని చిన్ని చేతిలో ఘోర పరాజయం పాలయ్యారు. చివరికి రాజకీయాల నుంచి నిష్క్రమించారు.

పోలీసు కస్టడీలో నాపై హత్యాయత్నం

- మాజీ సీఎం జగన్, అప్పటి సీఐడీ చీఫ్ సునీల్‌పై చర్యలు తీసుకోండి
- గుంటూరు ఎస్పీకి రఘురామకృష్ణరాజు ఫిర్యాదు



అమరావతి (ఆంధ్రజ్యోతి), గుంటూరు, జూన్ 10: గత వైసీపీ ప్రభుత్వ హయాంలో తప్పుడు కేసులు పెట్టి తనను వేధించారని, పోలీసు కస్టడీలో తనపై హత్యాయత్నం కూడా చేశారని ఉండి ఎమ్మెల్యే రఘురామకృష్ణ రాజు గుంటూరు ఎస్పీ తుషార్ డూడీకి సోమవారం ఫిర్యాదు చేశారు. ఈ మేరకు సోమవారం ఆయన తన ఫిర్యాదును ఎస్పీకి మెయిల్ చేశారు. గుంటూరులోని సీఐడీ కార్యాలయం పోలీస్ కస్టడీలో తనపై జరిగిన ఈ వ్యవహారంలో సీఐడీ మాజీ చీఫ్ సునీల్ కుమార్, ఐజీ సీతారామాంజనేయులు, మాజీ సీఎం జగన్మోహన్‌రెడ్డి, అప్పటి సీఐడీ అడిషనల్ ఎస్పీ విజయ్ పాల్, గుంటూరు జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ప్రభావతి తదితరులు బాధ్యులన్నారు. మాజీ సీఎం జగన్ ఆదేశాలతో అప్పటి సీఐడీ చీఫ్ పీవీ సునీల్‌కుమార్ తనను లాఠీలతో కొట్టించి వీడియో కాల్‌లో వారికి చూపించారని రఘురామ అన్నారు. సీఐడీ పోలీసులు తనమీద కూర్చొని తీవ్రంగా కొట్టారన్నారు. కాళ్లు తీవ్రంగా వాచినా జీజీహెచ్ సూపరింటెండెంట్ తప్పుడు వివేదిక ఇచ్చారన్నారు. వీరందరిపై తగు చర్యలు తీసుకోవాలని ఎస్పీకి ఫిర్యాదు చేశారు.

ధర్మారెడ్డికి 'సెలవు'!

- నేటి నుంచి వారం రోజుల పాటు మంజూరు
- రాష్ట్రంలోనే అందుబాటులో ఉండాలని షరతు
- 12న చంద్రబాబు రాక నేపథ్యంలోనే నిర్ణయం



తిరుపతి, జూన్ 10(ఆంధ్రజ్యోతి): తిరుమల తిరుపతి దేవస్థానం(టీటీడీ) ఈవో ధర్మారెడ్డి నేటినుంచి వారం రోజుల పాటు సెలవుపై వెళ్లనున్నారు. సోమవారం ఆయన సెలవు కోసం దరఖాస్తు చేసుకోగా ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. అయితే రాష్ట్రంలోనే అందుబాటులో ఉండాలని షరతు విధించింది. 12న ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేసిన అనంతరం టీడీపీ అధినేత చంద్రబాబు తిరుమల రానున్న నేపథ్యంలో ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకోవడం చర్చనీయాంశమైంది. రక్షణ శాఖకు చెందిన ఐడీఈఎస్ అధికారి ధర్మారెడ్డికి వైఎస్ కుటుంబానికి అత్యంత సన్నిహితుడిగా పేరుంది. రాజశేఖరరెడ్డి సీఎంగా ఉన్న సమయంలో ఆయన రెండు పర్యాయాలు డెప్యుటేషన్‌పై టీటీడీలో ఓఎస్డీగా తిరుమలలో కీలక అధికారిగా వ్యవహరించారు. మళ్లీ వైసీపీ ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత 2019 నుంచి తిరిగి టీటీడీకి డెప్యుటేషన్‌పై వచ్చారు. తొలుత కొండపై జేఈవో పోస్టులో ఓఎస్డీగా చేరినప్పటికీ తర్వాత ఆయన కోసమే ప్రభుత్వం ఆ పోస్టును అదనపు ఈవోగా అప్‌గ్రేడ్ చేసింది. తర్వాత ఈవోను కూడా సాగనంపి ఈవో ఫుల్ అడిషనల్ చార్జి కూడా ధర్మారెడ్డికే అప్పగించింది. దీంతో మొత్తం టీటీడీ వ్యవహారాలపై ఆయన పెత్తనం మొదలైంది. శ్రీవారి దర్శనాలను అడ్డుపెట్టుకుని వైసీపీ ప్రభుత్వానికి, సీఎంకు అవసరమైన పనులను వివిధ స్థాయిల్లో చేయించడానికి ప్రయత్నం చేశారని, టీటీడీలో కూడా పలువర్గాలను వేధించారని, అందులో భాగంగా తనపై విమర్శలకు దిగేవారికి దర్శనాలు కూడా లేకుండా చేసేవారన్న ఆరోపణలున్నాయి. బీజేపీ నేత భానుప్రకాశ్‌రెడ్డిని అలాగే వేధించారని, ఆయన్ని దర్శనానికి తీసుకెళ్లే సందర్భాల్లో కేంద్రమంత్రులను కూడా ఇబ్బంది పెట్టారన్న ఫిర్యాదులొచ్చాయి. 12న సీఎంగా ప్రమాణస్వీకారం చేసిన అనంతరం చంద్రబాబు అదే రోజు రాత్రికి తిరుమల రానున్నారు. 13న శ్రీవారి దర్శనం చేసుకుని తిరుగు ప్రయాణం కానున్నారు. సీఎం హోదాలో చంద్రబాబు వచ్చినపుడు ఈవో హోదాలో ధర్మారెడ్డి స్వాగతం పలకడంతో పాటు దర్శనం, ఆశీర్వచనం సమయంలో సైతం వెన్నంటి ఉండాలి. ధర్మారెడ్డి సెలవుపై వెళుతున్న క్రమంలో ఈవో బాధ్యతలను తిరుపతి జేఈవో వీరబ్రహ్మానికి అదనంగా అప్పగించారు.

జే బ్రాండ్లకు చెక్..!

- ఆంధ్రప్రదేశ్‌లో తొక్కేసిన బ్రాండ్లు మళ్లీ వచ్చేస్తున్నాయ్
- రూల్ ప్రకారమే కంపెనీలకు ఆర్డర్లు ఇస్తున్న 'బేవరేజెస్'

(అమరావతి - ఆంధ్రజ్యోతి)

బీర్లలో పాపులర్ బ్రాండ్ అయిన కింగ్‌ఫిషర్ మద్యం డిపోలకు చేరుతోంది. దీనికి సంబంధించిన వీడియోలు వైరల్ అవుతున్నాయి. వైసీపీ ప్రభుత్వంలో ఇదే కింగ్‌ఫిషర్ కంపెనీ తమకు వ్యాపారమే వద్దంటూ రాష్ట్రంలో ఉన్న బ్రూవరీని మూసేసుకుని వెళ్లిపోయింది. ఆ కంపెనీకి శ్రీకాకుళం జిల్లా రణస్థలంలో బ్రూవరీ ఉంది. జగన్ ప్రభుత్వంలోని పెద్దలు అన్ని కంపెనీల తరహాలోనే కేసుకు రూ.150 కమీషన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఇది తమ కంపెనీ రూల్స్‌కు విరుద్ధమని, తమ వ్యాపారం జాతీయ స్థాయిలో ఉందని, ఇలాంటివి తాము ప్రోత్సహించేది లేదని కింగ్‌ఫిషర్ తేల్చి చెప్పింది. ఎంత పెద్ద కంపెనీ అయినా తమకు ఒకటేనని అప్పట్లో అధికారులు ఆర్డర్లు నిలిపివేశారు. అప్పటికే ఆర్డర్ ఇచ్చి డిపోలకు చేరిన మద్యాన్ని షాపులకు పంపకుండా నిల్వ ఉంచి, ఆరు నెలల తర్వాత బహిరంగంగా వాటిని బుల్డోజర్లతో తొక్కించి ధ్వంసం చేశారు. ఈ ఘటనతో ఆగ్రహానికి గురైన ఆ కంపెనీ రణస్థలంలో ఉన్న బ్రూవరీని మూసేసుకుని వెళ్లిపోయింది. దీంతో తాము ఉపాధి కోల్పోయామని స్థానిక ప్రజలు రోడ్డెక్కి ఆందోళన చేసినా ప్రభుత్వం పట్టించుకోలేదు. దాంతోపాటు లిక్కర్, ఇతర బీర్ కంపెనీలు కూడా కనిపించకుండా పోయాయి. కొంత కాలం మ్యాన్షన్‌హౌస్‌ను ఆపేశారు. బ్లెండర్స్ ప్రైడ్, రాయల్‌స్టాగ్ లాంటి కంపెనీలు అడ్రస్ లేకుండా పోయాయి. దీనిపై వినియోగదారుల్లో చాలా వ్యతిరేకత వచ్చింది. ఇలా ఎందుకు చేయాల్సి వచ్చిందనే దానిపై ప్రభుత్వం వింత సమాధానం చెప్పింది. ఆ బ్రాండ్లను వినియోగదారులు అడగట్లేదని, అందుకే ఆర్డర్ ఇవ్వట్లేదని వివరణ ఇచ్చింది. నాలుగున్నరేళ్ల పాటు బ్రాండ్లు మాయం చేసిన ప్రభుత్వం చివర్లో కొంత మార్పులు చేసింది. ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో ఆపేసిన బ్రాండ్ల యాజమాన్యాలతో మాట్లాడి కొన్నింటిని వెనక్కి తీసుకొచ్చింది. అయితే ఆర్డర్లు మాత్రం తక్కువే ఇచ్చింది. కాగా ఇప్పుడు రూల్ ప్రకారం అందరికీ సమానంగా ఆర్డర్లు ఇస్తున్నారు.



కొత్త మద్యం పాలసీ ఎలా..?

ఈ ఏడాది సెప్టెంబరుతో మద్యం పాలసీ గడువు ముగుస్తుంది. ఈలోగానే కొత్త ప్రభుత్వం పాలసీని మారుస్తుందనే ప్రచారం జరుగుతోంది. మళ్లీ పాత విధానంలో ప్రైవేటు షాపులు తీసుకొస్తారని వ్యాపార వర్గాలు భావిస్తున్నాయి.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

రామోజీరావు

తెలుగువారికి చెందిన సామాజికార్థిక రంగాలలో, రాజకీయాలలో, సాంస్కృతిక జీవనంలో ఐదు దశాబ్దాల పాటు బలమైన ముద్ర వేసిన ప్రభావశాలి చెరుకూరి రామోజీరావు. పత్రికా, ప్రసార రంగాల బాహుబలిగా ఆయనను దేశవ్యాప్తంగా అంతా గుర్తు చేసుకుంటున్నారు. నిండు జీవితాన్ని క్రియాశీలంగా గడిపి గత శనివారం నిష్క్రమించిన రామోజీరావు ప్రస్థానాన్ని, ఆచరించిన విలువలను చర్చించుకుంటున్నారు.

మధ్యతరగతి వ్యవసాయ కుటుంబం నుంచి వచ్చి, పెద్ద చదువులు లేకుండానే, చిన్న చిన్న ఉద్యోగాలతో వ్యాపారాలతో జీవితం ప్రారంభించిన రామోజీరావు, వ్యవసాయ పత్రిక నుంచి దినపత్రికకు, మేగజైన్లకు, సినిమాల నిర్మాణానికి, బహుభాషా టీవీచానెళ్లకు, అతిపెద్ద ఫిల్మ్ సిటీ ఏర్పాటు వరకు మీడియా రంగంలో విస్తరించారు. పచ్చళ్ల, కూల్‌డ్రింక్‌ల తయారీ, హోటళ్ల, వస్త్రాల షోరూమ్‌ల నిర్వహణ మొదలైన వ్యాపారాలు చేశారు. ఆయన చేసిన అన్ని వ్యాపారాలూ విజయవంతం అయ్యాయని, ఆయనతోనే కొనసాగాయని చెప్పలేము. కానీ, రామోజీరావు అంటే వెంటనే స్ఫురించే సంస్థలు మాత్రం ఆయనతోనే విజయవంతంగా కొనసాగుతూ వచ్చాయి. చిట్ ఫండ్, దాని అనుబంధ ఆర్థిక వ్యాపారాలు రామోజీరావు సామ్రాజ్యానికి వెన్నెముకగా నిలిచాయి.

'ఈనాడు' అవతరణతో పత్రికారంగంలో వచ్చిన మార్పులు చెప్పుకోవాలి. అప్పటికి కొంతకాలంగా తెలుగు పత్రికలలో ఒకరకమైన జడత్వం ఏర్పడిపోయింది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం అవతరించి రెండు దశాబ్దాలు అవుతున్నా, తెలుగుపత్రికల ప్రధాన కార్యాలయాలు మద్రాస్‌లోనో, విజయవాడలోనో ఉంటున్నాయి. ఆదివారం సంచికలు ఇంకా సారస్వత అనుబంధాలుగానే కొనసాగుతున్నాయి. దినపత్రికలలో మార్పునకు పెద్ద సుముఖత కనిపించేది కాదు. ఆధునిక, ప్రగతిభావాలు కలిగిన సంపాదకవర్గంతో కలసి, రామోజీరావు 'ఈనాడు'ను ప్రయోగాత్మకంగా ప్రారంభించారు. అప్పటికి అభివృద్ధిపటంలో పెద్దగా చోటుచేసుకోని విశాఖపట్నంలో మొదటి ప్రచురణ కేంద్రాన్ని ప్రారంభించారు. వార్తలను, వార్తేతర పఠనాంశాలను కొత్తరకంగా ఇవ్వడం మొదలుపెట్టారు. మార్కెటింగ్ వ్యూహాలకు, సంపాదక కర్తవ్యాలను అనుసంధానం చేశారు. పాఠకుల పఠనాసక్తిని పెంచడానికి జీవనశైలి అంశాలను ఫీచర్లుగా ప్రవేశపెట్టారు. వింతలు విశేషాలు, నేరవార్తలు ఆ పత్రికలో పాఠకులను ఆకర్షించేవి. లైంగికవిజ్ఞానాంశాలను ప్రధానస్రవంతి పత్రికలోకి తీసుకువచ్చింది ఆ పత్రికే. తెలుగునాట మూలమూలలకు పత్రిక సకాలంలో చేరడానికి నెట్‌వర్క్ ఏర్పాటు చేశారు. అనేక గ్రామాల అభివృద్ధి, ఆ పత్రిక వృద్ధి సమన్వయంతో నడిచాయనడంలో అతిశయోక్తి లేదు.

పత్రిక వేయగలిగే గట్టి ప్రభావాన్ని రామోజీరావు రాజకీయ ఆశయాల కోసం మళ్లించారని ఆయన విమర్శకులే కాదు, అభిమానులు కూడా అంగీకరిస్తారు. ప్రభుత్వాల మీద గట్టి ప్రభావం వేయగలిగిన శక్తిగా ఆయనను పేర్కొనడం రివాజుగా మారింది కూడా. కొన్ని ప్రజాస్వామిక అవసరాలకు, సామాజిక అవసరాలకు కూడా పత్రికాశక్తిని ఆయన సంధించారు. పరువునష్టం బిల్లుకు వ్యతిరేకంగా, సారా వ్యతిరేక ఉద్యమానికి అనుకూలంగా ఆ పత్రిక చేసిన ప్రచారం తెలిసిందే. అట్లాగే కొన్ని ప్రజా ఉద్యమాలను వ్యతిరేకించడమో, సమర్థన ఇవ్వకపోవడమో కూడా ఆయన మీద విమర్శలకు కారణం అయింది. పత్రిక ద్వారా ఆయన తీసుకున్న వైఖరుల కారణంగా, ఆయన వ్యాపారాలకు ఇబ్బందులు కూడా వచ్చాయి.

పత్రికే కాదు, ఏ వ్యాపారంలో అయినా పూర్తి స్థాయి పాటవం ఉండాలని ఆయన నమ్మేవారు. విశ్వసనీయత అన్నది ఆయనకు ముఖ్యమైన వ్యాపార విలువ. పత్రిక రాజకీయ వైఖరుల మీద అభ్యంతరాలు ఉండవచ్చును కానీ, వివిధ రంగాల సమాచారాన్ని పూర్తి ఖచ్చితత్వంతో, వేగంగా అందించడం పాఠకులకు విశ్వాసం కలిగించింది. అట్లాగే, ఆర్థిక వ్యాపారాల మీద నియమపరమైన వివాదాలు, వేధింపులు ఎదురయ్యాయి కానీ, చందాదారుల నుంచి అపనమ్మకం ఎదురుకాలేదు. ఆయన చాలా విజయవంతమైన సినిమాలు తీసినప్పటికీ, భారీ తారాగణంతో ఎప్పుడూ నిర్మించలేదు. కథాప్రాధాన్యం ఉన్న మధ్యతరగతి జీవితాల సినిమాలు ఉషాకిరణ్ మూవీస్ ప్రత్యేకత. ఇటీవలి కాలంలో రియాల్టీషోలలో అదుపుతప్పిన అసభ్యత కనిపిస్తోంది కానీ, మొత్తం మీద శుభ్రమైన భాష, సన్నివేశాలతోనే ఆ సినిమాలు, ఈటీవీ సీరియళ్లు ఉండేవి. రామోజీ ప్రారంభించిన 24 గంటల వార్తాచానెల్ ఈటీవీ2, ఇప్పటికీ, విపరీతపోకడలేవీ లేకుండా, గంభీరంగా కొనసాగడం ఒక విశేషం. కొంతకాలం ఆయన నిర్వహించిన ఇంగ్లీషు పత్రిక 'న్యూస్ టైమ్' ఉన్నత ప్రమాణాలతో, దేశవిదేశాల కాలమిస్టులతో పరిణత పాఠకులకు విందులాగా ఉండేది.

పత్రికాభాష మీద సొంత, సంస్థాగత ముద్ర వేయడానికి రామోజీరావు ప్రయత్నించారు. వ్యక్తిగత శైలి అంటూ లేకుండా పత్రిక అంతా ఒకేరకమైన భాషాప్రయోగం కనిపించేది. అది కొంతకాలానికి ఒక ఫిర్యాదుగా కూడా మారింది. తెలుగులో సాంకేతిక పరిభాష సృష్టికి తనదైన ప్రయత్నం ఆయన ఉధృతంగా చేశారు. తెలుగులో సమగ్రమైన ఆధునిక నిఘంటువు రూపకల్పన కోసం తమ సంస్థ నుంచి చొరవ చూపారు. విపుల, చతుర వంటి విశిష్టపత్రికలు కొనసాగలేకపోయినట్టే, ఆ ప్రాజెక్టు కూడా తొలిదశలోనే ఆగిపోయింది.

పట్టుదలతో, కఠోర పరిశ్రమతో అంచెలంచెలుగా ఎదుగుతూ వచ్చిన రామోజీరావు, తను నిర్వహించిన సంస్థల ద్వారా తెలుగుసమాజానికి కూడా జాతీయస్థాయిలో గుర్తింపు తెచ్చారు. మీడియా రంగం నుంచి సమాజంలో ఇంతటి ప్రాబల్యం పొందిన వ్యక్తులు అరుదు.

సుపరిపాలనపై ఒక్కటే మాట!

దాదాపు పదేళ్ల క్రితం వార్డ్ కౌన్సిలర్‌గా ఉన్న ఒక నేత కేంద్రంలో మంత్రి పదవి స్థాయి చేపడతారని ఎవరైనా ఊహించారా? రెండు దశాబ్దాల క్రితం కార్పొరేటర్‌గా ఉన్న ఒక నేతకు జాతీయ స్థాయిలో మంత్రిపదవి లభిస్తుందని ఎవరైనా అంచనా వేయగలరా? ఇట్లాంటి అద్భుతాలు ఒక్క భారతీయ జనతా పార్టీలోనే జరుగుతాయి. ఆదివారం నాడు ప్రధానమంత్రి నరేంద్రమోదీ సారథ్యంలో ఆంధ్రప్రదేశ్‌కు చెందిన శ్రీనివాస వర్మ, తెలంగాణకు చెందిన బండి సంజయ్, కిషన్ రెడ్డి కేంద్ర మంత్రులుగా ప్రమాణ స్వీకారం చేస్తుంటే శరీరం ఒక్కసారి పులకరించింది. ఎలాంటి వారసత్వం, సంపన్న నేపథ్యం లేకుండా క్రింది స్థాయి నుంచి చిత్తశుద్ధితో పనిచేస్తే పార్టీ గుర్తింపు దానంతటదే లభిస్తుందని అనేక సందర్భాల్లో రుజువైంది. ఒకప్పుడు వాజపేయి, అద్వాణీల పోస్టర్లు అతికించి, మైకుల్లో ప్రచారం చేసిన వెంకయ్యనాయుడు తర్వాతి కాలంలో రెండవ ఉన్నత రాజ్యాంగ పదవి అయిన ఉపరాష్ట్రపతి పీఠాన్ని అధిరోహించారు. సాధారణ కార్యకర్తగా బీజేపీ ఆవిర్భావం నుంచి పార్టీలో ఉన్న కిషన్ రెడ్డి ఇవాళ రెండోసారి మోదీ మంత్రివర్గంలో కేబినెట్ మంత్రి కాగలిగారు. ఇంతెందుకు, రైల్వే స్టేషన్లో టీ అమ్మిన నరేంద్రమోదీ ఈ దేశ ప్రధానమంత్రి అవుతారని ఎవరైనా ఊహించారా?



■ వై. సత్యకుమార్

సత్యకాలమ్

అటల్ బిహారీ వాజపేయి ఒక సాధారణ బడిపంతులు కుమారుడు. పాంచజన్య పత్రికను అచ్చు వేయిస్తున్నప్పుడు ఆయన ప్రెస్‌లో ఇటుకలను తల దిండుగా పెట్టుకుని నిద్రపోయేవారు. ఆయన నిరంతర శ్రమ, వాగ్ధాటి మూలంగా అంచెలంచెలుగా పైకి ఎదిగారు. జనసంఘ్ తరపున ఏకైక సభ్యుడిగా ఉన్నప్పుడు లోక్‌సభలో ఒక మూల నిలబడి విదేశాంగ విధానం గురించి అనర్గళంగా మాట్లాడడంతో తొలి ప్రధాని జవహర్ లాల్ నెహ్రూ దృష్టిని ఆకర్షించారు. తర్వాతి కాలంలో ఆయనే ప్రధాని అయ్యారు. దేశ విభజన సమయంలో అద్వాణీ పాకిస్తాన్ నుంచి కట్టుబట్టలతో ఇండియాకు వచ్చి రాజస్థాన్‌లో ఒక చిన్న గదిలో అజ్ఞాతవాసం గడపాల్సి వచ్చింది. ఆయన ఈ దేశ ఉప ప్రధాని కాగలిగారు. ఇప్పుడు నరేంద్ర మోదీ నెహ్రూ రికార్డునే సమం చేసి మూడోసారి ఈ దేశ ప్రధాని కాగలిగారు.

"మీరు సామాన్య కుటుంబం నుంచి వచ్చారు కదా ప్రపంచంలో అగ్రదేశాధినేతలు ఎదురైనప్పుడు వారు కూడా మిమ్మల్ని గౌరవించేలా ఎలా చేసుకోగలిగారు?" అని ఇటీవల ఒక విలేకరి మోదీని అడిగినప్పుడు, "నాకు కూడా తొలిసారి ప్రపంచ దేశాధినేతలను కలుసుకున్నప్పుడు అదే విధంగా జంకు కలిగింది. కాని నా వెనుక 140 కోట్ల మంది భారతీయులు ఉన్నారని తెలిసినప్పుడు నేను తలెత్తుకుని వారితో మాట్లాడాను. ఈ దేశం ఆత్మ నాతో మాట్లాడించింది" అన్నారు. ఇవాళ కేంద్రమంత్రులైన వారు కూడా తాము సామాన్యులమని ఏ మాత్రం భయపడనక్కర్లేదు. వారు లక్షలాది మందికి ప్రజాప్రతినిధులు మాత్రమే కాదు, కోట్లాది మంది భారతీయులు వారి పని తీరుపై ఆశలు పెట్టుకున్నారని తెలుసుకున్నప్పుడు ధైర్యంగా నిర్ణయాలు తీసుకోగలుగుతారు.



రాబోయే పదేళ్ళు అత్యంత కీలకం. దేశ అభివృద్ధి కొత్త పుంతలు తొక్కాలంటే, మోదీ ప్రారంభించిన చరిత్ర ఫలవంతం కావాలంటే ఎన్డీఏ కలిసికట్టుగా పనిచేయాలి. ప్రభుత్వాన్ని నడపాలంటే ఏకాభిప్రాయం అవసరమని మోదీ తెలిపారు. సుపరిపాలన, ప్రజల జీవన నాణ్యత, అభివృద్ధి తన సంకల్పాలని ఆయన చెప్పారు. ఈ విషయంలో ఎన్డీఏ నేతలకు ఎటువంటి భేదాభిప్రాయం లేదు.

"మనం సామాన్యుల్లా నిత్యం వినయంగా ఉండాలి. సామాన్యులు అలాంటి రాజకీయ నాయకులనే గౌరవిస్తారు. నిజాయితీ, పారదర్శకత విషయంలో ఏ విధంగానూ రాజీపడవద్దు" అని మోదీ ఆదివారం మంత్రివర్గ ప్రమాణ స్వీకారం ముందు సహచరులతో చెప్పారు. అన్ని అంశాల కంటే దేశానికే తొలి ప్రాధాన్యత ఇవ్వాలనే నేషన్ ఫస్ట్ సూత్రాన్ని గౌరవించినందుకు, అందుకోసం ఎటువంటి సవాళ్లనైనా ఎదుర్కోవడానికి సిద్ధపడినందుకే మోదీ ప్రధాని కాగలిగారు.

ఇప్పుడు ఎన్డీఏలో తిరుగులేని నేత మోదీ అని చెప్పక తప్పదు. ఈ విషయం దేశ ప్రజలు బీజేపీకి మెజారిటీ సీట్లు ఇవ్వడం ద్వారా నిరూపించారు. మొత్తం ప్రపంచం ఆయన నాయకత్వాన్ని గుర్తించింది. అంతే కాదు, ఎన్డీఏ నేతలు కూడా ఈ విషయాన్ని సంపూర్ణంగా గుర్తించారు. గత పదేళ్లలో మోదీ నాయకత్వంలో దేశం అత్యంత బలోపేతంగా ఎదిగిన తీరు, ఐదవ ఆర్థిక వ్యవస్థగా ఎదిగిన తీరు వారికి తెలుసు. అతుకుల బొంతగా ఉన్న పది పన్నెండు పార్టీల ఇండియా కూటమి మూలంగా దేశం విచ్ఛిన్నం కావడమే కాని, దాని వల్ల సాధించగలిగేది ఏమీ లేదని వారికి ఎవరూ చెప్పనక్కర్లేదు.

"భారతదేశానికి సరైన సమయంలో లభించి సరైన నాయకుడు నరేంద్రమోదీ. మోదీ నాయకత్వంలో భారతీయులు కూడా అంతర్జాతీయంగా సమున్నత స్థాయికి ఎదిగారు. ప్రపంచంలో ఎక్కడకు వెళ్లినా భారతీయులు అత్యధిక తలసరి ఆదాయాన్ని ఆర్జిస్తున్నారు. ఆయన నాయకత్వంలో భారతీయులు గ్లోబల్ నేతలుగా మారగలరు" అని తెలుగుదేశం అధినేత చంద్రబాబునాయుడు అనడం సామాన్య విషయం కాదు. మోదీ నాయకత్వంలో భారతదేశం పేదరికాన్ని నిర్మూలించగలమని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. నితీష్ కుమార్ కూడా ఇండియా కూటమి నేతలు ప్రధాని పదవిని ఇవ్వజూపినప్పటికీ తిరస్కరించారని ఆ పార్టీ నేత త్యాగి చెప్పారు. మోదీ దేశానికి చేసిన సేవను ప్రజలు గుర్తించారని, ఆయన నాయకత్వానికి తిరుగులేదని నితీష్ కుమార్ ఎన్డీఏ సమావేశంలో ప్రకటించారు. జయంత్ చౌదరి, పవన్ కల్యాణ్, ఏక్‌నాథ్ షిండే, అనుప్రియ పటేల్‌తో పాటు ఎన్డీఏ నేతలందరూ మోదీ నాయకత్వంలో దేశం అభివృద్ధికి తిరుగులేదని ప్రకటించారు. ఎన్డీఏలో భాగస్వాములు కాని బీఆర్ఎస్, వైసీపీ, బీజేడీ వంటి అనేక పార్టీలను ప్రజలు తిరస్కరించారు.

విచిత్రమేమంటే ప్రతిపక్షాలకి మోదీని ఎదుర్కోనే సామర్థ్యం లేక ఈవీఎంలపై అనుమానాలు వ్యక్తం చేశాయి. ఎన్నికల సమయంలో సుప్రీంకోర్టుకు వెళ్లి ఈవీఎంలను అడ్డుకోవాలని చూశాయి. భారతదేశం టెక్నాలజీలో ముందడుగు వేస్తుంటే ప్రతిపక్షాలు ఇంకా 20వ శతాబ్దంలో ఉన్నారు, వారి ఆలోచనా విధానం అదే విధంగా ఉన్నది. ఇవాళ దేశం సుపరిపాలనలో ఫలితాలు సాధించాలంటే టెక్నాలజీ అవసరమని మోదీ నిరూపించారు. సంక్షేమ పథకాల నిధులు నేరుగా ప్రజల ఖాతాల్లోకి చేరుతున్నాయంటే ఆధార్, మొబైల్, బ్యాంకు ఖాతాలు సమ్మిళితం అవుతున్నాయంటే టెక్నాలజీ మూలంగానే.

ఎన్డీఏలో ఉన్నవారందరూ అభివృద్ధిని ఆశించేవారు. ముఖ్యంగా చంద్రబాబు నాయుడి ప్రధాన లక్ష్యం జగన్ హయాంలో కొన్ని సంవత్సరాలు వెనకబడిన ఆంధ్రప్రదేశ్‌ను మళ్లీ గాడిలో పెట్టడమే. రాజధానిగా అమరావతిని నిర్మించడం, పోలవరం వంటి ప్రాజెక్టులను వేగంగా పూర్తి చేయడం, రాష్ట్రం అన్ని రంగాల్లో సర్వతోముఖాభివృద్ధి చెందడం ఆయన లక్ష్యం. ఎన్డీఏ ప్రభుత్వ హయాంలో ఈ లక్ష్యాలను సాధించగలరనే విశ్వాసం ఆయనకున్నది. మోదీకి, తనకు అభివృద్ధియే ప్రధాన ఎజెండా అన్న విషయం ఆయనకు తెలుసు.

రాబోయే పదేళ్ళు అత్యంత కీలకం. దేశ అభివృద్ధి కొత్త పుంతలు తొక్కాలంటే, మోదీ ప్రారంభించిన చరిత్ర ఫలవంతం కావాలంటే ఎన్డీఏ కలిసికట్టుగా పనిచేయాలి. ప్రభుత్వాన్ని నడపాలంటే ఏకాభిప్రాయం అవసరమని మోదీ తెలిపారు. సుపరిపాలన, ప్రజల జీవన నాణ్యత, అభివృద్ధి తన సంకల్పాలని ఆయన చెప్పారు. ఈ విషయంలో ఎన్డీఏ నేతలకు ఎటువంటి భేదాభిప్రాయం లేదు. రానున్న రోజుల్లో దేశం శరవేగంతో అభివృద్ధి చెందుతుంది, అన్ని వర్గాలకూ న్యాయం జరుగుతుంది. మోదీ ప్రధానమంత్రిగా బాధ్యతలు చేపట్టిన వెంటనే పీఎం కిసాన్ నిధి క్రింద రైతులకు రూ.20వేల కోట్లు మంజూరు చేశారంటేనే ఎన్డీఏ ప్రభుత్వం రైతుల సంక్షేమానికి ఎంత కట్టుబడి ఉన్నదో అర్థమవుతోంది.

(బీజేపీ జాతీయ కార్యదర్శి)

రాష్ట్ర రాజకీయాలకు మళ్లీ జాతీయ ప్రాధాన్యం

పద్దెనిమిదవ లోక్‌సభ ఎన్నికల ఫలితాలు దిగ్భ్రాంతికరంగా ఉన్నాయి. రాష్ట్ర రాజకీయాలు మళ్లీ జాతీయ ఎన్నికలలో కీలక పాత్ర వహించిన వాస్తవాన్ని ఆ దిగ్భ్రాంతిలో చాలామంది బహుశా గుర్తించలేదేమో?!

తుది దశ పోలింగ్ రోజు జూన్ 4న ఏ పార్టీ/కూటమికి ఎన్ని సీట్లు వచ్చేది మేము ఇలా అంచనా వేశాము: బీజేపీకి 237తో సహా ఎన్డీఏకి 286, కాంగ్రెస్‌కు 89తో సహా ఇండియా కూటమికి 215. ఈ అంచనాలు, అంతిమ ఫలితాలకు ఇంచు మించు సమస్థాయిలో లేవా? ఆ అంతిమ ఫలితాలను ఒకసారి గుర్తు చేస్తాము: ఎన్డీఏ 292 (బీజేపీ 240); ఇండియా కూటమి 233 (కాంగ్రెస్ 99). మా అంచనాలు జోస్యాలు కావు. 2019 సార్వత్రిక పోరు తరువాత జరిగిన అసెంబ్లీ ఎన్నికల ఫలితాల ప్రాతిపదికన 'సర్దుబాటు' చేసిన లోక్‌సభ సీట్ల సంఖ్యలవి.

ప్రతి లోక్‌సభ నియోజకవర్గంలోను పలు అసెంబ్లీ నియోజకవర్గాలు ఉంటాయి కదా. చివరిసారి జరిగిన అసెంబ్లీ ఎన్నికల ఫలితాల ఆధారంగా ప్రతి లోక్‌సభా నియోజకవర్గంలోను రాగల ఓట్లను పునఃగణించాము. ఈ సర్దుబాటు అంకెల వివరాలను ఏడు భాగాలుగా ఆయా దశల పోలింగ్ ముందు రోజున మేము ప్రచురించిన విశ్లేషణాత్మక వ్యాసాలలో వెల్లడించాం.

అయితే గత అసెంబ్లీ ఎన్నికల ఫలితాల ఆధారంగా ఆ తరువాత జరిగే లోక్‌సభ ఎన్నికల ఫలితాలను అంచనా వేయవచ్చని మేము చెప్పబోవడం లేదు. ఏమైనా ఈ సారి మా అంచనాలు ఇంచుమించుగా సమరీతిలో ఉన్నాయని రుజువయింది. అయితే ఇది యాదృచ్ఛికమే. చెప్పవచ్చినదేమిటంటే ఇటీవల ముగిసిన లోక్‌సభ ఎన్నికలలో ఆయా పార్టీల జయాపజయాలను అంచనా వేసేందుకు గత లోక్‌సభ ఎన్నికల ఫలితాల కంటే రాష్ట్ర స్థాయి ఎన్నికల ఫలితాల మెరుగైన ఆరంభ ప్రాతిపదికను సమకూర్చాయి. 2019 లోక్‌సభ ఎన్నికల ఫలితాలను పక్కనపెట్టి, తదనంతరం జరిగిన అసెంబ్లీ ఎన్నికల ఫలితాలను పరిగణనలోకి తీసుకుంటే భారతీయ జనతాపార్టీ 60 సీట్ల లోటుతో ఈ 2024 సార్వత్రిక పోటీలో పాల్గొందన్న వాస్తవం విశదమవుతుంది. అయితే ఈ యథార్థాన్ని ఎన్నికల విశ్లేషకులు, ఎన్నికలపై వార్తలు, వార్తా కథనాలు రాసిన వారు పూర్తిగా ఉపేక్షించారనడం సత్యదూరం కాదు.



జాతీయ ఎన్నికలలో రాష్ట్ర రాజకీయాలు ప్రభావవంతమైన పాత్ర నిర్వహించడం మొదలైంది. బీజేపీ రాజకీయాల తీరు తెన్నుల పట్ల ఓటర్ల అసంతృప్తి కూడా ఈ మార్పుకు పాక్షిక కారణం. రోజువారీ జీవనోపాధి సమస్యలు, ఎన్నికల స్థానిక నేపథ్యాలు, సందర్భాలకు మళ్లీ ప్రాధాన్యం లభించడం ఈ ప్రజాస్వామిక పునఃసమతౌల్యతకు ప్రధాన కారణం.

ఆయా రాష్ట్రాలలో ఫలితాల తీరుతెన్నులు ఎలా ఉన్నాయో చూద్దాం. పశ్చిమ బెంగాల్‌నే తీసుకోండి. 2019 సార్వత్రికంలో ఈ రాష్ట్రంలో బీజేపీ 18 సీట్లు గెలుచుకున్నది. అయితే ఆ తరువాత జరిగిన అసెంబ్లీ ఎన్నికల ఫలితాలను పరిగణనలోకి తీసుకుంటే ఆ పార్టీ కేవలం 10 లోక్‌సభ నియోజకవర్గాలలో మాత్రమే ఆధిక్యతలో ఉన్నది. 2024 సార్వత్రికంలో బీజేపీకి 12 స్థానాలు మాత్రమే రావడం విస్మయం కలిగించదు. అదే విధంగా రాజస్థాన్‌లో 2023 అసెంబ్లీ ఎన్నికల ఫలితాల ఆధారంగా ఇటీవలి లోక్‌సభ ఎన్నికలలో కాంగ్రెస్‌తో సహా ఇండియా కూటమికి 11 సీట్లు మాత్రమే రాగలవని సహేతుకంగా విశ్వసించడానికి ఆధారమున్నది. బిహార్, కర్ణాటక, తమిళనాడులో ఇదే అంచనా పద్ధతి వర్తిస్తుంది. ఉత్తర్‌ప్రదేశ్, హర్యానా, గుజరాత్ లలో అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు మార్పు ఏ దిశగా జరగనున్నదో అర్థం చేసుకోవడానికి ఉపకరించాయి. అయితే ఆ మార్పు ఏ మేరకు ఉంటుందో అంచనావేయడం సాధ్యం కాలేదు. కాగా ఈ అంచనా పద్ధతి అన్ని రాష్ట్రాలకు వర్తించదు. 2019–24 మధ్యకాలంలో ఆంధ్రప్రదేశ్, ఒడిషాలలో అసెంబ్లీ ఎన్నికలు జరగలేదు. ఈ రెండు రాష్ట్రాలలో అప్పుడూ ఇప్పుడూ కూడా ఏకకాలంలో లోక్‌సభ, అసెంబ్లీ ఎన్నికలు జరిగాయి. ఆంధ్ర, ఒడిషాలలో సంభవించిన ఎన్నికల భూ కంపం సూచనలు ముందస్తుగా ఎక్కడా కనిపించలేదు. చివరిసారి అసెంబ్లీ ఎన్నికల అనంతరం వివిధ పార్టీలు, కూటముల మధ్య కొత్త పొత్తులు, సంచలనాత్మక రాజకీయ పరిణామాల కారణంగా మహారాష్ట్ర, జార్ఖండ్, తెలంగాణ, మణిపూర్, పంజాబ్ లలో సంబంధిత అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు ఉపయోగకరమైనవి కావు. అయితే ఈ రాష్ట్రాలలో ఇటీవలి లోక్‌సభ ఎన్నికల ఫలితాలు ఆయా సంచలనాత్మక రాజకీయ పరిణామాలు, కొత్త పొత్తులకు అనుగుణంగా ఉండడం గమనార్హం. రాష్ట్ర రాజకీయాలు జాతీయ ఎన్నికలలో కీలక పాత్ర వహించే ధోరణికి మినహాయింపు ఉన్న రాష్ట్రాలు మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, ఢిల్లీ, ఉత్తరాఖండ్, హిమాచల్‌ప్రదేశ్. ఈ రాష్ట్రాలలో చివరిసారి జరిగిన అసెంబ్లీ ఎన్నికలలో బీజేపీ బాగా లబ్ధి పొందింది. అదే ధోరణి ఇటీవలి లోక్‌సభ ఎన్నికలలో కూడా కొనసాగింది. ఫలితంగా ఆ రాష్ట్రాలలో ప్రత్యర్థుల కంటే అత్యధిక స్థానాలను కైవసం చేసుకున్నది.



■ యోగేంద్ర యాదవ్

భారత రాజకీయాల విశాల కథతో ఈ సార్వత్రిక ఎన్నికలు ముడిపడడం విశేషం. దాదాపు రెండు దశాబ్దాల క్రితం ఈ వ్యాస రచయితలలో ఒకరు (యోగేంద్ర యాదవ్) ప్రొఫెసర్ సుహాస్ పల్షికర్‌తో కలిసి ఒక వ్యాసపరంపర రాశారు. 1990ల్లో భారత రాజకీయాలు 'మూడో ఎన్నికల విధానం' (థర్డ్ ఎలక్టోరల్ సిస్టమ్) అనే కొత్త శకంలోకి ప్రవేశించాయన్నది ఆ వ్యాసాలలోని ప్రధాన వాదన. మరింత స్పష్టంగా చెప్పాలంటే రాష్ట్ర రాజకీయాలు జాతీయస్థాయి ఎన్నికల రాజకీయాలలో ప్రధానపాత్ర వహిస్తున్నాయి. 1970, 1980 లలో భారతీయ ఓటర్లు అసెంబ్లీ ఎన్నికలలో తాము తమ ప్రధానమంత్రిని ఎన్నుకుంటున్నట్లుగా ఓటు వేశారు. అందుకు భిన్నంగా 1990లు, 2000ల తొలి సంవత్సరాలలో భారతీయ ఓటర్లు జాతీయ ఎన్నికలలో తాము తమ ముఖ్యమంత్రిని ఎన్నుకుంటున్న రీతిలో ఓటు వేశారు. 2014లో జాతీయ రాజకీయాలలో నరేంద్ర మోదీ ఉత్థానంతో ఇదంతా మారిపోయింది. జాతీయ ఎన్నికలలో ఓటింగ్ ధోరణులను జాతీయ రాజకీయాలే ప్రధానంగా ప్రభావితం చేయడం ప్రారంభమయింది. అన్ని రాష్ట్రాలలోను కాకపోయినప్పటికీ కొన్ని రాష్ట్రాలలో అసెంబ్లీ ఎన్నికలలో ఓటింగ్ ధోరణులను సైతం జాతీయ రాజకీయాలే ప్రభావితం చేయడం సంభవించింది.

ఇటీవల ముగిసిన లోక్‌సభ ఎన్నికలు మరో మార్పుకు నాంది పలికాయి. రాష్ట్ర రాజకీయాలు ప్రధాన ప్రభావవంతమైన పాత్ర వహించలేదు కానీ జాతీయ ఎన్నికలలో ఓటర్లు ఓటు వేసే విధానానికి ఉపయుక్త సందర్భంగా మారాయి. 2019 సార్వత్రిక పోరులో కంటే 2024లో రాష్ట్ర రాజకీయాల తీరుతెన్నులపై దృష్టి పెట్టి జాతీయ ఎన్నికలలో ఓటు వేసిన వారు అధికంగా ఉన్నారు. ఈ వాస్తవాన్ని లోక్‌నీతి–సిఎస్‌డిఎస్ నిర్వహించిన పోస్ట్ పోల్ సర్వే ధ్రువీకరించింది. 'ఎవరికి ఓటు వేయాలో నిర్ణయించుకోవడంలో ఏ ప్రభుత్వ పాలనను ఎక్కువగా పరిగణనలోకి తీసుకుంటావు?' అన్న ప్రశ్నకు 23శాతం మంది కేంద్ర ప్రభుత్వమని సమాధానమిచ్చారు. రాష్ట్ర ప్రభుత్వమని 21 శాతం మంది మాత్రమే చెప్పారు. కేంద్ర ప్రభుత్వంతో పాటు రాష్ట్ర ప్రభుత్వ పాలనను కూడా పరిగణనలోకి తీసుకుంటామని చెప్పిన వారు 41శాతం మంది ఉన్నారు. ఇదే ప్రశ్నకు 2019లో 28 శాతం మంది కేంద్ర ప్రభుత్వమని, 17 శాతం మంది రాష్ట్ర ప్రభుత్వమని సమాధానమిచ్చారు.

జాతీయ ఎన్నికలలో రాష్ట్ర రాజకీయాలు ప్రభావవంతమైన పాత్ర నిర్వహించడంపై చర్చను ఈ సార్వత్రిక ఎన్నికలు ప్రారంభించాయి. బీజేపీ రాజకీయాల తీరుతెన్నుల పట్ల ఓటర్ల అసంతృప్తి కూడా ఈ మార్పుకు పాక్షిక కారణం. రోజువారీ జీవనోపాధి సమస్యలు, ఎన్నికల స్థానిక నేపథ్యాలు, సందర్భాలకు మళ్లీ ప్రాధాన్యం లభించడమే ఈ ప్రజాస్వామిక పునఃసమతౌల్యతకు ప్రధాన కారణం. జాతీయ అంశాలు, జాతీయవాద ఆదుర్దాలు వెనుకబడి, రాష్ట్ర రాజకీయాలు జాతీయ ఎన్నికలలో ప్రధాన ప్రభావ పాత్ర వహించడం ద్వారా ప్రజాస్వామిక పునఃసమతౌల్యతను సాధించేందుకు ఈ సార్వత్రిక ఎన్నికలు దారితీశాయి. నిస్సందేహంగా ఇదొక గణనీయమైన మార్పు.

(శ్రేయాస్ సర్దేశాయి, రాహుల్ శాస్త్రి సహకారంతో)

(ఇటీవలి లోక్‌సభ ఎన్నికల ఫలితాలపై ప్రముఖ విశ్లేషకుడు, భారత్ జోడో అభియాన్ జాతీయ కన్వీనర్ యోగేంద్రయాదవ్ అందిస్తున్న ఐదు వ్యాసాల పరంపరలో ఇది మొదటిది)

పరస్పర అపనమ్మకాల సుడిలో ప్రజాస్వామ్యం!

గమనించాలి గానీ రాజకీయ సందర్భాలు కూడా అనేక రాజకీయేతర గుణపాఠాలు నేర్పిస్తుంటాయి. గత రెండు దశాబ్దాలుగా జరుగుతున్న ఎన్నికలను, వాటి ఫలితాలను గమనిస్తే ఆ గుణపాఠాలకు కొదవేమీ లేదు. ప్రజలు సంక్షేమం కోరుకుంటున్నారా అభివృద్ధి కోరుకుంటున్నారా. ఈ ప్రశ్నలకు ఏ ప్రభుత్వం దగ్గరయినా సమాధానం ఉందా?

ప్రభుత్వాలు ప్రజలకు ఏ ఏ ఉపకారాలు చేయదలుచుకుంటున్నాయి. ప్రజలు ప్రభుత్వాల నుంచి ఎటువంటి లబ్ధి ఆశిస్తున్నారు. ప్రజల ఆశలకూ ప్రభుత్వాల పందేరాలకూ నడుమ సమన్వయం ఉన్నట్టా లేనట్టా. ప్రజలు ఆశిస్తున్న లబ్ధులనే ప్రభుత్వాలు అందిస్తున్నాయా. ప్రభుత్వాలు అందిస్తున్న ప్రయోజనాలతో ప్రజలు సంతృప్తి చెందుతున్నారా లేక ఇంకా ఇంకా కావాలి అంటున్నారా. ప్రజలు సంతృప్తి చెందుతున్నట్టయితే అధికార పీఠాన్నెక్కే రాజకీయ పార్టీల మార్పిడి తరచూ ఎందుకు జరుగుతోంది. అలా కాదనుకుంటే ప్రజలు సంతృప్తి చెందడం లేదు అనే మర్మాన్ని అధికారంలో ఉన్న పార్టీలు ఎందుకు గ్రహించలేకపోతున్నాయి.

ఈ ప్రశ్నలకు ప్రజల దగ్గర సమాధానాలున్నాయా? రెండు సందర్భాలలోనూ లేవనే గత ఇరవై ఏళ్ల ఎన్నికల ఫలితాలు చెపుతున్నాయి. ప్రజలు సంక్షేమాన్ని కోరుకుంటున్నారనడానికి గత రెండు దశాబ్దాల ఎన్నికలలో ఉదాహరణలు లేవు. ప్రజలు అభివృద్ధిని కోరుకుంటున్నారనడానికి కూడా స్పష్టమైన ఆధారాలు లేవు.

మరింత ఉదాహరణలతో చెప్పాల్సి వస్తే అభివృద్ధికీ, ఆత్యాధునిక ఆలోచనా విధానానికీ మారుపేరనుకున్న చంద్రబాబును దించి ప్రజలు ఒకానొక సందర్భంలో రాజశేఖర రెడ్డికి పట్టం కట్టారు. అభివృద్ధినీ సంక్షేమాన్నీ సమపాళ్లలో అందించానని తాననుకున్న కేసీఆర్‌నూ ప్రజలు ఇంకో సందర్భంలో మట్టి కరిపించారు. మళ్లీ అదే అభివృద్ధికి కొండగుర్తు అనుకునే చంద్రబాబును కాదని జగన్‌కు ఆంధ్ర ప్రజలు లాండ్ స్లయిడ్ ఫలితాన్నిచ్చారు. మరో మలుపులో సంక్షేమమే ఆరుప్రాణాలుగా పాలన సాగించాననుకున్న జగన్‌ను తోసిరాజని అదే ప్రజలు మళ్లీ తామే తిరస్కరించిన చంద్రబాబును గద్దెనెక్కించారు. "మరీ 23 వచ్చేంత చెడు చేసామా మేం ప్రజలకు!" అని చంద్రబాబే అవాక్కయే సందర్భం, "నేను కోట్లాదిమందికి అందించిన వేల కోట్ల రూపాయల లబ్ధి ఏమయింది ఎటుపోయింది?" అని జగన్ స్వయంగా గద్గదపడే సందర్భం... రెండూ ఆంధ్ర ప్రజల చమత్కారాలే!

అవినీతికి అసలు సిసలు అర్థం అని ముద్రపడ్డ నితీష్‌కు మళ్లీ అదే ప్రజలు అందలమిచ్చారు. దేశాన్ని ప్రగతి సూచీలో అగ్రస్థానంలో ఉంచామన్న చెప్పన్ ఇంచ్ ఛాతీని అబ్ కీ బార్ తీన్ సౌ కీ ఇస్ పార్ అని గేటు మూసేసారు. రాముడే దేశాన్ని మా చేతిలో పెడతాడనుకున్న వారికీ ఏకంగా అయోధ్యే చేయిచ్చింది. గుడి మెట్ల కింద నలిగిపోయిన గుడిసెలూ చిరువ్యాపారాలూ డొక్కాడడానికి చెమటలు కక్కే రెక్కలూ అభివృద్ధి కంటే తమ సంక్షేమమే ముఖ్యం అనుకుని ఉంటాయి. రాముడికన్నా ఆత్మారాముడే ముఖ్యం అనుకోవడంలో తప్పేంలేదు కదా. ఓడి గెలిచారో గెలిచి ఓడారో అర్థం కాని అయోమయంలోకి ఎన్డీఏనూ, ఇండియా కూటమినీ ప్రజలు విజయవంతంగా నెట్టేసారు.

ఇంత అభివృద్ధి చేసినా నన్ను ప్రజలు ఎందుకు కాదన్నారు అని గతంలో చంద్రబాబు సమాధానాల కోసం వెతుక్కున్నాడు. ఇంత సంక్షేమం అందించినా నాకెందుకిలా అయింది అని జగన్ ఇంకా కోమాలోంచి తేరుకోలేదు, బహుశా తేరుకోవడానికి చాలా కాలం పట్టొచ్చు. అభివృద్ధీ సంక్షేమం రెండూ చేసాను కదా నన్నెందుకు ప్రజలు కాదన్నారు అని కేసీఆర్ ఆ చిక్కుముడిని విప్పే ప్రయత్నంలో సతమతమవుతున్నాడు. మరోవైపు ప్రజలు కూడా అభివృద్ధిని కోరుకుంటూనే దానికి ప్రథమ ప్రాధాన్యం ఇవ్వడం లేదు, సామూహిక ప్రయోజనాల గురించి ప్రజలు ఆలోచించడం, నిరసించడం ఏనాడో మానేసారన్నది నిజం. వ్యక్తిగత లబ్ధులకే ప్రజలు మొగ్గు చూపుతున్నారన్నదీ నిజమే. అయితే వ్యక్తిగత లబ్ధులను ఇచ్చే ప్రభుత్వాల పట్ల ప్రజలకు సానుకూలత లేనే లేదన్నదీ వాస్తవమే. "పాలకులేమన్నా వాళ్ల జేబుల్లోంచి ఇస్తున్నారా, మాది మాకే ఇస్తున్నార"న్న భావన కూడా ప్రజల మెదళ్లలో బలంగా పీఠం వేసుకుంది. పైగా నాకు పదివేలిస్తున్నాడూ అంటే కచ్చితంగా వాడు పది లక్షలు తినే ఉంటాడన్న విశ్వాసమూ ప్రజలకు బలంగానే ఉంది. ఈ భావనే ప్రభుత్వాలను సంక్షేమం నిలబెట్టలేకపోవడానికి ప్రధాన కారణం. అభివృద్ధి వల్ల సమూహాలకే తప్ప వ్యక్తిగత ప్రయోజనం లేదు, వ్యక్తిగత ప్రయోజనం కూర్చే సంక్షేమం ఎవడబ్బసొమ్మూ కాదన్న అభిప్రాయాలే ప్రధానంగా ఈ ప్రభుత్వాల మార్పిడికి కారణం. ఈ ప్రహేళికను అర్థం చేసుకుని అటు సంక్షేమాన్నీ ఇటు అభివృద్ధినీ కూడా కొన్ని ప్రభుత్వాలు పట్టించుకున్నప్పటికీ ప్రజలు మాత్రం ఆ ప్రభుత్వాల పట్ల కూడా కనికరం చూపడం లేదు.

ప్రజలూ పాలకులు వేరువేరుగా ఉండని వ్యవస్థే ప్రజాస్వామ్యం అని చెప్పుకునే నిఘంటు అర్థాలను విని నవ్వుకుని ప్రజలూ పాలకులూ ఎప్పుడూ వేర్వేరే, వాళ్లు ఒకళ్లకొకళ్లు ఎప్పటికీ అర్థం కారు అని నిర్ధారించుకునే రోజులొచ్చాయని మన ఎన్నికలు రౌండ్ రౌండ్ కీ రుజువు చేస్తున్నాయి. అభివృద్ధా, సంక్షేమమా లేక రెండూనా లేక రెండూ కాదా అనే సందిగ్ధత నుంచి బయటపడడం ప్రజలకూ ప్రభుత్వాలకూ అత్యవసరం.



మాకు అభివృద్ధి వద్దని కానీ సంక్షేమం వద్దని కానీ ప్రజలు కరాఖండిగా చెప్పలేరు. ఏ ప్రభుత్వాలు వచ్చినా తమ సంక్షేమం తమకు దక్కుతుందనే నమ్మకం ప్రజలలో బలపడిపోయింది. అభివృద్ధి తమ సమస్య కాదనీ అది ప్రభుత్వాలే చూసుకుంటాయనీ నమ్మి కూడా ప్రజలు బలంగా దాన్ని పట్టించుకోవడం లేదు. చేపల్ని పట్టడం నేర్పాలి ఉచితంగా చేపల్నివ్వడం చేటు అనే సత్యాన్ని ఎప్పుడో పెడచెవిన పెట్టాం. ఉచితాల పద్మవ్యూహం నుంచి ఏ ప్రభుత్వమూ ఏ రాజకీయ పార్టీ అయినా అర్జునుడు కాలేని అభిమన్యుడే. రెండు రెండ్లు నాలుగనే లోకంలో అప్పట్లో చంద్రబాబు ఓడిపోకూడదు. ఇప్పట్లో కేసీఆర్ ఓడిపోకూడదు. కానీ వాస్తవం వేరేగా వుంది కదా.

ప్రజలను అర్థం చేసుకోవడంలో ప్రభుత్వాలు పూర్తిగా విఫలమయ్యాయని తేలిపోయింది. తమను ఫలానా రకంగా అర్థం చేసుకోండి అని ప్రజలు కూడా ప్రభుత్వాలకు తాత్పర్యాలను వివరించడంలోనూ సఫలం కాలేదని తేలిపోయింది. ఇటువంటి సందర్భాల్లోనే ఒక ప్రశ్న అందరినీ తొలుస్తూంటుంది. ప్రజలు మేధావులు, ఎవర్ని ఎక్కడ కూచోబెట్టాలో వాళ్లకు స్పష్టంగా తెలుసు అనే మాట నిజమేనా అని. మరో వైపు ప్రజలను మోసం చేసే నాయకులను చూసాం కానీ నాయకులను మోసం చేసే ప్రజలను చూడలేదు అని వినిపించే విచిత్రమైన వాదన సరైందేనా అనీ అనిపిస్తుంది. ఎవరి సైజును వాళ్లకు తెలియచేయాలన్నా ఎవరినైనా మోసం చేయాలన్నా వాళ్లను సంపూర్ణంగా అర్థం చేసుకోవడం అవసరం. వాళ్ల పట్ల పూర్తి అవగాహన తప్పనిసరి. కానీ ఇక్కడ అటు ప్రభుత్వాలూ ప్రజలను సరిగా అర్థం చేసుకోలేదనీ ఇటు ప్రజలూ ప్రభుత్వాల పట్ల సరైన అవగాహనకు రాలేకపోతున్నారనీ తెలిసిపోతోంది. ఈ ఒకరిని ఒకరు అర్థం చేసుకోని పరిస్థితే గొప్పది అనుకుంటే ప్రజాస్వామ్యానికి చాలా నష్టం.

మనం వేసే ఓటువల్ల గొప్ప మార్పు జరిగిపోతుంది అనే మాట నిజమే అయితే వాళ్లు మనల్ని ఓటు వేయనివ్వరు అంటాడు ఆస్కార్ వైల్డ్. అసలిక్కడ ప్రభుత్వాలకు ప్రజలకు మధ్య పరస్పర విశ్వాసం లేకపోవడం ప్రధానాంశం. ప్రజలు తమను మరోసారి కూడా గెలిపిస్తారు అని ఏ ప్రభుత్వమూ నమ్మలేకపోతోంది. ఈ ప్రభుత్వం కాక మరో ప్రభుత్వం మరింత మేలు చేస్తుందేమో అన్న గోడదూకుడు అవకాశం ఉండడం చేత ప్రజలూ ప్రస్తుత ప్రభుత్వాలను నమ్మరు. ఈ అపనమ్మకాల గందరగోళంలోనే ప్రజాస్వామ్యం చిక్కుకుపోతోంది. ప్రజలూ పాలకులు వేరువేరుగా ఉండని వ్యవస్థే ప్రజాస్వామ్యం అని చెప్పుకునే నిఘంటు అర్థాలను విని నవ్వుకుని ప్రజలూ పాలకులూ ఎప్పుడూ వేర్వేరే, వాళ్లు ఒకళ్లకొకళ్లు ఎప్పటికీ అర్థం కారు అని నిర్ధారించుకునే రోజులొచ్చాయని మన ఎన్నికలు రౌండ్ రౌండ్ కీ రుజువు చేస్తున్నాయి.

ఈ ఒకళ్లనొకళ్లు అర్థం చేసుకోవడానికి మాత్రం ఇప్పటివరకూ ఎటువంటి ప్రయత్నాలూ జరగలేదు. అర్థం చేసుకుంటున్నాం అనుకుంటూ ప్రతి ప్రయోగంలో ఆకులు పట్టుకుంటూ కాలిన చేతులను చూసుకుని దిగాలు పడడమే మిగిలింది. ఇప్పుడు తీవ్రంగా ప్రయోగాలు జరగాలి. ఏం కావాలి ఏం ఇవ్వాలి అనే విషయంలో మధ్యేమార్గాన్ని సుస్థిరం చేయాలి. రాజకీయేతర వ్యవస్థల నుంచి కొన్ని ప్రయోగశాలలు తయారై పరిష్కారాన్ని కనుగొనాలి. అభివృద్ధా, సంక్షేమమా లేక రెండూనా లేక రెండూ కాదా అనే సందిగ్ధత నుంచి బయటపడడం ప్రజలకూ ప్రభుత్వాలకూ అత్యవసరం. నిజమే రాజకీయ సందర్భాలు రాజకీయేతర గుణపాఠాలను నేర్పిస్తాయి. కానీ ఆ రాజకీయేతర గుణపాఠాలు కూడా రాజకీయాలను సవరించడానికి సరిదిద్దడానికి మాత్రమే ఉపయోగపడాలి.

• ప్రసేన్

'బుక్ బ్రహ్మ లిటరేచర్ ఫెస్టివల్ – 2024'

భారతీయ భాషల సాహిత్య ప్రాముఖ్యతను ప్రపంచానికి తెలియజెప్పేందుకు, దక్షిణ భారతీయ భాషల ప్రమరణ కర్తలను అందరినీ ఒకే వేదిక మీదకు తెచ్చేందుకు 'బుక్ బ్రహ్మ లిటరేచర్ ఫెస్టివల్ – 2024' జరుగుతున్నది. ఆగస్ట్ 9 నుంచి 11 వ తేదీ వరకు సెయింట్ జాన్స్ ఆడిటోరియం, కోరమంగల, బెంగుళూరులో జరిగే ఈ వేడుకలో డెలిగేట్స్‌గా పాల్గొనేందుకు రిజిస్ట్రేషన్ల కార్యక్రమం నేటితో మొదలవుతున్నది. పాల్గొనే ఉత్సాహం ఉన్న వారు www.bookbrahmalitfest.com అనే వెబ్‌సైట్‌కు వెళ్లి మీ పేర్లను ఉచితంగా రిజిస్టర్ చేసుకోవచ్చు. ఇలా ఆన్‌లైన్‌లో ఉచితంగా రిజిస్టర్ చేసుకున్న డెలిగేట్స్‌కు ఎంట్రీ పాస్ లభిస్తుంది, వారికి మాత్రమే ఫెస్టివల్ గ్రౌండ్స్‌లో ప్రవేశం ఉంటుంది. ఈ మూడు రోజుల వేడుకలో ఐదు దక్షిణాది రాష్ట్రాల నుంచి 450 మంది రచయితలు, 100 మంది పబ్లిషర్లు పాల్గొంటారు. కన్నడ, తమిళ్, మలయాళం, తెలుగు, ఇంగ్లీష్ భాషల పుస్తకాలతో 60 బుక్‌స్టాల్స్ ఉంటాయి. ఈ మూడు రోజుల్లోనూ ఐదు ఆడిటోరియమ్స్‌లో ఏకకాలంలో వేర్వేరు సెషన్లు మొత్తం 80 దాకా జరుగుతాయి. వేడుకలో హెచ్.ఎస్. శివప్రకాష్, వివేక్ షాన్‌భాగ్, జెయమోహన్, పెరుమాల్ మురుగన్, బెన్యమిన్, కె. సచ్చిదానందన్, గిరిష్ కాసరవల్లి, ఓల్గా, సి. మృణాళిని... తదితర ప్రముఖ సాహితీవేత్తలు పాల్గొంటారు. పండిట్ వెంకటేష్ కుమార్, ఆర్.కె. పద్మనాభ వంటి సంగీతకారుల సంగీత ప్రదర్శనలు, నటుడు ప్రకాష్ రాజ్ తదితరులచే పుస్తక పఠనాలు, మరిన్ని సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయి.

వివరాలకు ఫోన్: 70194 81044

– స్వాతిరావ్

వ్యాసాలు, ఉత్తరాలు పంపవలసిన చిరునామా
ఎడిటోపేజీ, ఆంధ్రజ్యోతి,
ప్లాట్–76, అశ్వినీ లే ఔట్,
హుడా హైట్స్, రోడ్ నంబరు–70,
జూబ్లీహిల్స్, హైదరాబాద్–500033.
మెయిల్:
editpage@andhrajyothy.com


పౌరులకు అవగాహన కల్పిస్తున్న ఈవీడీఎం సిబ్బంది

వరదలు వస్తే.. ఏం చేయాలి..?

హైదరాబాద్ సిటీ, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): భారీ వర్షాలు కురిసినప్పుడు ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలనే అంశంపై జీహెచ్ఎంసీలోని ఈవీడీఎం అధికారులు పౌరులకు శిక్షణ ఇచ్చారు. ఫతుల్లాగూడలో సోమవారం నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో వరద నిర్వహణ, ప్రాణాపాయం జరగకుండా చేయాల్సిన పనుల్లో పౌరులు ఎలా భాగస్వాములు కావాలన్నది వివరించారు. సాధారణ సమయాల్లోనూ మోస్తరు మించి వాన పడితే ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి ఉన్న దృష్ట్యా.. వాటిని ఎలా అధిగమించాలన్నది విపత్తు నిర్వహణ సిబ్బంది ద్వారా ప్రత్యక్షంగా చూపించారు. అత్యవసర పరిస్థితుల్లో సంప్రదించాల్సిన డీఆర్ఎఫ్, జీహెచ్ఎంసీ, తదితర విభాగాల ఫోన్ నంబర్లు వారికి ఇచ్చారు.

సరిపడా బస్సులు లేవు.. కొత్తవి రానేలేదు

● స్కూళ్లు, కళాశాలలు ప్రారంభమైతే రద్దీతో కష్టమే..

హైదరాబాద్ సిటీ, జూన్ 10 (ఆంధ్రజ్యోతి) : గ్రేటర్‌లో సిటీ బస్సులు సరిపడక లక్షల మంది నగరవాసులు ప్రతిరోజు ప్రైవేట్ వాహనాల వెంట పరుగులు పెడుతున్నారు. గ్రేటర్‌లో ప్రయాణికుల అవసరాలు తీర్చాలంటే 6 వేల బస్సులను ఆర్టీసీ నడపాల్సి ఉంటుందని రవాణారంగ నిపుణులు చెబుతున్నారు. అందులో సగం బస్సులు కూడా ప్రస్తుతం గ్రేటర్‌జోన్‌లో నడపడం లేదు. ఈ విద్యాసంవత్సరం ప్రారంభం నాటికి గ్రేటర్‌లో వంద కొత్త బస్సులు వస్తాయని ఆర్టీసీ అంచనా వేసినా ఇప్పటివరకు కొత్త బస్సులు అందుబాటులోకి రాలేదు. ఈనెల 12 నుంచి ప్రారంభమయ్యే పాఠశాలలు, ఇప్పటికే తరగతులు నిర్వహిస్తున్న కళాశాలలు పూర్తిస్థాయిలో తెరుచుకుంటే బస్సులకోసం రోడ్లపైకి వచ్చే వారి సంఖ్య మరింతగా పెరుగనుంది. రద్దీకి తగినట్లు బస్సులు లేకపోవడంతో ఇప్పటికే ఉదయం, సాయంత్రం వేళల్లో సిటీ బస్సుల్లో వేలాడుతూ, ఫుట్‌బోర్డు ప్రయాణాలు సాగిస్తున్నారు. పెరుగుతున్న ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా ప్రభుత్వం, టీజీఎస్ఆర్టీసీ బస్సులను మరిన్ని పెంచాలని ప్రయాణికులు కోరుతున్నారు.


ప్రజావాణి.. మళ్లీ షురూ..!

హైదరాబాద్ సిటీ, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల కోడ్ ముగియడంతో జీహెచ్ఎంసీ, కలెక్టరేట్‌లో ప్రజావాణి కార్యక్రమం తిరిగి ప్రారంభమైంది. సోమవారం జీహెచ్ఎంసీ కార్యాలయంలో మేయర్ గద్వాల్ విజయలక్ష్మి, ఇన్‌చార్జి కమిషనర్ ఆమ్రపాలి పౌరుల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. ఈ సందర్భంగా విజయలక్ష్మి మాట్లాడుతూ నేరుగా 27, ఫోన్ ఇన్ ద్వారా ఎనిమిది ఫిర్యాదులు వచ్చాయన్నారు. ఇన్‌చార్జి కమిషనర్ ఆమ్రపాలి మాట్లాడుతూ నిర్ణీత కాలవ్యవధిలో ఫిర్యాదులు పరిష్కరించాలని అధికారులకు సూచించారు.


ప్రజావాణిలో ఫిర్యాదులు స్వీకరిస్తున్న మేయర్ విజయలక్ష్మి, పక్కన ఆమ్రపాలి

కలెక్టరేట్‌లో 62 ఫిర్యాదులు..

కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో వివిధ ప్రాంతాలకు చెందిన 62 మంది తమ సమస్యలపై అధికారులకు వినతిపత్రాలు అందజేశారు. వివిధ సమస్యలపై ప్రజలు అందించే దరఖాస్తులను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని జిల్లా రెవెన్యూ అధికారి (డీఆర్ఓ) వెంకటాచారి అధికారులకు సూచించారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ లా ఆఫీసర్ వీరబ్రహ్మచారి, సికింద్రాబాద్, హైదరాబాద్ ఆర్డీఓలు మహిపాల్, దశరథ్‌సింగ్, ఈడీఎం రజిత, తహసీల్దార్లు తదితరులు పాల్గొన్నారు.



పోలీసులు గస్తీకి మంగళం పాడారు. రాత్రి నుంచి ఉదయం వరకు కాలనీలు, బస్తీల్లో పెట్రోలింగ్ చేస్తూ నేరాలను అరికట్టాల్సిన పోలీసులు ఎక్కడో ఓ చోట తమ వాహనాలను ఆపి కునుకుతీస్తున్నారు. వీటిపై ఉన్నతాధికారుల పర్యవేక్షణ లేకపోవడం కూడా ఇందుకు ఓ కారణంగా చెప్పొచ్చు. పోలీసు గస్తీ లేకపోవడం.. సైరన్ మూగబోవడంతో పలుచోట్ల అల్లరిమూకల ఆగడాలకు అంతులేకుండా పోతున్నది.

నిద్రపోతున్న నిఘా..

- కనిపించని పోలీస్ పెట్రోలింగ్, వినిపించని సైరన్
- నగరంలో రెచ్చిపోతున్న అల్లరిమూకలు
- రాత్రి పది దాటిందంటే.. భయపడుతున్న ప్రజలు

హైదరాబాద్ సిటీ, జూన్ 10(ఆంధ్రజ్యోతి): ట్రై కమిషనరేట్ పరిధిలోని అనేక ప్రాంతాల్లో అర్ధరాత్రి పోలీసుల గస్తీ కనిపించడం లేదు. రాత్రంతా పెట్రోలింగ్ చేయాల్సిన పోలీసులు పలు కాలనీలు, బస్తీలతో పాటు.. శివారు ప్రాంతాల్లో తిరగడం లేదనే ఆరోపణలు వెల్లువెత్తున్నాయి. జనసామర్థ్యం ఉన్న ప్రాంతాల్లోనే పోలీస్ పెట్రోలింగ్ వాహనాలు కనిపిస్తున్నాయని, సైరన్ వినిపిస్తోన్నదని, పోకిరీలు, ఆకతాయిలు, అల్లరిమూకలు ఉండే ప్రాంతాల్లో గస్తీ వాహనాలు అసలు కనిపించడమే లేదని ఆయా కాలనీ, బస్తీ వాసులు ఆరోపిస్తున్నారు.

పోలీసులు అర్ధరాత్రి వరకూ అడపాదడపా రోడ్లపై తిరుగుతూ అర్ధరాత్రి దాటగానే ఏదో ఒక అనుకూలమైన ప్రాంతంలో వాహనాన్ని నిలుపుకొని కాలయాపన చేస్తున్నట్లు ప్రజల నుంచి ఫిర్యాదులు వస్తున్నాయి. కొందరు పెట్రోలింగ్ పోలీసులు దర్జాగా నిద్రపోతున్నట్లు సమాచారం. తెల్లవారుజాము వరకు పడుకొని 4గంటల సమయంలో లేచి శివారు ప్రాంతాలకు వెళ్లి టీ తాగి, అక్కడక్కడే కాలనీల్లో చక్కర్లు కొట్టి రాత్రిపూట గస్తీని మమ అనిపిస్తున్నారనే విమర్శలు వస్తున్నాయి. ఏదైనా ఘటన జరిగితేనో.. డయల్-100కు ఫిర్యాదు వస్తేనో.. పోలీస్ ఉన్నతాధికారులు ఆదేశిస్తేనో తప్ప గస్తీ వాహనాలు గల్లీల్లో కనిపించడం లేదు. ఇదే అదునుగా భావిస్తున్న అల్లరిమూకలు, అరాచక శక్తులు రెచ్చిపోతున్నాయి. అర్ధరాత్రి నుంచి నుంచి తెల్లవారుజామున 4 గంటల మధ్యలో నేరస్థులు తమ పని కానిచ్చేస్తున్నారు. హత్యలు, అత్యాచారాలు, దోపిడీలు, దొంగతనాలు వంటి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్నారు. రాత్రి పది దాటిందంటే చాలు.. పోకిరీలు, చోటామోటా రౌడీలు పెచ్చుమీరిపోతున్నారు. మద్యం, గంజాయి మత్తుకు అలవాటుపడి గ్రూపులుగా విడిపోతున్న ముఠాలు గొడవలు, కొట్లాటలకు దిగుతున్నాయి. రాత్రిపూట రోడ్డుమీద వెళ్లాలంటేనే స్థానికులు భయపడే పరిస్థితి దాపురించింది. ముఖ్యంగా గత 3 నెలలుగా ట్రై కమిషనరేట్ పరిధిలోని అనేక ప్రాంతాల్లో గస్తీ పోలీసుల వైఫల్యంపై ఆరోపణలు వస్తున్నాయి. పోలీస్ పెట్రోలింగ్‌పై జోన్, డివిజన్ స్థాయి పోలీస్ అధికారుల పర్యవేక్షణ లేకపోవడం కూడా ఇందుకు కారణమనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. పోలీస్ ఉన్నతాధికారులు స్పందించి, శివారు ప్రాంతాల్లో, నేరాలు ఎక్కువగా జరుగుతున్న కాలనీలు, హాట్‌స్పాట్‌లలో రాత్రి పూట గస్తీని ముమ్మరం చేయాలని, పెట్రోలింగ్ పెంచి నేరగాళ్ల ఆటకట్టించాలని స్థానికులు కోరుతున్నారు.



● సికింద్రాబాద్ పరిధిలోని పలు ప్రాంతాల్లో అల్లరిమూకలు, రౌడీగ్యాంగులు హల్‌చల్ చేశాయి. మద్యం మత్తులో రోడ్డుమీద వెళ్తున్న వారిని అడ్డగించి దారిదోపిడీకి పాల్పడుతున్నారు. సెల్‌ఫోన్‌లు, డబ్బులు లాక్కొని భయభ్రాంతులకు గురిచేస్తున్నారు. ఎదురుతిరిగితే కత్తులతో, బ్లేడ్‌లతో గాయపరుస్తున్నారు. అల్లరిమూకల ఆగడాలు ఎక్కువ కావడంతో స్థానిక పోలీస్ స్టేషన్లకు ఫిర్యాదులు వెల్లువెత్తాయి. దాంతో టాస్క్‌ఫోర్స్ పోలీసులు రంగంలోకి దిగి రెండు మూడు పోకిరీ ముఠాల ఆట కట్టించారు.

ఇటీవల జరిగిన కొన్ని ఘటనలు..

● మీర్‌పేట పరిధిలో ఓ యువకుడు దారుణ హత్యకు గురయ్యాడు. చంపిన వ్యక్తికి, మృతునికి పాత కక్షలు ఉన్న నేపథ్యంలో ఈ హత్య జరిగింది. ఇటీవల జైలునుంచి బయటకు వచ్చిన నిందితుడు తన ప్రత్యర్థిని బయట నిర్మానుష్య ప్రాంతానికి పిలిచి మద్యం తాగించి కత్తులతో పొడిచి చంపేశారు. మృతుడు సైతం గతంలో జైలుకు వెళ్లివచ్చాడు.

● అత్తాపూర్ పరిధిలో ఒక యువకుడిని ప్రత్యర్థులు బీర్ బాటిళ్లతో దాడిచేసి హత్య చేశారు. ఈ ఘటన హసన్‌నగర్‌లో చోటు చేసుకుంది. పాత కక్షల నేపథ్యంలోనే ప్రత్యర్థులు పథకం ప్రకారం హత్య చేసినట్లు తెలిసింది.

● ముషీరాబాద్ పరిధిలో గుర్తుతెలియని వ్యక్తిని కొందరు దుండగులు హత్య చేశారు. ఎవరు చంపారో..? ఎందుకు చంపారో..? తెలియదు. చుట్టుపక్కల సీసీటీవీ కెమెరాలున్నా.. చంపింది ఎవరనేది పోలీసులు గుర్తించలేదని తెలుస్తోంది.

● ఇవి కేవలం మచ్చుకు కొన్ని మాత్రమే.. ట్రై కమిషనరేట్ పరిధిలోని అనేక కాలనీలు, బస్తీల్లో అల్లరిమూల ఆగడాలు ఎక్కువగా ఉన్నాయి. ముఖ్యంగా శివారు ప్రాంతాల్లో జరుగుతున్న అనేక సంఘటనలు వెలుగులోకి రావడంలేదు. గస్తీ పెరిగితే నేరాల సంఖ్య తగ్గుముఖం పట్టే అవకాశం ఉంది.

ఫేస్‌బుక్ పరిచయంతో.. **రూ.41.28 లక్షలకు టోపీ**

8

రోడ్ల తవ్వకాలపై
వాటర్‌బోర్డుకు నోటీసులు

● అనుమతి లేని తవ్వకాలపై పెనాల్టీ
● జీహెచ్ఎంసీలోనూ నిర్లక్ష్యం

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

హైదరాబాద్ సిటీ, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): రహదారులను తవ్వి వదిలేయడంపై జీహెచ్ఎంసీ సీరియస్‌గా స్పందించింది. వివిధ పనులకోసం బల్దియా తవ్విన రోడ్లను వెంటనే పునరుద్ధరించాలని ఉన్నతాధికారులు ఆదేశించారు. పలు ప్రాంతాల్లో అనుమతి లేకుండా రహదారులు తవ్వి.. పునరుద్ధరణ పనులు చేపట్టనందుకు వాటర్‌బోర్డుకు నోటీసులు జారీ చేశారు. 'తవ్వేశారు.. వదిలేశారు..' శీర్షికన సోమవారం 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనంపై ఉన్నతాధికారులు స్పందించారు. వర్షాలు మొదలైనా.. ఇప్పటికీ తవ్విన రోడ్ల పునరుద్ధరణ చేపట్టకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. రోడ్ల తవ్వకాలపై నివేదిక పంపాలని ఆదేశించారు. దీంతో యంత్రాంగం ఆగమేఘాలపై స్పందించింది. కథనంలో ప్రస్తావించిన ప్రతి ప్రాంతాన్ని క్షేత్రస్థాయిలో పరిశీలించి.. ఉన్నతాధికారులకు వివరాలు పంపారు.

నోటీసులు ఇలా..

● రామంతాపూర్ శ్రీనివాసపురం కాలనీ స్ట్రీట్ నెంబర్-4లో అనుమతి లేకుండా రహదారి తవ్వారని..

మిగతా 6వ పేజీలో..



బాప్‌రే.. భగాయత్..!

- ఎటు చూసినా మురుగు,చెత్త కుప్పలు
- ఎక్కడా క్లియర్‌గా లేని డ్రైనేజీ లైన్లు
- ఎక్కడికక్కడ ఉప్పొంగుతున్న మ్యాన్‌హోల్స్
- రోడ్లపైనే భారీగా నిర్మాణ వ్యర్థాలు
- నిర్వహణ పట్టించుకోని హెచ్ఎండీఏ, జీహెచ్ఎంసీ, వాటర్‌బోర్డు
- సంబంధం లేదంటూ చేతులెత్తేస్తున్న వైనం

ఉప్పల్ భగాయత్.. విశాలమైన రోడ్లు, ఆహ్లాదకరంగా ఉండే పార్కులతో ప్రభుత్వం ల్యాండ్‌పూలింగ్ స్కీమ్‌లో అందంగా తీర్చిదిద్దిన ప్రాంతమని అందరి నమ్మకం. కానీ.. అందులోకి తొంగిచూస్తే మాత్రం వికారంగా కనిపిస్తోంది. ఎటుచూసినా ఉప్పొంగుతున్న డ్రైనేజీలు, రోడ్లపై పారుతున్న మురుగు, చెత్త కుప్పలు, నిర్మాణ వ్యర్థాలు దర్శనమిస్తుంటాయి. నిర్వహణను పట్టించుకోవాల్సిన సంబంధిత శాఖ అధికారులు చేతులెత్తేశారు. దీంతో కోట్లు పెట్టి ప్లాట్లను కొనుగోలు చేసిన వారు మురుగుతో సావాసం చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది.

హైదరాబాద్ సిటీ, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా ల్యాండ్‌పూలింగ్ స్కీమ్‌లో అభివృద్ధి చేసిన ఉప్పల్ భగాయత్ లేవుట్ అధ్వానంగా మారింది. అంతర్జాతీయస్థాయి మౌలిక సదుపాయాలతో లేఅవుట్‌ను అభివృద్ధి చేసి ప్లాట్లను ఈ-వేలం వేసి వేలకోట్ల ఆదాయం సంపాదించింది సర్కారు. కానీ, ఆ తర్వాత పట్టించుకోకపోవడంతో ఇదీ హెచ్ఎండీఏ నిర్మించిన లేఅవుటేనా? అని అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ప్రస్తుతం ఉప్పల్ భగాయత్ లేఅవుట్‌లో ఏ వీధి చూసినా దుర్గంధమే. రోడ్లన్నీ ఎక్కడికక్కడే కంకర తేలిపోయి ప్రమాదకరంగా మారాయి. ఒక ప్రాంతంలో మ్యాన్‌హోల్ ఉప్పొంగితే కిలోమీటర్ మేర మురుగు ప్రవహిస్తున్నది.

భూ సమీకరణ పథకంలో భాగంగా ఉప్పల్ మండలంలోని ఉప్పల్ భగాయత్ గ్రామంలో 733.08 ఎకరాలను హెచ్ఎండీఏ 15ఏళ్ల క్రితం సేకరించింది. అందులో కొన్ని ఎకరాలను వాటర్‌బోర్డుకు, మెట్రో రైలుకు కేటాయించగా మిగతా 413.13 ఎకరాలలో 1,373 ప్లాట్లతో హెచ్ఎండీఏ ఫేజ్-1 లేఅవుట్‌ను చేసింది.. 71.08 ఎకరాలలో ఫేజ్-2 లేఅవుట్‌ను 67 ప్లాట్లతో సిద్ధం చేసింది. 30మీటర్లతో, 24 మీటర్లతో, 18 మీటర్లతో రోడ్లను నిర్మించారు. వీధిదీపాలను, అండర్‌గ్రౌండ్ డ్రెయినేజీ, సివరేజీ,

మిగతా 8వ పేజీలో..

డ్రైనేజీ లైన్లు ఎక్కడా క్లియర్‌గా లేవు

లేఅవుట్‌లో ప్రతి వీధిని కలుపుతూ అండర్‌గ్రౌండ్ డ్రైనేజీలైన్లను ఏర్పాటు చేశారు. కానీ, ప్రస్తుతం ఆ లైన్లలో మురుగు ఎక్కడా సాఫీగా పారడం లేదు. ఇప్పటికే వెలసిన అపార్ట్‌మెంట్లు, కమర్షియల్ భవనాల నిర్వాహకులు తమ డ్రైనేజీల కనెక్షన్లను అండర్‌గ్రౌండ్ డ్రైనేజీలకు కలిపారు. అయితే, పైపు లైన్లు కూడా చాలా తక్కువ వెడల్పు కావడంతో ఏమాత్రం సరిపోవడం లేదు. ఎక్కడికక్కడే ఉప్పొంగుతుండడంతో మురుగు వీధుల్లో ప్రవహిస్తున్నది. మెయిన్‌రోడ్డు వెంట జీహెచ్ఎంసీ డంప్‌యార్డ్ సమీపంలో ఓ మ్యాన్‌హోల్ ఉప్పొంగి కిలోమీటర్‌కు పైగా లేఅవుట్‌లో ప్రవహిస్తోంది. డ్రైనేజీ పరిస్థితి చూసైనా సంబంధిత సిబ్బంది మరమ్మతులు చేయడం లేదు.



ఎనర్జీ డ్రింక్స్‌తో
గుండె జబ్బులు రావచ్చు

- యూఎస్‌లోని మాయో క్లినిక్ అధ్యయనంలో వెల్లడి
- కెఫిన్‌తో పాటుగా టౌరీన్, గౌరానా వంటి పదార్థాలు ఉండటమే కారణం
- నిద్రకూ భంగమేనంటున్న మరికొన్ని అధ్యయనాలు
- ఉచితంగా ఇచ్చినా తాగొద్దంటున్న డాక్టర్లు

హైదరాబాద్ సిటీ, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): కాలేజీలో ఫంక్షన్ అయినా.. పబ్‌ల్లో పార్టీ అయినా.. మాల్స్‌లో కార్యక్రమాలైనా ఇటీవలి కాలంలో ఎనర్జీ డ్రింక్స్‌ను ఫ్రీగా అందుబాటులో ఉంచుతున్నారు. ఉచితంగా వస్తుండడంతో చాలామంది వీటిని ఒకటి కంటే ఎక్కువగానే తాగేస్తున్నారు. ఇకపై అలా తాగే ముందు ఒకటికి రెండుసార్లు ఆలోచించుకోవాల్సిందే! ఎందుకంటే ఈ కెఫినేటెడ్ ఎనర్జీ డ్రింక్‌ల వల్ల గుండె సంబంధిత సమస్యలు ఎక్కువగా ఉన్నాయని అమెరికాలోని మయో క్లినిక్ అధ్యయనంలో తేలింది. ఈ ఎనర్జీ డ్రింక్‌ల వల్ల గుండె లయ తప్పడం జరిగే అవకాశాలున్నాయని ఈ నివేదిక చెబుతున్నది. కెఫిన్ కంటెంట్‌తో పాటుగా దీనిలోని ఇతర పదార్థాలు కూడా సమస్యకు కారణమని పరిశోధకులు పేర్కొంటున్నారు. ఒక ఎనర్జీ డ్రింక్ బాటిల్‌లో 80 మిల్లీ గ్రాముల నుంచి 300మిల్లీ గ్రాముల వరకు కెఫిన్ ఉంటుందని, అదే సమస్యలకు కారణమవుతున్నదని హెచ్చరిస్తున్నారు. జర్నల్ హార్ట్ రిథమ్‌లో ప్రచురితమైన ఈ అధ్యయనం.. 5శాతం మంది రోగులలో గుండె సమస్య రావడానికి ముందు ఒకటి లేదంటే అంతకంటే ఎక్కువ ఎనర్జీ డ్రింక్స్ తాగి ఉంటారని పేర్కొంది. అయితే నేరుగా సంబంధం ఉందని

మిగతా 8వ పేజీలో..

నిధులిస్తేనే నిర్వహణ..

● స్కూల్ మెయింటెనెన్స్ ఫండ్‌పై సందిగ్ధం
● పట్టించుకోని గత ప్రభుత్వం.. ● ఇప్పటికైనా ప్రారంభించాలని వేడుకోలు

హైదరాబాద్ సిటీ, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): నూతన విద్యా సంవత్సరం ప్రారంభమవుతున్న నేపథ్యంలో స్కూల్ మెయింటెనెన్స్ ఫండ్‌పై సందిగ్ధం నెలకొంది. పాఠశాలల నిర్వహణకు సంబంధించిన నిధుల విషయంలో ప్రభుత్వం ప్రత్యేక చొరవ తీసుకోవాలని ఉపాధ్యాయులు కోరుతున్నారు. హైదరాబాద్ జిల్లాలోని 16 మండలాల పరిధిలో 691 ప్రభుత్వ పాఠశాలలున్నాయి. ఇందులో 1,14,607మంది విద్యార్థులుండగా.. వారికి 6,200 మంది ఉపాధ్యాయులు బోధనలు అందిస్తున్నారు. అయితే, జిల్లాలోని సర్కారు బడుల్లో కొంతకాలంగా రోజువారీ పారిశుధ్య పనులు నిర్వహించకపోవడంతో అవి దుర్గంధభరితంగా మారుతున్నాయి. పలుచోట్ల విద్యార్థులే ఎవరికి వారుగా తరగతి గదులను శుభ్రం చేసుకుంటున్నారు. మరికొన్ని చోట్ల ఉపాధ్యాయులే డబ్బులు వేసుకుని స్కావెంజర్లు, స్వీపర్లను నియమించుకుని పనులు చేయించుకుంటున్నారు.



గతంలో స్కూల్ గ్రాంట్ నుంచి..

విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా గతంలో స్కూల్ గ్రాంట్‌ను కేటాయించేవారు. పాఠశాలలో 50 మందిలోపు విద్యార్థులుంటే రూ.10వేలు, 50 నుంచి

మిగతా 6వ పేజీలో..

రోడ్ల తవ్వకాలపై వాటర్‌బోర్డుకు నోటీసులు

(5వ పేజీ తరువాయి)

సక్రమంగా పూడ్చలేదని, పునరుద్ధరణ పనులూ చేయలేదని గుర్తించారు. రహదారి పునరుద్ధరణకు రూ.లక్ష, అనుమతి లేకుండా తవ్వినందుకు రూ.50వేలు పెనాల్టీతో కలిపి రూ.1.50 లక్షలు చెల్లించాలని వాటర్‌బోర్డుకు డిమాండ్ నోటీస్ ఇచ్చినట్టు ఇంజనీరింగ్‌విభాగం అధికారి తెలిపారు. వెంటనే తాత్కాలిక పునరుద్ధరణ చేయాలన్నారు.

● మలక్‌పేటలో రేస్ కోర్సుకు ఎదురుగా ఉన్న దోభీగల్లీరోడ్డులో శాశ్వత ప్రాతిపదికన పునరుద్ధరణకు అనుమతులు తీసుకొని 2 నెలల్లో పనులు పూర్తిచేయాలని, అప్పటి వరకు తాత్కాలిక పునరుద్ధరణ చేపట్టాలని నోటీసులో పేర్కొన్నారు.

● పంజాగుట్టలోని ప్రతాప్‌నగర్‌లో మురుగునీటి పైపులైన్ కోసం వాటర్‌బోర్డు తవ్విన రోడ్డుకు వారంలో పునరుద్ధరణ చేయాలని బోర్డుకు డిమాండ్ నోటీసులిచ్చిన జీహెచ్‌ఎంసీ, వెంటనే వ్యర్థాలను తొలగించాలని పేర్కొంది.

జీహెచ్‌ఎంసీ పరిధిలో...

● పార్సీగుట్ట రహదారి నిర్మాణ పనులను 13వ తేదీన ప్రారంభించి 26 వరకు పూర్తిచేయనున్నారు.

● గోపన్‌పల్లిలో 95శాతం రోడ్ల నిర్మాణం పూర్తయింది. మిగతా పనులను త్వరలో చేపడతామని, ఎన్‌టీఆర్ నగర్‌లో 60 శాతం పనులు జరిగాయని, తాగునీటి, మురుగునీటి పైపులైన్ పనులు పూర్తయ్యాక రోడ్లను నిర్మిస్తామని అధికారి చెప్పారు.

నిధులిస్తేనే నిర్వహణ

(5వ పేజీ తరువాయి)

100 మంది లోపు ఉంటే రూ.25వేలు, 250 మంది వరకు ఉంటే రూ.50 వేలు, 300మంది ఉంటే రూ.75వేలు ఇచ్చేవారు. అయితే ప్రభుత్వం కేటాయించిన మొత్తం నిధుల్లో నుంచే కరెంట్ బిల్లులు, తాగునీటి నిర్వహణ, రిజిస్టర్ల కొనుగోలు, ఇతర ఖర్చులను ప్రధానోపాధ్యాయులు వెచ్చించేవారు. అలాగే ఇందులో నుంచే స్కావెంజర్లు, స్వీపర్లను కూడా ఏర్పాటు చేసుకునే వారు. నాలుగేళ్లుగా ప్రభుత్వం నిధులను పూర్తిస్థాయిలో విడుదల చేయకపోవడంతో హెచ్‌ఎంలు ఇబ్బందులు పడుతున్నారు. పాఠశాలలు అధ్వానంగా మారాయి. మహిళా టీచర్లు, విద్యార్థినులు నిత్యంఅవస్థలు పడేవారు. ఉపాధ్యాయ సంఘాలు అప్పటి ప్రభుత్వానికి వినతిపత్రాలు అందించినా పట్టించుకోలేదు.

కాంగ్రెస్ ప్రభుత్వం పట్టించుకోవాలి..

కాంగ్రెస్ ప్రభుత్వం పాఠశాలల మెయింటెనెన్స్‌పై ప్రత్యేకదృష్టి సారించాలని ఉపాధ్యాయులు కోరుతున్నారు. సర్కారు బడులను తీర్చిదిద్దేందుకు కృతనిశ్చయంతో ఉన్నామని, ఈ ఏడాది మార్చిలో జరిగిన ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాల సమావేశంలో సీఎం రేవంత్‌రెడ్డి హామీ ఇచ్చారు. ఈ నేపథ్యంలో కొత్త విద్యాసంవత్సరాన్ని దృష్టిలో ఉంచుకుని స్కూల్ గ్రాంట్‌తో సంబంధం లేకుండా స్కావెంజర్లకు ప్రత్యేక నిధులు కేటాయించాలని కోరుతున్నారు.

నేడు కోల్‌కతా రైలు 6 గంటలు ఆలస్యం

హైదరాబాద్ సిటీ, జూన్ 10 (ఆంధ్రజ్యోతి) : సికింద్రాబాద్ నుంచి కోల్‌కతా(శాంతగచ్చి)కి వెళ్లే ప్రత్యేక రైలు మంగళవారం 6 గంటల ఆలస్యంగా బయలుదేరుతుందని దక్షిణ మధ్య రైల్వే సీపీఆర్‌ఓ రాకేష్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. మంగళవారం ఉదయం 6.45 నిమిషాలకు సికింద్రాబాద్ నుంచి 07221 ప్రత్యేక రైలు బయలుదేరాల్సి ఉండగా నిర్వహణపనుల వల్ల మధ్యాహ్నం 12.45 నిమిషాలకు రీ షెడ్యూల్ చేసినట్లు అయన తెలిపారు. ప్రయాణికులు ఈ విషయాన్ని గమనించి స్టేషన్‌కు రావాలని విజ్ఞప్తి చేశారు.



గాంధీభవన్‌లో మాట్లాడుతున్న కాంగ్రెస్ ఫిషర్‌మెన్ చైర్మన్ సాయికుమార్

బీఆర్ఎస్ హయాంలో
చేపల పంపిణీలో రూ. కోట్ల అవినీతి

గోషామహల్, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో మత్స్యశాఖ ఆధ్వర్యంలో చెరువులు, చేపల అభివృద్ధి కోసం ఎంతో కృషి చేశామని గొప్పలు చెప్పడం అబద్ధమని కాంగ్రెస్ ఫిషర్‌మెన్ చైర్మన్ మెట్టు సాయికుమార్ ఆరోపించారు. సోమవారం గాంధీభవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాల్లో భారీ మోసాలు జరిగాయని, వాటిని కప్పి పుచ్చుకోవడానికి అసత్య ప్రచారం చేస్తున్నారన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో చేపల పంపిణీలో వందల కోట్ల అవినీతి జరిగిందని, దానిని త్వరలో ఆధారాలతో బయటపెడతామన్నారు.



కళాకారులను సత్కరించిన అతిథులు

విద్యార్థులను కళా రంగాల్లో ప్రోత్సహించాలి

రవీంద్రభారతి, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): శాస్త్రీయ కళలు మన సంస్కృతికి నిదర్శనమని వక్తలు పేర్కొన్నారు. సంస్కృతి సర్వీసెస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో తెలుగు వర్సిటీలోని ఆడిటోరియంలో సంస్కృతిక కళారాధన పేరిట ప్రత్యేక కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా పలు సాంస్కృతిక కార్యక్రమాలు ప్రదర్శించారు. చిన్నారి కళాకారులు ప్రదర్శించిన శాస్త్రీయ నృత్యాలు ప్రేక్షకులను రంజింపజేశాయి. చక్కటి అభినయంతో చిన్నారులు ఆకట్టుకున్నారు. కార్యక్రమంలో డా.అరిపిరాల కళ్యాణ్ శాస్త్రి, నటుడు జెమినీ సురేష్, వెంకటగిరిధర్, నటి గీతా సింగ్, అనుపమ, తదితరులు పాల్గొని కళాకారులను సత్కరించి అభినందించారు. విద్యార్థులు విద్యతోపాటు కళారంగాల్లో రాణించేలా తల్లిదండ్రులు ప్రోత్సహించాలని అన్నారు. చిన్నారి కళాకారులందరూ భవిష్యత్‌లో గొప్ప స్థాయికి చేరుకోవాలని అన్నారు. కళా సంస్థలు ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించి కళాకారులను ప్రోత్సహించాలని అన్నారు.



కళాకారులతో అతిథులు

కళలు సంస్కృతికి నిదర్శనం

రవీంద్రభారతి, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): అన్నమాచార్య జయంతి సందర్భంగా సరసిజ థియేటర్, లేఖిని రచయిత్రుల వేదిక సంయుక్తాధ్వర్యంలో అన్నమాచార్య సంకీర్తనల ఆలాపన కార్యక్రమం నిర్వహించారు. సోమవారం రవీంద్ర భారతి కాన్ఫరెన్స్ హాల్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో గాయకులు అన్నమాచార్య సంకీర్తనలు ఆలపించారు. ముఖ్యఅతిథులుగా తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ సంచాలకుడు మామిడి హరికృష్ణ, రసమయి సంస్థ అధినేత రాము, కలగ కృష్ణమోహన్, పొన్నాడ ప్రసాద్ తదితరులు పాల్గొని కళాకారులను సత్కరించి అభినందించారు.

తెలుగు జాతి ఉన్నంత కాలం అన్నమాచార్య కీర్తనలు బతికుంటాయని అన్నారు. కళలు మన సంస్కృతికి నిదర్శనమని అన్నారు. కార్యక్రమంలో సరసిజ అధ్యక్షురాలు అత్తలూరి విజయలక్ష్మి, జొన్నవిత్తుల సాయి మాధురి, ధనలక్ష్మి, అల్లూరి గౌరీలక్ష్మి, నండూరి సుందరీ, నాగమణి, సరస్వతీ కరవది, షమీర్, జానకి, వీణ తదితరులు పాల్గొన్నారు.

ఫెడరేషన్ ఆఫ్ బార్ అసోసియేషన్
ఉపాధ్యక్షుడిగా వసంత్‌కుమార్



అడ్డగుట్ట, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని కోర్టుల్లో ఉన్న సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తానని ఫెడరేషన్ ఆఫ్ బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు వై.వసంత్‌కుమార్ తెలిపారు. సోమవారం హైదరాబాద్‌లో నిర్వహించిన ఎన్నికల్లో ఆయన ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కోర్టులో నెలకొన్న సమస్యలతోపాటు అర్జీదారులు, న్యాయవాదుల సమస్యల పరిష్కారానికి ప్రత్యేక దృష్టి పెడతానన్నారు.



ఇండియన్ స్కౌట్స్, గైడ్స్ ఫెలోషిప్ కమిటీ సభ్యులు

రాష్ట్ర ఇండియన్ స్కౌట్స్, గైడ్స్ ఫెలోషిప్ కార్యవర్గం ఎన్నిక

సికింద్రాబాద్, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఇండియన్ స్కౌట్స్, గైడ్స్ ఫెలోషిప్ నూతన కమిటీని ఎన్నుకున్నారు. సికింద్రాబాద్‌లోని అక్షర వాగ్దేవి ఇంటర్నేషనల్ స్కూల్‌లో ఆదివారం ఎస్‌జీఎఫ్ డోనర్, జీవిత కాల సభ్యుడు పీఎల్. శ్రీనివాస్ ఆధ్వర్యంలో కమిటీ చార్టర్‌ను ప్రవేశపెట్టి నూతన సభ్యులను ఎన్నుకున్నారు.

రాష్ట్ర కమిటీ ఎగ్జిక్యూటివ్ ప్రెసిడెంట్‌గా మక్ మెక్కి, నేషనల్ కౌన్సిల్ సభ్యురాలిగా వాణి, రాష్ట్ర అధ్యక్షుడిగా మలయాద్రి, రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షురాలిగా అక్షరవాగ్దేవి ఇంటర్నేషనల్ స్కూల్ ప్రిన్సిపాల్ వనజ, రాష్ట్ర ఖజానా అధికారిగా బీఎన్ రావు, రాష్ట్ర కార్యదర్శిగా జూహి, జనరల్ సెక్రటరీగా సీమ రాణి, జాయింట్ సెక్రటరీగా థెరిస్సా, కౌన్సిల్ సభ్యురాలిగా కనకదుర్గ, రాష్ట్ర కో-ఆర్డినేటర్‌గా మొహమ్మద్ ఖాసిం, మల్కాజిగిరి నుంచి సభ్యుడిగా భాస్కర్‌రెడ్డి, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా నుంచి మహిళల గిల్డ్ సభ్యురాలిగా డాక్టర్ నూరి మెహరున్నీసాను ఎన్నుకున్నట్టు పీఎల్ శ్రీనివాస్ ప్రకటించారు.

గిరిజన విద్యార్థుల్లో వెలుగులు

- నీట్, జేఈఈ అడ్వాన్స్‌డ్‌లో ర్యాంకులు సాధించేలా తీర్చిదిద్దుతున్న రాజేంద్రనగర్ గిరిజన బాలుర ఐఐటీ స్టడీ సెంటర్



రాజేంద్రనగర్ మానస హిల్స్‌లో గల గిరిజన బాలుర ఐఐటీ స్టడీ సెంటర్

రాజేంద్రనగర్, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): ఊరికి దూరంగా అడవులు, కొండలు, లోయల్లో జీవించే గిరిజన విద్యార్థుల్లో వెలుగులు నింపుతున్నాయి గిరిజన ఆశ్రమ కళాశాలలు, ఐఐటీ స్టడీ సెంటర్‌లు. 10వ తరగతిలో మంచి మార్కులతో ఉత్తీర్ణులైన విద్యార్థులను ఎంపిక చేసి వారికి రాత పరీక్ష నిర్వహించి గిరిజన ఆశ్రమ కళాశాలలు, ఐఐటీ స్టడీ సెంటర్లలో ఆశ్రయం కల్పించి ఉన్నత చదువులు చదువుకోవడానికి అవకాశం కల్పిస్తున్నారు. అందుకోసం ప్రభుత్వం, గిరిజన సంక్షేమశాఖ ఎంతగానో శ్రమిస్తుంది.

రాజేంద్రనగర్‌లో గల గిరిజన బాలుర ఐఐటీ స్టడీ సెంటర్‌లో ప్రతియేటా నీట్, జేఈఈ అడ్వాన్స్‌డ్ పరీక్షలలో గిరిజన విద్యార్థులకు శిక్షణ ఇస్తూ పోటీ పరీక్షలలో రాణించేలా, ప్రతి సంవత్సరం ఎందరో విద్యార్థులు మెడిసిన్, వెటర్నరీ సైన్స్, బీఎస్సీ అగ్రికల్చర్, ఐఐటీ, ఎన్ఐటీ కాలేజీలలో సీట్లు సంపాదించుకునేలా తీర్చిదిద్దుతున్నారు.

జేఈఈ అడ్వాన్స్‌డ్‌లో..

ఐఐటీ జేఈఈ అడ్వాన్స్‌డ్ పరీక్షా ఫలితాలలోనూ సత్తా చాటారు. కళాశాలకు చెందిన 63 మంది విద్యార్థులు జేఈఈ అడ్వాన్స్‌డ్ పరీక్షలు రాయగా, వీరిలో 50మంది ఐఐటీ గిరిజన కేటగిరి విభాగంలో ర్యాంకులు సాధించారు. బి.చందులాల్ 291, బి.భద్రా 295, కె.వినోద్ 338, గట్టు శ్రీహర్ష 625, బానోత్ తరుణ్ 625, వంకుదోతు సంతోష్ 812, డి.స్టీఫెన్ 887, కత్రావత్ విశాల్ 930, భూక్య రాజ్‌కుమార్ 936, నేనావత్ రమేశ్ నాయక్ 936, అంగోత్ రాహుల్ 946, దనావత్ పవన్ 973, భూక్యా ఈశ్వర్ 1150, చిలుమూర్తి రాఘవేంద్ర 1617, వంకుదోతు భువన్ 1773, కె.రవి 4347, ముదుగుల కీర్తన్ 5483వ ర్యాంకు సాధించారు.

నీట్‌లో రాణించిన విద్యార్థులు

రాజేంద్రనగర్‌లోని గిరిజన బాలుర ఐఐటీ స్టడీ సెంటర్ నుంచి నీట్‌లో ఎనిమిది మంది విద్యార్థులు 400లకు పైగా మార్కులు సాధించారు. వి.రోహిత్ 516 మార్కులతో గిరిజన కేటగిరిలో 2379 ర్యాంకు సాధించి ప్రథమ స్థానంలో నిలిచారు. కె.గోపాల్ 447, పి.అశోక్ 446, జె.ప్రవీణ్ 438, జె.శ్రీకాంత్ 436, ఆర్. రాంచందర్ 416, ఎన్. మాన్‌సింగ్ 409, ఎన్. ఆకాశ్ 409 మార్కులతో తర్వాతి స్థానంలో నిలిచారు.

విద్యార్థుల ప్రతిభ



ప్రతి సంవత్సరం రాజేంద్రనగర్ ఐఐటీ స్టడీ సెంటర్ నుంచి గిరిజన బాలురు మెడిసిన్, వెటర్నరీ, అగ్రికల్చర్ సీట్లు సాధించడంతో పాటు దేశంలోనే అత్యున్నత కళాశాలలు అయిన ఐఐటీ, ఎన్ఐటీలలో కూడా ప్రవేశం పొందుతున్నారు. నేడు దేశ వ్యాప్తంగా ఉన్న అన్ని ఐఐటీలలో, పలు ఎన్ఐటీలలో కూడా రాజేంద్రనగర్ గిరిజన బాలుర ఐఐటీ స్టడీ సెంటర్ విద్యార్థులు చదువుతున్నారు.

\- గట్టు సురేందర్, ప్రిన్సిపాల్, రాజేంద్రనగర్ గిరిజన ఐఐటీ స్టడీ సెంటర్

డాక్టర్‌ను అవుతా



నీట్‌లో 516 మార్కులతో 2,379వ ర్యాంకు సాధించాను. అధ్యాపకులు బాగా చదువు చెప్పారు. మాది నారాయణపేట్ జిల్లా కొత్తపల్లి మండలం, కొత్తపల్లి తండా. డాక్టర్‌ను కావాలనేది నా కోరిక.

\- విస్లావత్ రోహిత్

సమాజానికి ఉపయోగపడాలన్నదే నా కోరిక



మాది మహబూబాబాద్ జిల్లా తొర్రూర్ సమీపంలోని లచ్చిరాం తండా. రాజేంద్రనగర్‌లో గిరిజన బాలుర ఐఐటీ స్టడీ సెంటర్‌లో చదువుకుని జేఈఈ అడ్వాన్స్‌లో 99 మార్కులతో గిరిజన క్యాటగిరిలో 291వ ర్యాంకు సాధించాను. ఐఐటీ కాలేజీలో సీటు సంపాదించి ఉన్నత చదువులు చదివి సమాజానికి ఉపయోగపడాలన్నదే నా కోరిక.

\- బానోత్ చందులాల్

మరిన్ని మెహిదీపట్నం జోన్ వార్తల కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/UgsY0QZ లో చదవండి.
Note: Andhrajyothi.com/editions/hyd/set-6 abids, mehadipatnam, charminarలో చూడగలరు.
నోట్: htpps://epaper.andhrajyothy.comలో లాగిన్ అయిన తరువాత క్యూఆర్‌కోడ్‌ని స్కాన్ చేయగలరు.

ప్రజావాణిని సద్వినియోగం చేసుకోవాలి

- మొదటి రోజు ఒక్క ఫిర్యాదూ అందని వైనం

మదీన, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): ప్రజావాణి కార్యక్రమాన్ని ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని జీహెచ్ఎంసీ చార్మినార్ జోన్ జాయింట్ కమిషనర్ ఎ. శైలజ సూచించారు. సోమవారం చాంద్రాయణగుట్ట నర్కిఫూల్‌బాగ్‌లోని జోనల్ కార్యాలయంలో జోనల్ కమిషనర్ టి.వెంకన్న పర్యవేక్షణలో ప్రజావాణి కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా శైలజ మాట్లాడుతూ, ప్రతి సోమవారం ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు జరిగే ఈ కార్యక్రమంలో ప్రజలు స్థానికంగా తాము ఎదుర్కొంటున్న సమస్యలపై ఫిర్యాదు చేయవచ్చన్నారు. ఎన్నికల కోడ్ ముగిసిన అనంతరం మొదటి రోజు జరిగిన ప్రజావాణిలో ఎలాంటి ఫిర్యాదులు అందలేదని తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ డైరెక్టర్(యూబీడీ) అమీనా బీ, వెటర్నరీ విభాగం డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, టౌన్‌ప్లానింగ్ జోనల్ సిటీ ప్లానర్ శ్యామ్‌కుమార్, బిల్ కలెక్టర్ రాజేశ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ సంగీత, నృత్య కళాశాలలో
ప్రవేశాలకు దరఖాస్తుల స్వీకరణ

చిలకలగూడ, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): తక్కువ ఖర్చుతో శాస్త్రీయ సంగీత, నృత్యాలలో శిక్షణ ఇవ్వటానికి అన్నిచర్యలూ చేపట్టినట్లు శ్రీభక్త రామదాసు ప్రభుత్వ సంగీత, నృత్య కళాశాల మారేడుపల్లి, ప్రిన్సిపాల్ కె.వరలక్ష్మి తెలిపారు. కళాశాలలో సోమవారం నిర్వహించిన విలేకరులు సమావేశంలో ఆమె మాట్లాడారు. గురువారం నుంచి తరగతులు ప్రారంభమవుతాయని, 2024-25విద్యా సంవత్సరంలో ప్రవేశాలకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు పేర్కొన్నారు. కర్ణాటక, హిందూస్థానీ గాత్రం, కూచిపూడి, పేరిణి నాట్యం వీణ, వయోలిన్, మృదంగం, తబల వాయిద్యాలలో నిష్ణాతులైన ఉపాధ్యాయులతో శిక్షణ ఇస్తామని పేర్కొన్నారు.దరఖాస్తులను కళాశాలలో ఉదయం 10.30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు పొందవచ్చన్నారు.

వాహనాల చోరీ.. ఓఎల్ఎక్స్‌లో విక్రయం

- నకిలీ ఆర్సీలు సృష్టించి.. రూ.10 వేల నుంచి 15 వేలకే..
- 14 వాహనాలు, ల్యాప్‌టాప్, నకిలీ ఆర్సీల స్వాధీనం
- ముగ్గురు నిందితుల అరెస్ట్



స్వాధీనం చేసుకున్న వాహనాలు, నిందితుల అరెస్ట్‌ను చూపిస్తున్న డీసీపీ రోహిణి ప్రియదర్శిని

బోయినపల్లి, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): ద్విచక్ర వాహనాలను చోరీ చేసి, నకిలీ రిజిస్ట్రేషన్ నంబర్లు అమర్చి ఓఎల్ఎక్స్‌లో విక్రయిస్తున్న ముగ్గురు నిందితులను బోయినపల్లి క్రైమ్ పోలీసులు అరెస్ట్ చేశారు. సోమవారం విలేకరుల సమావేశంలో నార్త్‌జోన్ డీసీపీ రోహిణిప్రియదర్శిని వివరాలు వెల్లడించారు. సూరారంకాలనీ కుత్బుల్లాపూర్ అమిత్ బస్తీకి చెందిన రజాక్‌ఖాన్(38) బైక్ మెకానిక్. ఏలూరు కొండవోలె గ్రామానికి చెందిన యామాల యోహాను అలియాస్ యోహాను(29) బతుకుదెరువు కోసం నగరానికి వచ్చి మియాపూర్ హఫీజ్‌పేట్‌లో నివసిస్తూ కారు డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. ఈ క్రమంలో రజాక్‌ఖాన్‌కు యోహానుతో పరిచయం ఏర్పడింది. ఇద్దరూ కొంతకాలంగా ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. సులభంగా డబ్బు సంపాదించాలని ప్రణాళికలు రూపొందించుకున్నారు. 2023 నుంచి బోయినపల్లి తిరుమలగిరి, నాంపల్లి, జీడిమెట్ల, అల్వాల్‌తోపాటు హైదరాబాద్, సైబరాబాద్ కమిషనరేట్ పరిధుల్లో తెల్లవారుజామున 3 గంటల ప్రాంతంలో రోడ్లపై నిలిపి ఉన్న ద్విచక్రవాహనాలను చోరీచేస్తున్నారు. దొంగిలించిన వాహనాలను రెండు మూడు రోజులపాటు పోలీసులు గుర్తించని ప్రాంతాల్లో ఉంచేవారు.

కృష్ణాజిల్లా మచిలీపట్నంలో ఇంటర్నెట్, జిరాక్స్ సెంటర్ నిర్వహిస్తున్న గొరిపర్తి వెంకటప్పయ్య(28) ద్వారా నకిలీ ఆర్సీలను సృష్టించారు. దొంగిలించిన ద్విచక్ర వాహనాలకు నకిలీ రిజిస్ట్రేషన్లు చేసి ఓఎల్ఎక్స్ ద్వారా వాటిని రూ. 10 వేల నుంచి రూ.15 వేలకే విక్రయిస్తున్నారు. ఓఎల్ఎక్స్‌లో వాహనాలను కొనుగోలు చేసినవారు ఆర్సీ అడగడంతో వారు పొంతనలేని సమాధానాలు చెబుతున్నారు. అనుమానం వచ్చిన ఓ వ్యక్తి పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

కేసు దర్యాప్తు ప్రారంభించగా.. రజాక్ ఖాన్, యోహాను, గొరిపర్తి వెంకటప్పయ్య ముఠాగా ఏర్పడి నకిలీ ఆర్సీలను సృష్టించి వాహనాలు విక్రయిస్తున్నట్లు దర్యాప్తులో తేలింది. నిందితులను అదుపులోకి తీసుకుని విచారించగా... నేరాన్ని అంగీకరించారు. వారి నుంచి 8 లక్షల విలువైన 14 ద్విచక్ర వాహనాలు, ల్యాప్‌టాప్, నకిలీ ఆర్సీ కార్డులను స్వాధీనం చేసుకున్నామని డీసీపీ తెలిపారు. కేసును ఛేదించిన డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్ సర్దార్ నాయక్, ఇన్‌స్పెక్టర్ లక్ష్మీనారాయణరెడ్డి, డీఎస్ఐ తుల్జారాం, ఎస్ఐ అనిల్, కానిస్టేబుళ్లు రమేష్, మురళి, శివశంకర్, మహేష్, శివకుమార్, శ్రీనివాసును డీసీపీ, అదనపు డీసీపీ పి.అశోక్, బేగంపేట్ ఏసీపీ పి.గోపాలకృష్ణమూర్తి అభినందించారు.

నీరు నిలవకుండా చర్యలు తీసుకోండి

- పని ప్రదేశాల్లో హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలి
- వాటర్ బోర్డు ఎండీ సుదర్శన్‌రెడ్డి

హైదరాబాద్ సిటీ, జూన్ 10(ఆంధ్రజ్యోతి): వర్షాలు కురిసే సమయంలో డివిజన్ల వారీగా వాటర్ లాగింగ్, స్టాగ్నింగ్ పాయింట్లను గుర్తించి నీరు నిలవకుండా చర్యలు తీసుకోవాలని వాటర్ బోర్డు ఎండీ సుదర్శన్‌రెడ్డి అధికారులకు సూచించారు. ఖైరతాబాద్‌లో జలమండలి ప్రధాన కార్యాలయంలో సోమవారం వర్షాకాల ప్రణాళికపై ఆయన అధికారులతో సమీక్ష నిర్వహించారు. రోడ్లపై సివరేజీ ఓవర్ ఫ్లో కాకుండా, పని ప్రదేశాల్లో హెచ్చరిక బోర్డులు, డీప్ మ్యాన్‌హోల్స్‌కు గ్రిల్స్ ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. వర్షాకాలంలో కలుషిత నీరు సరఫరా అయ్యే అవకాశం ఉన్నందున తగిన మోతాదులో క్లోరిన్ శాతం ఉండేలా చూడాలని సూచించారు. వేసవిలో జలమండలి ఏర్పాటు చేసిన చలివేంద్రాలను కొనసాగించాలని స్పష్టం చేశారు. డివిజన్ల వారీగా పెండింగ్ బిల్లులను ఎప్పటికప్పుడు వసూలు చేయాలని, నిర్దేశించిన లక్ష్యాలకు అతీతంగా పనిచేయాలని సూచించారు. గృహ వినియోగదారులతో పాటు వాణిజ్య కనెక్షన్లపై దృష్టి సారించాలన్నారు. సమీక్షలో ఆపరేషన్స్ డైరెక్టర్-1 అజ్మీరా కృష్ణ, ఆపరేషన్స్ డైరెక్టర్-2 స్వామి, సీజీఎంలు, జీఎంలు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

'ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి'

బర్కత్‌పుర, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): ట్రాఫిక్ నిబంధనలు పాటించకపోతే ప్రమాదాలు తప్పవని బేగంపేట ట్రాఫిక్ ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్ ఏసీపీ జి. శంకర్‌రాజు అన్నారు. సోమవారం రాష్ట్ర ఫైనాన్షియల్ కార్పొరేషన్ కార్యాలయంలో ఉద్యోగులు, సిబ్బందికి ట్రాఫిక్‌పై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అవగాహన కల్పించారు. వర్షాకాలంలో వాహనాలను జాగ్రత్తగా నడపాలని, నిర్లక్ష్యంగా ఉంటే ప్రమాదాలు జరిగి ప్రాణాలు కోల్పోయే అవకాశం ఉందన్నారు. కార్యక్రమంలో ఏపీ ఎస్ఎఫ్‌సీ తెలంగాణ డివిజన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఎం.శ్రీనివాస్, పద్మాకర్‌రావు, జనరల్ మేనేజర్ పాండురంగరాజు, ట్రాఫిక్ ఎస్ఐ ఆర్. పాండు తదితరులు పాల్గొన్నారు.

బండి సంజయ్‌కు శుభాకాంక్షలు



కేంద్ర మంత్రిగా నియమితులైన బండి సంజయ్‌కుమార్‌ను ఢిల్లీలోని ఆయన నివాసంలో బీజేపీ నాయకులు కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఆయనను కలిసిన వారిలో యువమోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి, ఎ.శివచంద్రగిరి, బీజేపీ భాగ్యనగర్ జిల్లా ఉపాధ్యక్షుడు పి. వెంకటరమణ తదితరులు ఉన్నారు.

\- చాంద్రాయణగుట్ట, ఆంధ్రజ్యోతి

దిష్టిబొమ్మ దహనం



నీట్ యూజీ-2024 ఫలితాల్లో అవకతవకలపై సుప్రీం కోర్టు సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని, ఇంటర్ మార్కుల ఆధారంగా వైద్య కళాశాలల్లో సీట్లు కేటాయించాలని ఏఐవైఎఫ్ విద్యార్థి నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ డైరెక్టర్ జనరల్ సుబోధ్‌కుమార్ దిష్టిబొమ్మను హిమాయత్‌నగర్ వై జంక్షన్ వద్ద దహనం చేశారు.

హత్య కేసులో ముగ్గురికి జీవిత ఖైదు

మదీన, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): హత్య కేసులో ముగ్గురు నిందితులకు న్యాయస్థానం జీవిత ఖైదు విధించిందని బహదూర్‌పురా ఇన్‌స్పెక్టర్ ఆర్. రఘునాథ్ తెలిపారు. రమ్నాస్‌పురాకు చెందిన షేక్ ఖాలిద్(40), అదే ప్రాంతానికి చెందిన మహ్మద్ అన్వర్ అలియాస్ అన్ను(35), మహ్మద్ మునవ్వర్ అలీ అలియాస్ బబ్బు(30)కాలాపత్తర్ పోలీస్‌స్టేషన్‌లో రౌడీషీటర్లు. పాతకక్షల నేపథ్యంలో ముగ్గురూ 2017 జనవరిలో అదే ప్రాంతానికి చెందిన మన్సూర్ అనే వ్యక్తిని దారుణంగా హత్య చేశారు. కేసు దర్యాప్తు ప్రారంభించిన పోలీసులు సాక్ష్యాధారాలు సేకరించి కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. కేసును విచారించిన నాంపల్లి మెట్రోపాలిటన్ సెషన్ జడ్జి బి. సురేష్ నిందితులు ముగ్గురికీ జీవిత ఖైదు, ఒక్కొక్కరికి రూ. 25,500 జరిమానా విధిస్తూ తీర్పు చెప్పారని ఇన్‌స్పెక్టర్ తెలిపారు.

అత్యాచారానికి పాల్పడిన వ్యక్తిపై పోక్సో కేసు

మదీన, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): బాలికపై అత్యాచారానికి పాల్పడిన ఓ వ్యక్తిపై బండ్లగూడ పోలీసులు పోక్సో కేసు నమోదు చేశారు. ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ తెలిపిన వివరాల ప్రకారం.. అల్ జుబేర్ కాలనీకి చెందిన ఇక్బాల్(40) ఫిబ్రవరిలో ఓ బాలికపై అత్యాచారం చేశాడు. ఈ విషయం ఎవరికైనా చెబితే చంపేస్తానని బెదిరించాడు. బాలిక తల్లిదండ్రులకు ఇటీవల విషయం చెప్పగా పోలీసులకు ఫిర్యాదు చేశారు. నిందితుడు ఇక్బాల్‌పై పోక్సో కేసు నమోదు చేశారు.

రెండుచోట్ల రోడ్డు ప్రమాదాలు

- బస్సుల చక్రాల కిందపడి ఇద్దరి మృతి

రాజేంద్రనగర్, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): అత్తాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో వేర్వేరు ప్రాంతాలలో సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదాలలో ఇద్దరు మృతిచెందారు. ఇన్‌స్పెక్టర్ వెంకట్రామిరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. చాంద్రాయణగుట్ట హషమాబాద్ ప్రాంతానికి చెందిన వార్ద బారామూద్(17) పీడీపీ చౌరస్తా నుంచి ఆరాంఘర్ మీదుగా స్కూటీపై వెళ్తోంది. ఆరాంఘర్ వద్ద గుర్తు తెలియని ప్రైవేటు బస్సు బాలిక పైనుంచి దూసుకెళ్లింది. దీంతో వార్ద బారామూద్ అక్కడికక్కడే మరణించింది. సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు సీసీ ఫుటేజీ ఆధారంగా వివరాలు సేకరిస్తున్నారు. బాలిక బాబాయి సయ్యద్ యాయా బారామూద్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చింతల్‌మెట్ రోడ్డులో..

చింతల్‌మెట్‌కు చెందిన పాండు(55) సోమవారం రోడ్డు దాటుతున్నాడు. కోఠి నుంచి రాజేంద్రనగర్ వైపు వెళ్తున్న ఆర్టీసీ బస్సు అతడిని ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. స్థానికుల సమాచారం మేరకు అత్తాపూర్ పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని ఉస్మానియా ఆస్పత్రి మార్చురీకి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మణికొండలో కారు బీభత్సం

- ద్విచక్రవాహనాలు ధ్వంసం, పలువురికి గాయాలు

నార్సింగ్, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): మణికొండలో సోమవారం రాత్రి ఓ కారు బీభత్సం సృష్టించింది. కారులో ఉన్న వ్యక్తి ర్యాష్ డ్రైవింగ్ చేస్తూ రోడ్డుపై ఎదురుగా వస్తున్న, పార్కింగ్ చేసిన వాహనాలను ఢీకొట్టుకుంటూ దూసుకుపోయాడు. దీంతో పలు వాహనాలు దెబ్బ తినడంతో పాటు పలువురికి గాయాలయ్యాయని స్థానికులు తెలిపారు. గాయపడిన వారిలో తండ్రీకొడుకులు కూడా ఉన్నారు. ఓ మైనర్ కారు డ్రైవింగ్ చేస్తున్నాడని స్థానికులు నార్సింగ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఎంఎంటీఎస్ రైలు నుంచి జారిపడి విద్యార్థి మృతి

బర్కత్‌పుర, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): ఎంఎంటీఎస్ రైలు నుంచి జారిపడి ఓ విద్యార్థి మృతి చెందాడు. బోయిగూడలో నివసిస్తున్న జనసూర్య(20) డిగ్రీ పూర్తి చేశాడు. స్నేహితులతో కలిసి ఆదివారం రాత్రి ఫలక్‌నుమాలో కాళీమాతను దర్శించుకొని తిరిగి సికింద్రాబాద్ వెళ్లడానికి ఎంఎంటీఎస్ రైలు ఎక్కాడు. ఫుట్‌బోర్డు ప్రయాణం చేస్తున్న అతడు యాకుత్‌పుర రైల్వే స్టేషన్ సమీపంలో జారి కిందపడిపోయాడు. తీవ్రంగా గాయపడడంతో ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ సోమవారం ఉదయం చనిపోయాడు. కాచిగూడ రైల్వే పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.



జాంబాగ్‌లో పుత్లిబౌలి వద్ద ప్రధాని నరేంద్ర మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న కార్పొరేటర్ రాకేశ్ జైశ్వాల్

బీజేపీ నాయకుల సంబరాలు

చాంద్రాయణగుట్ట, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): ప్రధానిగా నరేంద్ర మోదీ మూడోసారి ప్రమాణ స్వీకారం చేసిన సందర్భంగా పాతబస్తీ రాజన్న బావి వద్ద ఆదివారం రాత్రి బీజేపీ నాయకులు, కార్యకర్తలు సంబరాలు చేసుకున్నారు. బీజేపీ శాలిబండ డివిజన్ అధ్యక్షుడు సాయినాథ్ సూర్యవంశీ, హైదరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం కన్వీనర్ కోటి ధర్మతేజ టపాకాయలు కాల్చి, మిఠాయిలు పంచిపెట్టారు.

మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం

గోషామహల్: భారతదేశ ప్రధానమంత్రిగా మూడోసారి నరేంద్ర మోదీ ప్రమాణ స్వీకారం చేసిన సందర్భంగా జాంబాగ్ డివిజన్ కార్పొరేటర్ రాకేశ్ జైశ్వాల్ ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు జాంబాగ్‌లోని పుత్లిబౌలి వద్ద మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు శ్రీనివాస్ యాదవ్, అమర్‌సింగ్, అనిల్ యాదవ్, ప్రవీణ్, కాజల్, అజ్జు, నర్సింగ్, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

కేక్ కటింగ్

గోషామహల్: దేశ ప్రధానిగా నరేంద్ర మోదీ మూడోసారి ప్రమాణ స్వీకారం చేసిన సందర్భంగా బీజేపీ రాష్ట్ర మాజీ అధికార ప్రతినిధి మీర్ ఫిరాసత్ అలీ బాక్రీ ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. కార్యక్రమంలో నాయకులు ప్రవీణ్‌కుమార్, మహ్మద్ వసీముద్దీన్, దిగ్విజయ్ జైన్, నవాబ్ షఫత్ అలీ ఖాన్, దియానాథ్ అలీ ఖాన్, ప్రదీప్ జైశ్వాల్, మహ్మద్ హమీమ్ పాల్గొన్నారు.

సంజయ్, కిషన్‌రెడ్డిలకు ఈటల శుభాకాంక్షలు



కేంద్ర మంత్రులుగా ప్రమాణ స్వీకారం చేసిన కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ కుమార్, సికింద్రాబాద్ ఎంపీ కిషన్‌రెడ్డిలను సోమవారం ఢిల్లీలో మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఆయన వెంట బీజేపీ మేడ్చల్ జిల్లా కార్యదర్శి చింతల మాణిక్యారెడ్డి, నాయకులు నగేష్, రాజిరెడ్డి, జేఎస్ఆర్, శ్రీనివాస్‌రెడ్డి, జగన్, మణి, శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

- అల్వాల్, జూన్ 10 (ఆంధ్రజ్యోతి)



కిషన్‌రెడ్డిని సత్కరిస్తున్న సూర్యప్రకాష్‌సింగ్, మాజీ ఎమ్మెల్యే చింతల రాంచంద్రారెడ్డి, డాక్టర్ గౌతమ్‌రావు తదితరులు

విమర్శించిన వారికి ఓటు ద్వారా గుణపాఠం

● కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి

బర్కత్‌పుర, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): అంబర్‌పేట నియోజకవర్గంలో ఎలాంటి అభివృద్ధి పనులూ చేపట్టలేదని విమర్శలు చేసిన కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీల నేతలకు ప్రజలు ఓటు ద్వారా సరైన గుణపాఠం చెప్పారని కేంద్రమంత్రి జి.కిషన్‌రెడ్డి అన్నారు. సోమవారం ఢిల్లీలో కేంద్రమంత్రి కిషన్‌రెడ్డిని మాజీ ఎమ్మెల్యే చింతల రాంచంద్రారెడ్డి, సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఎన్.గౌతమ్‌రావు, మహంకాళి జిల్లా అధ్యక్షుడు శ్యామ్‌సుందర్‌గౌడ్, కోశాధికారి ఏ.సూర్యప్రకాష్ సింగ్, అధికార ప్రతినిధి ఏడెల్లి అజయ్‌కుమార్, బీజేపీ రాష్ట్ర నాయకులు ఎక్కాల నందు, ఎక్కాల కన్నా తదితరులు కలిసి శాలువా, పూలబొకేతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా కిషన్‌రెడ్డి మాట్లాడుతూ అంబర్‌పేట ప్రజలకు ఎల్లప్పుడూ రుణపడి ఉంటానని, ఈ నియోజకవర్గ ప్రజలు అందించిన మెజారిటీతోనే ఎంపీగా రెండోసారి గెలిచి పార్లమెంట్‌లో అడుగుపెట్టబోతున్నానని అన్నారు.

15న కంబైన్డ్ గ్రాడ్యుయేషన్ పరేడ్



ఎయిర్ చీఫ్ మార్షల్ వివేక్ రామ్ చౌదరి

అల్వాల్, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): దుండిగల్ ఎయిర్‌ఫోర్స్ అకాడమీలో ఈ నెల 15న పాసింగ్ ఔట్ పరేడ్ నిర్వహిస్తున్నట్లు అధికారులు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. పాసింగ్ ఔట్ పరేడ్‌ను వీక్షించడానికి ఎయిర్ చీఫ్ మార్షల్ వివేక్‌రామ్ చౌదరి ముఖ్య అతిథిగా హాజరవుతారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఫ్లయింగ్, నావిగేషన్, గ్రౌండ్‌డ్యూటీ విభాగాలలో ప్రతిభ కనపరిచిన వారికి వింగ్స్ ప్రదానం చేస్తామని పేర్కొన్నారు. ఆల్‌రౌండ్ ప్రతిభ కనపరిచిన కేడెట్స్‌కు ప్రెసిడెంట్ ఫ్లాగ్‌ను అందిస్తామని తెలిపారు. ఈ పరేడ్‌లో పిలాటస్ పీసీ-7, ఏరోబాటిక్ డిస్‌ప్లే, తేలికపాటి యుద్ధ విమానం (తేజస్), సూర్యకిరణ్, సారంగ్, చేతక్ హెలికాప్టర్లతో విన్యాసాలు నిర్వహిస్తామని పేర్కొన్నారు.

మాణిక్యాలకు మహా సత్కారం

● పదిలో 10 జీపీఏ సాధించిన 230 మందికి పురస్కారాలు ● మెడల్స్, సర్టిఫికెట్లు ప్రదానం చేసిన సీఎం రేవంత్‌రెడ్డి

రవీంద్రభారతి, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): పదో తరగతిలో 10జీపీఏ సాధించిన రాష్ట్రంలోని 230 మంది ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులను వందేమాతరం ఫౌండేషన్ ఆధ్వర్యంలో రవీంద్రభారతిలో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా వచ్చిన సీఎం రేవంత్‌రెడ్డి విద్యార్థులను మెడల్, సర్టిఫికెట్‌తో సత్కరించి అభినందించారు. గ్రామాల్లో ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు 10 జీపీఏ పాయింట్లు సాధించినా.. సర్వంచ్‌తో సత్కారానికి నోచుకోని చాలా మంది విద్యార్థులు ముఖ్యమంత్రి చేతుల మీదుగా సత్కారం పొందుతూ ఆనందపడ్డారు. ప్రతిభా పురస్కారాలు అందుకున్న వారిలో కొంతమంది భావాలు వారి మాటల్లోనే...

నాన్న కోసం..



మాది నిజామాబాద్ జిల్లా దోమకుండ గ్రామం. ఇక్కడి జెడ్పీహెచ్ఎస్ బాయ్స్ హైస్కూల్‌లో చదివాను. మా నాన్న రోజూ కూలీకి వెళ్తాడు. అమ్మ బీడీలు చుడుతుంది. నాన్న కోసం మార్కులు సాధించాలని పట్టుదలతో చదివాను. టెన్త్‌లో టాపర్‌గా నిలిచాను.

- శ్రీకాంత్, దోమకొండ

అమ్మనే ఆధారం



మాది కామారెడ్డి జిల్లా మాంధపూర్ గ్రామం. మా ఊరిలో ఉన్న జిల్లా పరిషత్ పాఠశాలలో చదువుకున్నాను. పదో తరగతి ఫలితాల్లో పదికి పది మార్కులతో పాసయ్యాను. ఉపాధ్యాయుల బోధన నాకెంతో ఉపయోగపడింది. నా చిన్నతనంలోనే నాన్న చనిపోయారు. అమ్మ అన్నీ తానై మమ్మల్ని చదివిస్తోంది. భవిష్యత్తులో ఇంజనీరింగ్ చదవాలని కోరిక ఉంది.

- సాయి క్రిష్, మాంధపూర్ గ్రామం

కార్పెంటర్ కూతురిని..



మాది వరంగల్ నగరం. కృష్ణ కాలనీలోని ఎస్‌హెచ్ఎస్ స్కూల్‌లో టెన్త్ వరకు చదివాను. పదో తరగతిలో 10 జీపీఏ రావడం అదృష్టంగా భావిస్తున్నాను. మా నాన్న కార్పెంటర్. మా పాఠశాల ఉపాధ్యాయులు చాలా బాగా బోధించారు కాబట్టే ఈ స్థాయిలో మార్కులు సాధించగలిగాను. అందరికీ రుణపడి ఉంటాను.

- భువన కృతి, కృష్ణకాలనీ

సాఫ్ట్‌వేర్ రంగంలో రాణించాలని..



మాది నిర్మల్ జిల్లా కొరిటికల్ గ్రామం. ఇక్కడే పదో తరగతి చదివాను. పదిలో టాపర్‌గా నిలవడం సంతోషంగా ఉంది. మా నాన్న రోజు కూలీ. ఉపాధ్యాయులు బాగా పాఠాలు చెప్పారు కాబట్టే టాపర్‌గా నిలువగలిగాను. భవిష్యత్‌లో సాఫ్ట్‌వేర్ రంగంలో రాణించాలని ఉంది.

- సరిత, కొరిటికల్

ఎంబీబీఎస్ చదువుతా..



నేను నిజామాబాద్ జిల్లా మచ్చుకరం గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో చదివాను. పదో తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించినందుకు రవీంద్రభారతిలో సత్కారం పొందడం ఆనందంగా ఉంది. సీఎం చెప్పినట్లు ఇంటర్‌లో కూడా బాగా చదివి ఎంబీబీఎస్ సీటు సంపాదిస్తాను. మా నాన్న వ్యవసాయం చేస్తారు.

- మాసం శ్రీవల్లి, మచ్చుకరం

హమాలీ రేట్లను పెంచాలి

● పౌర సరఫరాల శాఖ కార్యాలయాన్ని ముట్టడించిన హమాలీలు



సివిల్ సప్లయి భవన్ ముందు ఆందోళన చేస్తున్న హమాలీలు

ఖైరతాబాద్, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): పెరుగుతున్న ధరలకు అనుగుణంగా హమాలీ రేట్లను పెంచాలని డిమాండ్ చేస్తూ ఏఐటీయూసీ తెలంగాణ రాష్ట్ర సివిల్ సప్లయిస్ హమాలీ వర్కర్స్ యూనియన్ పౌరసరఫరాల శాఖ కార్యాలయాన్ని ముట్టడించింది. ప్రతి క్వింటాలుకు ఎగుమతి, దిగుమతులకు రూ. 35 చెల్లించాలని కోరుతూ కార్యాలయం ఎదుట హమాలీలు బైఠాయించి నినాదాలు చేశారు. దీంతో పోలీసులకు, నిరసనకారులకు మధ్య తోపులాట జరిగి ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఈ సందర్భంగా ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.బాలరాజ్ మాట్లాడుతూ రెండు సంవత్సరాలకు ఒకసారి పెరగాల్సిన ధరలు రెండు సంవత్సరాల 5 నెలలు దాటినా కనీసం చర్చలకు పిలవలేదని అన్నారు. కార్మికులందరికీ ఈఎస్ఐ, ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. బోనస్‌ను రూ. 6,500 నుంచి 10వేలకు పెంచాలని, ప్రావిడెంట్ ఫండ్ సదుపాయం కల్పించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా ప్రతినిధి బృందం సివిల్ సప్లయిస్ కమిషనర్ చౌహాన్‌కు వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో యూనియన్ కార్యనిర్వాహక అధ్యక్షులు వై.ఓమయ్య, సమ్మయ్య, దేవేందర్, బాలరాజ్, జకరయ్య, ఆలేరు శ్రీను, నర్సింహ, సంపత్ తదితరులు పాల్గొన్నారు.

ఫేస్‌బుక్‌లో పరిచయమై.. రూ. 41.28లక్షలు కుచ్చుటోపి

హైదరాబాద్ సిటీ, జూన్ 10(ఆంధ్రజ్యోతి): నగరానికి చెందిన ఓ డాక్టర్ (బేరియాట్రిక్ సర్జన్)ను ఫేస్‌బుక్‌లో పరిచయం చేసుకున్న సైబర్ నేరగాడు.. ఆన్‌లైన్ ట్రేడింగ్ పేరుతో రూ.41.28లక్షలు కొల్లగొట్టాడు. మోసపోయినట్లు గుర్తించిన డాక్టర్ సిటీ సైబర్ క్రైమ్ పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదు చేశారు. సైబర్ క్రైమ్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బేరియాట్రిక్ సర్జన్‌కు ఫేస్‌బుక్‌లో ఒక గుర్తుతెలియని వ్యక్తి పరిచయమయ్యాడు. కొద్దిరోజుల తర్వాత కాయిన్ మార్కెట్ డాట్ విన్ అనే ట్రేడింగ్ ప్లాట్‌ఫామ్ గురించి డాక్టర్‌కు వివరించాడు. ఆ ట్రేడింగ్ ప్లాట్‌ఫామ్‌లో పెట్టుబడులు పెడితే అతితక్కువ సమయంలోనే అత్యధిక లాభాలు వస్తాయని నమ్మించాడు. డాక్టర్ అతను చెప్పిన వ్యాలెట్లలో డబ్బులు జమచేసేవాడు. కొద్దిరోజులు తక్కువ మొత్తంలో పెట్టుబడి పెట్టించిన నేరగాడు.. మంచి లాభాలు వచ్చినట్లు నమ్మించాడు. అనంతరం అధిక మొత్తంలో పెట్టుబడి పెట్టించి విత్‌డ్రా ఆప్షన్‌ను, లాభాలు వచ్చినట్లు చూపించే ఆప్షన్ సైతం క్లోజ్ చేశాడు. దాంతో డాక్టర్ ఆ డబ్బును విత్‌డ్రా చేసుకునే ప్రయత్నంలో భాగంగా నేరస్థుని ఈ వ్యాలెట్ల గురించి, కోల్పోయిన డబ్బును దక్కించుకునేందుకు సెర్చ్ చేస్తుండగా.. మరో గుర్తుతెలియని వ్యక్తి తారసపడ్డాడు. దాంతో అతని మాటలు నమ్మి మరికొంత పెట్టుబడి పెట్టాడు. అతను పంపిన ఈ వ్యాలెట్ అడ్రస్‌ను గుర్తించిన బాధితుడు ఇది కూడా మోసమేనని గుర్తించాడు. తాను పోగొట్టుకున్న డబ్బును తిరిగి రికవరీ చేసుకునే క్రమంలో బాధితుడు క్రిప్టో రికవరీ పేరుతో ఉన్న కీచ్ డీ గ్రేట్ అనే ఫిషింగ్ ఐటీకు కనెక్టయ్యాడు. అలా తను రెండోసారి రికవరీ చేసుకొని తన వ్యాలెట్‌లో ఉంచిన డబ్బును కోల్పోయాడు. అలా సైబర్ నేరగాళ్లు డాక్టర్ నుంచి మొత్తం రూ.41.28లక్షలు దోచేశారు. పెద్దమొత్తంలో డబ్బులు పోగొట్టుకున్న డాక్టర్ చివరకు సిటీ సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

అన్న, అన్న కొడుకు దాడిలో తమ్ముడు మృతి



మృతిచెందిన కృష్ణ

హయత్‌నగర్, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): సొంత తమ్ముడిపై అన్న, అన్న కుమారుడు పార, కర్రలతో దాడి చేయడంతో తీవ్ర గాయాలకు గురైన తమ్ముడు చికిత్స పొందుతూ సోమవారం మృతిచెందాడు. హయత్‌నగర్ పోలీసుల కథనం ప్రకారం.. వివరాలు ఇలా ఉన్నాయి. ముద్దంగుల కృష్ణ(35) ఆయన భార్య జ్యోతితో కలిసి మునగనూర్ గ్రామంలో నివాసం ఉంటున్నారు. కృష్ణ సోదరుడు ముద్దంగుల రాములు(40) ఆయన కుమారుడు బాలు(20) తొర్రూర్ రాజీవ్ గృహకల్పలో నివాసం ఉంటారు. గత నెల 13న బాలు మునగనూర్‌కు వచ్చి చిన్నమ్మ జ్యోతితో అసభ్యకరంగా మాట్లాడాడు. దీంతో ఆగ్రహించిన బాబాయ్ కృష్ణ బాలుపై కర్రతో దాడి చేస్తుండగా అన్న రాములు అడ్డం రావడంతో ఆయనకు గాయం అయింది. పంచాయితీ పెద్ద మనుషుల వద్దకు వెళ్లడంతో కృష్ణకు రూ.4 వేల జరిమానా విధించారు. నెల రోజులైనా కృష్ణ జరిమానా చెల్లించక పోవడంతో ఆదివారం రాత్రి 8 గంటలకు రాములు ఆయన కుమారుడు బాలు మరో వ్యక్తితో కలిసి వచ్చి కృష్ణపై కర్రలు, పారతో దాడి చేశారు. దీంతో కృష్ణ కంటికి, తలకు బలమైన గాయాలు కాగా ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ సోమవారం సాయంత్రం కృష్ణ మృతిచెందాడు. కృష్ణ భార్య జ్యోతి ఫిర్యాదు మేరకు హయత్‌నగర్ పోలీసులు సోమవారం రాత్రి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఎనర్జీ డ్రింక్స్‌తో గుండె జబ్బులు రావొచ్చు

(5వ పేజీ తరువాయి)

చెప్పలేం కానీ, కాస్త అప్రమత్తత అవసరమని డాక్టర్లు సూచిస్తున్నారు.

సాఫ్ట్ డ్రింక్స్‌లా తాగేస్తున్నారు..

చాలామంది ఎనర్జీ డ్రింక్స్‌ను కూడా సాఫ్ట్‌డ్రింక్స్ లాంటివిగానే భావిస్తున్నారు. కొంతమందికి ఇది ఎడిక్షన్‌గా కూడా మారుతుందని చెబుతున్నారు. వీటిలో షుగర్ కంటెంట్ ఎక్కువన్నది నిజమే అయినా కెఫీన్, గౌరానా, గ్లుకురోనోలాక్టోన్, టౌరిన్, జిన్‌సెంగ్, ఇనోసిటాల్ తదితర పదార్థాలు ప్రధానంగా కనిపిస్తుంటాయి. కెఫీన్ స్టిమ్యులెంట్‌గా పనిచేస్తోందని, దీనితో పాటుగా ఇతర కెమికల్స్ వల్ల అతి తక్కువ సమయంలో శరీరానికి ఎనర్జీ అందుతుందని చెబుతున్నారు. మనదేశంలో అమ్మే 25కు పైగా ఎనర్జీ డ్రింక్స్‌లో నిబంధనలకంటే ఎక్కువగానే కెఫీన్ ఉంటుందని పలు అధ్యయనాలు చెబుతున్నాయి. అయితే, ఓ కప్పు కాఫీలో ఉండే 80మిల్లీగ్రాములకు సమానంగా తమ కాన్‌లలో కూడా కెఫీన్ ఉంటుందని పలు కంపెనీలు వాదిస్తున్నాయి. ఎనర్జీ డ్రింక్స్ తీసుకోవటం వల్ల స్టామినా పెరుగుతుందని కంపెనీలు చెబుతున్నాయి. ఈ డ్రింక్స్ తీసుకుంటున్న టీనేజర్లలో ఆందోళన, ఏకాగ్రత లేకపోవటం వంటి ఆరోగ్య సమస్యలు కనిపిస్తున్నాయని డాక్టర్లు చెబుతుండటం గమనార్హం. ఈ ఎనర్జీ డ్రింక్స్ తీసుకుంటున్న చిన్నారుల్లో మొదట్లో కాస్త ఎనర్జీ కనబడినా తరువాత కాలంలో నిద్రలేమి వంటి సమస్యలు కూడా వెంటాడే అవకాశాలున్నాయని పలువురు డాక్టర్లు హెచ్చరిస్తున్నారు. అమెరికన్ అకాడమీ ఆఫ్ పిడియాట్రిక్స్ మాత్రం.. చిన్నారులు, కౌమారదశ పిల్లలు, టీనేజర్లు వీటికి దూరంగా ఉండటమే మంచిదని సూచిస్తున్నది.

లిమిట్ దాటితేనే సమస్యంతా..!

ఫుడ్ సేఫ్టీ అండ్ స్టాండర్డ్స్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఎఫ్ఎస్ఎస్ఏఐ) ఇటీవల ఈ-కామర్స్ కంపెనీలు హెల్త్ డ్రింక్ అనో ఎనర్జీ డ్రింక్ అనో పాల ఉత్పత్తుల ఆధారిత పానీయాలు, మాల్ట్ ఆధారిత పానీయాలను రిఫర్ చేయవద్దని కోరింది. 2011లో ఫుడ్ సేఫ్టీ అండ్ స్టాండర్డ్స్ రెగ్యులేషన్ నూతన ప్రమాణాలను అనుసరించాలని నిర్దేశించింది. కెఫీన్ ఇంటాక్సికేషన్ వల్ల హార్ట్‌రేట్ ఒక్కసారిగా పెరగటం, యాంగ్జైటీ, వికారం, వాంతులు వంటివి కూడా కావొచ్చని చెబుతున్నారు. ఉచితంగా అందిస్తున్నారని తాగొద్దని, తాగేముందు ఒకటికి రెండుసార్లు తమ ఆరోగ్య పరిస్థితిని పరిగణనలోకి తీసుకోవాలని సూచిస్తున్నారు.

బాప్‌రే.. భగాయత్!

(5వ పేజీ తరువాయి)

నీటి సరఫరా సౌకర్యాలతో ఆకర్షణీయంగా లేఅవుట్‌ను తీర్చిదిద్దారు. ఫేజ్-3 లేఅవుట్ పేరుతో 40ఎకరాలను దాదాపు రూ.25కోట్లతో ఇటీవల హెచ్ఎండీఏ అభివృద్ధి చేసింది.

రూ. 250కోట్లకు పైగా ఖర్చు చేసినా..

ఉప్పల్ భగాయత్ ఫేజ్-1, 2, 3 లేఅవుట్లను హెచ్ఎండీఏ ఇంజనీరింగ్ విభాగం ఆధ్వర్యంలో రూ.250కోట్లకు పైగా వ్యయం చేసి అభివృద్ధి చేశారు. రోడ్లన్నీ 100అడుగుల నుంచి 40అడుగుల రోడ్డు వరకు ఉన్నాయి. ఎంతో విశాలంగా సెంట్రల్ మీడియన్ మొక్కలతో ఉండేలా ఆకర్షణీయంగా రూపొందించారు. ఐదేళ్ల క్రితం నుంచి ప్లాట్లను విక్రయించడంతో పెద్దఎత్తున కొనుగోలు చేసిన వారంతా నిర్మాణాలు చేపట్టారు. పెద్దఎత్తున అపార్ట్‌మెంట్లు వెలుస్తున్నాయి. హోటల్స్, ఫుడ్ కోర్టులు ఇలా అనేక రకాల కమర్షియల్ కార్యకలాపాలు సాగుతున్నాయి. కొందరు కబ్జాదారులైతే హెచ్ఎండీఏ ఖాళీ స్థలాలను వివిధ వ్యాపారాలకు అద్దెకిస్తూ పెద్దఎత్తున సొమ్ము చేసుకుంటున్నారు. ప్రస్తుతం వెలుస్తున్న భవన నిర్మాణాలకు ఉప్పల్ భగాయత్‌లోని మౌలిక సదుపాయాలు సరిపోవడం లేదు. రోడ్లన్నీ తారు లేచి, కంకర పోయి ఎక్కడికక్కడే గుంతలు ఏర్పడ్డాయి. వీటిపై ద్విచక్ర వాహనదారులు ప్రయాణిస్తూ అదుపుతప్పి గాయాలపాలవుతున్నారు. అపార్ట్‌మెంట్ నిర్మాణం చేసే సంస్థలన్నీ రోడ్లను ఎక్కడికక్కడే ఆక్రమించాయి. రోడ్లపైనే కార్మికులకు షెడ్లను ఏర్పాటు చేశారు. పెద్దఎత్తున ఇసుక, కంకర పోశారు. వాహనాలు వెళ్లేందుకు దారి లేదు. 50అడుగుల మేర సెల్లార్ తవ్వుతున్న ఓ నిర్మాణ సంస్థ అందులోకి వచ్చే నీటిని రోడ్లపై వదలడంతో వంద మీటర్ల మేర రోడ్డు పూర్తిగా దెబ్బతిన్నది.

ఏపుగా పెరిగిన చెట్లు..

ఎక్కడికక్కడే నరికివేత

ఉప్పల్ భగాయత్‌లో కోట్లాది రూపాయలు ఖర్చు చేసి పెద్దఎత్తున హెచ్ఎండీఏ మొక్కలు నాటింది. ఆ మొక్కలు ప్రస్తుతం చెట్లుగా మారాయి. అయితే, ఇటీవల విద్యుత్ తీగలకు తగులుతున్నాయనే పేరుతో ఎక్కడికక్కడే చెట్లను సగానికి నరికేశారు. కొమ్మలు రోడ్లపై పడి ఉన్నాయి. విద్యుత్‌శాఖ వాటిని తొలగించ లేదు. జీహెచ్ఎంసీ, హెచ్ఎండీఏలు ఆ వైపు కన్నెత్తి చూడలేదు. అంతర్జాతీయ స్థాయిలో మౌలిక సదుపాయాలంటూ ఊదరగొట్టిన హెచ్ఎండీఏ అధికారులు అండర్‌గ్రౌండ్ విద్యుత్ కేబులింగ్ పనులు చేపట్టకపోవడం విస్మయానికి గురిచేస్తోంది. హెచ్ఎండీఏ అధికారులు వర్షపు నీటి డ్రెయిన్‌ను సైతం నిర్మించలేదు. వర్షం వస్తే నీరు పోయే మార్గాలు చేపట్టలేదు. దీంతో ఉప్పల్ భగాయత్ ఫేజ్-1లో వర్షం వస్తే చాలు.. ఎడమవైపు దాదాపు 200మీటర్ల మేర రోడ్డు మొత్తం మునిగి నీళ్లు నిలుస్తున్నాయి. డివైడర్‌కు మధ్య గ్యాప్ వదిలినా నీరంతా 20మీటర్ల దూరంలోని మూసీనదిలో చేరేందుకు అవకాశమున్నది. హెచ్ఎండీఏ అధికారుల నిర్లక్ష్యంతో ఆ మార్గంలో ప్రయాణికులు వర్షపు నీటిలో ఇబ్బందులు పడుతున్నారు.

నిర్వహణ పట్టించుకోని హెచ్ఎండీఏ, జీహెచ్ఎంసీ, వాటర్‌బోర్డు

ఉప్పల్ భగాయత్ లేఅవుట్‌ను అభివృద్ధి చేసి ప్లాట్లను విక్రయించి ఇప్పటి వరకు దాదాపు వెయ్యి కోట్ల ఆదాయాన్ని హెచ్ఎండీఏ పొందింది. ఉప్పల్ భగాయత్ లేఅవుట్‌లో అనుమతుల ద్వారా జీహెచ్ఎంసీ ఇప్పటి వరకు దాదాపు రూ.100కోట్ల వరకు ఆదాయం సమకూర్చుకున్నట్లు సమాచారం. అపార్ట్‌మెంట్లు నిర్మాణం కావడంతో యేటా ఆస్తిపన్ను కూడా జీహెచ్ఎంసీయే వసూలు చేస్తోంది. ఇక తాగునీటి కనెక్షన్లు ఇచ్చి వాటర్‌బోర్డు కూడా కోట్లలోనే ఆదాయం పొందింది. రెండేళ్ల క్రితం ఉప్పల్ భగాయత్ లేఅవుట్‌లో తాగునీటి నిర్వహణ, మురుగునీటి నిర్వహణ వాటర్‌బోర్డుకు అప్పగించారు. నిర్వహణ పనులకు అవసరమైన దాదాపు రూ. వంద కోట్ల మేరకు హెచ్ఎండీఏ కూడా వాటర్‌బోర్డుకు చెల్లింపులు చేసింది. కానీ, వాటర్‌బోర్డు మురుగునీటి నిర్వహణ చేపట్టడం లేదు. జీహెచ్ఎంసీ పర్మిషన్లతో, ఆస్తిపన్ను వసూళ్లతో ఆదాయం పొందుతోంది కానీ, కనీసం రోడ్లను ఊడ్చడం లేదు. అపార్ట్‌మెంట్లలోని నివాసితుల నుంచి కనీసం చెత్త తీసుకెళ్లేందుకు వాహనాలు కూడా రావడంలేదు. దాంతో ఖాళీ స్థలాల్లో చెత్త పారబోసే పరిస్థితి ఉన్నది. మౌలిక సదుపాయాల నిర్వహణ లేక అనారోగ్యం పాలవుతున్నామని, హెచ్ఎండీఏకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని స్థానికులు వాపోతున్నారు. పర్మిషన్లు ఇచ్చి ఆస్తిపన్ను వసూలు చేసే జీహెచ్ఎంసీ, వాటర్‌బోర్డు అధికారులు తమకు సంబంధం లేదంటూ విషయాన్ని దాటవేస్తున్నారు. రోడ్లపై నిర్మాణ సామగ్రి, వ్యర్థాలు పోసే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని, డ్రైనేజీలైన్లను క్లియర్ చేసే విధంగా చర్యలు చేపట్టాలని వారు డిమాండ్ చేస్తున్నారు.

జర్నలిస్టుల పిల్లలకు ఫీజులో రాయితీ

● ప్రైవేటు పాఠశాలలకు హైదరాబాద్ డీఈఓ ఆదేశాలు



ఫీజు రాయితీ సర్క్యులర్‌ను హెచ్‌యూజే నేతలకు అందజేస్తున్న డీఈఓ రోహిణి

హైదరాబాద్ సిటీ, జూన్ 10(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ప్రైవేట్ పాఠశాలల్లో జర్నలిస్టు పిల్లలకు ఫీజు రాయితీ కల్పించాలని ఆదేశిస్తూ జిల్లా విద్యాశాఖాధికారి రోహిణి సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. ప్రైవేట్ పాఠశాలల్లో పిల్లల చదువు మోయలేని భారంగా మారినందున ఆయా పాఠశాలల ఫీజుల్లో రాయితీ ఇచ్చే విధంగా ఆదేశాలు జారీచేయాలని హైదరాబాద్ యూనియన్ ఆఫ్ జర్నలిస్ట్స్(హెచ్‌యూజే) చేసిన వినతికి జిల్లా విద్యాశాఖాధికారి స్పందించారు. ఈ మేరకు హైదరాబాద్ జిల్లా విద్యాశాఖ అధికారి జారీచేసిన సర్క్యులర్‌ను హెచ్‌యూజే నాయకులు శిగా శంకర్, కార్యదర్శి ఖాజా అబ్దుల్ హమీద్ తదితరులకు అందజేశారు. ఈ సందర్భంగా హెచ్‌యూజే నేతలు మాట్లాడుతూ హైదరాబాద్ జిల్లాలో అర్హులైన పాత్రికేయులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు.



శంకర్‌యాదవ్ పార్థివదేహానికి శ్రద్ధాంజలి ఘటిస్తున్న మాజీ మంత్రి హరీష్ రావు తదితరులు, చిత్రంలో తలసాని శ్రీనివాస్ యాదవ్

తలసాని సోదరుడు శంకర్ యాదవ్ మృతి

● పలువురు ప్రముఖుల నివాళి

సికింద్రాబాద్, మారేడుపల్లి, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ అన్న, మోండా మార్కెట్ వర్తకుల సంఘం అధ్యక్షుడు, శంకర్‌యాదవ్(61) సోమవారం తెల్లవారుజామున కన్నుమూశారు. కొద్ది రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన సికింద్రాబాద్‌లోని యశోద హాస్పిటల్‌లో చికిత్స పొందుతూ తుదిశ్వాస విడిచారు. బోయినపల్లి కూరగాయల మార్కెట్ ఏజెంట్స్ అసోసియేషన్ అధ్యక్షుడిగా కూడా ఆయన పని చేశారు.

మాజీ మంత్రులు హరీష్‌రావు, ఎర్రబెల్లి దయాకర్‌రావు, మహమూద్‌అలీ, మాజీ డిప్యూటీ స్పీకర్ పద్మారావుగౌడ్ ఏలూరు పార్లమెంట్ సభ్యులు పుట్టా మహేష్‌కుమార్‌యాదవ్, శాసనమండలి డిప్యూటీ ఛైర్మన్ బండ ప్రకాష్, ఎమ్మెల్సీ ఎగ్గే మల్లేశం, ఎమ్మెల్యేలు దానం నాగేందర్, కాలేరు వెంకటేష్, ఎన్.శ్రీగణేష్, మాజీ ఎంపీలు అంజన్ కుమార్‌యాదవ్, రావుల చంద్రశేఖర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ శ్రీనివాస్‌రెడ్డి, కార్పొరేటర్లు, కార్పొరేషన్ల మాజీ ఛైర్మన్లు, బీఆర్ఎస్ నాయకులు, పలువురు వ్యాపారులు తదితరులు శంకర్‌యాదవ్ పార్థివదేహాన్ని సందర్శించి నివాళులు అర్పించారు. అనంతరం మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్, ఇతర కుటుంబసభ్యులను పరామర్శించి తమ ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

నేడు ఉద్యాన వర్సిటీలో స్నాతకోత్సవం

హైదరాబాద్, 10 (ఆంధ్రజ్యోతి): శ్రీకొండా లక్ష్మణ్ బాపూజీ తెలంగాణ రాష్ట్ర ఉద్యాన విశ్వవిద్యాలయం మూడో స్నాతకోత్సవం నేడు(మంగళవారం) నిర్వహిస్తున్నట్లు వీసీ డాక్టర్ నీరజ ప్రభాకర్ తెలిపారు. రాష్ట్ర గవర్నర్ సీపీ రాధాకృష్ణన్, తమిళనాడు వ్యవసాయ విశ్వవిద్యాలయం వీసీ డాక్టర్ గీతాలక్ష్మి ముఖ్యఅతిథులుగా హాజరవుతున్నట్లు తెలిపారు. ఈ స్నాతకోత్సవంలో 156 మందికి ఉద్యాన డిగ్రీ, 50 మందికి ఫారెస్ట్ డిగ్రీ, 45 మందికి ఉద్యాన పీజీ, 30 మందికి ఫారెస్ట్ పీజీ, అలాగే మరో ఆరుగురికి పీహెచ్‌డీ డాక్టరేట్ పట్టాలు ప్రదానం చేయనున్నట్లు వీసీ నీరజ తెలిపారు.



సంధ్య 70 ఎంఎం థియేటర్ వద్ద ప్రభాస్ అభిమానులు

ఆర్టీసీ క్రాస్‌రోడ్‌లో ఉద్రిక్తత

● కల్కి సినిమా ట్రైలర్ షో ఆలస్యంపై ఆగ్రహం

● థియేటర్‌లోకి చొచ్చుకెళ్లేందుకు అభిమానుల యత్నం

● లాఠీ చార్జ్ చేసిన చిక్కడపల్లి పోలీసులు

రాంనగర్, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ సినీహీరో ప్రభాస్ నటించిన కల్కి సినిమా ట్రైలర్ రిలీజ్ ఆలస్యం కావడంతో ఆర్టీసీ క్రాస్‌రోడ్‌లోని సంధ్య 70 ఎంఎం థియేటర్ వద్ద ఉద్రిక్తత చోటుచేసుకుంది. సోమవారం సాయంత్రం సంధ్య థియేటర్ 70 ఎంఎంలో కల్కి సినిమా ట్రైలర్ వేస్తామని ప్రకటించారు. దీంతో సాయంత్రం ఐదు గంటల నుంచే జంటనగరాలతో పాటు వివిధ జిల్లాల నుంచి ప్రభాస్ అభిమానులు వేలాదిగా థియేటర్ వద్దకు చేరుకున్నారు. ప్రభాస్ చిత్రపటానికి పూలమాలలు వేసి క్షీరాభిషేకం చేసి బ్యాండ్ మేళాలకు అనుగుణంగా డ్యాన్స్ చేస్తూ పెద్ద పెట్టున నినాదాలు చేశారు. కల్కి సినిమా ట్రైలర్ ప్రదర్శన ఆలస్యం కావడంతో ఆర్టీసీ క్రాస్‌రోడ్డుకు చేరుకున్న అభిమానులు ఒక్కసారిగా సంధ్య థియేటర్‌లోకి చొచ్చుకెళ్లేందుకు ప్రయత్నించారు. దీంతో చిక్కడపల్లి పోలీసులు లాఠీచార్జ్ చేసి అభిమానులను చెదరగొట్టారు. కొద్దిసేపటి తరువాత థియేటర్‌లో కల్కి సినిమా ట్రైలర్ విడుదల చేయడంతో అభిమానులను రెండు పర్యాయాలు థియేటర్లలోకి పంపించి ట్రైలర్ చూసే అవకాశం కల్పించారు.



ట్యాంక్‌బండ్‌పై నుంచి లిబర్టీ వెళ్లే మార్గంలో భారీ సంఖ్యలో నిలిచిన వాహనాలు

ట్యాంక్‌బండ్‌పై భారీగా ట్రాఫిక్ జామ్

● గంటల తరబడి వాహనదారుల నరకయాతన

కవాడిగూడ, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): జీహెచ్ఎంసీ చెత్త తరలించే వాహనం బ్రేకులు సోమవారం రాత్రి ఫేలవడంతో లోయర్ ట్యాంక్‌బండ్‌లోని అంబేడ్కర్ విగ్రహం వద్ద ప్రధాన రోడ్డుపై నిలిచిపోయింది. దీంతో లోయర్ ట్యాంక్‌బండ్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం నుంచి ట్యాంక్‌బండ్‌పై ఉన్న చిల్డ్రన్ పార్కు వరకు వాహనాలు ఎక్కడికక్కడ నిలిచిపోయాయి. తెలుగుతల్లి ఫ్లైఓవర్, లోయర్ ట్యాంక్‌బండ్ కనకాల కట్టమైసమ్మ దేవాలయం రూట్‌లో కూడా వాహనాలు బారులు తీరాయి. దీంతో బస్సులు, వాహనాలపై ఇళ్లకు వెళ్లే వారు గంటల తరబడి ట్రాఫిక్‌లో ఇరుక్కుని నరకయాతన అనుభవించారు. సమాచారం అందుకున్న సైఫాబాద్ ట్రాఫిక్ పోలీసులు దాదాపు గంటపాటు శ్రమించి ట్రాఫిక్‌ను క్లియర్ చేయడంతో వాహనదారులు ఊపిరి పీల్చుకున్నారు. జీహెచ్ఎంసీలో కాలంచెల్లిన వాహనాలను వాడటం వల్లే ఇలాంటి సమస్యలు వస్తున్నాయని పలువురు వాహనదారులు ఆగ్రహం వ్యక్తం చేశారు.



టేబుల్ మీద మోచేతులు ఆనించి కూర్చుంటాం. పాదాలకు బిగుతైన బూట్లను వేసుకుంటాం. నేల మీద పద్మాసనంలో కూర్చుంటాం. ఇవన్నీ సర్వసాధారణమైన అలవాట్లే! కానీ వీటితో నాడులు దెబ్బతింటాయనే విషయం మనలో ఎంత మందికి తెలుసు? నాడుల డ్యామేజీని ఎలా నియంత్రించాలో, ఎలా పసిగట్టి సరిదిద్దుకోవాలో వైద్యులను అడిగి తెలుసుకుందాం!

నరాలు దెబ్బతినకుండా...

ఈ జాగ్రత్తలు పాటించాలి

- డెస్క్ మీద చేతులు పెట్టుకునే అలవాటు ఉన్నవాళ్లు, ఆ ప్రదేశంలో మెత్తని ప్యాడ్స్ ఏర్పాటు చేసుకోవాలి
- కార్పెల్ టన్నెల్ సిండ్రోమ్ రాకుండా, కంప్యూటర్ ముందు పని చేసేటప్పుడు, మణికట్టు, ముంజేయి సమాంతరంగా ఉండేలా చూసుకోవాలి.
- ఎక్కువ సమయాల పాటు పద్మాసనంలో కూర్చోకూడదు
- బిగుతైన బూట్లు వేసుకోకూడదు
- మోకాలి సర్జరీ తర్వాత బ్యాండేజీలు మరీ బిగుతుగా ఉండకుండా చూసుకోవాలి.
- ప్రమాదాలకు గురైన వెంటనే ఆలస్యం చేయకుండా వైద్యులను సంప్రతించాలి
- అవయవాల్లో స్పర్శ ఏమాత్రం తగ్గినా, తిమ్మిర్లు మొదలైనా, బలహీనత కనిపించినా వెంటనే వైద్యులను కలవాలి.

మధుమేహం, బిపిల ప్రభావం

మధుమేహానికీ నాడుల డ్యామేజీకి దగ్గరి సంబంధం ఉంది. సాధారణంగా మధుమేహం నిర్థారణ అయ్యే సమయానికే 20% మేరకు నాడుల పనితీరు దెబ్బతింటుంది. కాబట్టి చేతులు, కాళ్లలోని నాడులు సురక్షితంగా ఉండాలంటే మధుమేహం మీద ఓ కన్నేసి ఉంచాలి. నిర్థారణ అయిన తర్వాత చక్కెరను అదుపులో ఉంచుకోవాలి. అధిక రక్తపోటు నాడుల మీద నేరుగా ప్రభావం చూపించకపోయినా, రక్తపోటు పెరగడం మూలంగా నాడులకు రక్తప్రసరణ తగ్గి, డ్యామేజీకి గురయ్యే అవకాశాలుంటాయి.

నాడులు టెలిఫోన్ తీగల్లాంటివి. ఆ తీగ దెబ్బతింటే శబ్ద ప్రసారాల్లో అంతరాయం ఏర్పడవచ్చు, పూర్తిగా తెగిపోతే, టెలిఫోన్ పూర్తిగా మూగబోవచ్చు. నాడులు దెబ్బతిన్నా ఇదే పరిస్థితి. మరీ ముఖ్యంగా అరచేతులు, చేతులు, పాదాలు, కాళ్లకు సంబంధించిన నాడులు దెబ్బతింటే, ఆయా అవయవాలకు మెదడు నుంచి సిగ్నల్స్ అందక తిమ్మిరి, మొద్దుబారడం, స్పర్శ కోల్పోవడం, బలహీనత ఆవరించడం లాంటి లక్షణాలు తలెత్తుతాయి. దురదృష్టకరమైన విషయం ఏంటంటే, ఇలాంటి లక్షణాలను ఎక్కువ మంది నిర్లక్ష్యం చేస్తూ ఉంటారు. పూర్తిగా పని చేయలేని పరిస్థితికి చేరుకున్న తర్వాత మాత్రమే కంగారు పడిపోయి, వైద్యుల దగ్గరకు పరుగులు పెడుతూ ఉంటారు. కానీ ఇలా ఆలస్యం చేయడం వల్ల, చికిత్సతో సరిదిద్దగలిగే నాడీ సమస్య, ఎప్పటికీ సరిదిద్దలేని శాశ్వత సమస్యగా మారిపోయే ప్రమాదం ఉంటుంది.

నాడులు ఎందుకు దెబ్బతింటాయి?

ప్రమాదాలు, ఒరుసుకుపోవడం, రక్తప్రసారం ఆగిపోవడం, మధుమేహం, అధిక రక్తపోటు, రేడియేషన్, మెటాస్టాసిస్ (నాడులకు కేన్సర్ పాకడం) వల్ల నాడులు దెబ్బతింటాయి. రోడ్డు ప్రమాదాల్లో నేల మీద పడిపోయేటప్పుడు, శరీరానికి దెబ్బలు తగలకుండా చేతులను చాపి, అడ్డుకునే ప్రయత్నం చేస్తాం. చేతులు రోడ్డుకు ఢీకొనడం వల్ల బాహుమూలల్లోని నాడులు దెబ్బతింటాయి. అలాగే చేతులు స్ట్రెచ్ అయినా నాడులు దెబ్బతింటాయి. ఇలాంటి ప్రమాదాల్లో నాడులు పూర్తిగా దెబ్బతింటే చేయి మొత్తం బలహీనపడిపోతుంది. పాక్షికంగా దెబ్బతింటే బలహీనత తక్కువగా ఉంటుంది. అలాగే రోడ్డు ప్రమాదాల్లో ఫ్రాక్చర్ల సమయంలో కూడా నాడులు దెబ్బతింటూ ఉంటాయి. భుజం మీద పడిపోతే యాక్సిలరీ నాడి దెబ్బతిని చేతిని పైకి లేపలేకపోతారు. టేబుల్ మీద మోచేతిని ఆనించి కూర్చునే అలవాటున్న వాళ్లలో మోచేతి దగ్గరి నాడుల మీద ప్రభావం పడుతుంది.

కంప్రెషన్ ఇంజురీస్

టెండాన్ల మధ్య నుంచి ప్రయాణించే నాడులు ఒత్తిడికి లోనై అవయవాల్లో బలహీనత వస్తుంది. కంప్యూటర్ దగ్గర ఎక్కువ సమయాల పాటు పని చేసినా మణికట్టులో నాడి ఒత్తిడికి గురై, కార్పెల్ టెన్నల్ సిండ్రోమ్ అనే సమస్య తలెత్తుతుంది. దాంతో మొదటి మూడు వేళ్లలో తిమ్మిర్లు మొదలవుతాయి. అరచేతులు బలహీనపడతాయి. స్థూలకాయ మహిళల్లో, గర్భిణుల్లో, రుమటాయిడ్ ఆర్థ్రయిటిస్ ఉన్న వాళ్లలో, మణికట్టుకు దెబ్బ తగిలిన వాళ్లలో ఈ సమస్య ఎక్కువ. బిగుతైన బూట్లు వేసుకున్నప్పుడు పాదాల్లోని నాడులు ఒరుసుకుపోతాయి. సర్జరీ తదనంతరం ఎక్కువ సమయాల పాటు మంచానికే పరిమితమైన వాళ్లలో మోకాలి అడుగు భాగం బెడ్‌కు తగులుతూ ఉండడం మూలంగా కాళ్లలో నాడులు దెబ్బతిని ఫుట్ డ్రాప్ సమస్య తలెత్తుతుంది. ఎక్కువ సమయాల పాటు పద్మాసనంలో కూర్చునే వాళ్లలో కూడా కాళ్లలోని నాడులు దెబ్బతింటాయి. ఇవన్నీ కంప్రెషన్ న్యూరోపతీ సమస్యలు.

నాడుల డ్యామేజీని ఇలా గుర్తించాలి

- దెబ్బ తిన్న నాడికి సంబంధించిన అవయవంలో స్పర్శ తగ్గుతుంది.
- దెబ్బతిన్న నాడికి సంబంధించిన కండరాలు బలహీనపడి, అవయవ బలహీనత తలెత్తుతుంది
- తిమ్మిర్లు రావచ్చు
- కదలికలు తగ్గుతాయి

డ్యామేజీలు పలు రకాలు

నాడులు దెబ్బతినకుండా వాటిని ఆక్సాన్ అనే నర్వ్ ఫైబర్లు, మెంబ్రేన్స్ కాపాడుతూ ఉంటాయి. కొన్ని సందర్భాల్లో ఇవి కూడా నాడులను కాపాడలేకపోతాయి. అలాంటప్పుడు నాడులు దెబ్బతింటూ ఉంటాయి. సాగడం, ఒరుసుకుపోవడం, తెగిపోవడం... ఇలా మూడు రకాలుగా నాడులు దెబ్బతింటూ ఉంటాయి.

కొన్నిసార్లు నాడులు చెక్కుచెదరకుండా ఉన్నప్పటికీ, వాటి పనితీరు దెబ్బ తింటూ ఉంటుంది. కొన్ని రోజుల నుంచి కొన్ని వారాల లోపు ఈ సమస్య దానంతట అదే సర్దుకుంటుంది. ఇంకొన్ని సందర్భాల్లో నాడి యాక్సాన్ దెబ్బతిని, కవరింగ్స్ మెరుగ్గానే ఉంటాయి. ఈ సమస్య కూడా దానంతట అదే పరిష్కారమైపోతుంది. కానీ నర్వ్ స్ట్రక్చర్ పూర్తిగా దెబ్బతిన్నప్పుడు సర్జరీ ద్వారా టెండాన్ ట్రాన్సర్, నర్వ్ గ్రాఫ్టింగ్, రక్త సరఫరాను పునరుద్ధరించడం లాంటివి చేయవలసి ఉంటుంది. కానీ సర్జరీ ఫలితం 50 నుంచి 60 శాతమే ఉండవచ్చు. పెద్దలతో పోల్చుకుంటే, యుక్తవయస్కుల్లో ఫలితం మెరుగ్గా ఉంటుంది. అలాగే గాయపడిన నాడులకు ఎంత త్వరగా సర్జరీ చేయగలిగితే ఫలితం అంత మెరుగ్గా ఉంటుంది. రోగి వయసు, గాయం తీవ్రత, చికిత్సను ఆశ్రయించిన సమయాల మీద కూడా సర్జరీ ఫలితం ఆధారపడి ఉంటుంది.



వెన్ను దెబ్బతింటే....

వెన్నుపాము దెబ్బతింటే రెండు చేతులు, రెండు కాళ్ల మీద ప్రభావం పడవచ్చు. వెన్నుపాములో సగభాగం దెబ్బతింటే, ఒక వైపు కాలు, చేయి మీద ప్రభావం పడవచ్చు. సాధారణంగా రోడ్డు ప్రమాదాల్లో వెన్నుపాముకు దెబ్బ తగిలినప్పుడు, వెన్నుపాము లోపలే రక్తం గడ్డకట్టవచ్చు. కొన్ని సందర్భాల్లో వెన్నుపూసల మధ్య నాడులు ఒరిపిడికి గురి కావచ్చు. దాంతో అవయవాల్లో బలహీనత తలెత్తుతుంది. ఇలాంటి సందర్భాల్లో కూడా సమస్య తీవ్రత మీదే సర్జరీల ఫలితాలు ఆధారపడి ఉంటాయి.

డాక్టర్ ఆర్. ఎన్. కోమల్ కుమార్
సీనియర్ న్యూరాలజిస్ట్,
యశోద హాస్పిటల్స్,
సికింద్రాబాద్.



నవ్య డాక్టర్ – పిల్లలను ఇలా ఎత్తుకోవాలి

ప్రసవం క్లిష్టంగా మారిన సమయంలో బిడ్డ చేతులు పట్టుకుని బయటకు లాగుతూ ఉంటారు. ఇలాంటప్పుడు బిడ్డ బాహుమూలల్లోని నాడులు దెబ్బతినే ప్రమాదం ఉంటుంది. ఈ సమస్య బిడ్డ పెరిగే క్రమంలో చేతులు బలహీనపడడం ద్వారా బయల్పడుతూ ఉంటుంది. అలాగే చిన్న పిల్లలను ఎత్తుకునేటప్పుడు బాహుమూలల్లో అర చేతులు ఉంచి, పైకి లేపాలి. అంతే తప్ప మోచేతులు, ముంజేతుల దగ్గర పట్టుకుని పైకి లేపే ప్రయత్నం చేసినా, పిల్లల బాహుమూలల్లోని నాడులు దెబ్బతిని, చేతులు బలహీనపడిపోయే ప్రమాదం ఉంటుంది.

అవేర్‌నెస్

ఆహారం ఇలా సురక్షితం

ఆహారాన్ని శుచిగా తయారు చేసుకోవడమెలాగో తెలిస్తే సరిపోదు. పోషకాలు నష్టపోకుండా ఎలా వండుకోవాలో, ఎలా నిలువ చేసుకోవాలో కూడా తెలిసి ఉండాలి. అప్పుడే పోషక నష్టాన్ని అరికట్టగలుగుతాం.

శుభ్రంగా ఉండేలా...

- పదార్థాలను తాకేటప్పుడు, వంట వండేటప్పుడు చేతులను శుభ్రంగా ఉంచుకోవాలి
- టాయిలెట్ వాడిన ప్రతిసారీ చేతులు శుభ్రంగా సబ్బుతో కడుక్కోవాలి
- వంటకు ఉపయోగించే పరికరాలు (కత్తులు, చాపింగ్ బోర్డ్, మిక్సీ గిన్నెలు, పాత్రలు), ప్రదేశాలు శానిటైజ్ చేస్తూ ఉండాలి
- వంటింట్లో ఎలుకలు, బొద్దింకలు, చీమలు లాంటివి లేకుండా చూసుకోవాలి

వీటిని వేర్వేరుగా...

- పచ్చి మాంసం, గుడ్లు, సముద్రాహారాలను ఇతర పదార్థాలకు దూరంగా ఉంచాలి
- కూరగాయలకూ, మాంసాహారినికీ ఒకే కత్తి, చాపింగ్ బోర్డ్, పాత్రలు ఉపయోగించకూడదు



- పచ్చివాటినీ, ఉడికించిన వాటికీ వేర్వేరు పాత్రలు కేటాయించాలి

బాగా ఉడికించాలి

- మాంసం, చేపలు, గుడ్లు, సముద్రాహారాలను బాగా ఉడికించాలి.
- సూప్స్, స్ట్యూలను 70 డిగ్రీల సెంటీగ్రేడ్‌కు చేరుకునే వరకూ ఉడికించాలి. ఇవి చల్లారిపోతే, తిరిగి వేడి చేసిన తర్వాతే తినాలి

సురక్షితమైన తాపమానాల్లో...

- వంటకాలను రెండు గంటలకు మించి గది ఉష్ణోగ్రతలో ఉంచకూడదు
- పాడయ్యే వీలున్న పదార్థాలతో పాటు, వండిన వంటకాలన్నింటినీ 5 డిగ్రీల కంటే తక్కువ తాపమానంలో నిల్వ చేసుకోవాలి
- వడ్డించే ముందు, పదార్థాలన్నీ 60 డిగ్రీల సెంటీగ్రేడ్‌కు మించి ఉండేలా చూసుకోవాలి
- రెఫ్రిజిలేటర్‌లో పదార్థాలను ఎక్కువ రోజుల పాటు నిల్వ చేసి పెట్టుకోకూడదు
- గడ్డకట్టిన పదార్థాలను గది ఉష్ణోగ్రతలో సాధారణ తాపమానానికి చేరుకునేలా వదిలేసి తినకూడదు

శుభ్రత ఇలా...

- పాశ్చరైజ్డ్ పాలలా, సురక్షితమైన పద్ధతిలో ప్రాసెస్ చేసిన పదార్థాలను ఎంచుకోవాలి
- సలాడ్, ఫ్రూట్ సలాడ్స్ కోసం పండ్లు, కూరగాయలను కోసుకునే ముందు వాటిని శుభ్రంగా కడుక్కోవాలి
- అవెంత తాజాగా కనిపించినా, ఎక్స్పైరీ డేట్ దాటిన పదార్థాల జోలికి వెళ్లకూడదు.

కేన్సర్ కేర్

కేన్సర్లకు కారణం జీవనశైలే!



ఈ మధ్యకాలంలో మన దేశంలో కేన్సర్ కేసుల సంఖ్య గణనీయంగా పెరుగుతోంది. దీనికి ప్రధాన కారణం మన జీవనశైలిలో వచ్చిన మార్పులేనంటారు హైదరాబాద్‌లోని మెడికవర్ ఆసుపత్రికి చెందిన క్లినికల్ ఆంకాలజిస్ట్ డాక్టర్ రవి చందర్. ఇదే విధంగా కేన్సర్ చికిత్సలో అనేక మార్పులు కూడా వచ్చాయంటున్నారాయన. ఈ విషయాలపై 'డాక్టర్'కు ఆయన ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూ.

కేన్సర్ కేసుల సంఖ్య పెరుగుతోందా? దీనికి కారణాలేవిఎటి?

కేన్సర్ కేసులు గణనీయంగా పెరుగుతున్నాయి. సమీప భవిష్యత్తులో ప్రపంచంలో అతి ఎక్కువ కేసులు ఉండేది మన దేశంలోనే అంటే ఆశ్చర్యపోవాల్సిన అవసరం లేదు. దీనికి రెండు కారణాలు ఉన్నాయి. మొదటిది జీవన శైలిలో వచ్చిన మార్పులు. రెండోది మన పర్యావరణంలో వచ్చిన మార్పులు. ఈ మధ్యకాలంలో గర్భసంచి కేన్సర్, రొమ్ము కేన్సర్, పేవుల కేన్సర్, నోటి కేన్సర్‌లు బాగా పెరిగాయి. ఇవన్నీ జీవన శైలిలో వచ్చిన మార్పుల వల్ల వచ్చే కేన్సర్లు. పర్యావరణ కాలుష్యం వల్ల లంగ్ కేన్సర్లు ఎక్కువయ్యాయి. ఈ మధ్యకాలంలో 40 ఏళ్ల వాళ్లకు కూడా లంగ్ కేన్సర్ వస్తున్నాయి. సాధారణంగా ఎవరైనా సిగరెట్లు తాగటం మొదలుపెట్టిన 25 ఏళ్ల తర్వాత లంగ్ కేన్సర్ వచ్చే అవకాశముంది. కానీ ఢిల్లీలో ఒక పసిపాప పుడితే ఆ పాప కాలుష్యంలోనే పెరుగుతుంది. అంటే చిన్న వయస్సులోనే ఆ పాపకు కేన్సర్ వచ్చే అవకాశం ఎక్కువగా ఉంది.

మన జీవన శైలిలో ఎలాంటి మార్పులు వచ్చాయని మీరు భావిస్తున్నారు?

ఎక్కువ కొవ్వు పదార్థాలు తినడం, ఐటిలో పని చేసే వాళ్ల సంఖ్య పెరగడం మనం చూస్తున్నాం. జంక్ ఫుడ్ తినేవారి సంఖ్య పెరిగింది. ఆకుకూరలు, కాయగూరలు మాత్రమే తినేవారి సంఖ్య తగ్గుతోంది. దీని వల్ల కూడా సమస్యలు వస్తున్నాయి. ఉదాహరణకు శాకాహారులు ఎక్కువగా ఆకుకూరలు, కాయగూరలు తింటారు. వీటిలో ఫైబర్ శాతం ఎక్కువగా ఉంటుంది. మన శరీరంలో ఏవైనా రసాయనాలు ఉన్నా వీటిని ఈ ఫైబర్ పీల్చుకుంటుంది. ఫైబర్ తగ్గిపోతే మనకు ఈ రసాయనాల వల్ల ఎక్కువ ముప్పు ఏర్పడుతుంది. అంటే మనకు రక్షణ తగ్గిపోయినట్లే కదా! అంతే కాదు మనకు యాంటీ ఆక్సిడెంట్స్ కూడా కావాలి. యాంటీ ఆక్సిడెంట్స్ మనకు విటమిన్ల ద్వారా లభిస్తాయి. విటమిన్ ఎ, విటవిఎన్ బి, విటమిన్ సిల ద్వారా ఇవి ఎక్కువ లభిస్తాయి. క్యారెట్, బీట్‌రూట్, పండ్ల ద్వారా ఇవి లభిస్తాయి. వీటిని తినటం తగ్గిస్తే మనకు రక్షణ కూడా తగ్గుతుంది. ఈ కారణాల వల్ల ఇతర జబ్బులతో పాటుగా కేన్సర్ బారిన పడే వారి సంఖ్య కూడా పెరుగుతోంది.

కేన్సర్లు సోకడంలో జన్యువుల పాత్ర ఎంత?


అన్ని క్యాన్సర్లకు జన్యువులే కారణం కాదు. నా ఉద్దేశంలో. 5 నుంచి 10 శాతం మందికి మాత్రమే కేన్సర్లు జన్యువుల ద్వారా వస్తాయి. మిగిలిన 90 శాతం కేసుల్లో కేన్సర్ రావటానికి జన్యువులు కారణం కాదు.

మీకు వచ్చే కేసుల్లో సంఖ్యాపరంగా ఏవి ఎక్కువ ఉంటాయి?

మహిళల్లో 28 శాతం కేసులు రొమ్ము కేన్సర్లే ఉంటాయి. ఒవేరియన్ కేన్సర్లు కూడా ఎక్కువే వస్తాయి. ఇంతకు ముందు సర్వైకల్ కేన్సర్లు ఎక్కువగా వచ్చేవి . అయితే దీనికి వ్యాక్సిన్ వచ్చింది. హెచ్‌పీవీ వైరస్ వల్ల వస్తుందని శాస్త్రవేత్తలు కనుగొన్నారు. దీనికి వ్యాక్సిన్ కనుగొనటం వల్ల ఈ కేన్సర్ వచ్చే వారి సంఖ్య గణనీయంగా తగ్గింది. సర్జరీలలో బ్రెస్ట్, ఒవేరియన్ కేన్సర్లు, పెద్ద ప్రేవు కేన్సర్లు ఎక్కువగా ఉంటాయి. ఇక్కడో ఆసక్తికరమైన విషయం చెప్పాలి. పాశ్చాత్య దేశాల్లో నోటి కేన్సర్ ఎక్కువగా కనిపించదు. మన దగ్గరే పొగాకు, గుట్కాలను వాడే వారు ఎక్కువగా ఉంటారు కాబట్టి ఈ కేన్సర్ వచ్చే వారి సంఖ్య కూడా ఎక్కువగానే ఉంటుంది. అయితే పాశ్చాత్య దేశాల్లో పెద్ద ప్రేవు కేన్సర్లు ఎక్కువగా వస్తాయి. ఇంతకు ముందు కడుపులో అల్సర్ల వల్ల కేన్సర్లు ఎక్కువగా ఉండేవి. ఇప్పుడు ఇవి కూడా తగ్గాయి. ఏతావాతా చెప్పేదేమిటంటే- జీవనశైలి మారుతున్న కొలది క్యాన్సర్ల తీరు మారుతోంది.

కేన్సర్ ట్రీట్‌మెంట్‌లో వచ్చిన మార్పులు ఏమిటి?

సర్జరీ పరంగా లేప్రోస్కోపిక్ అంటారు. రోబోటిక్ సర్జరీలు కూడా అందుబాటులోకి వచ్చాయి. దీని వల్ల పేషెంట్లకు ఎక్కువ మేలు జరుగుతోంది. అదే విధంగా రేడియేషన్ ఇచ్చే విధానం కూడా మారింది. ఉదాహరణకు ఒక చిన్న భాగంలో కేన్సర్ కణాలు ఉన్నాయనుకుందాం. ఒకప్పుడు రేడియేషన్‌ను, ఆ కణజాలం మొత్తానికీ ఇచ్చేవారు. కానీ ఇప్పుడు కేవలం ఏ భాగంలో ఉందో అక్కడే ఇవ్వగలుగుతున్నారు. దీని వల్ల చిన్న చిన్న ట్యూమర్లు ఉంటే వాటికి రేడియేషన్‌తో సరిపెట్టగలుగుతున్నాం. అంతే కాకుండా ఇంతకు ముందు నెలన్నర పాటు రేడియేషన్ ఇవ్వాల్సి వచ్చేది. ఇప్పుడు ఐదు రోజుల్లో పూర్తి అయిపోతోంది. కీమో థెరపీలో అనేక మార్పులు వచ్చాయి. దానికి సంబంధించిన యాంటీబాడీస్ చికిత్స కూడా అందుబాటులోకి వచ్చాయి. అయితే అన్ని యాంటీ బాడీలు అందరికీ ఒకే విధంగా పనిచేయవు. వేర్వేరు వ్యక్తులకు వేర్వేరుగా ఉంటాయి. కానీ ఎవరికి ఎలాంటి యాంటీబాడీలు పనిచేస్తాయనే విషయాన్ని నిర్ధారించుకోవాలి. దీని వల్ల టెస్టుల సంఖ్య పెరిగింది. అదే సమయంలో చికిత్స కచ్చితత్వం కూడా పెరిగింది. ఇమ్యూనో థెరిపీలు అందుబాటులోకి వచ్చాయి. కొన్ని రోజుల తర్వాత దీని ఖరీదు కూడా తగ్గుతుంది.



పేషెంట్లలో అవగాహన పెరిగిందా?

పేషెంట్లలో అవగాహన అయితే ఎక్కువ ఉంది. కేన్సర్ కుటుంబ చరిత్ర ఉన్నవాళ్లు కూడా వస్తున్నారు. కొద్ది మంది గూగుల్‌లో లక్షణాలు చూసి వస్తూ ఉంటారు. పరీక్షలు చేయించుకొనేవారి సంఖ్య కూడా పెరిగింది.

ఈ మధ్యకాలంలో రోబోటిక్స్‌కు సంబంధించి ఎక్కువ ప్రచారం జరుగుతోంది. దీని వల్ల లాభాలేమిటి?

ఇది కూడా ల్యాప్రోస్కోపిక్ సర్జరీ లాంటిదే. ముందు దీని గురించి చెప్పుకుందాం. ల్యాప్రోస్కోపిక్ సర్జరీలో ఒక చిన్న కన్నం పెట్టి దాని నుంచి చిన్న పరికరాన్ని పంపి లోపలి భాగాలను చూడగలుగుతారు. అయితే ల్యాప్రోస్కోపిక్ పరికరాలకు కొన్ని పరిమితులు ఉంటాయి. వీటిని ఎక్కువగా కదిపేందుకు వీలు ఉండదు. రోబోటిక్ సర్జరీలో కూడా ఇలాగే చేస్తారు. కానీ దానిలో అత్యాధునిక పరికరాలను వాడతారు. దాని ద్వారా వచ్చే బొమ్మలు కూడా పదిరెట్లు పెద్దగా ఉంటాయి. శరీరం లోపల కూడా మనకు నచ్చిన విధంగా వాటిని కదపవచ్చు. మన చేయిని ఎలా కదుపుతామో వీటిని కూడా అలా కదపవచ్చు. ఈ సౌకర్యం వల్ల చిన్న చిన్న రక్తనాళాలకు.. కణజాలాలకు ఇబ్బంది కలగదు. రక్త స్రావం కూడా ఎక్కువ కాదు. అందువల్లే ప్రొస్టేట్ సర్జరీకి ఎక్కువగా రోబోటిక్ సర్జరీనే చేస్తారు.

కానీ ఖరీదు కూడా ఎక్కువే కదా?

ఎందుకంటే రోబోటిక్స్‌లో ఎక్కువగా డిస్పోజబుల్స్ ఉంటాయి. అందువల్ల చికిత్స ఖరీదు ఎక్కువ. ఇప్పటి దాకా డావిన్సీ అనే ఒకే కంపెనీ రోబోటిక్ సర్జరీ యంత్రాలు తయారుచేసేది. దీని ఖరీదు 18 కోట్ల దాకా ఉండేది. ఈ మధ్యకాలంలో ఎస్ఎస్ఐ మంత్ర అనే కంపెనీ యంత్రాలు తయారుచేస్తోంది. ఇవి పూర్తిగా మేడిన్ ఇండియా యంత్రాలు. వీటి ఖరీదు ఐదు కోట్ల దాకా ఉంటుంది. ఈ యంత్రాలు అందుబాటులోకి వస్తే రోబోటిక్ సర్జరీ ఖరీదు గణనీయంగా తగ్గుతోంది. ఒకటి రెండేళ్లలో లేప్రోస్కోపిక్‌కు రోబోటిక్‌కు పెద్ద తేడా ఉండకపోవచ్చు.

పాశ్చాత్యదేశాల్లో గ్రూపు

ఎందుకంటే అక్కడ హాస్పటల్స్‌లో ఇన్ హౌస్ కన్సల్టెంట్స్ ఉండరు. గ్రూపు ప్రాక్టీసు ఉంటుంది. హాస్పిటల్స్‌ను హాస్పిటలిస్ట్లు మేనేజ్ చేస్తూ ఉంటారు. వారే పేషెంట్లను చూసుకుంటారు. డాక్టర్లు పేషెంట్లను హాస్పటల్స్‌కు పంపుతారు. కానీ ఇక్కడ హాస్పటల్స్ డాక్టర్ల దగ్గరకు పంపుతాయి. ఏ హాస్పటల్ తన దగ్గర ఉన్న పేషెంట్లను కోల్పోవాలని చూడదు.

ఫుడ్ ఫ్యాక్ట్

లిచీల్లో ఏముంది?

వర్షాకాలంలో మార్కెట్లను ముంచెత్తే లిచి పండ్ల మూలాలు చైనాలో ఉన్నాయి. ఈ తీయని పండులో యాంటీఆక్సిడెంట్లు, పోషకాలు కూడా పుష్కలంగా ఉంటాయి. విటమిన్లు, మినరల్స్‌ను కలిగి ఉండే లిచి పండ్లు జీవక్రియలన్నిటికీ తోడ్పడతాయి. వీటిలోని విటమిన్ సి, చర్మంలో కొల్లాజెన్ ఉత్పత్తికి దోహదపడుతుంది. చర్మపు బిగుతు పెరిగి, యవ్వనాన్ని సంతరించుకుంటుంది. లిచిలో నీటి శాతం ఎక్కువ కాబట్టి డీహైడ్రేషన్ ముప్పు తగ్గుతుంది. లిచిలోని పొటాషియం, మెగ్నీషియం, కాపర్, ఫోలేట్‌లు, గుండె ఆరోగ్యానికీ, నాడుల పనితీరుకూ, ఎర్ర రక్త కణాల తయారీకీ తోడ్పడతాయి. ఈ పండ్లలోని యాంటీ ఇన్‌ఫ్లమేటరీ గుణాల వల్ల శరీరంలో ఇన్‌ఫ్లమేషన్ తగ్గుతుంది. ఈ పండ్లలోని పీచు వల్ల జీర్ణవ్యవస్థ మెరుగ్గా పని చేస్తుంది. జీర్ణవ్యవస్థ ఆరోగ్యం పెరగడంతో పోషక శోషణ పెరిగి పరిపూర్ణ ఆరోగ్యం సమకూరుతుంది.



గుడ్ హెల్త్

ఓం ప్రభావం

ఓంకారాన్ని పలకడం ద్వారా నాడీ వ్యవస్థ ప్రేరేపితమై, సాంత్వన దక్కుతుంది. ఇలా ఓంను పలకడం వల్ల శ్వాస క్రమబద్ధమై, రక్తపోటు కూడా తగ్గుతుంది. ఓంకారం, మెదడు నుంచి శరీరం చివరి వరకూ సాగే వేగస్ నాడిని ప్రేరేపించి, గుండె వేగం, జీర్ణక్రియలను క్రమబద్ధం చేస్తుంది. మనసుకు సాంత్వన సమకూరి, హాయిగా నిద్రలోకి జారిపోయే శక్తి ఓంకారానికి ఉంది. 12 సార్లు ఓంకారాన్ని పలికితే, నిద్రలేమి, ఒత్తిడి తొలగిపోతాయి. కాబట్టి ఒత్తిడి, ఆందోళనలతో బాధపడేవారు 12 సార్లు ఓంకారాన్ని పలికితే తప్పక ఫలితం దక్కుతుందని నిపుణులు అంటున్నారు.




ఆంధ్రజ్యోతి
నవ్య | చిత్రజ్యోతి
మంగళవారం • 11 జూన్ 2024
cinema@andhrajyothy.com



బ్లాక్ బస్టర్ కాంబినేషన్.. మరోసారి!

నందమూరి బాలకృష్ణ, దర్శకుడు బోయపాటి శ్రీనివాస్.. ఈ కాంబినేషన్‌కు తెలుగు చిత్ర పరిశ్రమలో ప్రత్యేకమైన గుర్తింపు ఉంది. వీరిద్దరూ కలసి చేసిన 'సింహా', 'లెజెండ్', 'అఖండ' చిత్రాలు బ్లాక్‌బస్టర్ హిట్ అయి, అత్యధిక వసూళ్లు సాధించి, సెన్సేషన్ క్రియేట్ చేశాయి. వీరిద్దరి కలయికలో మరో సినిమా ఎప్పుడా అని ఎదురు చూసేలా చేశాయి. ఆ ఎదురు చూపులకు తెర దించుతూ ఈ సినిమా వివరాలను బాలకృష్ణ పుట్టినరోజు సందర్భంగా సోమవారం ప్రకటించారు. 'లెజెండ్' చిత్రాన్ని నిర్మించిన రామ్ ఆచంట, గోపీచంద్ ఆచంట ఈ భారీ సినిమాను నిర్మించనున్నారు. బాలకృష్ణ చిన్న కుమార్తె తేజస్విని ఈ చిత్రానికి సమర్పకురాలు. ఈ సందర్భంగా విడుదల చేసిన పోస్టర్ డివోషనల్ టచ్‌తో ఉంది. ఎర్రటి సూర్యుడు, పడుతున్న తోక చుక్కలు చూస్తుంటే బాలకృష్ణతో బోయపాటి మరో పవర్‌ఫుల్ సినిమా తీయబోతున్నారని అర్థమవుతుంది. అంతే కాదు బాలకృష్ణ కెరీర్‌లోనే అత్యంత భారీ బడ్జెట్ సినిమా ఇదే. దీనికి సంబంధించిన పూర్తి వివరాలు త్వరలో వెల్లడిస్తామని నిర్మాతలు చెప్పారు.



మరో పవర్‌ఫుల్ పాత్రలో బాలయ్య

నందమూరి బాలకృష్ణ సినిమా అంటేనే తెలుగు నాట ఉండే సందడే వేరు. ఇప్పుడు ఆయనతో చేతులు కలిపారు దర్శకుడు బాబీ కొల్లి. మాస్‌ని మెప్పించే కథాంశంతో ఆయన రూపొందిస్తున్న చిత్రం గ్లింప్స్‌ను బాలకృష్ణ పుట్టినరోజు సందర్భంగా విడుదల చేశారు. ఇందులో బాలకృష్ణ పాత్ర పవర్‌ఫుల్‌గా ఉండబోతోందని గ్లింప్స్‌ను చూస్తే అర్థమవుతుంది. 'జాలి, దయ, కరుణ లాంటి పదాలకు అర్థం తెలియని అసురుడు' అంటూ ఓ పవర్‌ఫుల్ డైలాగ్‌తో బాలకృష్ణ పాత్రను పరిచయం చేశారు. స్టైలిష్‌గా ఉంటూ అసలు సిసలు వయలెన్స్ చూపించే పాత్రలో బాలకృష్ణ కనిపించనున్నారు. తెలుగులో విజయవంతమైన చిత్రాలు నిర్మించే సంస్థల్లో ఒకటైన సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ ఈ చిత్రాన్ని భారీ స్థాయిలో నిర్మిస్తోంది. సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య నిర్మిస్తున్న ఈ చిత్రంలో బాలీవుడ్ నటుడు బాబీ డియోల్ విలన్‌గా నటిస్తున్నారు. థమన్ సంగీతం, విజయ్ కార్తిక్ సినిమాటోగ్రఫీ అందిస్తున్నారు

అద్భుతమైన కల 'కల్కి'



అందరూ ఎప్పుడెప్పుడా అని ఆసక్తిగా ఎదురుచూస్తున్న సినిమా 'కల్కి 2898 ఏ.డీ'. ప్రభాస్ నటించిన ఈ పాన్ ఇండియా ప్రాజెక్ట్‌కు నాగ్‌అశ్విన్ దర్శకత్వం వహించగా, అశ్వనీదత్ నిర్మించారు. అమితాబ్ బచ్చన్, కమల్ హాసన్, రాజేంద్రప్రసాద్, పశుపతి, దీపికా పదుకొనే, దిశా పటానీ కీలక పాత్రలు పోషించారు. ఈ నెల 27న సినిమాను ఐదు భారతీయ భాషలతో పాటు ప్రపంచవ్యాప్తంగా మరిన్ని భాషల్లో విడుదల చేయనున్నారు. సోమవారం ఈ సినిమా ట్రైలర్‌ను విడుదల చేశారు. అత్యద్భుత సాంకేతిక విలువలతో విజువల్ వండర్‌లా ఉన్న ఈ ట్రైలర్‌లోని వీఎఫ్ఎక్స్ షాట్స్, డైలాగ్స్, నటీనటుల పర్ఫామెన్స్, నేపథ్య సంగీతం మరో స్థాయిలో ఉన్నాయి. ట్రైలర్ విడుదల చేసిన అనంతరం దర్శకుడు నాగ్‌అశ్విన్ మాట్లాడుతూ "ఒక దర్శకుడిగా నాకు ఇండియన్ మైథాలజీ, సైన్స్ ఫిక్షన్ అంటే చాలా ఇష్టం. ఈ సినిమాలో ఆ రెండింటినీ మిక్స్ చేశాను. ఈ ప్రయోగం థియేటర్లలో సినిమాను చూసే ప్రేక్షకులకు సరికొత్త అనుభూతిని ఇస్తుంది. ఈ సినిమా ఒక అద్భుతమైన కల లాంటిది. ఆ కలను తెరపైకి తెచ్చేందుకు చాలా సమయం పట్టింది. ఈ ప్రయాణంలో చిత్ర బృందం పడిన శ్రమ అంతా ఇంతా కాదు. టీమ్ అంతా ప్రాణం పెట్టి పనిచేయడంతోనే ఈ సినిమా అవుట్‌పుట్ అనుకున్న దానికంటే పది రెట్లు బాగా వచ్చింది" అని అన్నారు.



ఇది నా అదృష్టం

'సీతయ్య', 'లాహిరి లాహిరి లాహిరిలో', 'దేవదాసు' వంటి బ్లాక్‌బస్టర్స్‌కు దర్శకత్వం వహించిన డైరెక్టర్ వై.వీ.ఎస్.చౌదరి. దాదాపు 9 ఏళ్ల గ్యాప్ తర్వాత ఆయన ఓ చిత్రానికి దర్శకత్వం వహిస్తున్నారు. వై.వీ.ఎస్.చౌదరి సతీమణి యలమంచలి గీత ఈ సినిమాను నిర్మిస్తున్నారు. సోమవారం నందమూరి బాలకృష్ణ పుట్టినరోజు సందర్భంగా ఈ సినిమాను ఆయన ప్రకటించారు. ఇంకా టైటిల్ ఖరారు కాని ఈ చిత్రంతో నందమూరి జానకిరామ్ తనయుడు నందమూరి తారకరామారావు కథానాయకుడిగా పరిచయమౌతున్నారు. ఈ సందర్భంగా డైరెక్టర్ వై.వీ.ఎస్.చౌదరి మాట్లాడుతూ "మంచి కథతో మీ ముందుకు వస్తున్నాను. నందమూరి వంశం నుంచి నాలుగో తరానికి చెందిన నటుడ్ని పరిచయం చేస్తున్నందుకు ఆనందంగా ఉంది. నిజానికి ఇది నా అదృష్టంగా భావిస్తున్నాను. నా ప్రతీ సినిమాలాగే ఇందులోనూ సంగీతానికి, సాహిత్యానికి పెద్దపీట ఉంటుంది. త్వరలోనే ఈ సినిమాలోని హీరోని, హీరోయిన్‌ను, మిగతా చిత్ర బృందాన్ని పరిచయం చేస్తాను" అని చెప్పారు. ఈ చిత్రానికి ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: రమేశ్ అత్తిలి.

విజయ్ సేతుపతి
నట విశ్వరూపం చూస్తారు



తమిళ నటుడు విజయ్ సేతుపతి నటించిన 50వ చిత్రం 'మహారాజా'. అనురాగ్ కశ్యప్, మమతా మోహన్‌దాస్, అభిరామి కీలక పాత్రలు పోషించారు. నిథిలన్ స్వామినాథన్ దర్శకత్వంలో సుధన్ సుందరమ్, జగదీశ్ పళనిసామి నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 14న విడుదలవుతోంది. సోమవారం ఈ సినిమా ప్రీ రిలీజ్ ప్రెస్ మీట్ నిర్వహించారు. ఈ సందర్భంగా హీరో విజయ్ సేతుపతి మాట్లాడుతూ "ఈ సినిమా విజయంపై అంతా నమ్మకంగా ఉన్నాం. తెలుగు ప్రేక్షకులందరికీ ఈ సినిమా నచ్చుతుంది" అని చెప్పారు. "మాస్, క్లాస్ ప్రేక్షకుల్ని అలరించే ఫ్యామిలీ ఎంటర్టైనర్ 'మహారాజా'. విజయ్ సేతుపతి నటవిశ్వరూపం ఇందులో చూస్తారు" అని నిర్మాత ఎన్వీ ప్రసాద్ అన్నారు. ఈ చిత్రానికి ఎడిటర్: ఫిలోమిన్ రాజ్, డీఓపీ: దినేశ్ పురుషోత్తమన్, సంగీతం: బి.అజనీశ్ లోక్‌నాథ్, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: ఎ.కుమార్.

మొదటి పాటకు ముహూర్తం

నాని హీరోగా నటిస్తున్న తాజా చిత్రం 'సరిపోదా శనివారం'. ఇందులో సూర్యగా ఓ పవర్‌ఫుల్ పాత్ర పోషిస్తున్నారాయన. వివేక్ ఆత్రేయ దర్శకత్వంలో ఈ హై బడ్జెట్ ఫిల్మ్‌ను డీవీవీ దానయ్య, కల్యాణ్ దాసరి నిర్మిస్తున్నారు. ప్రస్తుతం షూటింగ్ శరవేగంతో జరుగుతోంది. మ్యూజిక్ ప్రమోషన్స్ ప్రారంభిస్తూ ఈ నెల 15న మొదటి పాటను విడుదల చేయాలని నిర్ణయించారు. ఈ సందర్భంగా విడుదల చేసిన వీడియో నాని స్లో మోషన్‌లో నడుచుకుంటూ వచ్చి క్లాత్‌ను తొలగించాక టేప్ రికార్డర్ కనిపించడం, అందులోంచి సంగీతం వినిపించడం .. ఆసక్తికరంగా ఉంది. సంగీత దర్శకుడు జేక్స్ బిజోయ్ ఈ సినిమా కోసం అద్భుతమైన ఆల్బమ్ సిద్ధం చేశారు. ప్రియాంక మోహన్ హీరోయిన్‌గా నటిస్తుండగా, ఎస్.జె. సూర్య కీలక పాత్రలో కనిపించనున్నారు. ఆగస్టు 29న తెలుగు సహా తమిళ, కన్నడ, మలయాళ, హిందీ భాషల్లో విడుదల కానున్న ఈ చిత్రానికి ఫొటోగ్రఫీ: మురళి, ఎడిటింగ్: కార్తిక్ శ్రీనివాస్.





బాయ్‌ఫ్రెండ్‌తో పెళ్లి

'హీరామండీ' వెబ్ సిరీస్‌తో సూపర్ సక్సెస్‌ను అందుకున్న బాలీవుడ్ నటి సోనాక్షి పెళ్లి పీటలెక్కనున్నారు. బాయ్‌ఫ్రెండ్ జహీర్‌తో ఆమె వివాహం ఈ నెల 23న జరుగనున్నదని సమాచారం. పెళ్లి వేడుక తర్వాత బాలీవుడ్ స్టార్స్‌కు అదిరిపోయే రేంజ్‌లో పార్టీ ఇవ్వనున్నారట ఈ జంట. 'డబుల్ ఎక్స్‌ఎల్' చిత్రంలో కలసి నటించిన సోనాక్షి, జహీర్ చెట్టాపట్టాలేసుకుంటూ తిరుగుతూ మీడియాకు కనిపించినా ఎన్నడూ వారి రిలేషన్ గురించి వెల్లడించలేదు. వీరిద్దరూ ఏడాదిగా సహజీవనం చేస్తున్నారని కూడా వినిపిస్తోంది. సోనాక్షి తండ్రి

విడుదలకు సిద్ధమైన రాజావారు



జూనియర్ ఎన్టీఆర్ బావమరిది నార్నే నితిన్, సంపద హీరోహీరోయిన్లుగా నటించిన చిత్రం 'శ్రీశ్రీశ్రీ రాజావారు' చిత్రం సెన్సార్ పూర్తి చేసుకుని విడుదలకు సిద్ధమైంది. సతీశ్ వేగేశ్న దర్శకత్వంలో చింతపల్లి రామరావు ఈ సినిమాను నిర్మించారు. ఆయన మాట్లాడుతూ 'అన్ని కమర్షియల్ అంశాలు కలిగిన సినిమా ఇది. దర్శకుడు సతీశ్ చిత్రాన్ని చక్కగా తీర్చిదిద్దారు. ప్రతి ఒక్కరినీ ఎంటర్‌టైన్ చేసే సినిమా ఇది. చిత్రం బాగుందని సెన్సార్ సభ్యులు ప్రశంసించారు. త్వరలో విడుదల చేస్తాం' అని చెప్పారు. రావు రమేశ్, నరేశ్, రఘు కుంచె, ప్రవీణ్, రచ్చ రవి తదితరులు నటించిన ఈ చిత్రానికి పాటలు: ప్రియమణి, సంగీతం: కైలాష్ మీనన్, ఫొటోగ్రఫీ: దాము నర్రావుల, సమర్పణ: రంగాపురం రాఘవేంద్ర.

అందరినీ ఆకట్టుకునేలా...



అవినాశ్ తిరువీధుల, సిమ్రాన్ చౌదరి జంటగా ఓ చిత్రంలో నటిస్తున్నారు. కార్తీ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని శాంతనూపతి, ఆలపాటి రాజా, అవినాశ్ బుయాని, అంకిత్ రెడ్డిలు నిర్మిస్తున్నారు. ఆదివారం ఈ సినిమా ప్రారంభమైంది. నిర్మాత టి.జి. విశ్వప్రసాద్ కెమెరా స్విచ్ఛాన్ చేయగా, దర్శకుడు బాబీ గౌరవ దర్శకత్వం వహించారు. హైదరాబాద్ నగర పోలీస్ కమిషనర్ శ్రీనివాస రెడ్డి క్లాప్ కొట్టారు. ఈ సందర్భంగా చిత్ర నిర్మాత శాంతనూపతి మాట్లాడుతూ "ఈ సినిమా కథ చాలా బాగుంటుంది. హిట్ సినిమాకు కావాల్సిన అంశాలన్నీ ఈ కథలో ఉన్నాయి. సినిమా అందరినీ ఆకట్టుకునేలా ఉంటుంది" అని చెప్పారు. "కొత్తదనం కోరుకునే ప్రేక్షకులకు ఈ సినిమా విందు భోజనంలా ఉంటుంది" అని దర్శకుడు కార్తీ అన్నారు. ఈ చిత్రానికి ఎడిటర్: చోటా.కె.ప్రసాద్, కెమెరామెన్: ఎ.విశ్వనాథ్, సంగీతం: వివేక్ సాగర్.



ఫన్నీగా... రొమాంటిక్‌గా..

చైతన్యారావ్, హెబ్బాపటేల్ జంటగా నటిస్తున్న చిత్రం 'హనీమూన్ ఎక్స్‌ప్రెస్'. బాల రాజశేఖరుని దర్శకత్వంలో కేకేఆర్, బాలరాజ్ నిర్మించారు. ఈ నెల 21న ఈ చిత్రం విడుదలవుతోంది. ఈ సందర్భంగా 'హనీమూన్ ఎక్స్‌ప్రెస్' టీజర్‌ను ఆదివారం అక్కినేని అమల చేతుల మీదుగా యూనిట్ విడుదల చేసింది. ఈ సందర్భంగా అమల మాట్లాడుతూ 'ఈ సినిమా టీజర్ ఫన్నీగా, రొమాంటిక్‌గా ఉంది, నేటి సమాజంలో పరిస్థితులకు అద్దంపట్టే చిత్రమిది' అని అన్నారు. బాల రాజశేఖరుని మాట్లాడుతూ 'మా చిత్రం ఫస్ట్‌లుక్ పోస్టర్‌ను నాగార్జున గారు, టీజర్‌ను అమలగారు విడుదల చేయడం ఆనందాన్నిచ్చింది. అలాగే ఆడియోకు ప్రేక్షకుల నుంచి చక్కటి స్పందన వస్తోంది. ఇదొక మంచి రొమాంటిక్ కామెడీ మూవీ' అన్నారు. ఈ చిత్రానికి సంగీతం: కల్యాణి మాలిక్, సినిమాటోగ్రఫీ: శిష్టా వీఎంకే

ఆరు భాషల్లో 'వరదరాజు గోవిందం'



సీనియర్ దర్శకుడు వి.సముద్ర స్వీయ దర్శకత్వంలో నిర్మించిన చిత్రం 'వరదరాజు గోవిందం'. రవి జంగు హీరోగా, ప్రీతి కొంగన హీరోయిన్‌గా నటించారు. ఈ చిత్రం షూటింగ్ పూర్తయింది. ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ కార్యక్రమాలు జరుగుతున్నాయి. ఆరు భాషల్లో ఈ సినిమాను ఆగస్టులో విడుదల చేయడానికి ప్లాన్ చేస్తున్నారు. ఈ సందర్భంగా శనివారం సాయంత్రం ప్రసాద్ ప్రివ్యూ థియేటర్‌లో టీజర్ రిలీజ్ చేశారు. ఈ కార్యక్రమానికి హాజరైన సుమన్ మాట్లాడుతూ 'ఇందులో ముఖ్య పాత్ర పోషించాను. అలుపెరుగని శ్రామికుడిలా సముద్ర కష్టపడి అద్భుతంగా ఈ సినిమాను రూపొందించారు. 'కాంతారా', 'హనుమాన్' తరహాలో చిత్రం పెద్ద హిట్ కావాలి' అని కోరారు. దర్శకనిర్మాత సముద్ర మాట్లాడుతూ 'శ్రీకృష్ణుని బ్యాక్‌డ్రాప్‌లో ఈ సినిమా తీశాం. చాలా గొప్ప కథ ఇది. భారతదేశం గర్వించదగ్గ సినిమా అవుతుంది. హీరో రవికి మంచి బ్రేక్ ఇచ్చే సినిమా అవుతుంది' అన్నారు. హిందీ, అస్సామీ, హర్యానా చిత్రాల్లో నటించిన తనకు ఈ సినిమాతో సముద్ర తెలుగులో తొలి అవకాశం ఇచ్చారని రవి జంగు చెప్పారు. ఈ కార్యక్రమానికి హాజరైన అతిథులంతా సినిమా హిట్ కావాలని ఆకాంక్షించారు.

మరింత కట్టుదిట్టంగా డెరివేటివ్స్ మార్కెట్

అల్లాటప్పా కంపెనీల షేర్లకు గుడ్‌బై ! ● చర్చా పత్రం విడుదల చేసిన సెబీ

న్యూఢిల్లీ: డెరివేటివ్స్ మార్కెట్‌ను మరింత పటిష్ఠం చేయాలని మార్కెట్ నియంత్రణ మండలి సెబీ భావిస్తోంది. ఇందుకోసం డెరివేటివ్స్ సెగ్మెంట్‌లో చేర్చే కంపెనీల షేర్ల అర్హతను మరింత కట్టుదిట్టం చేసేందుకు సిద్ధమవుతోంది. దీనికి సంబంధించి ఒక చర్చా పత్రాన్ని విడుదల చేసింది. మదుపరులు, మార్కెట్ నిపుణులు ఈ చర్చా పత్రంపై తమ అభిప్రాయాలు, సూచనలు ఈ నెల 19లోపు తెలియజేయాలని కోరింది. ఫ్యూచర్ అండ్ ఆప్షన్స్ (ఎఫ్ అండ్ ఓ)లో పెద్దగా ట్రేడ్ కాని అల్లాటప్పా కంపెనీల షేర్లను తొలగించడం కూడా ఈ చర్చా పత్రం ప్రధాన లక్ష్యమని భావిస్తున్నారు. క్యాష్ సెగ్మెంట్‌లో పెద్దగా ట్రేడ్ కాని కంపెనీల షేర్లు కూడా ప్రస్తుతం ఎఫ్ అండ్ ఓ జాబితాలో ఉన్నాయి. ఇలాంటి షేర్ల ట్రేడింగ్‌లో అక్రమాలకు అవకాశం ఉన్నందున, వీలైనంత త్వరగా వాటికి చెక్ పెట్టాలని సెబీ భావిస్తోంది. క్యాష్ సెగ్మెంట్‌లో ట్రేడయ్యే కంపెనీ షేర్ల పరిమాణం, షేర్ల లభ్యత, మార్కెట్లో ఆ కంపెనీ షేర్ల టర్నోవర్ ఆధారంగా వాటికి ఎఫ్ అండ్ ఓలో చోటు కల్పించాలని సెబీ యోచిస్తోంది. ఇందుకోసం ఈ చర్చా పత్రంలో ఈ కింది అంశాలు ప్రతిపాదించింది.



- డెరివేటివ్స్ జాబితాలో చేర్చే కంపెనీల షేర్లు, మొత్తం ట్రేడింగ్ రోజుల్లో కనీసం 75 శాతం రోజులు ట్రేడ్ అయి ఉండాలి.
- యాక్టివ్ ట్రేడర్లలో 15 శాతం మంది లేదా 200 మంది ఏది తక్కువైతే అంత మంది కనీసం ఆయా కంపెనీల షేర్లలో ట్రేడింగ్ జరిపి ఉండాలి.
- ఆయా కంపెనీల రోజువారీ కనీస టర్నోవర్ రూ.500 కోట్ల నుంచి రూ.1,500 కోట్లు ఉండాలి.
- రోజువారీ కనీస ప్రీమియం టర్నోవర్ రూ.150 కోట్లు ఉండాలి.
- అనుమతించే గరిష్ఠ ఓపెన్ కాంట్రాక్టుల మొత్తం రూ.1,250 కోట్ల నుంచి రూ.1,750 కోట్లు మించ కూడదు.
- టాప్-500 కంపెనీల జాబితా నుంచే డెరివేటివ్స్ మార్కెట్ షేర్ల ఎంపిక.
- గత ఆరు నెలల్లో క్యాష్ మార్కెట్లో ఈ కంపెనీల రోజువారీ డెలివరీ షేర్ల విలువ కనీసం రూ.30-40 కోట్లు ఉండాలి.
- ఏదైనా ఒక కంపెనీ షేర్లు ఈ అర్హతల విషయంలో విఫలమైతే, ఆ కంపెనీ షేర్లను డెరివేటివ్స్ సెగ్మెంట్ నుంచి తొలగించాలి.

'నామినేషన్'పై వెనక్కి తగ్గిన సెబీ

వారసుల నామినేషన్ నిబంధనపై సెబీ వెనక్కి తగ్గింది. డీమ్యాట్ ఖాతాదారులు, మ్యూచువల్ ఫండ్స్ (ఎంఎఫ్) ఇన్వెస్టర్లు తమ చాయిస్ ఆఫ్ నామినేషన్ పూర్తి చేయడం లేదా అసలు నామినేషనే వద్దనుకున్నా, ఆ విషయం ఈ నెలాఖరులోగా రిజిస్ట్రార్ టు ది ఇష్యూ లేదా షేర్ ట్రాన్స్‌ఫర్ ఏజెంట్లకు తెలపాలని కోరింది. లేకపోతే వారికి ఆయా కంపెనీలు, ఎంఎఫ్ పథకాలు లేదా రుణ పత్రాలపై రావలసిన డివిడెండ్, వడ్డీ లేదా రిడంప్షన్ చెల్లింపులు నిలిపి వేస్తామని ఇంతకు ముందు ప్రకటించింది. అయితే ఈ నిబంధన పక్కన పెట్టాలని మార్కెట్ వర్గాలు, మదుపరుల నుంచి విజ్ఞప్తులు రావడంతో సెబీ ఈ ప్రతిపాదనపై వెనక్కి తగ్గింది. అయితే కొత్తగా డీమ్యాట్ ఖాతాలు ప్రారంభించే మదుపరులకు, కొత్తగా ఎంఎఫ్ పెట్టుబడులు ప్రారంభించే మదుపరులకు మాత్రం ఈ నిబంధన తప్పనిసరని స్పష్టం చేసింది.

అవి డీప్ ఫేక్ వీడియోలు — ఎన్ఎస్ఈ

నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజీ (ఎన్ఎస్ఈ) తన ఎండీ, సీఈఓ ఆశిష్ కుమార్ చౌహాన్ పెట్టుబడి సలహాలు ఇస్తున్నట్లుగా రూపొందించిన డీప్ ఫేక్ వీడియోలపై ఇన్వెస్టర్లను హెచ్చరించింది. ఆధునిక సాంకేతికతను ఉపయోగించి రూపొందించిన ఈ వీడియోలు నిజం కాదని, వాటిని నమ్మవద్దని.. ఆ వీడియోల్లోని పెట్టుబడి సలహాలను పాటించవద్దని తాజా ప్రకటనలో పేర్కొంది. ఎన్ఎస్ఈ ఉద్యోగులు, అధికారులెవ్వరూ స్టాక్స్‌ను సిఫారసు చేయరని స్పష్టం చేసింది.

సెన్సెక్స్ @ 77,000

లాభాల స్వీకరణతో నష్టాల్లో ముగిసిన సూచీ

ముంబై: భారత ప్రధానిగా నరేంద్ర మోదీ మూడోసారి బాధ్యతలు చేపట్టిన నేపథ్యంలో స్టాక్ మార్కెట్ ప్రామాణిక సూచీలు సోమవారం ఆరంభ ట్రేడింగ్‌లో సరికొత్త ఉన్నత శిఖరాలను చేరాయి. సెన్సెక్స్ తొలిసారిగా 77,000 మైలురాయిని దాటగా.. నిఫ్టీ 23,400 ఎగువకు చేరింది. సెన్సెక్స్ 385.68 పాయింట్ల లాభంతో 77,079.04 వద్ద, నిఫ్టీ 121.75 పాయింట్ల వృద్ధితో 23,411.90 వద్ద సరికొత్త ఆల్‌టైం ఇంట్రాడే రికార్డులను నమోదు చేశాయి. అయితే, అంతర్జాతీయ మార్కెట్ల ప్రతికూల సంకేతాల కారణంగా దిగ్గజ షేర్లలో ఒకటైన హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్‌తో పాటు ఐటీ రంగ స్టాక్స్‌లో ఇన్వెస్టర్లు లాభాల స్వీకరణకు పాల్పడటంతో సూచీలు చివరికి నష్టాల్లో ముగిశాయి. క్రితం సెషన్‌తో పోలిస్తే, సెన్సెక్స్ 203.28 పాయింట్ల నష్టంతో 76,490.08 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 30.95 పాయింట్లు కోల్పోయి 23,259.20 వద్ద క్లోజైంది. ఈక్విటీ మదుపరుల సంపదగా పరిగణించే బీఎస్ఈ నమోదిత కంపెనీల మొత్తం మార్కెట్ క్యాపిటలైజేషన్ రూ.425.22 లక్షల కోట్లు (5.09 లక్షల కోట్ల డాలర్లు)గా నమోదైంది. సెన్సెక్స్‌లోని 30 లిస్టెడ్ కంపెనీల్లో సగం లాభపడ్డాయి. అల్ట్రాటెక్ సిమెంట్ షేరు 3.52 శాతం వృద్ధితో సూచీ టాప్ గెయినర్‌గా నిలిచింది. పవర్‌గ్రిడ్ 2 శాతానికి పైగా రాణించింది. ఐటీ రంగానికి చెందిన టెక్ మహీంద్రా 2.72 శాతం, ఇన్ఫోసిస్ 2.20 శాతం, విప్రో 1.95 శాతం, టీసీఎస్ 0.94 శాతం, హెచ్‌సీఎల్ టెక్ 0.88 శాతం క్షీణించాయి. హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ షేరు 0.75 శాతం నష్టపోయింది. బీఎస్ఈలోని స్మాల్‌క్యాప్ సూచీ మాత్రం 1.04 శాతం వృద్ధి చెందగా.. మిడ్‌క్యాప్ ఇండెక్స్ 0.56 శాతం బలపడింది. రంగాల వారీ సూచీల్లో సేవలు, రియల్టీ, కమోడిటీస్, యుటిలిటీస్ ఒక శాతానికి పైగా పెరగగా.. ఐటీ, ఆటో, మెటల్, టెక్ సూచీలు మాత్రం నేలచూపులు చూశాయి. ఫారెక్స్ మార్కెట్ విషయానికొస్తే, డాలర్‌తో రూపాయి మారకం విలువ 10 పైసలు క్షీణించి 83.50 వద్ద ముగిసింది. ఈక్విటీ మార్కెట్లో నష్టాలతోపాటు అంతర్జాతీయంగా డాలర్ బలపడటం ఇందుకు కారణమైంది.

- ప్రత్యేక రసాయనాల తయారీ సంస్థ క్రోనాక్స్ ల్యాబ్ సైన్సెస్ తన షేర్లను స్టాక్ ఎక్స్ఛేంజీల్లో నమోదు చేసింది. ఐపీఓ ధర రూ.136తో పోలిస్తే, బీఎస్ఈలో కంపెనీ షేరు 21.32 శాతం ప్రీమియంతో రూ.165 వద్ద లిస్టయింది. తొలిరోజు ట్రేడింగ్ ముగిసేసరికి, కంపెనీ షేరు 17.16 శాతం లాభంతో రూ.159.35 వద్ద స్థిరపడింది.

సెన్సెక్స్ ప్రస్థానం

మైలురాయి	తేదీ
10,000	2006 ఫిబ్రవరి 7
20,000	2007 డిసెంబరు 11
30,000	2017 ఏప్రిల్ 26
40,000	2019 జూన్ 3
50,000	2021 ఫిబ్రవరి 3
60,000	2021 సెప్టెంబరు 24
70,000	2023 డిసెంబరు 11
71,000	2023 డిసెంబరు 15
72,000	2023 డిసెంబరు 27
73,000	2024 జనవరి 15
74,000	2024 మార్చి 6
75,000	2024 ఏప్రిల్ 9
76,000	2024 మే 27
77,000	2024 జూన్ 10

ఎంఫసిస్‌లో 15% వాటా విక్రయించిన బ్లాక్‌స్టోన్

ఐటీ కంపెనీ ఎంఫసిస్ ప్రమోటర్ బ్లాక్‌స్టోన్.. కంపెనీలో 15.08 శాతం వాటాకు సమానమైన 2.85 కోట్ల షేర్లను రూ.6,735 కోట్లకు బహిరంగ మార్కెట్లో భారీ బ్లాక్ డీల్ ద్వారా విక్రయించింది. ఒక్కో షేరును సగటున రూ.2,363.37కు విక్రయించింది. ఈ డీల్ తర్వాత ఎంఫసిస్‌లో బ్లాక్‌స్టోన్ వాటా 55.45 శాతం నుంచి 40.37 శాతానికి తగ్గింది. అయినప్పటికీ, కంపెనీలో అతిపెద్ద వాటాదారుగా కొనసాగనుంది. ఈ ఏడాదిలో ఇప్పటివరకు నమోదైన రెండో అతిపెద్ద బ్లాక్ డీల్ ఇదే. సోమవారం ఇంట్రాడేలో 4.82 శాతం వరకు క్షీణించిన ఎంఫసిస్ షేరు.. చివరికి దాదాపు 3 శాతం నష్టంతో రూ.2,398 వద్ద ముగిసింది.

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



11వ తేదీ			
హైదరాబాద్	520	విజయవాడ	530
వరంగల్	522	గోదావరి	525
చిత్తూరు	593	విశాఖపట్నం	530
		దజను గుడ్లు రూ.	72

ఫామ్‌గేట్ ధర (కిలో) రూ. వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	139	గోదావరి	141
వరంగల్	139	విజయవాడ	141
కరీంనగర్	139	గుంటూరు	141
మహబూబ్‌నగర్	139	ఒంగోలు	141
కర్నూలు	139	చిత్తూరు	154
విశాఖపట్నం	130		

ఐఫోన్లకూ జనరేటివ్ ఏఐ టెక్నాలజీ హంగులు

యాపిల్ ఇంటెలిజెన్స్‌ను ఆవిష్కరించిన కంపెనీ



న్యూయార్క్: అమెరికన్ టెక్నాలజీ దిగ్గజం యాపిల్ ఎట్టకేలకు జనరేటివ్ కృత్రిమ మేధ (జనరేటివ్ ఏఐ) సాంకేతికతలోకి ప్రవేశించింది. యాపిల్ ఇంటెలిజెన్స్ పేరుతో ఐఫోన్, ఐప్యాడ్, మ్యాక్ బుక్‌లో జనరేటివ్ ఏఐ ఆధారిత ఫీచర్లను అందుబాటులోకి తెస్తున్నట్లు కంపెనీ ప్రకటించింది. పలు లార్జ్ ల్యాంగ్వేజ్ మోడళ్ల (ఎల్ఎల్ఎం) సమాహారమైన 'యాపిల్ ఇంటెలిజెన్స్' అభివృద్ధిలో వినియోగదారుల సమాచార భద్రతతోపాటు వ్యక్తిగతీకరణకు అధిక ప్రాధాన్యమివ్వడం జరిగిందని 'డబ్ల్యూడబ్ల్యూడీసీ 2024' సదస్సులో యాపిల్ సీఈఓ టిమ్‌కుక్ వెల్లడించారు. ఐఓఎస్ 18, ఐప్యాడ్ ఓస్ 18, మ్యాక్ సికోయా వెర్షన్ ఆపరేటింగ్ సిస్టమ్స్‌తో కూడిన కంపెనీ ఉత్పత్తుల్లో యాపిల్ ఇంటెలిజెన్స్‌ను ఈ ఏడాదిలోనే అందుబాటులోకి తేనున్నట్లు కంపెనీ స్పష్టం చేసింది. అంతేకాదు, కంపెనీకి చెందిన ప్రముఖ డిజిటల్ అసిస్టెంట్ అప్లికేషన్ సిరి ఫీచర్లను మరింత మెరుగుపర్చడంతోపాటు వాయిస్ కమాండ్స్‌తోనే గాక, టెక్స్ట్ మేసేజ్ ద్వారానూ సమాధానాలు పొందే వీలు కల్పిస్తున్నట్లు కంపెనీ తెలిపింది. అలాగే, ప్రముఖ జనరేటివ్ ఏఐ అప్లికేషన్ చాట్ జీపీటీ అభివృద్ధి సంస్థ ఓపెన్ ఏఐతోనూ యాపిల్ జట్టు కట్టింది. చాట్‌జీపీటీ అప్లికేషన్‌నూ త్వరలోనే ఐఫోన్, ఐప్యాడ్, మ్యాక్‌బుక్ వినియోగదారులకు అందుబాటులోకి తేనుంది.

మోదీకి సంస్క'రణం' తప్పదు : యూబీఎస్

న్యూఢిల్లీ: ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి ఈ సారి కఠిన సంస్కరణల అమలు కష్టమే అవుతుందని స్విస్ బ్రోకరేజీ సంస్థ యూబీఎస్ తెలిపింది. భూ, వ్యవసాయ సంస్కరణలతో పాటు పెట్టుబడుల ఉపసంహరణ. ఉమ్మడి పౌర స్మృతి, ఒక జాతి-ఒకే ఎన్నికలు వంటి సంస్కరణల అమలుతో ప్రస్తుతం ఉన్న 6.5-7 శాతంగా ఉన్న సగటు వృద్ధి రేటును వచ్చే ఐదేళ్ల కాలంలో 7.5 శాతానికి చేర్చగల సామర్థ్యం ఉన్నదని తెలిపింది. అయితే ఈసారి మద్దతు కోసం ఎన్‌డీఏ భాగస్వాములపై ఆధారపడాల్సిన పరిస్థితి కారణంగా 2014, 2019 ఎన్నికలతో పోల్చితే మోదీకి గల రాజకీయ సౌలభ్యం ఈసారి తగ్గిందని సంస్థ చీఫ్ ఎకనామిస్ట్ తన్వీ గుప్తా అన్నారు.

● యమహా ఫాసినో ఎస్



ఇండియా యమహా మోటార్ (ఐవైఎం) ప్రైవేట్ లిమిటెడ్.. మార్కెట్లోకి ఫాసినో ఎస్ మోడల్ స్కూటర్‌ను విడుదల చేసింది. స్టైలిష్ యూరోపియన్ డిజైన్, పెర్ఫార్మెన్స్, ఇన్నోవేషన్‌తో కూడిన ఈ స్కూటర్ యమహా పోర్టుఫోలియోలో ప్రీమియం స్కూటర్ మోడల్‌గా ఉండనుందని తెలిపింది. బీఎస్ 6 ప్రమాణాలు, 125 సీసీ బ్లూ కోర్ హైబ్రిడ్ ఇంజన్, ఎయిర్ కూల్డ్, ఫ్యూయల్ ఇంజక్టెడ్, ఆటోమేటిక్ స్టాప్, స్టార్ట్ సిస్టమ్ ఈ స్కూటర్ ప్రత్యేకతలు. మూడు రంగుల్లో అందుబాటులో ఉండనున్న ఈ స్కూటర్ ధరలు రూ.93,730, రూ.94,530 (ఢిల్లీ ఎక్స్‌షోరూమ్)గా ఉన్నాయి.

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	71,770 ▲	65,800 ▲	96,200 ▲
ముంబై	71,176 ▼	65,195 ▼	88,928 ▼

స్పోర్ట్స్

టీ20 ప్రపంచకప్‌లో నేడు

పాకిస్థాన్ x కెనడా (రా. 8. గం.)



పాక్‌కు సూపర్-8 కష్టమేనా..?

న్యూయార్క్: తొలి మ్యాచ్‌లో పసికూన అమెరికా చేతిలో చిత్తవడంతోనే అర్థమైపోయింది ఈసారి టీ20 వరల్డ్ కప్‌లో పాకిస్థాన్ పురోగతి ఎలా ఉండబోతోందో. అరంగేట్ర జట్టు అమెరికాతో మ్యాచ్ సూపర్ ఓవర్‌కు దారి తీయడం పాకిస్థాన్ చెత్త ఆటకు నిదర్శనం. ఇక భారత్‌పై కేవలం 120 రన్స్ లక్ష్యాన్ని ఛేదించలేక చతికిలపడింది. వరుసగా రెండు మ్యాచ్‌ల్లో పరాజయం పాకిస్థాన్ సూపర్-8 అవకాశాలను బాగా దెబ్బ తీసేదే. ప్రతి గ్రూప్‌లో తొలి రెండు స్థానాల్లో ఉన్న జట్లు సూపర్-8కి చేరే విషయం తెలిసిందే. ఇక..రెండు ఓటములతో పాయింట్ల ఖాతా తెరవలేకపోయిన బాబర్ సేనకు తదుపరి దశ చాన్సులు ప్రస్తుతానికి సంక్లిష్టమే. ఈ నేపథ్యంలో కెనడా, ఐర్లాండ్‌తో జరిగే ఆఖరి రెండు మ్యాచ్‌ల్లో పాక్ భారీ తేడాతో నెగ్గాల్సి ఉంటుంది. మరోవైపు టీమిండియా తన చివరి రెండు మ్యాచ్‌ల్లోనూ తప్పక గెలవాలి. అంతేకాదు..అమెరికాను ఐర్లాండ్ ఓడించాలి. ఇలా ఫలితాలన్నీ అనుకూలిస్తే..పాక్ నాలుగు మ్యాచ్‌ల్లో 4 పాయింట్లతో ఉంటుంది. భారత్ 8 పాయింట్లతో గ్రూప్ టాపర్‌గా సూపర్-8కు చేరుతుంది. పాక్ మాదిరే అమెరికా 4 పాయింట్లతో కెనడా, ఐర్లాండ్ రెండేసి పాయింట్లతో ఉంటాయి. ఈ పరిస్థితుల్లో నెట్ రన్‌రేట్ పరిగణనలోకి వస్తుంది. అప్పుడు మెరుగైన రన్‌రేట్ ఉంటే పాక్ సూపర్-8లో ప్రవేశిస్తుంది.

జట్టును ప్రక్షాళన చేయాల్సిందే..

కరాచీ: టీమిండియా చేతిలో ఓటమితో పాకిస్థాన్ క్రికెట్ బోర్డు (పీసీబీ) చీఫ్ గరంగరంగా ఉన్నాడు. జట్టులో భారీ ప్రక్షాళన తప్పదని వ్యాఖ్యానించాడు. 'మ్యాచ్‌లు గెలిచేందుకు జట్టుకు చిన్నపాటి ఆపరేషన్ చేయాల్సి ఉంటుందనుకున్నా. కానీ పరిస్థితులు చూస్తుంటే భారీ శస్త్రచికిత్సే అవసరం' అని పీసీబీ అధ్యక్షుడు మొహిసిన్ నఖ్వీ మండిపడ్డాడు. 'అమెరికా, భారత్ చేతిలో పరాజయం తీవ్ర నిరాశకు గురి చేసింది. ఇప్పుడున్న ఆటగాళ్లను గాకుండా కొత్త క్రికెటర్లతో జట్టును ప్రక్షాళించాల్సిందే' అని అతడు కుండ బద్దలుగొట్టాడు.

అతడి వల్లే ఓటమి..



ఇమాద్

భారత్‌తో మ్యాచ్‌లో ఇమాద్ వసీమ్ ఉద్దేశపూర్వకంగా జిడ్డు బ్యాటింగ్ చేయడంవల్లే పాకిస్థాన్ ఓడిందని ఆ జట్టు మాజీ కెప్టెన్ సలీమ్ మాలిక్ తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తాడు. ఆదివారం జరిగిన ఆ మ్యాచ్‌లో 23 బంతులు ఆడిన ఇమాద్ 15 పరుగులే చేశాడు. 'వసీమ్ ఇన్నింగ్స్ చూడండి. బంతులకు బంతులు తినేసి స్వల్ప ఛేదనలో పరిస్థితులను సంక్లిష్టం చేశాడు' అని మాలిక్ దుయ్యబట్టాడు. ఇక..పాకిస్థాన్ డ్రెస్సింగ్ రూమ్‌లో అంతా సవ్యంగా లేదని మరో మాజీ కెప్టెన్ షాహిద్ అఫ్రీది అభిప్రాయపడ్డాడు. కెప్టెన్ బాబర్, కొందరు జట్టు సభ్యులకు పొసగడంలేదన్న అనుమానం వ్యక్తంజేశాడు. 'ఇప్పుడేది మాట్లాడినా నా అల్లుడు (షహీన్‌షా అఫ్రీది)ని వెనుకేసుకొచ్చానంటారు. అందుకే వరల్డ్‌కప్ అయ్యాక అంతా చెబుతాన'ని అఫ్రీది అన్నాడు.

నా కెరీర్ ముగిసిందన్నారు: బుమ్రా



న్యూయార్క్: పాకిస్థాన్‌తో జరిగిన ఉత్కంఠభరిత మ్యాచ్‌లో టీమిండియా తక్కువ స్కోరు చేసినా, స్టార్ పేసర్ బుమ్రా తన సూపర్ బౌలింగ్‌తో జట్టును గట్టెక్కించాడు. అలాగే టీ20ల్లో భారత్ తమ అత్యల్ప స్కోరును కాపాడుకోవడంకూడా ఇదే తొలిసారి. దీంతో సర్వత్రా అతడిపై ప్రశంసల జల్లు కురుస్తోంది. కానీ ఏడాది క్రితం గాయంతో బాధపడుతున్నప్పుడు.. తన పని అయిపోయినట్టేనన్న వారికిది సమాధానమని బుమ్రా తెల్చాడు. 'ఇప్పుడు కొనియాడుతున్న వారే ఇక నేను క్రికెట్ ఆడలేనని, కెరీర్ ముగిసినట్టేనని గతేడాది కామెంట్ చేశారు. కానీ ఇప్పుడు పరిస్థితి మారింద'ని పాక్‌తో మ్యాచ్ ముగిశాక బుమ్రా తెలిపాడు.

ఆ సమయంలో కన్నీళ్లు ఆగలేదు: రవిశాస్త్రి



పంత్‌కు బెస్ట్ ఫీల్డర్ మెడల్ అందజేస్తున్న రవిశాస్త్రి

న్యూయార్క్: ఏడాదిన్నర క్రితం వికెట్ కీపర్ రిషబ్ పంత్ కారు ప్రమాదంలో గాయపడిన విషయం తెలియగానే కన్నీటిని ఆపుకోలేకపోయానని మాజీ కోచ్ రవిశాస్త్రి తెలిపాడు. పాక్‌తో మ్యాచ్‌లో పంత్ బ్యాటింగ్‌లోనే కాకుండా, మూడు క్యాచ్‌లతో ఆకట్టుకోవడంతో జట్టు నుంచి బెస్ట్ ఫీల్డర్ అవార్డు అందుకున్నాడు. దీన్ని అందించేందుకు రవిశాస్త్రి డ్రెస్సింగ్ రూమ్‌కు వచ్చాడు. 'కెరీర్ సందేహాస్పదంగా మారిన స్థితి నుంచి పంత్ ఈ మెగా టోర్నీ ఆడే దశకు చేరడం నిజంగా స్ఫూర్తిదాయకం. బ్యాటింగ్‌లో జట్టు ఎక్స్ ఫ్యాక్టర్‌గా ఉండడమే కాకుండా, కీపింగ్ సమయంలోనూ వేగంగా కదలడం చూస్తుంటే నీ కఠోర శ్రమ అర్థమవుతుంది' అని శాస్త్రి కొనియాడాడు.

దక్షిణాఫ్రికా హ్యాట్రిక్

4 రన్స్‌తో బంగ్లాదేశ్‌పై గెలుపు

సూపర్-8 బెర్త్ దాదాపు ఖరారు



క్లాసెన్ (46)

కేశవ్ (3/27)

న్యూయార్క్: టీ20ల్లో దక్షిణాఫ్రికాపై తొలిసారిగా గెలిచే సువర్ణావకాశాన్ని బంగ్లాదేశ్ చేజార్చుకుంది. కేవలం 114 పరుగుల లక్ష్యాన్ని ఛేదించలేక చివర్లో చతికిలపడింది. సఫారీ బౌలర్లు మాత్రం ఆఖరి బంతి వరకు పట్టు వీడక పోవడంతో 4 పరుగులతో గెలిచి ఊపిరిపీల్చుకుంది. గ్రూప్ 'డి'లో భాగంగా సోమవారం జరిగిన ఈ మ్యాచ్ ఫలితంతో సౌతాఫ్రికా ప్రస్తుతం మూడు విజయాలు, ఆరు పాయింట్లతో టాప్‌లో ఉంది. దీంతో సఫారీలు సూపర్-8లోనూ దాదాపు చోటు ఖాయం చేసుకున్నట్టే. ముందుగా బ్యాటింగ్‌కు దిగిన దక్షిణాఫ్రికా 20 ఓవర్లలో 6 వికెట్లకు 113 పరుగులు చేసింది. ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్ క్లాసెన్ (46), మిల్లర్ (29), డికాక్ (18) మాత్రమే రాణించారు. తన్‌జీమ్ హసన్‌కు మూడు, టస్కిన్‌కు రెండు వికెట్లు దక్కాయి. ఛేదనలో బంగ్లాదేశ్ 20 ఓవర్లలో 7 వికెట్లకు 109 పరుగులకే పరిమితమైంది. హ్రిదయ్ (37), మహ్మదుల్లా (20) ఆకట్టుకున్నారు. కేశవ్ మహరాజ్ మూడు.. నోకియా, రబాడ రెండేసి వికెట్లు పడగొట్టారు.

చివర్లో తడబాటు: బంగ్లా టాపార్డర్ విఫలం కావడంతో 50 పరుగులకే నాలుగు వికెట్లు కోల్పోయింది. అయితే తౌహీద్ హ్రిదయ్ జట్టును విజయం వైపు నడిపించే ప్రయత్నం చేశాడు. అతడికి మహ్మదుల్లా సహకరించగా, ఇద్దరూ వీలైనప్పుడల్లా బౌండరీలతో ఆకట్టుకున్నారు. కానీ 18వ ఓవర్‌లో రబాడ 2 పరుగులే ఇచ్చి హ్రిదయ్‌ను అవుట్ చేయడం మ్యాచ్‌ను మలుపు తిప్పింది. ఇక చివరి ఓవర్‌లో 11 పరుగులు చేయాల్సి రాగా, స్పిన్నర్ కేశవ్ రెండు వికెట్లు తీసి 6 పరుగులే ఇవ్వడంతో బంగ్లాకు నిరాశ తప్పలేదు.

ఆదుకున్న మిల్లర్-క్లాసెన్: నసౌ ట్రాక్ బౌలింగ్‌కు అనుకూలిస్తుండగా.. టాస్ గెలిచిన సఫారీలు బ్యాటింగ్ ఎంచుకున్నారు. దీంతో బంగ్లా పేసర్లు చెలరేగి 23 పరుగులకే ఓపెనర్లు హెన్‌డ్రిక్స్ (0), డికాక్, మార్‌క్రమ్ (4), స్టబ్స్ (0)ల పనిబట్టారు. పేసర్ తన్‌జీమ్ హసన్ ఇందులో మూడు వికెట్లు తీయడం విశేషం. ఇలాంటి ఇబ్బందికర పరిస్థితిలో క్లాసెన్, మిల్లర్ ఐదో వికెట్‌కు రికార్డు స్థాయిలో 79 పరుగులు జత చేశారు. అయితే చివరి మూడు ఓవర్లలో బంగ్లా బౌలర్లు 13 పరుగులు మాత్రమే ఇచ్చి.. క్లాసెన్, మిల్లర్ వికెట్లు కూడా పడగొట్టడంతో సౌతాఫ్రికా స్వల్ప స్కోరుకే పరిమితమైంది.

సంక్షిప్త స్కోర్లు

దక్షిణాఫ్రికా: 20 ఓవర్లలో 113/6 (క్లాసెన్ 46, మిల్లర్ 29, డికాక్ 18; తన్‌జీమ్ హసన్ 3/18, టస్కిన్ 2/19)

బంగ్లాదేశ్: 20 ఓవర్లలో 109/7. (తౌహీద్ 37, మహ్మదుల్లా 20, షంటో 14; కేశవ్ 3/27, నోకియా 2/17, రబాడ 2/19).

పాయింట్ల పట్టిక — గ్రూప్-డి

జట్టు	మ్యా	గె	ఓ	ఫ.తే	పా	రన్‌రేట్
దక్షిణాఫ్రికా	3	3	0	0	6	0.603
బంగ్లాదేశ్	2	1	1	0	2	0.075
నెదర్లాండ్స్	2	1	1	0	2	0.024
నేపాల్	1	0	1	0	0	-0.539
శ్రీలంక	2	0	2	0	0	-0.777

ఆ: ఆడినవి; గె: గెల్చినవి; ఓ: ఓడినవి; పా: పాయింట్లు

స్కాట్లాండ్ అలవోకగా..

7 వికెట్లతో ఒమన్ చిత్తు

నార్త్ సౌండ్: బ్రాండన్ మెక్‌ముల్లెన్ (31 బంతుల్లో 61 నాటౌట్) ధనాధన్ అర్ధ శతకంతో.. టీ20 వరల్డ్‌కప్‌లో స్కాట్లాండ్ రెండో విజయాన్ని నమోదు చేసింది. గ్రూప్-బిలో ఆదివారం రాత్రి జరిగిన మ్యాచ్‌లో స్కాట్లాండ్ 7 వికెట్లతో ఒమన్‌ను చిత్తు చేసింది. తొలుత ఒమన్ 20 ఓవర్లలో 150/7 స్కోరు చేసింది. ప్రతీక్ అథ్వాలే (54), అయాన్ ఖాన్ (41 నాటౌట్) బ్యాట్‌తో అదరగొట్టారు. షరీఫ్ 2 వికెట్లు తీశాడు. ఛేదనలో స్కాట్లాండ్ 13.1 ఓవర్లలో 153/3 స్కోరు చేసి గెలిచింది. ఓపెనర్ జార్జ్ మున్సే (41), బ్రాండన్ రెండో వికెట్‌కు 29 బంతుల్లో 65 పరుగులు జోడించారు.

ఇంగ్లండ్‌కు ఇరకాటం: స్కాట్లాండ్ విజయంతో.. గ్రూప్-బిలో డిఫెండింగ్ చాంప్ ఇంగ్లండ్ పరిస్థితి ఇరకాటంలో పడింది. వర్షం కారణంగా స్కాట్లాండ్‌తో మ్యాచ్ రద్దు కాగా.. ఆస్ట్రేలియా చేతిలో ఓడింది. ఈ నేపథ్యంలో సూపర్-8కు చేరాలంటే.. మిగిలిన రెండు మ్యాచ్‌లో బట్లర్ సేన తప్పకుండా నెగ్గడంతోపాటు రన్‌రేట్‌ను కూడా భారీగా మెరుగుపరచుకోవాల్సిన అవసరం ఉంది.

సంక్షిప్త స్కోర్లు

ఒమన్: 20 ఓవర్లలో 150/7 (ప్రతీక్ 54, అయాన్ 41 నాటౌట్, షరీఫ్ 2/40).

స్కాట్లాండ్: 13.1 ఓవర్లలో 153/3 (మెక్‌ములెన్ 61, మున్సే 41 నాటౌట్, బిలాల్ 1/12, ఆకిబ్ 1/41).

పాయింట్ల పట్టిక — గ్రూప్-బి

జట్టు	మ్యా	గె	ఓ	ఫ.తే	పా	రన్‌రేట్
స్కాట్లాండ్	3	2	0	1	5	2.164
ఆస్ట్రేలియా	2	2	0	0	4	1.875
నమీబియా	2	1	1	0	2	-0.309
ఇంగ్లండ్	2	0	1	1	1	-1.800
ఒమన్	3	0	3	0	0	-1.613

ఆ: ఆడినవి; గె: గెల్చినవి; ఓ: ఓడినవి; పా: పాయింట్లు

విండీస్‌లో మ్యాచ్‌లకు లామిచానె



కింగ్‌స్టన్: అమెరికా వీసా నిరాకరించడంతో ఆ దేశంలో టీ20 ప్రపంచ కప్ మ్యాచ్‌లకు దూరమైన నేపాల్ క్రికెటర్ సందీప్ లామిచానె..వెస్టిండీస్‌లో మాత్రం జట్టు తరఫున బరిలో దిగనున్నాడు. గ్రూప్ 'డి'లో తలపడుతున్న నేపాల్..చివరి రెండు మ్యాచ్‌లను వెస్టిండీస్‌లో ఆడాల్సి ఉంది. ఆ రెండు మ్యాచ్‌లకు లామిచానెను ఎంపిక చేసినట్టు నేపాల్ క్రికెట్ సంఘం సోమవారం తెలిపింది.

లాహోర్‌లో ఆడండి..

టీమిండియాకు పీసీబీ వినతి

లాహోర్: చాంపియన్స్ ట్రోఫీలో లాహోర్ వేదికగా మ్యాచ్‌లు ఆడాలని టీమిండియాను పాకిస్థాన్ క్రికెట్ బోర్డు (పీసీబీ) కోరింది. భారత జట్టుకు ఇక్కడ అత్యంత పటిష్ఠమైన భద్రత కల్పిస్తామని హామీ ఇచ్చింది. వచ్చే ఏడాది ఫిబ్రవరి 19 నుంచి మార్చి తొమ్మిది వరకు జరిగే చాంపియన్స్ ట్రోఫీ వన్డే టోర్నీకి పీసీబీ ఆతిథ్యం ఇస్తోంది. అయితే భద్రతా కారణాల రీత్యా పాకిస్థాన్ వెళ్లేందుకు టీమిండియా సుముఖంగా లేదు. 'ఒక్కో మ్యాచ్‌కు ఒక్కో వేదికకు వెళ్లే ప్రయాణ భారాన్ని తగ్గించడంతోపాటు కట్టుదిట్టమైన భద్రత కల్పించేందుకు లాహోర్‌ను హోం గ్రౌండ్‌గా చేసుకొని చాంపియన్స్ ట్రోఫీ ఆడాలని భారత్‌కు సూచించాం' అని పీసీబీ వర్గాలు వెల్లడించాయి. ఈ మేరకు ఐసీసీకి పంపిన చాంపియన్స్ ట్రోఫీ ముసాయిదా షెడ్యూల్‌లో ప్రతిపాదించినట్టు ఆ వర్గాలు తెలిపాయి.

సుమిత్ @ 77

కెరీర్ బెస్ట్ ర్యాంక్ కైవసం



న్యూఢిల్లీ: భారత టెన్నిస్ ఆటగాడు సుమిత్ నగల్ కెరీర్ బెస్ట్ 77వ ర్యాంక్‌కు ఎగబాకాడు. ఈ క్రమంలో పారిస్ ఒలింపిక్స్ సింగిల్స్ మెయిన్ డ్రాకు నగల్ అర్హత సాధించే అవకాశాలున్నాయి. సోమవారం తాజాగా విడుదల చేసిన ఏటీపీ ర్యాంకింగ్స్‌లో నగల్ ఏకంగా 18 ర్యాంకులు మెరుగుపరచుకొని 77వ స్థానంలో నిలిచాడు. నిబంధనల ప్రకారం టాప్-56 ర్యాంక్ ప్లేయర్లకు నేరుగా ఒలింపిక్ బెర్త్ దక్కనుంది. అయితే, ఒక దేశం నుంచి నలుగురు ప్లేయర్లకు మాత్రమే అనే నిబంధన కారణంగా సుమిత్ లాంటి తక్కువ ర్యాంక్ ఆటగాళ్లకు అదృష్టం వరించే చాన్సులున్నాయి.

జర్నలిజంలో రామోజీది కొత్త ఒరవడి

» సీనియర్ పాత్రికేయుల నివాళి

బంజారాహిల్స్, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): ఈనాడు గ్రూప్ సంస్థల చైర్మన్ చెరుకూరి రామోజీరావు పత్రికా రంగంలోనే గాక వివిధ రంగాల్లోనూ తనదైన ముద్ర వేశారని సీనియర్ పాత్రికేయులు కొనియాడారు. జర్నలిజంలో నూతన ఒరవడిని సృష్టించి ఆదర్శప్రాయుడిగా, మార్గదర్శిగా నిలిచారని ప్రశంసించారు. సోమవారం హైదరాబాద్ సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో రామోజీరావు చిత్రపటానికి పలువురు సీనియర్ పాత్రికేయులు నివాళులర్పించారు. వృత్తినీ, వ్యాపారాన్నీ ఆయన ఒకేగాటున కట్టలేదని వల్లీశ్వర్ అన్నారు. ధైర్యంగా వార్తలు రాయాలని ప్రోత్సహించడంతో పాటు ప్రతి నెలా ఒకటో తేదీన జీతాలిచ్చేవారని గుర్తు చేశారు. ఎ.రజాహుస్సేన్ మాట్లాడుతూ నిష్పక్ష వార్తల విషయంలో రామోజీరావు కచ్చితత్వాన్ని ప్రదర్శించేవారని, క్రమశిక్షణ, నిబద్ధత విషయాల్లో ఆయనను చూసి ప్రతి ఒక్కరూ నేర్చుకోవాలన్నారు. జర్నలిజం స్కూల్ నెలకొల్పి, శాస్త్రీయ శిక్షణ ఇచ్చి, ఉత్తమ పాత్రికేయుల్ని తీర్చిదిద్దిన ఘనత రామోజీకే దక్కుతుందని పాశం యాదగిరి అన్నారు. వినయ్ కుమార్ మాట్లాడుతూ జిల్లా ఎడిషన్లతో వార్తాలోకంలో సంచలనం సృష్టించిన ఘనత రామోజీరావుదని అన్నారు. దుర్గాకుమార్, చెన్నయ్య, జమున, సుందరసాయి, కె.వేణుగోపాల్, ఇస్మాయిల్, హేమసుందర్, శరత్‌కుమార్, కేశవులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేల అనర్హతపై స్పీకర్ నిర్ణయం ఎప్పుడు?

» రాష్ట్ర ప్రభుత్వానికి హైకోర్టు ప్రశ్న

» సభాపతికి సమయం నిర్దేశించడం తగదని ఏజీ వాదన

హైదరాబాద్, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ తరఫున గెలిచి కాంగ్రెస్‌లోకి మారిన ఎమ్మెల్యేలకు వ్యతిరేకంగా దాఖలైన అనర్హత పిటిషన్లపై స్పీకర్ ఎప్పటిలోగా నిర్ణయం తీసుకుంటారో చెప్పాలని హైకోర్టు రాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించింది. స్పీకర్ తరఫున వాదనలు వినిపించడానికి ప్రత్యేకంగా న్యాయవాది ఉండాల్సిన అవసరం ఉందని సూచించింది. పార్టీ మారిన ఎమ్మెల్యేలు దానం నాగేందర్, కడియం శ్రీహరి, తెల్లం వెంకట్రావుపై అనర్హత వేటు వేసేలా స్పీకర్‌కు ఆదేశాలు ఇవ్వాలని కోరుతూ బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు పాడి కౌశిక్‌రెడ్డి, కేపీ వివేకానంద పిటిషన్లు దాఖలు చేశారు. ఈ పిటిషన్లపై జస్టిస్ విజయ్‌సేన్ రెడ్డి ధర్మాసనం సోమవారం మరోసారి విచారణ చేపట్టింది. పిటిషనర్ల తరఫున సీనియర్ న్యాయవాదులు గండ్ర మోహన్‌రావు, జె.రాంచంద్రరావు వాదిస్తూ.. తెలంగాణ అసెంబ్లీ స్పీకర్ సుప్రీంకోర్టు తీర్పునకు విరుద్ధంగా, పక్షపాత ధోరణితో వ్యవహరిస్తున్నారని పేర్కొన్నారు. ఫిరాయింపులపై మూడునెలల్లో నిర్ణయం తీసుకోవాలని ఇటీవల మహారాష్ట్ర స్పీకర్‌ను సుప్రీంకోర్టు ఆదేశించిన విషయాన్ని గుర్తు చేశారు. ప్రభుత్వం తరఫున అడ్వకేట్ జనరల్ సుదర్శన్‌రెడ్డి వాదనలు వినిపిస్తూ తమ హయాంలో ఎటువంటి నిర్ణయాలు తీసుకోకుండా పదేళ్లపాటు కాలం గడిపిన వారు ఇప్పుడు వచ్చి ఉపన్యాసాలు ఇస్తున్నారని ధ్వజమెత్తారు. స్పీకర్‌కు సమయం నిర్దేశించడం సరికాదని తెలిపారు. ఈ పిటిషన్లపై తమకు కౌంటర్ దాఖలు చేసే అవకాశం ఇవ్వాలని కోరారు. పార్టీ మారిన ఎమ్మెల్యేల తరఫున సీనియర్ న్యాయవాదులు శ్రీరఘురాం, మయూర్‌రెడ్డి వాదనలు వినిపిస్తూ సమయం నిర్దేశించడం.. స్పీకర్ హోదాను తగ్గించడమే అవుతుందని పేర్కొన్నారు. వాదనలు నమోదు చేసుకున్న ధర్మాసనం.. స్పీకర్ నిర్ణయం తీసుకోవడానికి ఎంతకాలం పడుతుంది? దానికి కాలపరిమితి ఉండాలి కదా? అని పేర్కొంది. రాష్ట్ర ప్రభుత్వం కోరిన విధంగా అసెంబ్లీ కార్యదర్శి, ప్రభుత్వం కౌంటర్‌లు దాఖలు చేయడానికి సమయం ఇస్తూ విచారణను 27కు వాయిదా వేసింది.

ఏడాదిలో వెయ్యి కిలోల గంజాయి పట్టివేత

» రైల్వే సెక్యూరిటీ కమిషనర్ డెబస్మతి బెనర్జీ

సికింద్రాబాద్ రైల్వే స్టేషన్, జూన్ 10(ఆంధ్రజ్యోతి): దక్షిణ మధ్య రైల్వే సికింద్రాబాద్ డివిజన్‌లో ఈ ఏడాదిలో ఇప్పటివరకు వెయ్యి కిలోల గంజాయిని పట్టుకున్నామని దక్షిణ మధ్య రైల్వే సికింద్రాబాద్ డివిజనల్ సెక్యూరిటీ కమిషనర్ డెబస్మతి బెనర్జీ ఒక ప్రకటనలో తెలిపారు. 36 మందిపై కేసులు నమోదు చేశామని తెలిపారు. రైళ్లలో గంజాయి సరఫరా చేస్తే కఠిన చర్యలు ఉంటాయని ఆమె హెచ్చరించారు. రైళ్లలో ఎప్పటికప్పుడు ఆర్పీఎఫ్ మహిళా కానిస్టేబుళ్ల శక్తి టీం పర్యవేక్షణ ఉంటుందన్నారు.

ఈసెట్ కౌన్సెలింగ్‌లో గందరగోళం

హైదరాబాద్‌లోని 6 సహాయ కేంద్రాల్లో సర్టిఫికెట్ల పరిశీలన షురూ

» ఫీజు బకాయి ఉండటంతో సర్టిఫికెట్లు ఇవ్వని ప్రైవేట్ కాలేజీలు

» 6వ సెమిస్టర్ మెమోలను ఇంకా జారీచేయని టెక్నికల్ బోర్డు

» పత్రాలు లేకుండా పరిశీలన ఎలాగంటున్న కౌన్సెలింగ్ సిబ్బంది



జేఎన్‌టీయూలో సర్టిఫికెట్ వెరిఫికేషన్‌కు హాజరైన అభ్యర్థులు

హైదరాబాద్ సిటీ, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): బీటెక్ లేటరల్ ఎంట్రీ(నేరుగా సెకండియర్) ప్రవేశాల కోసం సాంకేతిక విద్యా శాఖ సోమవారం ప్రారంభించిన టీజీఈసెట్ కౌన్సెలింగ్ ప్రక్రియ గందరగోళంగా మారింది. ఈసెట్‌లో ర్యాంకులు పొందిన అభ్యర్థులు ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకొని ధ్రువపత్రాల పరిశీలన కోసం హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన ఆరు హెల్ప్‌లైన్ సెంటర్లకు వచ్చారు. అయితే.. వారిలో చాలా మంది ఒరిజినల్ సర్టిఫికెట్లు లేకుండానే రావడంతో హెల్ప్‌లైన్ సెంటర్లలో ఉన్న సిబ్బందికి ఏం చేయాలో దిక్కుతోచని పరిస్థితి ఎదురైంది. ధ్రువపత్రాల పరిశీలనకు వచ్చే అభ్యర్థులు పదో తరగతి మార్కుల మెమో, డిప్లొమా ప్రొవిజనల్ సర్టిఫికెట్, ఆరు సెమిస్టర్ల మార్కుల జాబితాలతో పాటు గత ఏడేళ్లకు సంబంధించిన స్టడీ సర్టిఫికెట్ల ఒరిజినల్స్ తెచ్చుకోవాలని సాంకేతిక విద్యాశాఖ గత నెల 24న జారీచేసిన నోటిఫికేషన్‌లో స్పష్టం చేసింది.

ప్రభుత్వం నుంచి ఫీజులు రాక ఇబ్బంది..

డిప్లొమా కోర్సుల్లో చేరిన విద్యార్థుల టెన్త్ క్లాస్ మెమోలతో పాటు ఏడేళ్ల స్టడీ సర్టిఫికెట్లు ఆయా కాలేజీల్లో ఉన్నాయి. మూడేళ్లుగా ప్రభుత్వం నుంచి ఫీజు బకాయిలు రాకపోవడంతో సర్టిఫికెట్లు ఇచ్చేందుకు యాజమాన్యాలు ససేమిరా అంటున్నాయని అభ్యర్థులు వాపోతున్నారు. మరోవైపు డిప్లొమా చివరి సెమిస్టర్ ఫలితాలను విడుదల చేసిన రాష్ట్ర సాంకేతిక విద్యామండలి.. మార్కుల మెమోలను కళాశాలలకు ఇంకా పంపలేదు. దీనిపై విద్యార్థులు మండిపడుతున్నారు. మెమోలు ఇవ్వకుండానే కౌన్సెలింగ్ ఎలా పెడతారని ప్రశ్నిస్తున్నారు. మరోవైపు, ధ్రువపత్రాలు లేకుండా వెరిఫికేషన్‌కు వచ్చిన అభ్యర్థులను కొన్ని హెల్ప్‌లైన్ కేంద్రాల్లోకి అనుమతించకపోవడంతో వారంతా దిగాలుగా వెనుదిరిగారు. కొన్ని కేంద్రాల్లో ఒరిజినల్స్ ఇవ్వని అభ్యర్థులను పెండింగ్ జాబితాలో పెట్టేశారు. కౌన్సెలింగ్ ప్రక్రియ పూర్తయ్యేలోగా ఒరిజినల్ ధ్రువపత్రాలను తప్పనిసరిగా సమర్పించాలని చెప్పినట్లు తెలిసింది. ప్రభుత్వ పాలిటెక్నిక్‌లలో ఏర్పాటు చేసిన హెల్ప్‌లైన్ కేంద్రాల్లో మాత్రం అభ్యర్థుల వద్ద ఎటువంటి ధ్రువపత్రాలు లేకున్నా ఎస్ఎస్‌సీ, ఎస్‌బీటీఈటీ, టీజీఈసెట్ వెబ్‌సైట్‌లో అభ్యర్థుల వివరాలను తనిఖీ చేసిన సిబ్బంది.. వెరిఫికేషన్ ప్రక్రియను మొక్కుబడిగా కానిచ్చేస్తున్నారు. ఓ వైపు ప్రభుత్వం నుంచి ఫీజు బకాయిలు రాకపోవడం, మరోవైపు టెక్నికల్ బోర్డు నుంచి మార్కుల జాబితాలు అందకపోవడంతో అభ్యర్థులు తీవ్ర ఇక్కట్లు ఎదుర్కొంటున్నారు.

హాల్ టికెట్లు ఉంటే చాలు

ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు ఉన్నందున ప్రైవేటు పాలిటెక్నిక్ కాలేజీల్లో చదివిన విద్యార్థుల సర్టిఫికెట్లను యాజమాన్యాలు వెనక్కి ఇవ్వడం లేదని తెలిసింది. అలాగే, ఎస్‌బీటీఈటీ నుంచి 6వ సెమిస్టర్ మార్కుల జాబితాలు అభ్యర్థులకు అందని మాట వాస్తవమే. దీనిని దృష్టిలో పెట్టుకొని హెల్ప్‌లైన్ కేంద్రాలకు మార్గదర్శకాలను జారీచేశాం. అభ్యర్థులు టెన్త్, డిప్లొమా, ఈసెట్ హాల్‌టికెట్లు తెచ్చుకుంటే చాలు. ఆ నంబర్లతో ఎస్ఎస్‌సీ, ఎస్‌బీటీఈటీ, టీజీఈసెట్ వెబ్‌సైట్లలో అభ్యర్థుల వివరాలను తనిఖీ చేసి.. వెరిఫికేషన్ పూర్తి చేయాలని ఆదేశించాం.

- శ్రీనివాస్, కౌన్సెలింగ్ క్యాంప్ ఆఫీసర్

వందలాది మంది గైర్హాజరు

రాష్ట్రవ్యాప్తంగా 23,330 మంది అభ్యర్థులు ఈసెట్ రాయగా.. 22,305 మంది(95.86శాతం) అర్హత సాధించారు. వారంతా కౌన్సెలింగ్ కోసం శనివారం నుంచి ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. వారి నివాసాలకు సమీపంలోని హెల్ప్‌లైన్ కేంద్రాల్లో ధ్రువపత్రాల పరిశీలన నిమిత్తం స్లాట్ బుక్ చేసుకున్నారు. తీరా హెల్ప్‌లైన్ కేంద్రాలకు ఒరిజినల్ ధ్రువపత్రాలు లేకుండా వచ్చేసరికి తామేం చేయలేమని సిబ్బంది చేతులెత్తేస్తున్నారు. దీంతో హైదరాబాద్‌లోని 5 కేంద్రాల్లో సర్టిఫికెట్ వెరిఫికేషన్‌కు రావాల్సిన వందలాది మంది గైర్హాజరయ్యారు.

ఉపాధి చట్టం బలోపేతం కోసం కృషి

వేతనం, పని దినాల పెంపునకు ప్రయత్నిస్తాం

చట్టం రక్షణకు పోరాడతాం: మంత్రి సీతక్క



రాంనగర్/హైదరాబాద్, జూన్ 10 (ఆంధ్రజ్యోతి) : ఉపాధి హామీ పని దినాలను 150 రోజులకు పెంచడం, కనీస వేతనం రూ.400 పెంచడం, పట్టణ ప్రాంతాలకు ఉపాధి పనిని విస్తరింపచేయడం కోసం ప్రయత్నిస్తామని గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క హామీ ఇచ్చారు. 'గ్రామీణ ఉపాధి హామీ చట్టం అమలు-సవాళ్లు' అనే అంశంపై సోమవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో జరిగిన సదస్సులో సీతక్క మాట్లాడారు. బీజేపీ ప్రభుత్వం ఉపాధి హామీని ఎత్తివేయాలని కుట్ర చేస్తోందని ఆరోపించారు. ఉపాధి చట్టం రక్షణ కోసం కాంగ్రెస్ ఎంపీల ద్వారా పార్లమెంట్‌లో పోరాడతామన్నారు.

పారిశుధ్యంపై దృష్టి పెట్టండి..

వర్షాకాలంలో గ్రామీణ ప్రాంతాల్లో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు చేపట్టాలని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క అధికారులను ఆదేశించారు. సోమవారం సచివాలయంలో సంబంధిత శాఖ అధికారులతో ఆమె సమీక్ష నిర్వహించారు. గ్రామీణ ప్రాంతాల్లో పారిశుధ్య పనులు చేపట్టడంతోపాటు తాగు నీటి ట్యాంకులను క్లోరినేషన్ చేయాలని చెప్పారు. మహిళా శక్తి పథకం కింద ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల యూనిఫామ్‌లు కుట్టడం పూర్తయిందని, త్వరలోనే వాటిని అందజేస్తామని సీతక్క వెల్లడించారు. కాగా, రాష్ట్రంలో ఔట్ సోర్సింగ్ పంచాయతీ సెక్రటరీ(ఓపీఎస్)లుగా పనిచేస్తున్న వారిని జూనియర్ పంచాయతీ సెక్రటరీ(జేపీఎస్)లుగా మార్చాలని మంత్రి సీతక్కను టీపీఆర్‌టీ నేత, కాంగ్రెస్ నాయకుడు గాల్‌రెడ్డి హర్షవర్ధన్ రెడ్డి.. నిరుద్యోగ జేఏసీ చైర్మన్, కాంగ్రెస్ నేత మానవతారాయ్ కోరారు. ఈ మేరకు ఓపీఎస్‌లతో పాటు వివిధ సంఘాల ప్రతినిధులతో కలిసి సచివాలయంలో మంత్రిని కలిసి వినతి పత్రం సమర్పించారు.

వైసీపీ విధ్వంసం నిజమే

» ఎన్నికల రోజు, ఆ తర్వాత టీడీపీ అభ్యర్థులు, నేతలపై హత్యాయత్నాలు

» డీజీపీ గుప్తాకి నివేదిక అందజేసిన సిట్

అమరావతి, జూన్ 10(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో సార్వత్రిక ఎన్నికల రోజు, ఆ తర్వాత వైసీపీ మూకలు విధ్వంసం సృష్టించాయని ప్రత్యేక దర్యాప్తు బృందం(సిట్) నిర్ధారించింది. టీడీపీ అభ్యర్థులు, సానుభూతిపరులపై దాడులు చేసి, హత్యాయత్నానికి పాల్పడ్డారని తేల్చిచెప్పింది. పల్నాడు, అనంతపురం, తిరుపతి జిల్లాల్లో పోలింగ్ రోజైన మే 13న, ఆ తర్వాత జరిగిన హింసాత్మక ఘటనలపై వాస్తవాలను వెలికి తీసేందుకు ఎన్నికల కమిషన్ ఆదేశాలతో ఐజీ వినీత్ బ్రిజిలాల్ నేతృత్వంలో రంగంలోకి దిగిన సిట్ బృందాలు క్షుణ్ణంగా దర్యాప్తు నిర్వహించాయి. విచారణలో గుర్తించిన కీలక అంశాలతో 157 పేజీల పూర్తిస్థాయి నివేదికను డీజీపీ హరీశ్‌కుమార్ గుప్తాకు ఐజీ సమర్పించారు. ఎన్నికల హింసకు సంబంధించి 35 కేసులు, ఈవీఎంల ధ్వంసంపై 2 కేసులు నమోదయ్యాయని, క్షేత్రస్థాయిలో పర్యటించి 447మంది ప్రత్యక్ష సాక్షుల వాంగ్మూలాలు నమోదు చేసినట్లు సిట్ వెల్లడించింది. 25 కేసుల్లో వెబ్ కాస్టింగ్ ఫుటేజీ తీసుకుని ఫోరెన్సిక్ సైన్స్ ల్యాబ్‌కు పంపామని, రిపోర్టు చార్జిషీట్లకు జత చేసి కోర్టులో దాఖలు చేసినట్లు పేర్కొంది. మొత్తం కేసుల్లో 1,450 మందికి పైగా నిందితులు ఉన్నారని, ఇప్పటివరకూ 718మందిని అరెస్టు చేసి మిగతా వారికి 41ఏ నోటీసులు జారీ చేసినట్లు తెలిపింది. సిట్ ప్రధాన కార్యాలయంతో పాటు జిల్లాల్లోని సిట్ అధికారులకు మొత్తం 43 వినతులు అందగా టీడీపీ నుంచి 21, వైసీపీ నుంచి 19, బీజేపీ 1, ఇతరులు 2 ఇచ్చినట్లు వెల్లడించింది. పలువురు నిందితులు ముందస్తు బెయిలు కోసం న్యాయస్థానాల్లో పిటిషన్లు వేయగా ఏపీపీల తరఫున కౌంటర్లు సిద్ధం చేసినట్లు పేర్కొంది.

నివేదికలో మరికొన్ని కీలక ప్రస్తావనలివీ...

- మాచర్ల ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, ఆయన అనుచరులు పాల్వాయి గేట్ పోలింగ్ స్టేషన్లో ఈవీఎం ధ్వంసం చేసి, అడ్డుకోబోయిన టీడీపీ ఏజెంట్ తల పగులగొట్టారు. కానీ, సదరు బీఎల్‌వో, వీఆర్వో గుర్తు తెలియని వ్యక్తులంటూ ఫిర్యాదు చేశారు. ఆధారాల సేకరణలో విఫలమయ్యారు.
- ఒప్పిచెర్ల పోలింగ్ బూత్‌లో వైసీపీ ఏజెంట్ పాలకీర్తి శ్రీనివాసరావు కంట్రోల్ యూనిట్‌ను నేలకేసి కొట్టి ధ్వంసం చేశారు.
- టీడీపీ అభ్యర్థి జూలకంటి బ్రహ్మారెడ్డిపై రెంటాల లూథర్ చర్చ్ వద్ద వైసీపీ మద్దతుదారులు దాడి చేసి, ఆయన కారుపై పెట్రోలు పోసి తగులబెట్టారు. టీడీపీ మద్దతుదారుడిని చంపేందుకు యత్నించిన వైసీపీ అల్లరి మూకల రాళ్లదాడిలో సీఐ తల పగిలింది.
- టీడీపీకి చెందిన వేల్పుల సింహాద్రి యాదవ్‌ను హత్య చేసేందుకు 20మంది వైసీపీ అల్లరి మూకలు కర్రలు, ఇనుప రాడ్లతో దాడి చేశారు.
- నరసరావుపేట మండలం దొండపాడులో టీడీపీ ఎంపీ అభ్యర్థి లావు కృష్ణదేవరాయలు కారుపై వైసీపీ శ్రేణులు దాడి చేశాయి.
- తాడిపత్రిలో జేసీ ప్రభాకర్ రెడ్డి ఆయన కుమారుడు టీడీపీ అభ్యర్థి అస్మిత్ రెడ్డిపై వైసీపీ మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి, ఆయన కుమారుడు హర్షవర్ధన్‌రెడ్డి దాడి చేశారు.
- తిరుపతిలో టీడీపీ చంద్రగిరి అభ్యర్థి పులివర్తి నానిపై చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, ఆయన కుమారుడు మోహిత్‌రెడ్డి అనుచరులు సుత్తి, ఇనుప రాడ్లు, మద్యం సీసాలు, క్రికెట్ బ్యాట్లతో దాడి చేశారు. నాని ఎడమ భుజానికి గాయం కాగా గన్‌మెన్‌కు రక్తగాయాలు అయ్యాయి.

అమిత్ మాలవీయ స్త్రీలోలుడు

పశ్చిమ బెంగాల్‌కు వచ్చినప్పుడల్లా పలువురితో శారీరకంగా గడిపేవాడు

» పశ్చిమబెంగాల్‌కే చెందిన శంతను సిన్హా సంచలన ఆరోపణ.. తాను ఆరెస్సెస్ ప్రతినిధినని వెల్లడి

» తీవ్రంగా ఖండించిన అమిత్ మాలవీయ..

శంతనుపై రూ.10కోట్లకు పరువు నష్టం దావా



అమిత్ మాలవీయ



శంతను సిన్హా

న్యూఢిల్లీ/బెంగళూరు, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): బీజేపీ ఐటీ సెల్ చీఫ్ అమిత్ మాలవీయ బెంగాల్‌కు వచ్చినప్పుడల్లా అక్కడ పలువురు మహిళలతో శారీరకంగా గడిపేవారని పశ్చిమ బెంగాల్‌కే చెందిన శంతను సిన్హా సంచలన ఆరోపణలు చేశారు. శృంగార కార్యకలాపాల కోసం ఆయన బెంగాల్‌లోని బీజేపీ కార్యాలయాలను కూడా ఉపయోగించుకున్నారని ఫేస్‌బుక్‌లో పోస్టు చేశారు. శంతను తనను తాను ఆరెస్సెస్ అధికార ప్రతినిధిగా చెప్పుకొన్నారు. "మహిళలతో గడపటం కోసం మాలవీయ స్టార్ హోటళ్లనే కాకుండా బెంగాల్‌లోని బీజేపీ కార్యాలయాలను కూడా ఉపయోగించుకున్నారు" అని పేర్కొన్నారు. "బెంగాల్‌లోని బీజేపీ నేతలు తమ పదవులను కాపాడుకోవడం కోసం అమిత్ మాలవీయ లాంటి నాయకులకు ఇలా అమ్మాయిలను సరఫరా చేస్తూనే ఉంటారా" అని ప్రశ్నించారు. అయితే, ఈ ఆరోపణలను మాలవీయ ఖండించారు. శంతను ఆరోపణలు అబద్ధమని, అత్యంత తీవ్రమైనవని పేర్కొన్నారు. ఆయనపై రూ.10కోట్లకు పరువు నష్టం దావా వేశారు. మూడు రోజుల్లోగా ఫేస్‌బుక్ పోస్టును తొలగించాలని, బేషరతుగా క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు లీగల్ నోటీసులు పంపించారు. ఈ గడువు మంగళవారంతో ముగియనుంది. మరోవైపు, శంతను ఆరెస్సెస్ ప్రతినిధిగా ఎప్పుడూ లేరని ఆ సంస్థ వర్గాలు పేర్కొన్నాయి.


మాలవీయను వెంటనే పదవి నుంచి తొలగించాలి

అమిత్ మాలవీయను వెంటనే బీజేపీ ఐటీ సెల్ చీఫ్ పోస్టు నుంచి తొలగించాలని కాంగ్రెస్ డిమాండ్ చేసింది. దీనిపై జాతీయ మహిళా కమిషన్ సత్వరమే సుమోటో కేసు నమోదు చేయాలని విజ్ఞప్తి చేసింది. కాంగ్రెస్ సోషల్ మీడియా విభాగం చైర్‌పర్సన్ సుప్రియా శ్రీనతే సోమవారం మీడియాతో మాట్లాడారు. బీజేపీ ఐటీ సెల్ చీఫ్‌గా మాలవీయ అత్యంత ప్రభావవంతమైన పోస్టులో ఉన్నారని, ఆయన్ను ఆ పోస్టు నుంచి తొలగించకపోతే దర్యాప్తు ముందుకు సాగదని, బాధితులకు న్యాయం జరగదని అన్నారు. మాలవీయపై సాక్షాత్తూ ఆరెస్సెస్‌కు చెందిన వ్యక్తే ఈ ఆరోపణలు చేశారని సుప్రియ గుర్తు చేశారు.

ప్రజ్వల్‌కు 14రోజుల జ్యుడీషియల్ కస్టడీ

లైంగిక దౌర్జన్యాల ఆరోపణలతో అరెస్టయిన జేడీఎస్ మాజీ ఎంపీ ప్రజ్వల్ రేవణ్ణకు కోర్టు 14 రోజుల జ్యుడీషియల్ కస్టడీ విధించింది. పది రోజుల సిట్ కస్టడీ ముగియడంతో సిట్ అధికారులు 42వ ఏసీఎంఎం ప్రజాప్రతినిధుల ప్రత్యేక న్యాయస్థానం ఎదుట సోమవారం హాజరుపరిచారు. సిట్ విచారణ ముగిసిందని, ఇక కస్టడీ అవసరం లేదని సిట్ తరఫు న్యాయవాది కోర్టుకు తెలియజేశారు. దీంతో జ్యుడీషియల్ కస్టడీకి పంపాలని ప్రజ్వల్ తరఫు న్యాయవాదులు కోరారు. న్యాయాధికారి 14రోజుల జ్యుడీషియల్ కస్టడీకి ఆదేశించారు.

ఆదిత్యుడు తీసిన సూర్యుడి రంగుల ఫొటోలు



బెంగళూరు, జూన్ 10: సూర్యుడిపై అధ్యయనం కోసం ప్రయోగించిన ఆదిత్య-ఎల్1లోని రెండు పరికరాలు ఉగ్ర సూరీడు చిత్రాలను బంధించాయని ఇస్రో తెలిపింది. భారత తొలి సోలార్ మిషన్ ఆదిత్య-ఎల్1ను ఇస్రో గతేడాది సెప్టెంబరు 2న ప్రయోగించింది. ఇది 127 రోజుల సుదీర్ఘ ప్రయాణం అనంతరం ఈ ఏడాది జనవరి 6న ఎల్-1 పాయింట్‌కు చేరుకుంది. భూమికి సుమారు 1.5 లక్షల కిలోమీటర్ల దూరంలో ఉన్న ఈ ఎల్-1 పాయింట్ నుంచి ఇది సూర్యుడిని నిత్యం పరిశీలిస్తుంది. ఈ క్రమంలో ఆదిత్య-ఎల్1 వ్యోమనౌకలో ఏర్పాటు చేసిన సోలార్ అల్ట్రా వైలెట్ ఇమేజింగ్ టెలిస్కోప్ (సూట్), విజిబుల్ ఎమిషన్ లైన్ కరోనాగ్రాఫ్ (వీఈఎల్‌సీ) ఈ ఏడాది మే నెల 8 నుంచి 15వ తేదీ మధ్య కాలంలో సూర్యుడి డైనమిక్ కార్యకలాపాలను చిత్రీకరించాయని ఇస్రో వెల్లడించింది. భూ అయస్కాంత తుఫానులకు దారితీసే కరోనాల్ మాస్ ఎజెక్షన్ (సీఎంఈ)తో సంబంధం ఉన్న అనేక ఎక్స్-క్లాస్, ఎం-క్లాస్ మంటలను ఈ రెండు పరికరాలు నమోదు చేశాయని తెలిపింది. మే 17న 'సూట్' పేలోడ్ సేకరించిన సూర్యుని చిత్రాలను ఇస్రో విడుదల చేయడంతోపాటు.. వీఈఎస్‌సీ అందించిన పరిశీలనల వివరాలను కూడా పంచుకుంది.

యాత్రికుల బస్సుపై కాల్పులు

పాక్ ఉగ్రవాదుల పనే!

కనీసం ముగ్గురు పాల్గొన్నట్టు అంచనా



న్యూఢిల్లీ, జూన్ 10: జమ్మూ-కశ్మీర్‌లోని రియాసీ జిల్లా తెర్యాత్ వద్ద యాత్రికులు ప్రయాణిస్తున్న బస్సుపై కాల్పులు జరిగిన సంఘటనలో పాకిస్థాన్ ఉగ్రవాదుల ప్రమేయం ఉందని పోలీసు వర్గాలు అనుమానిస్తున్నాయి. కనీసం ముగ్గురు విదేశీ ఉగ్రవాదులు ఇందులో పాల్గొని ఉంటారని అంచనా వేస్తున్నారు. ఈ ప్రాంతంలో మూడు ఉగ్రవాద ముఠాలు పనిచేస్తున్నట్టు కూడా భావిస్తున్నారు. వైష్ణోదేవి దర్శనం నిమిత్తం వచ్చిన యాత్రికులు శివఖోడ్‌లో పూజలు ముగించుకొని ఆదివారం సాయంత్రం తెర్యాత్ గ్రామం వద్ద ఘాట్ రోడ్డు మీదుగా కాట్రా వెళ్తుండగా ఉగ్రవాదులు కాల్పులు జరిపారు. తూటాలు డ్రైవర్‌కు తగలడంతో ఆయన నియంత్రణ కోల్పోయారు. దాంతో బస్సు అదుపు తప్పి లోయలో పడింది. ఈ ప్రమాదంలో తొమ్మిది మంది మరణించగా, 33 మంది గాయపడ్డారు.

మణిపూర్ సీఎం కాన్వాయ్‌పై మిలిటెంట్ల కాల్పులు

ఇంఫాల్, జూన్ 10: మణిపూర్ సీఎం బీరేన్ సింగ్ కాన్వాయ్‌పై మిలిటెంట్లు కాల్పులకు తెగబడ్డారు. ఈ మెరుపు దాడిలో భద్రతా సిబ్బంది ఒకరు గాయపడ్డారు. సోమవారం ఉదయం జిరిబామ్ సమీపంలో జాతీయ రహదారి-37పై ఈ ఘటన చోటుచేసుకుంది. మైతేయి-కుకీ తెగల మధ్య ఘర్షణలతో అట్టుడుకుతున్న జిరిబామ్‌ను సీఎం బీరేన్ మంగళవారం సందర్శించాల్సి ఉంది. ఈ నేపథ్యంలోనే భద్రతా దళాలు ఆ ప్రాంతంలో పరిస్థితిని అంచనా వేసేందుకు ఒకరోజు ముందుగానే కాన్వాయ్‌తో బయలుదేరగా దాడి జరిగింది. వెంటనే తేరుకున్న పోలీసు బలగాలు, అస్సాం రైఫిల్స్ దళాలు మిలిటెంట్లపై ఎదురు కాల్పులు జరిపాయి. ఇటీవల కనబడకుండా పోయిన మైతేయి రైతు శరత్ సింగ్(59) మృతదేహం 6న బయటపడటంతో జిరిబామ్‌లో ఉద్రిక్త పరిస్థితులు తలెత్తాయి.



సోనియాను కలిసిన బంగ్లా ప్రధాని

న్యూఢిల్లీ, జూన్ 10 : ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ప్రమాణస్వీకార కార్యక్రమానికి హాజరైన బంగ్లాదేశ్ ప్రధాని షేక్ హసీనా సోమవారం కాంగ్రెస్ అగ్రనేతలు సోనియా గాంధీ, రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ వాద్రాలను కలుసుకొన్నారు. ఈమేరకు కాంగ్రెస్ పార్టీ 'ఎక్స్'లో వెల్లడించింది. బంగ్లా ప్రధాని వారిని కలిసిన చిత్రాలను కూడా 'ఎక్స్'లో ఉంచింది. గాంధీల కుటుంబానికి బంగ్లా ప్రధాని కుటుంబానికి సుదీర్ఘ అనుబంధం ఉంది. షేక్ హసీనా తండ్రి.. బంగ్లాదేశ్ పిత షేక్ ముజిబుర్ రహ్మాన్‌కు దివంగత భారత మాజీ ప్రధాని ఇందిరా గాంధీతో ఎంతో స్నేహం ఉండేది. బంగ్లా విముక్తికి జరిగిన 1971 యుద్ధంలో ఇందిర కీలక పాత్ర పోషించారు. కేంద్రమంత్రి ఎస్. జయశంకర్ కూడా బంగ్లాదేశ్ ప్రధానిని కలిశారు.

'నీట్'పై సుప్రీంకోర్టులో మరో రిట్

న్యూఢిల్లీ, జూన్ 10: వైద్య కళాశాలల్లో ప్రవేశాలకు ఉద్దేశించిన నీట్-యూజీ పరీక్షల్లో నేషనల్ టెస్టింగ్ అథారిటీ (ఎన్‌టీఏ) గ్రేస్ మార్కులు ఇవ్వడాన్ని సవాలు చేస్తూ సుప్రీంకోర్టులో మరో రిట్ పిటిషన్ దాఖలయింది. సమయాన్ని నష్టపోయారన్న ('లాస్ ఆఫ్ టైమ్') కారణం చూపించి ఎన్‌టీఏ 1,536 మంది విద్యార్థులకు గ్రేస్ మార్కులు ఇచ్చింది. ఇందుకు అభ్యంతరం చెబుతూ ఏపీకి చెందిన నీట్ అభ్యర్థి జరిపాటి కార్తీక్ ఈ పిటిషన్ దాఖలు చేశారు. గ్రేస్ మార్కులు ఇవ్వడం కోసం నార్మలైజేషన్ ఫార్ములాను అనుచిత పద్ధతుల్లో ఉపయోగించారని పిటిషనర్ ఆరోపించారు. ఇది చట్టవ్యతిరేకం, ఏకపక్షం, రాజ్యాంగంలోని ఈ పరీక్షల్లో నార్మలైజేషన్ ఫార్ములాను ఉపయోగించకూడదని తెలిపారు. ఎందుకంటే ఈ పరీక్ష అభ్యర్థులకు ఆయా సబ్జెక్టుల్లో ఉన్న జ్ఞానాన్ని ప్రత్యక్షంగా మదింపు వేయడానికి ఉద్దేశించినదని పేర్కొన్నారు. ఈ ఫార్ములా ప్రకారమయితే వాస్తవ మదింపు ఆధారంగా కాకుండా, అంచనాల ఆధారంగా మార్కులు వేస్తారని తెలిపారు. అందువల్ల ఆ ఫార్ములా ఇక్కడ ఉపయోగపడదని తెలిపారు. అంతేకాకుండా ఆఫ్‌లైన్‌లో పరీక్షలు నిర్వహించినందున 'లాస్ ఆఫ్ టైమ్'ను లెక్కించడానికి ప్రామాణిక విధానమేదీ లేదని వివరించారు. అసలు గ్రేస్ మార్కులను లెక్కించడానికి ప్రాతిపదిక ఏమిటో తెలియదని ఆరోపించారు. ఈ పిటిషన్‌పై సత్వర విచారణ జరిగేలా లిస్టింగ్ చేయాలని అతని తరఫు లాయర్లు సుప్రీంకోర్టు రిజిస్ట్రీని కోరారు.

నచ్చిన పద్ధతిలో పెళ్లి చేసుకోవచ్చు

» అలహాబాద్ హైకోర్టు తీర్పు

ప్రయాగ్‌రాజ్, జూన్ 10: నచ్చిన పద్ధతిలో వివాహం చేసుకునే హక్కు మేజర్‌కు ఉందని అలహాబాద్ హైకోర్టు స్పష్టం చేసింది. ఇష్టమైన వారితో కలిసి ఉండే హక్కు కూడా ఉందని, ఇందుకు రాజ్యాంగం రక్షణ కల్పిస్తుందని తెలిపింది. ఓ వివాహం విషయమై మేజిస్ట్రేటు కోర్టు ఇచ్చిన ఆదేశాలను కొట్టివేస్తూ జస్టిస్ జె.జె.మునీర్, జస్టిస్ అరుణ్ కుమార్ దేశ్వాల్‌ల ధర్మాసనం సోమవారం ఈ మేరకు తీర్పు ఇచ్చింది. 21 ఏళ్ల మహిళ ఏప్రిల్ నెలలో ముస్లిం సంప్రదాయాల ప్రకారం ఓ వ్యక్తిని వివాహం చేసుకుంది. అయితే ఈ పెళ్లి చెల్లదని యువతి తల్లిదండ్రులు కేసు వేశారు. మేజిస్ట్రేటు కోర్టు కూడా అందుకు అనుకూలంగా తీర్పునిచ్చింది. దీనిని సవాలు చేస్తూ యువతి హైకోర్టులో అప్పీలు చేశారు. విచారణ జరిపిన ధర్మాసనం కింది కోర్టు ఉత్తర్వులను పక్కన పెట్టింది.

ఫ్రాన్స్ పార్లమెంట్ రద్దు

» ఈయూ ఎన్నికల్లో మద్దతు కోల్పోవడంతో మేక్రాన్ 'ముందస్తు' నిర్ణయం

పారిస్, జూన్ 10: ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మేక్రాన్.. పార్లమెంట్‌ను రద్దు చేస్తున్నట్లు తెలిపారు. యూరోపియన్ యూనియన్ (ఈయూ) ఎన్నికల్లో విపక్ష పార్టీ నేషనల్ ర్యాలీ విజయం సాధిస్తుందన్న అంచనాల నేపథ్యంలో ఆదివారం అనూహ్య నిర్ణయం తీసుకున్నారు. ప్రజావిశ్వాసం మేరకు ఫ్రాన్స్ జాతీయ అసెంబ్లీకి ముందస్తు ఎన్నికలు నిర్వహించాలని మేక్రాన్ భావిస్తున్నారు. ఈయూ ఎన్నికల్లో మేక్రాన్ పార్టీ రెనాయిసెన్స్‌కు 15 శాతం ఓట్లు, ప్రతిపక్ష నేషనల్ ర్యాలీ పార్టీకి సుమారు 32 శాతం ఓట్లు వస్తాయని ఎగ్జిట్ పోల్స్ అంచనా వేశాయి. అయితే దేశంలో తమ పార్టీ ప్రజా విశ్వాసం కోల్పోలేదని నిరూపించేందుకు మేక్రాన్ ముందస్తు ఎన్నికలకు పిలుపునిచ్చారు. "ఈ రోజు జాతీయ అసెంబ్లీని రద్దు చేస్తున్నా. ఈ నిర్ణయం చాలా పెద్దది. ప్రజాస్వామ్యం మీద ఉన్న నమ్మకంతో, భవిష్యత్ తరాల కోసం ఈ నిర్ణయం తీసుకున్నా" అని మేక్రాన్ తెలిపారు. ఫ్రాన్స్ ప్రజలు మార్పు కోరుకుంటున్నారని మేక్రాన్ ప్రకటనపై ప్రతిపక్ష నాయకుడు జోర్డాన్ బార్డెల్లా వ్యాఖ్యానించారు. కాగా, ఎన్నికలను రెండు దశల్లో నిర్వహించనున్నట్లు ఫ్రాన్స్ అధ్యక్షుడు తెలిపారు. జూన్ 30న మొదటి దశ, జులై 7 చివరి దశ పోలింగ్ ఉంటుందని పేర్కొన్నారు. కాగా, 2022లో ఫ్రాన్స్ అధ్యక్షుడిగా మేక్రాన్ రెండో సారి ఎన్నికయ్యారు. 2027 వరకు ఆయన తన పదవీలో కొనసాగనున్నారు.



గవర్నర్ చేతుల మీదుగా డిగ్రీ పట్టాను అందుకుంటున్న విద్యార్థిని బజ్జూరి దివ్య

మానవ మనుగడకు వ్యవసాయమే ఆధారం

- వ్యవసాయానికి నాణ్యమైన విత్తనాలు కీలకం
- రైతులకు జయశంకర్ వ్యవసాయ వర్సిటీ

మెరుగైన విత్తనాలను ఇవ్వడం హర్షణీయం: గవర్నర్ రాధాకృష్ణన్

రాజేంద్రనగర్, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): మానవ మనుగడకు వ్యవసాయమే ఆధారమని గవర్నర్ రాధాకృష్ణన్ అన్నారు. వ్యవసాయానికి నాణ్యమైన విత్తనం కీలకమని, జయశంకర్ వర్సిటీ నాణ్యమైన, మెరుగైన వంగడాలను రైతులకు అందిస్తుండటం హర్షణీయమని అభినందించారు. ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ వర్సిటీ 6వ స్నాతకోత్సవం సోమవారం యూనివర్సిటీ ఆడిటోరియంలో ఘనంగా జరిగింది. ఈ స్నాతకోత్సవంలో గవర్నర్ పాల్గొని మాట్లాడారు. ఉద్యోగ దశలోకి ప్రవేశిస్తున్న విద్యార్థులు ఆత్మవిశ్వాసం, అంకితభావంతో ముందుకు వెళ్లాలని, జీవితంలో ఒడిదొడుకులు సహజమని వాటిని ధైర్యంగా ఎదుర్కోవాలని పిలుపునిచ్చారు. స్నాతకోత్సవానికి ఎస్బీఐ కో-ఎండీ చల్లా శ్రీనివాసులు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాకు చెందిన తాను ఈ వ్యవసాయ కళాశాలలోనే చదివానని చెప్పారు. కాగా, ఈ స్నాతకోత్సవంలో యూజీ, పీజీ, పీహెచ్‌డీలు పూర్తి చేసిన 517 మంది విద్యార్థులు డిగ్రీ పట్టాలను అందుకున్నారు. 235 మంది విద్యార్థులు తర్వాత డిగ్రీలను తీసుకుంటామని తెలిపినట్లు వర్సిటీ అధికారులు వెల్లడించారు.

ఇద్దరు విద్యార్థినులకు 6 గోల్డ్ మెడల్స్

సోమవారం డిగ్రీ పట్టాలను పొందిన వారిలో సూర్యాపేటలోని తిరుమలగిరికి చెందిన బజ్జూరి దివ్య, కరీంనగర్ హౌసింగ్ బోర్డు కాలనీకి చెందిన వెలిచాల సాయిప్రత్యూష ఇద్దరూ ఆరు చొప్పున బంగారు పతకాలను సాధించారు. దివ్య ప్రస్తుతం ఢిల్లీలోని ఇండియన్ అగ్రికల్చర్ రిసెర్చ్ ఇనిస్టిట్యూట్‌లో జెనిటిక్స్ అండ్ ప్లాంట్ బ్రీడింగ్‌లో పీహెచ్‌డీ చేస్తున్నారు. గొప్ప శాస్త్రవేత్త కావాలన్నదే తన ధ్యేయమని దివ్య ఆంధ్రజ్యోతికి చెప్పారు. ప్రత్యూష ప్రస్తుతం గుంటూరులోని కాంటినెంటల్ కాఫీ రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ విభాగంలో శాస్త్రవేత్తగా పనిచేస్తున్నారు. భవిష్యత్తులో వ్యవసాయశాఖ లేదా వ్యవసాయ విశ్వవిద్యాలయాల్లో శాస్త్రవేత్తగా పనిచేయాలని కోరికగా ఉందని ప్రత్యూష తెలిపారు.

నకిలీ మందుల తయారీదారులపై ఉక్కుపాదం

- వైద్యారోగ్యశాఖ మంత్రి దామోదర
- డ్రగ్ ఇన్‌స్పెక్టర్లకు నియామక పత్రాల అందజేత

హైదరాబాద్, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): నకిలీ మందుల తయారీదారులను ఉక్కుపాదంతో అణిచివేయడానికి తెలంగాణ సర్కారు చర్యలు తీసుకుందని వైద్యారోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ అన్నారు. ఇటీవలే కొత్తగా ఉద్యోగాలు సాధించిన 17 మంది డ్రగ్ ఇన్‌స్పెక్టర్లకు సోమవారం మంత్రి నియామక పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నకిలీ మందుల నివారణకై నిరంతర పర్యవేక్షణ కోసం డ్రగ్ ఇన్‌స్పెక్టర్ల నియామకాన్ని చేపట్టామన్నారు. నూతనంగా ఎంపికైన ఔషధ నియంత్రణ అధికారులు శాఖ బలోపేతానికి కృషి చేయాలని ఆదేశించారు. సమాజ హితం కోసం ఉద్యోగ విధులను నిర్వహించాలని సూచించారు. కార్యక్రమంలో కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్, డ్రగ్స్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్ డైరెక్టర్ జనరల్ (ఇన్‌చార్జి) ఆర్వీ కర్ణన్, జాయింట్ డైరెక్టర్ రామ్‌దాస్‌లు పాల్గొన్నారు.

నేడు ఎడ్‌సెట్ ఫలితాలు

హైదరాబాద్, హైదరాబాద్ సిటీ, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): ఎడ్‌సెట్ ఫలితాలను మంగళవారం విడుదల చేయనున్నారు. ఇందుకు సంబంధించిన ఏర్పాట్లను అధికారులు పూర్తిచేశారు. బీఎడ్ కోర్సుల ప్రవేశాల కోసం మే 23వ తేదీన ఎడ్‌సెట్ ప్రవేశ పరీక్షను నిర్వహించిన విషయం తెలిసిందే. ఈ ప్రవేశ పరీక్షకు సంబంధించిన ఫలితాలను మంగళవారం సాయంత్రం 3.30 గంటలకు విడుదల చేయనున్నారు. రాష్ట్ర ఉన్నత విద్యా మండలి ఛైర్మన్ ప్రొఫెసర్ లింబాద్రి ఈ ఫలితాలను ప్రకటించనున్నారు.

పోలంపల్లి ప్రాజెక్టు మరమ్మతులకు సహకరించండి

- డిప్యూటీ సీఎం భట్టికి ఏపీలోని జగ్గయ్యపేట ఎమ్మెల్యే విజ్ఞప్తి

మధిర టౌన్, జూన్ 10 : తెలంగాణ, ఆంధ్రా సరిహద్దులో మునేటిపై ఉన్న పోలంపల్లి ప్రాజెక్టు మరమ్మతులకు సహకరించాలని ఏపీలోని ఎన్టీఆర్ జిల్లా జగ్గయ్యపేట ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్(తాతయ్య) ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్కను కలిసి విజ్ఞప్తి చేశారు. జగ్గయ్యపేట రైతులతో పాటు వచ్చిన ఆయన ఆదివారం రాత్రి మధిరలో భట్టిని కలిసి ఈమేరకు విజ్ఞప్తి చేశారు. గత సంవత్సరం కురిసిన వర్షాలకు ప్రాజెక్టుకు తెలంగాణ వైపు గండి పడటంతో నీరు వృథాగా పోతోందని, తద్వారా నీటి నిల్వ సామర్థ్యం తగ్గి ఆంధ్రా ప్రాంతంలోని పొలాలకు సాగునీటికి ఇబ్బందులు కలుగుతున్నాయని తెలిపారు. అందువల్ల ప్రాజెక్టు మరమ్మతులకు సహకరించాలని కోరారు.

సీఎం రేవంత్‌రెడ్డిపై బీజేపీ ప్రైవేట్ ఫిర్యాదు

- మెరిట్ ఆధారంగా వేగంగా విచారించాలని హైకోర్టు ఆదేశాలు

హైదరాబాద్, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): ఫేక్ ప్రచారం చేశారంటూ సీఎం రేవంత్‌రెడ్డిపై బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాసం వెంకటేశ్వర్లు దాఖలు చేసిన ప్రైవేట్ ఫిర్యాదుపై మెరిట్ ఆధారంగా వేగంగా విచారించి నిర్ణయం తీసుకోవాలని హైకోర్టు దిగువ కోర్టుకు ఆదేశాలు జారీచేసింది. బీజేపీ వస్తే రాజ్యాంగాన్ని, ఎస్సీ, ఎస్టీ, బీసీ రిజర్వేషన్లను రద్దు చేస్తారని ఎన్నికల్లో తప్పుడు ప్రచారం చేయడంతోపాటు అమిత్ షా ఫేక్ వీడియో వైరల్ చేశారంటూ నాంపల్లి కోర్టులో ప్రైవేట్ కేసు దాఖలు చేశారు. ఈ పిటిషన్‌ను దిగువ కోర్టు విచారణకు స్వీకరించకుండా వాయిదా వేయడంతో బీజేపీ రాష్ట్ర విభాగం హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. దీనిపై జస్టిస్ కే లక్ష్మణ్ ధర్మాసనం విచారణ చేపట్టింది. వీలైనంత వేగంగా చట్టప్రకారం విచారణ చేపట్టి తీర్పు ఇవ్వాలని దిగువ కోర్టు హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది.

కులసర్వేకు వడివడిగా అడుగులు

- నిపుణులు, మేధావులతో బీసీ కమిషన్ భేటీ.. వెల్లడించిన ఛైర్మన్

హైదరాబాద్, జూన్ 10 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో త్వరలో చేపట్టబోయే కులసర్వేకు సంబంధించి అడుగులు వడివడిగా పడుతున్నాయని బీసీ కమిషన్ ఛైర్మన్ డాక్టర్ వకుళాభరణం కృష్ణమోహన్ తెలిపారు. బీసీ కమిషన్ కార్యాలయంలో పలువురు నిపుణులు, మేధావులతో సోమవారం సమావేశం నిర్వహించామని ఆయన ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా తమిళనాడు, కర్ణాటక, ఏపీ, బిహార్ రాష్ట్రాల్లో నిర్వహించిన 'కులసర్వే'లపై సమావేశంలో లోతుగా చర్చ జరిగిందన్నారు. సర్వే కార్యాచరణ ప్రణాళిక తయారీలో భాగంగా.. త్వరలో రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రతినిధులు, కుల సంఘాలను ఆహ్వానిస్తామని, ఇందుకు సంబంధించి వారంలోపే తేదీలను ప్రకటిస్తామన్నారు.

నీట్ పరీక్ష మళ్లీ నిర్వహించాలి: ఎంపీ ఆర్.కృష్ణయ్య

రాంనగర్, జూన్ 10 (ఆంధ్రజ్యోతి):నీట్ పరీక్షలో అవకతవకలు జరిగాయని, దాన్ని తిరిగి మళ్లీ నిర్వహించాలని రాజ్యసభ సభ్యుడు ఆర్ కృష్ణయ్య డిమాండ్ చేశారు. ఎన్టీఏ (నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ) చేసిన తప్పులను కప్పి పుచ్చుకునేందుకే జూన్ 14న విడుదల కావాల్సిన నీట్ ఫలితాలను, ఎన్నికల ఫలితాల రోజున విడుదల చేశారని ఆయన ఆరోపించారు. నీట్ అతికష్టమైన పరీక్ష అని, ప్రతి యేటా ఒకరు లేదా ఇద్దరు మాత్రమే ఆలిండియా ఫస్ట్ ర్యాంక్ సాధిస్తారని చెప్పారు. కానీ ఈ సారి ఏకంగా 67 మందికి ఆలిండియా ఫస్ట్ ర్యాంక్ రావడం ఆశ్చర్యంగా ఉందని అన్నారు. నీట్ పరీక్ష నిర్వహణలో విఫలమైన ఎన్టీఏపై సీబీఐ విచారణ జరిపించాలని, తప్పు చేసినవారిని దేశద్రోహం కింద శిక్షించాలని కృష్ణయ్య డిమాండ్ చేశారు.

రూ. 2 లక్షల రుణాన్ని ఒకేసారి మాఫీ చేయాలి: సీపీఎం

హైదరాబాద్, జూన్ 10(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ఎన్నికల మ్యానిఫెస్టోలో ఇచ్చిన హామీ ప్రకారం కౌలు రైతులకు ఈ వానాకాలం నుంచే రైతు భరోసా అమలు చేయాలని సీపీఎం డిమాండ్ చేసింది. ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సమావేశం సోమవారం ఎంబీ భవన్‌లో నిర్వహించారు. ఈ సమావేశంలో పొలిట్‌బ్యూరో సభ్యులు బీవీ రాఘవులు, ఎ.విజయరాఘవన్‌లు పాల్గొని కొన్ని తీర్మానాలు చేశారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీ మేరకు రూ.2 లక్షల వరకు రుణాన్ని ఏకకాలంలో మాఫీ చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో 20 లక్షల మందికి పైగా కౌలు రైతులున్నారని, రైతుల ఆత్మహత్యల్లో సగం మంది కౌలుదారులే ఉన్నారని పేర్కొన్నారు. గత రెండేళ్లుగా రాష్ట్రంలో పంటల బీమా సౌకర్యం లేదని, ప్రీమియం మొత్తం ప్రభుత్వమే చెల్లించేలా పంటల బీమా అమలు చేయాలని కోరారు. రుణమాఫీని వెంటనే అమలు చేయకపోతే అధిక వడ్డీలకు అప్పులు తెచ్చుకోవాల్సిన పరిస్థితి వస్తుందన్నారు. అదేవిధంగా రాష్ట్రంలో విద్యార్థుల ఫీజు రీయంబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని సీపీఎం డిమాండ్ చేసింది. ఉద్యోగుల సప్లిమెంటరీ బిల్లులు, షెడ్యూల్డ్ ఎంపాయిస్ పరిశ్రమల్లో పని చేసే కార్మికుల వేతనాల సమస్య తీవ్రంగా ఉందని, ప్రభుత్వం తక్షణమే స్పందించి ఉద్యోగుల సమస్యలనుపరిష్కరించాలని డిమాండ్ చేశారు.

సర్కారు బడుల్లో సెమీ రెసిడెన్షియల్

ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు ప్రైవేటు స్కూళ్లతో పోటీపడడం గర్వకారణం: సీఎం రేవంత్



ప్రతిభా పురస్కారాలు పొందిన ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులతో సీఎం రేవంత్

రవీంద్రభారతి, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల్లో సెమీ రెసిడెన్షియల్ విధానాన్ని అమలు చేసే అంశాన్ని పరిశీలిస్తున్నట్లు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తెలిపారు. రెసిడెన్షియల్ స్కూళ్ల వల్ల తల్లిదండ్రులు, పిల్లల మధ్య బంధాలు బలహీనపడుతున్నట్లుగా ఒక అధ్యయనంలో తేలిందని, అందుకే దీనిపై ఆలోచిస్తున్నామని అన్నారు. విద్యార్థులు గురుకుల స్కూళ్ల కంటే గ్రామాల్లోని పాఠశాలల్లో చదువుకుంటేనే తల్లిదండ్రులకు దగ్గరగా ఉండే అవకాశం ఉంటుందన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతూ.. మట్టిలో మాణిక్యాల్లా రాణించే విద్యార్థులు తెలంగాణకు గర్వకారణమన్నారు. ప్రస్తుతం రాజకీయాల్లో, ఉన్నత స్థాయిలో ఉన్న వ్యక్తులందరూ ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకున్న వారేనని పేర్కొన్నారు. ప్రధాని మోదీ, ఏపీకి కాబోయే సీఎం చంద్రబాబుతోపాటు తాను కూడా సర్కారు బడిలో చదువుకున్న వాళ్లమేనని తెలిపారు. దేశంలోని 90 శాతం మంది ఐఏఎస్, ఐపీఎస్, ఐఎఫ్ఎస్ అధికారులు ప్రభుత్వ పాఠశాలల్లోనే విద్యనభ్యసించి పట్టుదలతో ఉన్నతస్థాయికి ఎదిగారని అన్నారు. సోమవారం.. రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల్లో చదివి పదో తరగతిలో 10 జీపీఏ సాధించిన 230 మంది విద్యార్థులకు వందేమాతరం ఫౌండేషన్ ఆధ్వర్యంలో రవీంద్రభారతిలో సీఎం రేవంత్ చేతుల మీదుగా ప్రతిభా పురస్కారాలను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ తెలంగాణలో ప్రైవేట్ స్కూళ్లలో చదివే పిల్లలతో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు పోటీపడి ఎదుగుతుండడం సంతోషం కలిగిస్తోందన్నారు. ప్రభుత్వ పాఠశాలల ద్వారానే తెలంగాణ పునర్నిర్మాణం చేస్తామని ప్రకటించారు. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు ఉత్తమ ప్రతిభ చాటి తమ ప్రభుత్వ గౌరవాన్ని పెంచారని ప్రశంసించారు. నిజానికి ఈ సత్కారం తామే అధికారికంగా చేస్తే బాగుండేదని, వందేమాతరం ఫౌండేషన్ ఈ కార్యక్రమాన్ని నిర్వహించి తమ బాధ్యతను గుర్తు చేసిందని అన్నారు.

యథావిధిగా సింగిల్ టీచర్ స్కూళ్లు

గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఏకోపాధ్యాయ పాఠశాలలను విద్యార్థులు లేరనే సాకుతో మూసివేసిందని సీఎం రేవంత్ విమర్శించారు. మౌలిక వసతులపై దృష్టి పెట్టనందునే అలాంటి పరిస్థితి ఏర్పడిందన్నారు. తమ ప్రభుత్వం ఆ స్కూళ్లను యథావిధిగా కొనసాగించేందుకు చర్యలు తీసుకుందని తెలిపారు. ప్రతి గ్రామం, ప్రతి తండాలోని పిల్లలకు విద్యనందించడమే తమ లక్ష్యమన్నారు. రాష్ట్రంలో శిథిలావస్థకు చేరిన అన్ని ప్రభుత్వ పాఠశాలల భవనాలను పునర్‌నిర్మించేందుకు రూ.2 వేల కోట్లతో పనులు ప్రారంభించామని వెల్లడించారు. బడి బయటి విద్యార్థులను బడిలో చేర్పించేందుకు ఈ నెల 9 నుంచి 20వ తేదీ వరకు బడిబాట కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని చెప్పారు. ప్రభుత్వ పాఠశాలల నిర్వహణ బాధ్యతలను కూడా గత ప్రభుత్వానికి భిన్నంగా మహిళా సంఘాలకు అప్పగించామని సీఎం పేర్కొన్నారు. మహిళా సంఘాల సభ్యులతో అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీలను నియమించి వారికి స్కూల్ నిర్వహణ, మధ్యాహ్న భోజనం, విద్యార్థుల స్కూల్ డ్రెస్సుల బాధ్యతను అప్పగించామని తెలిపారు. కమిటీలకు గ్రీన్ చానల్ ద్వారా నిధులు విడుదల చేయాలని అధికారులకు ఆదేశించినట్లు పేర్కొన్నారు. విద్యపై ప్రభుత్వం పెట్టేది ఖర్చు కాదు.. పెట్టుబడి అని సీఎం అన్నారు. ఈ పెట్టుబడి మన సమాజానికి లాభాన్ని చేకూరుస్తుందని, విదేశాల్లో ఉద్యోగాలు చేసేవారు సొంత గ్రామాల్లో అభివృద్ధి పనులు చేసేందుకు ఉత్సాహం చూపించడమే ఇందుకు ఉదాహరణ అని చెప్పారు.

త్వరలో విద్య, వ్యవసాయ కమిషన్లు..

విద్యారంగం, వ్యవసాయ రంగానికి త్వరలో ప్రత్యేక కమిషన్లు ఏర్పాటు చేస్తామని సీఎం రేవంత్ ప్రకటించారు. తద్వారా ఆయా రంగాల్లోని సమస్యలను పరిష్కరించే వెసులుబాటు కలుగుతుందన్నారు. తమ ప్రభుత్వానికి ఎలాంటి భేషజాలు లేవని, ఎవరు సలహాలు, సూచనలు ఇచ్చినా స్వీకరించేందుకు సిద్ధంగా ఉన్నామని అన్నారు. పదో తరగతిలో ఉత్తమ ప్రతిభ చాటిన విద్యార్థులు ఇంటర్మీడియట్‌లో స్టేట్ ర్యాంకులు సాధించాలని, భవిష్యత్తులో ఐఏఎస్, ఐపీఎస్‌లుగా రాణించాలని సూచించారు. 10 జీపీఏ వచ్చిన విద్యార్థుల అడ్మిషన్లపై దృష్టి పెట్టాలని అధికారులను ఆదేశించారు. మెగా డీఎస్సీతో ప్రభుత్వ పాఠశాలలను కాపాడే ప్రయత్నం చేస్తామన్నారు. సత్కారం అందుకున్న విద్యార్థుల్లో కామారెడ్డి జిల్లా మాంధపూర్ గ్రామానికి చెందిన సాయి క్రిష్, నిజామాబాద్ జిల్లా దోమకుండకు చెందిన శ్రీకాంత్, వరంగల్ లోని కృష్ణ కాలనీకి చెందిన భువన కృతి, నిజామాబాద్ జిల్లా మచ్చుకురం గ్రామానికి చెందిన మాసం శ్రీవల్లి, నిర్మల్ జిల్లా కొరిటికల్ గ్రామానికి చెందిన సరిత తదితరులు ఉన్నారు.

ఉద్యోగుల అంతర్రాష్ట్ర బదిలీలకు మోక్షం!

- బదిలీల అంశాన్ని పరిశీలించండి
- జీఏడీ అధికారులతో సీఎం రేవంత్

హైదరాబాద్, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): తెలుగు రాష్ట్రాల మధ్య పదేళ్లుగా పెండింగ్‌లో ఉన్న ఉద్యోగుల అంతర్రాష్ట్ర బదిలీల సమస్య త్వరలోనే పరిష్కారమయ్యే సూచనలు కనిపిస్తున్నాయి. ఆంధ్రప్రదేశ్ నుంచి తెలంగాణకు, ఇక్కడి నుంచి ఆంధ్రప్రదేశ్‌కు బదిలీ కావాలనుకున్న ఉద్యోగుల విషయంలో తగిన చర్యలు తీసుకోవాల్సిందిగా సీఎం రేవంత్‌రెడ్డి సాధారణ పరిపాలనా శాఖ అధికారుల(జీఏడీ)కు సూచించినట్లు తెలిసింది. అయితే ఈ బదిలీలకు సంబంధించి రెండు రాష్ట్రాలు పరస్పరం అంగీకారానికి రావాల్సి ఉంది. రాష్ట్ర విభజన సమయంలోనే రెండు రాష్ట్రాలకు ఉద్యోగుల పంపిణీ జరిగినా.. జిల్లా, జోనల్, మల్టీ జోనల్ పోస్టుల్లో ఉన్నవారికి అప్పట్లో ఆప్షన్లు లేకపోవడంతో ఎక్కడివారు అక్కడే ఉండిపోవాల్సి వచ్చింది. అయితే స్వచ్ఛందంగా ఏపీకి వెళ్లాలనుకునే వారు దరఖాస్తు చేసుకోవాల్సిందిగా తెలంగాణ ప్రభుత్వం 2021లో ఉత్తర్వులు జారీ చేసింది. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కూడా ఈ అవకాశం కల్పించింది. దీంతో ఏపీ నుంచి తెలంగాణకు రావడానికి 1881 మంది, తెలంగాణ నుంచి ఏపీకి వెళ్లడానికి 1369 మంది దరఖాస్తు చేసుకున్నారు. కానీ, ఈ అంశంపై గత బీఆర్ఎస్, వైసీపీ ప్రభుత్వాలు ఈ అంశాన్ని ఎటూ తేల్చలేదు. ఇప్పుడు రెండు రాష్ట్రాల్లో కొత్త ప్రభుత్వాలు ఏర్పాటు కావడంతో సమస్య మళ్లీ తెరపైకి వచ్చింది. ఏపీ నుంచి తెలంగాణకు రావాలనుకుంటున్న ఉద్యోగులు ఇటీవల ఇక్కడి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారిని, సీఎంవో ముఖ్యకార్యదర్శి వి.శేషాద్రిని కలిశారు. ఈ అంశాన్ని అధికారులు సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లగా.. త్వరితగతిన పరిష్కరించాలంటూ అధికారులను ఆయన ఆదేశించారు. దీంతో రాష్ట్ర జీఏడీ అధికారులు ఏపీ అధికారులతో సంప్రదింపులు జరుపుతున్నారు.

టెస్కాబ్ ఛైర్మన్‌గా మార్నేని రవీందర్‌రావు



హైదరాబాద్, హనుమకొండ సిటీ జూన్ 10(ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర సహకార అపెక్స్ బ్యాంకు(టెస్కాబ్) ఛైర్మన్‌గా వరంగల్ జిల్లాకు చెందిన మార్నేని రవీందర్‌రావు నియమితులయ్యారు. ప్రస్తుతం ఆయన వరంగల్ డీసీసీబీ ఛైర్మన్‌గా, టెస్కాబ్ డైరెక్టర్‌గా ఉన్నారు. వైస్ ఛైర్మన్‌గా హైదరాబాద్ డీసీసీబీ ఛైర్మన్ కొత్తకుర్మ సత్తయ్య నియమితులయ్యారు. హైదరాబాద్ అబిడ్స్‌లోని టెస్కాబ్ ప్రధాన కార్యాలయంలో సోమవారం ఎన్నిక ప్రక్రియ ఏకగ్రీవంగా ముగిసింది. ఎన్నిక పూర్తయిన తరువాత రాష్ట్ర సహకార సంఘాల రిజిస్ట్రార్ హరిత నుంచి రవీందర్‌రావు నియామక పత్రాన్ని అందుకున్నారు. అనంతరం కొత్తగా ఎన్నికైన ఛైర్మన్, వైస్ ఛైర్మన్‌లతోపాటు డైరెక్టర్లు... ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావుతో పాటు పలువురిని మర్యాదపూర్వకంగా కలిశారు. వరంగల్ ఉమ్మడి జిల్లా చరిత్రలోనే ఇక్కడి డీసీసీ బ్యాంక్ ఛైర్మన్ టెస్కాబ్ ఛైర్మన్‌గా నియమితులు కావడం ఇదే తొలిసారి కావడం విశేషం.

కొండూరి రాజీనామాతో ఏర్పడ్డ ఖాళీ

రాష్ట్రంలో మొత్తం 9 డీసీసీ బ్యాంకులు ఉన్నాయి. కాంగ్రెస్ అధికారం చేపట్టడంతో అనేక పరిణామాలు చోటుచేసుకున్నాయి. ఛైర్మన్లుగా ఉన్న వారిలో ఏడుగురు బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లోకి చేరారు. టెస్కాబ్ ఛైర్మన్‌గా ఉన్న కొండూరు రవీందర్‌రావుతో పాటు వైస్ ఛైర్మన్‌గా ఉన్న నల్గొండ డీసీసీ బ్యాంక్ ఛైర్మన్ గొంగిడి మహేందర్‌రెడ్డి బీఆర్ఎస్‌ను వీడలేదు. ఈ నేపథ్యంలో వారిని పదవులను నుంచి తొలగించేందుకు కొందరు బ్యాంకు డైరెక్టర్లు ఇటీవల సహకార శాఖ రిజిస్ట్రార్‌కు అవిశ్వాస తీర్మానానికి నోటీసు ఇచ్చారు. దాంతో ఈనెల 1న కొండూరి రవీందర్‌రావు, మహేందర్‌రెడ్డి తమ పదవులకు రాజీనామా చేశారు. వాస్తవానికి అవిశ్వాసంపై సోమవారం సమావేశం నిర్వహించాల్సి ఉంది. ముందస్తుగా రాజీనామాలు చేయటంతో సమావేశాన్ని రద్దుచేశారు. ఈలోగా రాష్ట్ర ప్రభుత్వం నుంచి అధ్యక్ష, ఉపాధ్యక్ష పదవులపై క్లియరెన్స్ వచ్చింది. దీంతో మెజార్టీ డైరెక్టర్ల సమక్షంలో ఛైర్మన్‌గా రవీందర్‌రావు, వైస్‌ఛైర్మన్‌గా సత్తయ్యలను ఎన్నుకున్నారు. కాగా, మార్నేని రవీందర్‌రావు స్వస్థలం ఐనవోలు. ఆయన తండ్రి మార్నేని మాధవరావు స్వాతంత్ర్య సమరయోధుడు. భార్య మధుమతి ఐనవోలు ఎంపీపీగా ఉన్నారు. ఆయన 1983 నుంచి టీడీపీలో ఉంటూ అనేక పదవులు చేపట్టారు.1987లో ఐనవోలు సింగిల్ విండో ఛైర్మన్‌గా, 1996 నుంచి 2004 వరకు శ్రీమల్లికార్జున దేవస్థానం ఐనవోలు ధర్మకర్తల మండలి ఛైర్మన్‌గా బాధ్యతలు నిర్వహించారు. 2006లో వర్ధన్నపేట జెడ్‌పీటీసీగా ఎన్నికై, జెడ్పీ ఫ్లోర్ లీడర్‌గా వ్యవహరించారు. 2009లో బీఆర్ఎస్‌లో చేరి వరంగల్ ఉమ్మడి జిల్లా డీసీసీ బ్యాంకు ఛైర్మన్‌గా 2020 ఫిబ్రవరి 29 బాధ్యతలు చేపట్టారు.

రుణమాఫీకి విధివిధానాలు!

రూపొందించాలని అధికారులకు సీఎం ఆదేశం.. ఆగస్టు 15 లోగా రుణమాఫీ చేసి తీరాల్సిందే

- వ్యవసాయ శాఖపై సమీక్షలో సీఎం



వ్యవసాయ సహకారశాఖ అధికారులతో సమీక్షలో సీఎం రేవంత్, చిత్రంలో భట్టి, తుమ్మల, సీఎస్ శాంతికుమారి

హైదరాబాద్, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): రైతులకు ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు ఆగస్టు 15లోపు రుణమాఫీ చేసి తీరాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధికారులతో అన్నారు. ఇందుకు సంబంధించి వెంటనే విధివిధానాలు రూపొందించాలని ఆదేశించారు. పంట రుణమాఫీ, ఇతర అంశాలపై వ్యవసాయ, సహకార శాఖ అధికారులతో ముఖ్యమంత్రి సోమవారం సమీక్ష నిర్వహించారు. రైతు రుణమాఫీ పథకం అమలు చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేయాలన్నారు. రూ.2 లక్షల వరకు రుణాలు ఉన్న రైతుల జాబితాను సిద్ధం చేయాలని, పూర్తి స్థాయిలో బ్యాంకర్ల నుంచి రైతుల వివరాలు సేకరించి అర్హులను గుర్తించాలని సూచించారు. కటాఫ్ తేదీ విషయంలో సమస్యలు తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కేవలం బ్యాంకుల నుంచే కాకుండా, పీఏసీఎస్‌ల నుంచి పంట రుణాలు తీసుకున్న రైతుల వివరాలను కూడా అందుబాటులో ఉండేలా చూడాలని పేర్కొన్నారు. రూ.2 లక్షల రైతు రుణమాఫీ చేసేందుకు పూర్తిస్థాయి వివరాలతోపాటు అవసరమైన అంచనా వ్యయాన్ని కూడా రూపొందించాలని, స్పష్టమైన ప్రణాళికతో ముందుకు రావాలని ఆదేశించారు. రుణమాఫీకి ఎన్ని నిధులు అవసరమవుతున్నాయో చూసుకొని ఆదాయ మార్గాలను అన్వేషించాలన్నారు. మూడు, నాలుగు రోజుల్లో ప్రతిపాదనలు పంపించాలని, కేబినెట్ ముందు పెట్టి చర్చించిన తర్వాత నిర్ణయం తీసుకుంటామని చెప్పారు. ఈ సమీక్షా సమావేశంలో ఉపముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క, వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి, ఆర్థికశాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ రామకృష్ణారావు, వ్యవసాయశాఖ కార్యదర్శి రఘునందన్‌రావు, డైరెక్టర్ గోపి ఇతర అధికారులు పాల్గొన్నారు

నిధులు, పథకాల సాధనకు కృషి చేయాలి

తెలుగు రాష్ట్రాల కేంద్రమంత్రులకు శుభాకాంక్షలు తెలిపిన సీఎం రేవంత్

ఏపీ, తెలంగాణల నుంచి కేంద్రమంత్రులుగా ప్రమాణస్వీకారం చేసిన కిషన్‌రెడ్డి, బండి సంజయ్, రామ్మోహన్ నాయుడు, పెమ్మసాని చంద్రశేఖర్, శ్రీనివాస వర్మలకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా విభజన చట్టంలోని అంశాల అమలు, కేంద్రం నుంచి తెలుగు రాష్ట్రాలకు రావాల్సిన నిధులు, పథకాలు, ప్రాజెక్టుల సాధనకు కృషి చేయాలని కోరారు. ఈమేరకు ఆయన సోమవారం తన 'ఎక్స్' ఖాతాలో ట్వీట్ చేశారు.

బొగ్గు, గనులతో దేశానికి ఆదాయం

- మిషన్-100 డేస్ ఎజెండాతో ముందుకెళ్తా
- సమర్థంగా బాధ్యతలను నిర్వహిస్తా: కిషన్‌రెడ్డి



న్యూఢిల్లీ, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): బొగ్గు, గనులు దేశానికి ఆదాయం తీసుకొచ్చే శాఖలని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి అన్నారు. దేశాభివృద్ధిలో బొగ్గు పాత్ర కీలకమని, నల్లబంగారం వెలికితీత, ఎగుమతి, ఉద్యోగుల సంక్షేమం తదితర అంశాలపై ఆ శాఖ మంత్రిగా తాను పనిచేయాల్సి ఉంటుందన్నారు. మోదీ నాయకత్వంలో తన బాధ్యతలను సమర్థంగా నిర్వహిస్తానని విశ్వాసం వ్యక్తంచేశారు. ప్రైవేటు రంగంలో చాలా సంస్థలు బొగ్గు గనుల వ్యవస్థలో భాగస్వాములుగా ఉన్నాయని, వాటన్నింటినీ సమన్వయం చేసుకుంటూ ముందుకెళ్తానని స్పష్టం చేశారు. సోమవారం ఆయన ఢిల్లీలోని తన నివాసంలో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో పలు విషయాలను వెల్లడించారు. "విద్యుదుత్పత్తి, స్టీల్ కంపెనీలకు బొగ్గు అవసరం ఎక్కువగా ఉంటుంది. గనులు ఎక్కువగా రాష్ట్రాల అధీనంలో ఉంటాయి. ఇసుకతోపాటు చాలా వరకు ఖనిజాల వెలికితీతపై గనుల శాఖ పర్యవేక్షణ ఉంటుంది" అని ఆయన వివరించారు. ఒకట్రెండు రోజుల్లో అధికారులతో సమీక్షించిన తర్వాత.. 'విజన్ 100 డేస్ ఎజెండా'తో ముందుకెళ్తానని తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు ఆదాయాన్ని పెంచే విషయంలో ప్రత్యేక చొరవ తీసుకుంటానన్నారు. "కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం వచ్చాక.. బొగ్గు ఉత్పత్తి పెరిగింది. దాంతో దేశంలో విద్యుత్తు కోతల్లేవు. పారదర్శక విధానాల రూపకల్పనతో బొగ్గు తవ్వకం, సరఫరా, వినియోగంలో అవినీతికి తావు లేకుండా ప్రభుత్వం చర్యలు తీసుకుంది" అని వ్యాఖ్యానించారు. దేశంలో విద్యుత్తు డిమాండ్ పెరుగుతోందని, ఈ నేపథ్యంలో బొగ్గు కొరత లేకుండా చర్యలు తీసుకుంటామన్నారు.

చంద్రబాబు ప్రమాణ స్వీకారానికి వెళ్తా

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా చంద్రబాబు ప్రమాణస్వీకారానికి హాజరవుతానని కిషన్‌రెడ్డి తెలిపారు. తెలుగు రాష్ట్రాలకు కేంద్ర క్యాబినెట్‌లో సముచిత స్థానం లభించిందని అభిప్రాయపడ్డారు. తామంతా తెలుగు రాష్ట్రాల అభివృద్ధికి కృషిచేస్తామన్నారు. "రామ్మోహన్ నాయుడికి పౌరవిమానయాన శాఖ ఇవ్వడం వల్ల హైదరాబాద్, విశాఖ, పుట్టపర్తి తదితర విమానాశ్రయాల అభివృద్ధికి బాటలు పడతాయని విశ్వసిస్తున్నా. వరంగల్‌లో విమానాశ్రయానికి నావంతు కృషి చేస్తా" అని వ్యాఖ్యానించారు.

రాష్ట్రాల అధ్యక్షుల మార్పు

తెలంగాణతోపాటు.. పలు రాష్ట్రాల బీజేపీ అధ్యక్షుల మార్పు త్వరలో ఉంటుందని కిషన్‌రెడ్డి సూత్రప్రాయంగా వెల్లడించారు. సోమవారం ఉదయం ఆయన పలు మీడియా చానళ్లతో మాట్లాడుతూ ఈ విషయం చెప్పారు. "బూత్ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు బీజేపీ అధ్యక్షుల మార్పు ఉంటుంది. జాతీయ స్థాయిలోనూ కొత్త అధ్యక్షుడు వస్తాడు" అని వివరించారు.

25 ఎకరాల్లో వనదేవతల స్మృతివనం

(మొదటిపేజీ తరువాయి)

కసరత్తు చేస్తున్నట్లు తెలిసింది. ములుగు జిల్లాలోని మేడారంలో రెండేళ్లకొకసారి జరిగే సమ్మక్క-సారలమ్మ జాతరకు వందల ఏళ్ల చరిత్ర ఉంది. జాతర సమయంలో వనమంతా జనంతో నిండిపోతుంది. రెండేళ్లకోసారి నాలుగురోజులపాటు జరిగే ఈ జాతరకు దాదాపు 10 రాష్ట్రాల నుంచి కోటి మందికి పైగా గిరిజన, గిరిజనేతర భక్తులు వస్తారు. 'కుంభమేళా' తర్వాత దేశంలో మళ్లీ అంతటి స్థాయిలో ప్రజలు పాల్గొనేది ఈ జాతరలోనే. ఇంత ప్రాశస్త్యం ఉన్న జాతరకు జాతీయ హోదా కల్పించాలన్న డిమాండ్ కొన్నేళ్లుగా ఉంది. ఇప్పటికే రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ పలుమార్లు కేంద్రానికి లేఖలు రాసింది. కానీ, కేంద్రం మాత్రం ఏళ్ల నుంచి తాత్సారం చేస్తూ వస్తోంది. ఈ నేపథ్యంలో జాతరకు జాతీయ హోదా కల్పించే అంశాన్ని మరో సారి ప్రస్తావించడంతోపాటు స్మృతి వనం వివరాలను తెలుపుతూ కేంద్రానికి లేఖ రాయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది.

భక్తులకు సకల సౌకర్యాలు కల్పించేలా..

సమ్మక్క-సారలమ్మ చరిత్రను తెలిపేలా ఇప్పటికే చిలకల గుట్ట చుట్టూ ఉన్న ప్రహరీపై చిత్రాలను గిరిజన శాఖ ఏర్పాటు చేసింది. ఆ చిత్రాలు గోడలకే పరిమితం కావడం, గద్దెల ప్రాంగణానికి చిలకల గుట్టకు చాలా దూరం ఉండడంతో ఎక్కువ మంది భక్తులు వెళ్లలేకపోతున్నారు. ఈ క్రమంలో తల్లుల చరిత్రను కళ్లకు కట్టేలా డిటిటల్ మ్యూజియం ఏర్పాటు చేయనున్నారు. స్మృతివనంలో ముఖ్యంగా అప్పటి శాసనాలు, సమ్మక్క-సారలమ్మ వినియోగించిన వస్తువులను ప్రదర్శించనున్నారు. అప్పటి పాలనాపరమైన అంశాలు, ప్రజల మధ్య బంధాలు ఎలా ఉండేవన్న అంశాలను తెలియజేస్తూ దీన్ని నిర్మించనున్నారు. జాతర రోజుల్లోనే కాకుండా సాధారణ రోజుల్లోనూ కుటుంబంతోపాటు వెళ్లి, ఆ ప్రాంతాన్ని సందర్శించే విధంగా తీర్చిదిద్దాలని యోచిస్తోంది. గెస్ట్ హౌస్‌లు, పిల్లలకు ఆహ్లాదకరమైన వాతావరణం ఉండేలా స్మృతివనాన్ని తీర్చిదిద్దనున్నారు. ముఖ్యంగా చిలకల గుట్టను సుందరీకరించనున్నారు. మొత్తంగా భక్తులకు సకల సౌకర్యాలను కల్పించనున్నారు. మేడారం ప్రాంతాన్ని అభివృద్ధి చేయడం, స్మృతివనం నిర్మాణంతో తల్లుల దగ్గరకు వచ్చేవారి సంఖ్య పెరుగుతుందని, తద్వారా స్థానిక గిరిజనులకు ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయని ప్రభుత్వం భావిస్తోంది.

ఆస్తి తగదాతో ఆగిన అంత్యక్రియలు

- మూడు రోజులుగా మార్చురీలోనే మృతదేహం
- భర్త అంత్యక్రియలు చేసేది లేదని భీష్మించిన భార్య
- 'ఆస్తి' కేసును ఉపసంహరించుకోవాలని డిమాండ్
- అతడి సోదరుడు, చెల్లెళ్లతో బంధువుల చర్చలు
- యాదాద్రి భువనగిరి జిల్లాలోని పంతంగిలో ఘటన

చౌటుప్పల్ రూరల్, జూన్ 10: తండ్రి ఆస్తి కోసం కోర్టుకెక్కిన ఇద్దరు చెల్లెళ్లు, సోదరుడి వల్లే తన భర్త ఆత్మహత్య చేసుకున్నారని, ఆ కేసును ఉపసంహరించుకుంటేనే అంత్యక్రియలు నిర్వహిస్తామని భార్య, బంధువులు తేల్చి చెప్పారు. దీంతో ఆత్మహత్య చేసుకున్న వ్యక్తి మృతదేహం మూడు రోజులుగా మార్చురీలోనే మగ్గుతోంది. యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ మండలం పంతంగికి చెందిన చీరిక హనుమంతరెడ్డి(48) హైదరాబాద్‌లో ప్రైవేటు బస్సు డ్రైవర్‌గా పనిచేస్తూ... అక్కడే అద్దె ఇంట్లో ఉండేవారు. హనుమంతరెడ్డి తండ్రి నర్సిరెడ్డి పేరిట 7.24 ఎకరాల భూమి ఉంది. పోస్ట్ మాస్టర్‌గా ఉద్యోగ విరమణ చేసిన నర్సిరెడ్డి... మూడేళ్ల క్రితం వ్యక్తిగత కారణాలతో ఆత్మహత్య చేసుకున్నారు. తండ్రి ఆస్తిలో తమకూ వాటా కావాలని హనుమంతరెడ్డి తోబుట్టువులు కోర్టును ఆశ్రయించారు. తమ్ముడు కరుణాకర్‌రెడ్డితోనూ హనుమంతరెడ్డికి ఆస్తి తగాదాలున్నాయి. ఈ నేపథ్యంలో కొద్ది రోజులుగా మానసిక వేదనతో ఉన్న హనుమంతరెడ్డి శనివారం రాత్రి పంతంగిలోని ఇంటికి వచ్చి ఉరి వేసుకున్నారు. ఆదివారం తెల్లవారుజామున పక్కింట్లో ఉన్న వారు చూసి పోలీసులకు సమాచారమివ్వడంతో విషయం వెలుగు చూసింది. పోస్టుమార్టం కోసం మృతదేహాన్ని స్థానిక ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అయితే, తన భర్త మృతికి ఆడపడుచులు, మరిదే కారణమని హనుమంతరెడ్డి భార్య స్వప్న పోలీసులకు ఫిర్యాదు చేయగా.. ముగ్గురిపై కేసు నమోదైంది. దీంతో భయపడ్డ ఇద్దరు చెల్లెళ్లు, తమ్ముడు... ఆ కేసును ఉపసంహరించుకోవాలని గ్రామ పెద్దలు, బంధువుల ద్వారా హనుమంతరెడ్డి భార్యపై ఒత్తిడి తెచ్చారు. ఆస్తి విషయమై కోర్టులో ఉన్న కేసును ఉపసంహరించుకుంటేనే అంత్యక్రియలు నిర్వహిస్తామని హనుమంతరెడ్డి భార్య స్వప్న, బంధువులు భీష్మించారు. ఆది, సోమవారాల్లో అతడి సోదరుడు, చెల్లెళ్లతో బంధువులు చర్చించారు. కేసు ఉపసంహరణకు వారు ఒప్పుకొన్నా.. సోమవారం కోర్టు సమయం మించిపోవడంతో వీలు కాలేదు. మంగళవారం కేసు ఉపసంహరించుకున్న తర్వాత అంత్యక్రియలు నిర్వహించేందుకు బంధువులు ఏర్పాట్లు చేస్తున్నారు.

ఎస్కార్ట్ బెయిల్‌పై రాధాకిషన్‌రావు విడుదల

హైదరాబాద్, సైదాబాద్, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): ఫోన్ ట్యాపింగ్ కేసులో చంచల్‌గూడ జైలులో రిమాండ్‌లో ఉన్న టాస్క్‌ఫోర్స్ మాజీ డీసీపీ రాధాకిషన్‌రావు ఎస్కార్ట్ బెయిల్‌పై సోమవారం విడుదలయ్యారు. ఆయన తల్లి దశదిన కర్మ కార్యక్రమాల్లో పాల్గొనేందుకు కోర్టును అభ్యర్థించడంతో సోమవారం నుంచి 14 వరకు ఎస్కార్ట్ బెయిల్ మంజూరు చేసింది. ఆయన తిరిగి 14వ తేదీ సాయంత్రం చంచల్‌గూడ జైలుకు చేరుకుంటారు.

బైరాన్‌పల్లిలో చాళుక్యుల నాటి శిల్పం!

ధూళిమిట్ట, జూన్ 10: సిద్దిపేట జిల్లా ధూళిమిట్ట మండలంలోని బైరాన్‌పల్లిలో చాళుక్యుల నాటి జైన సర్వోతభద్ర శిల్పం బయల్పడింది. ఈ గ్రామంలో అంగడి వీరన్న శివాలయంగా పిలుస్తున్న పురాతన జైనాలయం ఉంది. ఈ ఆలయం ముందు చాలా రోజులుగా గ్రామానికి చెందిన కుందరం నరేశ్ ఆవులను కట్టివేస్తున్నాడు. ఇటీవల కురిసిన వర్షాలకు ఆవులను కట్టివేసిన ప్రదేశంలో చిన్న గుంత ఏర్పడి, అక్కడ ఓ స్తంభంలాంటిది కనిపించింది. దీంతో గ్రామస్థులు దానిని బయటకు తీసి, పురావస్తు శాఖకు సమాచారమందించారు. స్తంభాన్ని పరిశీలించిన పురావస్తు శాఖ అధికారి శ్రీనివాస్.. దాన్ని 5 అడుగుల ఎత్తైన జైన చౌముఖి (నాలుగు వైపుల చెక్కిన) శిల్పంగా గుర్తించారు. నాలుగు అంతస్తులుగా చెక్కిన ఈ శిల నలువైపులా 24వ జైన తీర్థంకరుడు, ధ్యాన శిల్పాలు ఉన్నాయి. శిల శిఖరాన వృషభ మూర్తి రూపం చెక్కి ఉంది. అంతస్తులో మహా వీరుడు ఉన్నాడనీ, ఆయనకి ఇరువైపులా చామరలు వీస్తున్నారని, కింద నాలుగు వైపులా మూడు సింహాలు చెక్కి ఉన్నాయని శ్రీనివాస్ తెలిపారు.


లభ్యమైన చాళుక్యుల కాలం నాటి సర్వోతభద్ర శిల్పం

మద్యం మత్తులో చెరువులో నిద్రించిన వ్యక్తి

- మృతదేహం అనుకుని పోలీసులకు సమాచారం
- బయటకు లాగగా లేచి నిలబడడంతో అంతా అవాక్కు

వరంగల్ క్రైం, జూన్ 10: హనుమకొండ రెడ్డిపురం చెరువు వద్ద సోమవారం మద్యం మత్తులో ఓ వ్యక్తి చేసిన పనికి పోలీసులతో పాటు స్థానికులు అవాక్కయ్యారు. సుమారు ఐదు గంటలపాటు అతడు కదలకుండా చెరువు నీటిలో పడుకోవడంతో మృతదేహం అనుకుని స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు అక్కడికి చేరుకుని ఆ వ్యక్తిని చేయిపట్టి బయటకు లాగే ప్రయత్నం చేయగా ఒక్క ఉదుటన లేచి నిలబడడంతో అంతా నివ్వెరపోయారు. తన పేరు శ్రీనివాస్ అని, తాను ఏపీలోని పీఎస్‌ఆర్ నెల్లూరు జిల్లా కావలికి చెందిన వాడినని పోలీసులకు తెలిపాడు. తాను కాజీపేటలోని ఓ గ్రానైట్ కంపెనీలో కూలీగా పనిచేస్తున్నాని, ఎండ వేడికి తట్టుకోలేక చెరువులో నిద్రిస్తే బయటకు ఎందుకు లాగారని పోలీసులతో వాగ్వాదానికి దిగాడు. కాజీపేటకు వెళ్లేందుకు తన వద్ద డబ్బులు లేవని రూ.50 ఇవ్వాలని పోలీసులనే అడగడంతో వారు అతడిని మందలించి అక్కడి నుంచి పంపించేశారు.

విపత్తు నిర్వహణ, అగ్నిమాపక సేవల శాఖతో బ్యాంక్ ఆఫ్ బరోడా ఒప్పందం

- సిబ్బంది, పెన్షనర్లకు వ్యక్తిగత ప్రమాద బీమా

హైదరాబాద్ సిటీ, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): బ్యాంక్ ఆఫ్ బరోడా తెలంగాణ రాష్ట్ర విపత్తు నిర్వహణ, అగ్నిమాపక సేవలశాఖతో అవగాహన ఒప్పందం చేసుకుంది. ఈ ఒప్పందం మేరకు తెలంగాణ రాష్ట్ర విపత్తు నిర్వహణ, అగ్నిమాపక సేవల శాఖలో సేవలందిస్తున్న సిబ్బంది, పెన్షనర్లకు ప్రత్యేక ఆఫర్లు, వ్యక్తిగత ప్రమాద బీమా కవరేజీ, రిటైల్ రుణాలపై ఆఫర్లు, డెబిట్, క్రెడిట్ కార్డులతో సహా ఇతర ప్రయోజనాలను అందిస్తారు. తెలంగాణ రాష్ట్ర విపత్తు నిర్వహణ, అగ్నిమాపక సేవలశాఖ డైరెక్టర్ జనరల్ వై.నాగిరెడ్డి, బ్యాంక్ ఆఫ్ బరోడా హైదరాబాద్ జోన్ జనరల్ మేనేజర్ రితేష్ కుమార్ ఈమేరకు సోమవారం ఎంఓయూ చేసుకున్నారు. విధి నిర్వహణలో ప్రమాదవశాత్తు మరణిస్తే రూ. 1.30 కోట్ల వరకు వ్యక్తిగత ప్రమాద బీమా కవరేజీ, రూ. 1.26 కోట్ల వరకు ఆఫ్ డ్యూటీ ప్రయోజనాలు కలుగుతాయి. శాశ్వత వైకల్య కవరేజీ రూ. 80 లక్షల వరకు లభిస్తుంది.

బీఆర్‌ఎస్ పాలనలో వెంచర్లకూ రైతుబంధు

- కాంగ్రెస్ సర్కారు అలా చేయదు: ఆది శ్రీనివాస్

హైదరాబాద్, జూన్ 10(ఆంధ్రజ్యోతి): బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో రియల్ ఎస్టేట్ వెంచర్లు, కొండలు, గుట్టలకు రైతుబంధు ఇచ్చారని, కాంగ్రెస్ ప్రభుత్వం అలా చేయదని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. ఇచ్చిన మాటకు కట్టుబడి ఉండే ప్రభుత్వం కాంగ్రెస్‌దని, రైతు రుణమాఫీ ఆగస్టు 15వ తేదీ లోపు చేసి తీరుతామని ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఇప్పటివరకు 68 లక్షల మంది రైతులకు రూ.7,625 కోట్ల రైతుబంధు ప్రభుత్వం ఇచ్చిందని గుర్తు చేశారు. హరీశ్‌రావు తాను చేసిన చాలెంజ్‌కు కట్టుబడి ఉండాలని, స్పీకర్ ఫార్మట్‌లో రాజీనామా లేఖను సిద్ధం చేసుకోవాలన్నారు. లోక్‌సభ ఎన్నికల్లో బీఆర్‌ఎస్, బీజేపీ కలిసి కాంగ్రెస్‌ను ఓడించాలనుకున్నాయని టీపీసీసీ మేధావుల సెల్ చైర్మన్ అనంతుల శ్యామ్‌మోహన్ ఆరోపించారు. ఆ రెండు పార్టీలు కుమ్మక్కవడం వల్లే కాంగ్రెస్‌కు సీట్లు తగ్గాయన్నారు. చేపల పెంపకం పేరుతో బీఆర్‌ఎస్ కుంభకోణానికి పాల్పడిందని కాంగ్రెస్ నేత మెట్టు సాయికుమార్ ఆరోపించారు. దీనిపై త్వరలోనే విజిలెన్స్ విచారణ చేపట్టి నిజాలు తేలుస్తామని చెప్పారు. నీట్ పరీక్ష నిర్వహించడంలో కేంద్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని, ఇందులో తెలుగు విద్యార్థులకు తీరని అన్యాయం చేశారని టీపీసీసీ అధికార ప్రతినిధి చనగాని దయాకర్ ఆరోపించారు. నీట్ పరీక్షను రద్దు చేసి మళ్లీ నిర్వహించాలన్నారు.

చిట్టెమ్మ.. రోబో టీచర్!

- హైదరాబాద్‌లో భారత్ తయారీ రోబోలతో బోధన

హైదర్‌నగర్, జూన్ 10(ఆంధ్రజ్యోతి): సూపర్ స్టార్ రజనీకాంత్ సినిమాలో "చిట్టి" హంగామా చూశారు కదా..? ఆ 'రోబో' అంతా సూపర్ ఫాస్ట్..! ఏదైనా చకచకా చేసేస్తుంది..! టకటకా చెప్పేస్తుంది..! ఇప్పుడు ఇలాంటి రోబో టీచర్లు 'చిట్టెమ్మ'లను హైదరాబాద్‌లోని నెక్స్ట్ జెన్ స్కూల్స్‌లో ప్రవేశపెట్టారు. కేపీహెచ్‌బీ, ప్రగతినగర్‌లోని పాఠశాలల్లో వీటి సేవలు అందుబాటులో ఉంటాయని నెక్స్ట్ జెన్ స్కూల్స్ వ్యవస్థాపకుడు కంకణాల రఘు తెలిపారు. ఇవి పూర్తిగా భారత్‌లో తయారైన ఈ రోబోలని, కృత్రిమ మేధ (ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్) ఆధారంగా పనిచేస్తాయని చెప్పారు. కేపీహెచ్‌బీలోని ఓ హోటల్‌లో సోమవారం మీడియా సమావేశంలో రెండు రోబో టీచర్లను పరిచయం చేశారు. కేరళలోని కొచ్చికి చెందిన మేకర్స్ ల్యాబ్ స్టార్టప్ కంపెనీ వీటిని తయారుచేసిందన్నారు. సాంకేతికతను చిన్నారులకు చేరువ చేసే ఉద్దేశంతో రోబో టీచర్స్‌ను ప్రవేశపెట్టామన్నారు. చాట్ జీపీటీ, అలెక్సాతో పోలిస్తే ఇవి అత్యుత్తమ సేవలందిస్తాయని చెప్పారు. విద్యార్థులు, ఉపాధ్యాయులకు ఎలాంటి సందేహాలున్నా చకచకా జవాబు ఇస్తుందన్నారు. జనరల్ నాలెడ్జి, సబ్జెక్టుల్లో ఏ సందేహమైనా ఇంగ్లిష్, హిందీ, ఫ్రెంచ్ భాషల్లో విపులంగా వివరిస్తుందని తెలిపారు. త్వరలోనే తెలుగుతో పాటు మరో 20 ప్రాంతీయ భాషలను కూడా బోధించేలా సాఫ్ట్‌వేర్ అప్‌డేట్ చేస్తున్నట్లు మేకర్స్ ల్యాబ్ స్టార్టప్ ప్రతినిధి హరిసాగర్ చెప్పారు. విద్యార్థుల తల్లిదండ్రుల ఫీడ్ బ్యాక్‌ను కూడా రోబో తీసుకునేలా చూస్తామని ప్రధానోపాధ్యాయురాలు సురేఖ తెలిపారు. తద్వారా మెరుగైన విద్య అందించే అవకాశం ఉంటుందని, తల్లిదండ్రుల సూచనలు, సలహాలు గౌరవించినట్లు కూడా ఉంటుందని పేర్కొన్నారు. కాగా, కార్యక్రమంలో విద్యార్థులు రోబో టీచర్లకు ప్రశ్నలు వేశారు. సందేహాలను అవి నివృత్తి చేస్తున్న తీరును చూసి ఉబ్బితబ్బిబయ్యారు.



రోబో టీచర్లతో పాఠశాల టీచర్లు

తెలంగాణకు కీలక శాఖలు!

కేబినెట్ మంత్రి కిషన్‌రెడ్డికి బొగ్గు, గనుల శాఖ.. హోంశాఖ సహాయ మంత్రిగా బండి సంజయ్

- రాష్ట్రానికి మూడోసారి హోం
- రెండోసారి బొగ్గు శాఖ నిర్వహించే చాన్స్
- కేంద్ర మంత్రి అమిత్ షాతో ఈటల భేటీ

హైదరాబాద్, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): కేంద్ర మంత్రివర్గంలో తెలంగాణకు రెండు కీలక పదవులు దక్కాయి. కేంద్ర ఖజానాకు ఆదాయాన్ని సమకూర్చే బొగ్గు, గనుల శాఖను కిషన్‌రెడ్డికి కేటాయిస్తూ ప్రధాని నరేంద్రమోదీ నిర్ణయం తీసుకున్నారు. శాంతి భద్రతలను పరిరక్షించే హోంశాఖకు సహాయ మంత్రిగా బండి సంజయ్‌ని నియమించారు. కాగా, దేశ అభివృద్ధిలో బొగ్గు ఉత్పత్తి కీలకంగా మారడం, సింగరేణి వంటి సంస్థలు ఇక్కడే కొనసాగుతున్న నేపథ్యంలో కిషన్‌రెడ్డికి బొగ్గు గనుల శాఖను కేటాయించడం రాష్ట్రాభివృద్ధికి మరింత దోహదపడుతుందని బీజేపీ వర్గాలు పేర్కొంటున్నాయి. ఈ శాఖను గతంలో దివంగత నేత దాసరి నారాయణరావు కూడా నిర్వహించారు. తొలుత 2004లో సహాయ మంత్రి హోదాలో ఈ శాఖను నిర్వహించగా, ఆ తర్వాత ఇండిపెండెంట్ మంత్రిగా వ్యవహరించారు. రాజ్యసభ సభ్యుడిగా ఆయన కేంద్ర మంత్రిగా బాధ్యతలు నిర్వహించారు. అనంతరం తెలంగాణ ప్రాంతం నుంచి బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్ కూడా బొగ్గు గనుల శాఖ సహాయ మంత్రిగా వ్యవహరించారు. తాజాగా కిషన్‌రెడ్డిని ఈ శాఖ వరించింది. మోదీ 2.0 ప్రభుత్వంలో కిషన్‌రెడ్డి తొలుత హోంశాఖ సహాయ మంత్రిగా పనిచేశారు. ఆ తర్వాత ఆయనకు పర్యాటకం-సాంస్కృతిక, ఈశాన్య రాష్ట్రాల అభివృద్ధి శాఖ మంత్రి కేబినెట్ హోదా కల్పించారు. ఇక తెలంగాణలో అధికార పీఠాన్ని కైవసం చేసుకునే దిశగా అడుగులు వేస్తున్న బీజేపీ అగ్రనాయకత్వం.. అందులో భాగంగానే బండి సంజయ్‌కి హోంశాఖ సహాయ మంత్రిగా బాధ్యతలు అప్పగించిందని ఆ పార్టీ వర్గాలు చెబుతున్నాయి. బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడిగా సంజయ్ దూకుడుగా వ్యవహరించడం తెలిసిందే. ప్రజా సమస్యలపై పోరాటాలు చేసిన పలు సందర్భాల్లో ఆయన పోలీసు నిర్బంధాలను ఎదుర్కొన్నారు. ఒకటి రెండు సందర్భాల్లో ఎస్పీ స్థాయి అధికారులు ఆయనపై చేయి కూడా చేసుకున్నారు. అప్పట్లో ఈ ఘటనపై సంజయ్ లోక్‌సభ స్పీకర్‌కు ఫిర్యాదు చేయగా.. సదరు అధికారి ప్రివిలేజ్ కమిటీ ముందు హాజరయ్యారు. ఈ నేపథ్యంలో.. సంజయ్‌కి హోంశాఖ సహాయమంత్రి పదవిని కేటాయిస్తే.. రాష్ట్ర పోలీసులు మునుపటిలా ఆయన విషయంలో దురుసుగా ప్రవర్తించే అవకాశాలుండవని బీజేపీ సీనియర్ నేత ఒకరు 'ఆంధ్రజ్యోతి'తో వ్యాఖ్యానించారు. కాగా, గతంలో బీజేపీ సీనియర్ నేత, మహారాష్ట్ర మాజీ గవర్నర్ సీహెచ్ విద్యాసాగర్‌రావు 1999లో వాజపేయి కేబినెట్‌లో కేంద్ర హోంశాఖ సహాయమంత్రి పదవిని చేపట్టారు. మోదీ 2.0లో కిషన్‌రెడ్డి కూడా తొలుత ఈ శాఖ మంత్రిగా పనిచేశారు. తాజాగా బండి సంజయ్‌కి దక్కడంతో గడచిన రెండున్నర దశాబ్దాల్లో తెలంగాణ వ్యక్తులకు ఈ శాఖ మూడోసారి దక్కినట్లయింది.


కిషన్‌రెడ్డి, బండి సంజయ్‌ను సన్మానిస్తున్న బీజేపీ నేతలు, అమిత్ షాతో సమావేశంలో ఈటల రాజేందర్

అమిత్ షాతో ఈటల భేటీ

మల్కాజిగిరి నుంచి ఎంపీగా ఎన్నికైన ఈటల రాజేందర్ సోమవారం ఢిల్లీలో కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షాను మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. తెలంగాణ రాష్ట్ర బీజేపీ శాఖకు నూతన అధ్యక్షుడిగా ఈటల రాజేందర్‌ను నియమిస్తారనే ప్రచారం జరుగుతున్న నేపథ్యంలో ఆయన అమిత్ షాను కలవడం ప్రాధాన్యం సంతరించుకుంది.

నమ్మకాన్ని నిలబెట్టుకుంటా: బండి సంజయ్

ప్రధాని మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా, పార్టీ జాతీయ నాయకత్వం తనపై ఉంచిన నమ్మకాన్ని నూటికి నూరుపాళ్లు నిలబెట్టుకుంటానని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ అన్నారు. తనకు అప్పగించిన బాధ్యతలను సమర్థంగా నిర్వహిస్తానని, తన శాఖ ద్వారా రాష్ట్ర ప్రజలకు న్యాయం చేసేందుకు శాయశక్తులా కృషి చేస్తానని 'ఆంధ్రజ్యోతి'తో చెప్పారు.


బావిలోపడిన వృద్ధురాలిని పైకిలాగుతున్న సిబ్బంది

40 అడుగుల బావిలో.. 2 గంటల వేదన!

కళ్లు కనపడక బావిలో పడిన వృద్ధురాలు

ప్రాణాలకు తెగించి కాపాడిన యువకుడు

హుజూర్‌నగర్, జూన్ 10: అసలే వయసు పైబడింది.. ఆపై కళ్లు సరిగా కనిపించవు.. రాత్రిపూట బయటికొచ్చిన ఓ వృద్ధురాలు ఇంటి ఆవరణలోని బావిలో పడిపోయింది. దాదాపు 2 గంటల పాటు నరకయాతన అనుభవించింది. ఆమెను బయటకు తీసేందుకు పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది చేసిన ప్రయత్నాలు విఫలమవడంతో.. చివరికి ఓ యువకుడు ప్రాణాలకు తెగించి కాపాడాడు. సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్‌లో ఈ ఘటన చోటు చేసుకుంది. గౌరిపెద్ది కనకదుర్గ (70) గాంధీ పార్కు సెంటర్‌లో నివాసముంటోంది. భర్త ప్రసాద్ ఆరేళ్ల క్రితం మృతి చెందగా, వారికి పిల్లలు లేరు. ఇంట్లో ఒంటరిగా ఉంటున్న కనకదుర్గ ఆదివారం రాత్రి 10.30 గంటల సమయంలో ఇంటి ఆవరణలో ఉన్న 40 అడుగుల లోతున్న నీళ్లు లేని బావిలో పడి కేకలు వేసింది. చుట్టుపక్కల వారు అది విని 108కి ఫోన్ చేశారు. పోలీసులు అగ్నిమాపక సిబ్బందికి కూడా సమాచారం అందించడంతో అంతా అక్కడికి చేరుకున్నారు. అయితే, బావిలోని కనకదుర్గను బయటకు తీసేందుకు ప్రయత్నించినా ఫలితం లేకపోయింది. గోవిందపురం కాలనీకి చెందిన గోపి సాహసం చేసి వృద్ధురాలిని కాపాడేందుకు బావిలోకి దిగాడు. పోలీసులు ఒక కుర్చీకి తాడు కట్టి బావిలోకి వేయగా కనకదుర్గను కుర్చీ మీద కుర్చోబెట్టి రెండువైపులా తాళ్లు కట్టి క్షేమంగా బయటికి తీశారు. వృద్ధురాలిని కాపాడిన గోపిని స్థానికులు అభినందించారు.

'గొర్రెల' అక్రమాల వెనుక అండదండలెవరివి?

మళ్లించిన సొమ్ములో ఎవరి వాటా ఎంత?

రాంచందర్, కల్యాణ్‌కు ఏసీబీ ప్రశ్నలు

హైదరాబాద్, జూన్ 10 (ఆంధ్రజ్యోతి) : గొర్రెల పంపిణీ పథకంలో రూ.700 కోట్ల కుంభకోణం కేసు దర్యాప్తులో మరో కీలక పరిణామం చోటు చేసుకుంది. ఈ కేసులో అరెస్టై జ్యుడీషియల్ రిమాండ్‌లో ఉన్న తెలంగాణ స్టేట్ లైవ్‌స్టాక్ డెవలప్‌మెంట్ ఏజెన్సీ మాజీ సీఈవో రాంచందర్‌తోపాటు మాజీ మంత్రి, ప్రస్తుత ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ మాజీ ఓఎస్డీ జి.కల్యాణ్ కుమార్‌ను ఏసీబీ అధికారులు మూడు రోజుల కస్టడీకి తీసుకున్నారు. రూ.2.10 కోట్ల మేర అక్రమాలు జరిగాయన్న ఆరోపణలతో ఈ కేసు దర్యాప్తు ప్రారంభం కాగా.. మొత్తం రూ. 700 కోట్ల మేర అక్రమాలు జరిగినట్లు ఏసీబీ అధికారులు గుర్తించారు. ఈ మేరకు దర్యాప్తులో సేకరించిన ఆధారాల ఆధారంగా రాంచందర్, కల్యాణ్‌ను వేర్వేరుగా ఏసీబీ అధికారులు ప్రశ్నిస్తున్నారు. తమ వద్ద ఉన్న సమాచారంతో ప్రత్యేక ప్రశ్నావళి రూపొందించి, వారి నుంచి సమాధానాలు రాబట్టే ప్రయత్నం చేస్తున్నారు. మొదటి రోజు విచారణలో కేసుకు సంబంధించిన ప్రాథమిక అంశాలపైనే దర్యాప్తు అధికారులు ఎక్కువగా దృష్టి సారించారు. వందల కోట్ల రూపాయల అక్రమాల వెనక ఎవరి అండదండలు ఉన్నాయి? నకిలీ బిల్లులు, ఓచర్లతో ప్రైవేటు వ్యక్తుల ఖాతాలో జమ చేసిన సొమ్ము ఎవరెవరు ఎంత పంచుకున్నారు? అనే కోణంలో ప్రశ్నించినట్లు తెలిసింది. ఏసీబీ విచారణలో వ్యక్తిగత సమాచారం, ఉద్యోగం, ఆస్తులకు సంబంధించిన వివరాలు వెల్లడించిన రాంచందర్, కల్యాణ్... కేసుకు సంబంధించిన కీలక ప్రశ్నలకు జవాబు చెప్పకుండా మౌనం వహించినట్లు తెలిసింది. గొర్రెల పంపిణీ పథకం ప్రారంభం, అక్రమాల వ్యూహాలు, వచ్చిన సొమ్ములో వాటాలు, నిధుల దారిమళ్లింపు ఇలా కేసు దర్యాప్తునకు అవసరమైన అన్ని అంశాలపై రాంచందర్, కల్యాణ్‌ను విచారించి వివరాలు రాబట్టే ప్రయత్నంలో దర్యాప్తు అధికారులున్నారు. అక్రమాల్లో రాజకీయ నాయకులు, ప్రభుత్వ అధికారుల పాత్ర ఏంటన్న కోణంలోనూ ప్రశ్నించనున్నారు. అలాగే, కేసుకు సంబంధించిన కీలక నిందితుల్లో ఒకరైన ప్రైవేటు వ్యక్తి మొహిదొద్దీన్ గురించి కస్టడీలో రాంచందర్, కల్యాణ్ నుంచి సమాచారం రాబట్టేందుకు దర్యాప్తు అధికారులు సిద్ధమవుతున్నారు. గొర్రెల పథకంలో 'లోలోన' సంస్థ ప్రమేయం ఏమిటీ, ఓ ప్రైవేటు వ్యక్తి కనుసన్నల్లో ప్రభుత్వ అధికారులు పనిచేసేలా ఎందుకు మౌఖిక ఆదేశాలు ఇచ్చారనే విషయంపైనా వీరి నుంచి సమాధానాలు రాబట్టనున్నారు. కేసుకు ముందు, తర్వాత మొహిదొద్దీన్‌తో జరిగిన సంప్రదింపులు, అతడి అనుచరుల సమాచారాన్ని రాబట్టే పనిలో ఉన్నారు. కాగా, మూడు రోజుల కస్టడీలో భాగంగా ఇద్దరు నిందితులను ఉదయం చంచల్‌గూడ జైలు నుంచి ఏసీబీ కార్యాలయానికి తీసుకొచ్చి, విచారణ అనంతరం తిరిగి సాయంత్రం జైలుకు తరలిస్తున్నారు. మంగళ, బుధ వారాల్లోనూ ఇదే తీరులో ఉదయం నుంచి సాయంత్రం వరకు విచారించనున్నారు.

డిజైన్ల ప్రకారమే నిర్మించారా?

- బ్యారేజీల నిర్మాణాల్లో మీ పాత్ర ఏంటి?
- మాజీ ఈఎన్‌సీలు, అధికారులపై జస్టిస్ ఘోష్ ప్రశ్నల వర్షం

హైదరాబాద్, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): కాళేశ్వరం ప్రాజెక్టులో భాగంగా నిర్మించిన బ్యారేజీలకు సంబంధించి జస్టిస్ పినాకి చంద్రఘోష్ నీటిపారుదల శాఖ అధికారులపై ప్రశ్నల వర్షం కురిపించారు. బ్యారేజీలు ఎలా నిర్మించారు? ఆ నిర్మాణాల్లో మీ పాత్ర ఏంటి? షీట్ పైల్స్ బదులుగా సీకెంట్ పైల్స్‌ను ఎందుకు వాడారు? డిజైన్ల ప్రకారమే నిర్మాణం చేశారా? వంటి ప్రశ్నలు సంధించారు. సోమవారం జస్టిస్ పీసీ ఘోష్ మాజీ ఈఎన్‌సీలు సి.మురళీధర్‌రావు, నల్లా వెంకటేశ్వర్లు, నరేందర్‌రెడ్డితో పాటు ఈఈలు యాదగిరి, ఓంకారేశ్వర సింగ్, తిరుపతిని విచారించారు. దీనికన్నా ముందు సాంకేతిక అంశాలపై ప్రశ్నపత్రం సిద్ధం చేసుకున్న ఆయన.. వాటికి అధికారుల నుంచి సమాధానాలు రాబట్టుకున్నారు. డిజైన్ ప్రకారమే బ్యారేజీల నిర్మాణం జరిగిందా? నిర్మాణం జరుగుతున్న క్రమంలో చోటుచేసుకున్న మార్పులేంటి? వంటి వివరాలను ఆరా తీశారు. ఉదయం నుంచి మధ్యాహ్నం 3 గంటల దాకా విచారణ జరిగింది. ఇక రాష్ట్ర డ్యామ్ సేఫ్టీ ఆర్గనైజేషన్(ఎస్‌డీఎస్‌వో)తో పాటు సెంట్రల్ డిజైన్ ఆర్గనైజేషన్(సీడీవో), క్వాలిటీ కంట్రోల్ విభాగాలకు చెందిన 24 మంది అధికారులకు మంగళవారం కమిషన్ ముందు హాజరు కావాలని సమాచారమిచ్చారు.

సాంకేతిక అంశాలపైనే తొలుత దృష్టి: జస్టిస్ ఘోష్

కాళేశ్వరం ప్రాజెక్టులోని మూడు బ్యారేజీలను పరిశీలించామని, ఆయా బ్యారేజీల నిర్మాణంలో భాగస్వాములైన ఇంజనీర్ల నుంచి వివరాలు తీసుకుంటున్నామని జస్టిస్ ఘోష్ చెప్పారు. ప్రస్తుతం సాంకేతిక అంశాలపై పూర్తిస్థాయిలో దృష్టి సారించి, వివరాలను సేకరిస్తున్నామని తెలిపారు. ఆ తర్వాత ఉల్లంఘనలు, అవినీతి, అక్రమాలపై దృష్టి పెడతామని గుర్తుచేశారు. సోమవారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. నిర్మాణ సంస్థల ప్రతినిధులను కూడా పిలవనున్నట్లు జస్టిస్ ఘోష్ చెప్పారు. లోపాలు ఎక్కడున్నాయో తెలుసుకునే ప్రయత్నం చేస్తున్నానని, పూర్తిగా నిర్ధారణ వచ్చాకే నివేదిక సమర్పించనున్నట్లు ప్రకటించారు. నివేదిక ఇచ్చేందుకు పెట్టిన గడువు 30న ముగియనున్న నేపథ్యంలో ప్రభుత్వానికి ఏమైనా విజ్ఞప్తి చేస్తారా? అని ప్రశ్నించగా.. కమిషన్‌కు తగినంత సమయం ఇచ్చే బాధ్యత ప్రభుత్వానిదన్నారు. గడువు ఇవ్వాలా? వద్దా? అనే అంశాలపై నిర్ణయం ప్రభుత్వమే తీసుకుంటుందని స్పష్టం చేశారు. కమిషన్‌కు సహాయంగా నిపుణుల కమిటీని వేశామని, ఆ కమిటీ నివేదిక ఇస్తుందని చెప్పారు. కమిషన్‌కు 54 దాకా ఫిర్యాదులు వచ్చాయని, ప్రభుత్వం ఇచ్చిన విచారణ విధివిధానాలకు భిన్నంగా పలు ఫిర్యాదులు అందాయని, ఆయా అంశాలపై నిర్ణయం తీసుకునే బాధ్యత ప్రభుత్వానిదేనని తెలిపారు. విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం నుంచి వివరాలు తీసుకుంటామన్నారు.

మేడిగడ్డ బ్యారేజీలో గేటు విడిభాగాల తొలగింపు

మహదేవపూర్ రూరల్: మేడిగడ్డ బ్యారేజీ బ్లాక్-7లో ఒక గేటు కటింగ్ పనులు పూర్తి కాగా దాన్ని తొలగించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ప్లాట్‌ఫామ్ ఏరియా నుంచి గేటు వద్దకు విడిభాగాలను తరలించేందుకు క్రేన్లు, భారీ వాహనాలు వెళ్లేందుకు వీలుగా రోడ్డు వేస్తున్నారు. మంగళవారంతో రోడ్డు పనులు పూర్తి చేసి కట్ చేసి గేటు విడిభాగాలను నది ఒడ్డుకు తరలించే ఏర్పాట్లు చేస్తున్నారు. అలాగే సీఎస్‌ఎంఆర్‌ఎస్ సభ్యుడు హరిదేవ్ నేతృత్వంలోని ఏడుగురు నిపుణుల బృందం ఆధ్వర్యంలో చేపట్టిన పరీక్షలు ఆరో రోజు కొనసాగాయి. అన్నారం బ్యారేజీలో గ్రౌటింగ్ పనులు ఇప్పటికే పూర్తికాగా ఎన్‌డీఎస్‌ఏ సూచించిన పరీక్షలు కొనసాగుతున్నాయి. ప్రస్తుతం బ్యారేజీలో లీకేజీ ఏర్పడ్డ నాలుగు వెంట్లలో 25 మీటర్ల మేర డ్రిల్లింగ్ చేసి బ్యారేజీ కిందున్న మట్టి నమూనాలను సేకరిస్తున్నారు.

ప్రభుత్వ నిర్ణయాలే అమలు చేశా!

జస్టిస్ నర్సింహారెడ్డి కమిషన్‌కు తెలిపిన ట్రాన్స్‌కో మాజీ సీఎండీ ప్రభాకర్‌రావు


హైదరాబాద్, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): ఛత్తీస్‌గఢ్ విద్యుత్తు, యాదాద్రి, భద్రాద్రి విద్యుత్కేంద్రాలకు సంబంధించిన అంశాల్లో తాను స్వయంగా నిర్ణయాలు తీసుకోలేదని ట్రాన్స్‌కో, జెన్‌కో మాజీ సీఎండీ దేవులపల్లి ప్రభాకర్‌రావు చెప్పారు. నాటి పరిస్థితులు, ప్రభుత్వ నిర్ణయానికి అనుగుణంగానే ముందుకు వెళ్లామని తెలిపారు. విద్యుత్తు అంశాలపై విచారణ జరుపుతున్న జస్టిస్ ఎల్. నర్సింహారెడ్డి ఎదుట హాజరైన ప్రభాకర్‌రావు వివరణ ఇచ్చారు. ఆయనతో పాటు ఇంధన శాఖ మాజీ ముఖ్యకార్యదర్శి సురేశ్ చందా కూడా హాజరయ్యారు. కాంపిటీటివ్ బిడ్డింగ్ ప్రక్రియను అనుసరించకుండా నామినేషన్ పద్ధతిలో ఛత్తీస్‌గఢ్ డిస్కంల నుంచి 1000 మెగావాట్ల విద్యుత్తు కొనుగోళ్లకు 2014లో ఒప్పందం చేసుకోవడంతో పాటు అవసరానికి మించి 2000 మెగావాట్ల విద్యుత్తు కారిడార్ (అంతర్రాష్ట్ర విద్యుత్తు సరఫరా లైన్లు) కోసం పవర్ గ్రిడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (పీజీసీఐఎల్)కు దరఖాస్తు చేసుకోవాలని తెలంగాణ డిస్కమ్‌లను నాటి ప్రభుత్వం ఏకపక్షంగా ఆదేశించడం వల్ల ఆర్థిక నష్టం జరిగిందని రాష్ట్ర ప్రభుత్వం గుర్తించింది. సమర్థవంతమైన సూపర్ క్రిటికల్ టెక్నాలజీని పక్కనపెట్టి సబ్ క్రిటికల్ టెక్నాలజీతో మణుగూరు వద్ద భద్రాద్రి థర్మల్ విద్యుత్కేంద్రం నిర్మించాలని నిర్ణయం తీసుకోవడం, ఓపెన్ కాంపిటీటివ్ బిడ్డింగ్‌కి బదులుగా నామినేషన్ పద్ధతిలో భద్రాద్రి విద్యుత్కేంద్రం నిర్మాణ పనులను కాంట్రాక్టర్లకు అప్పగించడం వంటి నిర్ణయాలు దీర్ఘకాలంలో భారం కానున్నాయని, ఇక 179 నుంచి 388 కి.మీ.ల దూరంలో ఉన్న సింగరేణి బొగ్గు గనుల నుంచి బొగ్గును తరలించి విద్యుదుత్పత్తి చేయడానికి నల్లగొండ జిల్లా దామరచర్లలో యాదాద్రి థర్మల్ విద్యుత్కేంద్రాన్ని నిర్మించాలని నిర్ణయం తీసుకోవడంతో బొగ్గు రవాణా వ్యయం భారంగా మారనుందని రేవంత్ సర్కారు నిర్ణయానికి వచ్చింది. పోటీ బిడ్డింగ్‌కు బదులుగా నామినేషన్ పద్ధతిలో యాదాద్రి విద్యుత్కేంద్రం నిర్మాణ పనులను ఈపీసీ విధానంలో కాంట్రాక్టర్లకు కట్టబెట్టారని ప్రభుత్వం ఆగ్రహంతో ఉంది. ఈ అంశాలన్నింటిపైనా వివరణ ఇవ్వాలని కోరుతూ జస్టిస్ ఎల్.నర్సింహారెడ్డి కమిషన్ ఇదివరకే ప్రభాకర్‌రావుతో పాటు కీలక అధికారులకు లేఖలు రాసింది. ఇప్పటికే లిఖితపూర్వకంగా సమాచారం అందించిన ప్రభాకర్‌రావు.. సోమవారం జస్టిస్ ఎల్.నర్సింహారెడ్డితో సమావేశమై, వివరాలు తెలియజేశారు.



తండ్రి దుక్కి దున్నుతుండగా... రోటవేటర్లో పడి కొడుకు మృతి

- వరంగల్ జిల్లా లైన్‌తండాలో విషాదం

నల్లబెల్లి, జూన్ 10: ట్రాక్టర్ రోటవేటర్‌తో తండ్రి దుక్కి దున్నుతుండగా.. సరదాగా ట్రాక్టర్ ఇంజన్ పైకి ఎక్కిన కుమారుడు ప్రమాదవశాత్తు రోటవేటర్లో పడి మృతి చెందిన ఘటన వరంగల్ జిల్లా నల్లబెల్లి మండలం లైన్‌తండాలో సోమవారం జరిగింది. లైన్‌తండాకు చెందిన గుగులోతు మశోద, రాజులు వ్యవసాయం చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నారు. వీరికి ఇద్దరు కుమారులున్నారు. సోమవారం రాజు ట్రాక్టర్ ఇంజన్‌కు రోటవేటర్‌ను తగిలించుకొని తన భూమిలో దుక్కి దున్నుతున్నాడు. అక్కడికి వచ్చిన అతని చిన్న కుమారుడు గుగులోతు బాలు(9), సరదాగా ట్రాక్టర్ ఎక్కాడు. దుక్కి దున్నతున్న సమయంలో ట్రాక్టర్ కుదుపులకు లోనై బాలు రోటవేటర్లో పడిపోయాడు. వెంటనే ట్రాక్టర్‌ను ఆపినా, అప్పటికే శరీరం రెండు ముక్కలైంది. ఘటన స్థలికి చేరుకున్న కుటుంబసభ్యులు కన్నీరుమున్నీరుగా విలపించారు. విషయం తెలుసుకున్న పోలీసులు వచ్చి మృతదేహాన్ని పరిశీలించారు. బాలుడి తల్లి మశోద ఫిర్యాదు మేరకు ఎస్సై రామారావు కేసు నమోదు చేశారు.


బాలు (ఫైల్)

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., printed at Aamoda Press, H.No.5-9-287/10 & 11, Plot No. 53 & 54, Prasanth Towers, Rajeev Gandhi Nagar, Moosapet, Kukatpally (Mandal), Kukatpally Municipality, Ranga Reddy District and Published at Plot No.76, Ashwini Layout, Huda Heights, Road No.70, Jubilee Hills, Hyderabad-500033. Editor: K. Srinivas. Fax No. 23558288, Phone No: 23558233 / 44 / 55, Regd. No.H/HD 674, RNI No.44903 / 86. Managing Director: Vemuri Radha Krishna, Founder: K.L.N.Prasad.

ఆంధ్రజ్యోతి దిక్సూచి
diksuchi@andhrajyothy.com
హైదరాబాద్ ● మంగళవారం 11 జూన్ 2024

సివిల్స్ ప్రిలిమ్స్

GS mock questions

1. Consider the following statements about Madurai, the capital city of the Pandya kingdom:
1. It has been described in Maduraikkanchi as a large grand city, enclosed by walls on three sides and the cauvery river on the fourth side.
2. The Arthasastra mentions it as a centre of fine cotton textiles.
3. Other lliterary sources describe it as a major craft centre.
Which of the statements given above is correct?
a. 1 only b. 2 and 3 only c. 1 and 2 only d. 1, 2 and 3

2. Consider the following statements about the Jorwe culture of the Deccan:
1. It covers practically the whole of modern Maharashtra except the coastal Konkan district.
2. The Pravara-Godavari valleys seem to have been the nuclear zone.
3. The large sited if this culture yields evidence of shifting agriculture.
Which of the statements given above is correct?
a. 1 only b. 1 and 2 only c. 2 and 3 only d. 1, 2 and 3

3. Man Kautuhal, a work on music, was prepared under the aegis of
a. Raja Man Singh of Gwalior b. Tansen
c. Meerabai d. Amir Khusrau

4. Which one of the following was not a part of the action programme of the Non - cooperation Movement?
a. The congress organization was to the reach down the village and the Mohalla level.
b. Boycott of government affiliated schools and colleges.
c.Taking control of the law and order machinery of the state by the Congress working committee.
d. Surrender of titles and honors given by the government

5. In the context of the Geological Survey of India (GSI) discovering vanadium reserves in India, consider the following statements:
1. Vanadium is an abundant element in the earth's crust.
2. Vanadium is listed as one of the 30 critical minerals.
3. Titanomagnetite is the ore of vanadium.
4. India has the highest reserves of vanadium, while Brazil is the world's largest exporter of vanadium.
How many of the statements given above is correct?
a. Only One b. Only two c. Only three d. All four

6. With reference to the Bochasanwasi Akshar Purushottam Swaminarayan Sanstha Mandir, recently inaugurated at Abhu Dhabi, consider the following statements:
1. It is built in the traditional Vesara style of architecture.
2. Temple is surrounded by 'Dome of Harmony' and 'Dome of Peace.
3. The temple has been built using cement.
4. The temple houses seven shrines.
Which of the statements given above are correct
a) 1 and 3 only b) 1, 2 and 3 only
c) 2 and 3 only d) 2 and 4 only

7. With reference to the Bharat Ratna award, consider the following statements:
1. It is India's highest literary award.
2. The announcement of award recipients usually occurs annually on India's Independence Day.
3. The recommendations for Bharat Ratna are made by the Prime Minister to the President.
How many of the statements given above are correct?
a) Only one b) Only two c) All three d) None

8. With reference to Subika painting, consider the following statements:
1. It is a style of painting which is linked to the Meitei community's cultural history.
2. These paintings traditionally use handmade paper created from the bark of specific trees. Which of the statement(s) given above is/are correct?
a) 1 only b) 2 only c) Both 1 and 2 d) Neither 1 nor 2

9. Which of the following cities was recently added to UNESCO's Creative Cities Network (UCCN)?
a) Gwalior b) Junagadh c) Chittor d) Rishikesh

10. Match List 1 and List 2 and select the correct answer using the code given below the lists:

List 1 (Political idea)	List 2 (Thinker)
A. Human beings, unlike All other objects, posses Dignity	1. Aung San Suu Kyi
B. It is Swaraj when we learn To rule ourselves	2. Subhas Chandra Bose
C. Freedom implies not only emancipation from political bondage but also, equal distribution of wealth	3. Immanuel Kant
D. For me real freedom is freedom from fear	4. Mahatma Gandhi

Code:

	A	B	C	D
a)	3	2	4	1
b)	1	4	2	3
c)	3	4	2	1
d)	1	2	4	3

11. Renowed classical singer Prabha Atre, who passed away recently,was an expotent of which of the following gharanas?
a. Kirana Gharana b. Patiala Gharana
c. Gwalior Gharana d. Agra Gharana

12. At which of the following places was diamond mining carried put during the Delhi Sultanate period?
a) Awadh b) Khambat c) Panna d) Laknauthi

13. Consider the following the pairs:

S.no.	Author	Contribution
1.	Dandin	Nitisara
2.	Kamandaka	Dashakumara charitha
3.	Vishakadatta	Mudrarakshasa
4.	Patanjali	Mahabhashya

How many of the following pairs is /are correctly matched?
a. Only one b. Only two c. Only three d. All four


14. Consider the following the pairs:

S.No.	Location	Leader
1.	Malabar	C.Rajagopalachari
2.	Orissa	Bonsa Majhi
3.	Dharsana	Imam Sahib

How many of the following pairs is /are correctly matched?
a. Only one b. Only two c. Only three d. All four

15. With reference to the colonial history of India, consider the following statements:
1. The Frazer Commission on Police Reforms was established during the Viceroyalty of Lord Curzon.
2. Lord Curzon appointed the MacDonnell Commission to enquire into the results of famine operations.
3. The 'Kitchener Controversy', during the Viceroyalty of Lord Curzon, was related to the military reforms.
How many of the above statements is/are incorrect?
a. Only one b. Only two c. All three d.None

16. With reference to the Silkyara Bend -Barkot Tunnel, consider the following statements:
1. The silkyara Bend -Barkot Tunnel is being implemented through National Highways and Infrastructure Development Corporation Ltd. (NHIDCL).
2. Is falls along the National Highway (NH)-205.
3. It is a part of the 'Chardham Mahamarg Pariyojana'.
How many of the above statements is/are correct?
a. Only one b. Only two c.All three d. None



17. With reference to Lake Victoria, consider the following statements:
1. The lake 's area is divided among Tanzania, Uganda and Kenya, and Uganda occupies the maximum area of the lake.
2. The Equator passes through Lake Victoria.
3. The Kagera river drains into Lake Victoria.
How many of the above statements is /are correct?
a. Only one b. Only two c. All three d. None

18. Consider the following stements regarding Willington Island:
1. It is one of the largest natural islands of India situated near Kochi.
2. It was created during the deepening of Vembanad lake.
Which of the statements given above is/are correct?
a. 1 only b. 2 only c. Both 1 and 2 d. Neither 1 nor 2

19. Consider the following:
1. Intensification of storms 2. Low dissolved oxygen
3. Coral bleaching
How many of the above are the possible impacts of the increasing ocean heat content?
a. Only one b. Only two c. All three d. None

20. Recently erupted Hunga Tonga-Hunga Ha'apai volcano is located in which of the following ocean?
a. Northern Pacific Ocean b. Southern Pacific Ocean
c. Northern Atlantic Ocean d. Southern Atlantic Ocean

21. The Daudhan Dam, Lower Orr Dam, and Kotha barrage are part of which river Interlinking project?
a. Kalasa Banduri project
b. Krishna (Almatti)-Pennar link c. Ken-Betwa link
d. Parbati-Kuno-Sindh link

22. Consider the following winds:
1. Mistral 2. Sirocco 3. Ghibli 4. Khamsin
How many of the above local winds of the Mediterranean Sea is/are hot winds?
a. Only one b. Only two c. Only three d. All four

23. Consider the following statements:
1. An air mass is a large body of air with generally temperature and humidity.
2. Polar air masses originate over the higher latitudes of both land and sea.
3. The air mass which forms over the Indian ocean is cold and dry.
How many of the above statements is/are correct?
a. Only one b. Only two c. All three d. None

24. In which among the following states of India are located the "Namchik-Namphuk"coal fields?
a. Sikkim b. Meghalaya
c.Arunachal Pradesh d. Manipur

25. Which among the following matches of city and their earthquake zone are correct?

S.No.	Place	Zone
1.	Kolkata	Zone III
2.	Guwahti	Zone V
3.	Delhi	Zone IV
4.	Chennai	Zone II

Choose the correct option from the codes given below:
a. 1, 2 b. 1, 2 and 3
c. 1, 3 and 4 d. All the above

26. Which of the following best describes the key objective of Garima Greh scheme?
a. Providing vocational training for rural women.
b. Creating awareness about menstrual hygiene among adolescent girls.
c. Providing shelter home for transgender persons.
d. Promoting legal rights and social acceptance of transgender communities.

27. Consider the following statements regarding Saksham Anganwadi and Poshan 2.0 scheme:
1. It is a centrally Sponsored Scheme under the Ministry of Health and family welfare.
2. Objectives of the scheme is to improve nutritional and health status of children below 5 years.
Which of the statements given above is/are correct?
a. Only 1 b. Only 2 c. Both 1 and 2 d. Neither 1 nor 2

28. Consider the following statements:
1. Ayushman Bharat Yojana aims to undertake interventions to address health at primary level only.
2. Intensified mission Indradhanush focusses on reaching zero-dose children aged between 0 and 5 years.
Which of the statements given above is/are correct?
a. Only 1 b. Only 2 c. Both 1 and 2 d. Neither 1 nor 2

29. 'Triple Threat Report" is released by which of the following organization?
a. World Health Organization
b. World Economic Forum
c. Food and Agriculture organization d. UNICEF

30. Consider the following statements regarding Juvenile Justice Amendment Act, 2021:
1. District Magistrates (DM), including Additional DM, can issue adoption orders.
2. There will be no appeal for any order made by a child welfare committee.
Which of the statements given above is/are correct?
a. Only 1 b. Only 2 c. Both 1 and 2 d. Neither 1 nor 2

31. With reference to the Sukanya Samriddhi Yojana (SSY), Consider the following:
1. The maturity period of the account is 21 years.
2. Only one account can be opened in the name of a girl child.
Which of the statements given above is/are correct?
a. only 1 b. only 2 c. Both 1 and 2 d. Neither 1 nor 2

32. Consider the following statements regarding the clean Ganga Fund(CGF):
1. It is a non-lapsable fund established to enable individuals and corporates to contribute towards the conservation efforts of River Ganga.
2. It is registered under Indian Trust Act and chaired by the Prime Minister.
3. Contribution to the find is a notified Corporate Social Responsibility (CSR) activity.
How many of the above statements are correct?
a. Only one b. Only Two c. All Three d. None

33. Consider the following statements regarding Atmanirbhar Bharat Rozgar Yojana(ABRY):
1. It was launched to incentivize employers for creation of new employment post COVID-19 pandemic.
2. Under the scheme the government provides both the employee and employer contributions for establishments with up to 1000 employees.
3. The benefits is extended to all EPFO registered establishments and their new employees with salaries more than 15,000 per month.
How many of the above statements is correct?
a. Only one b. Only two c. All three d. None

34. Consider the following statements regarding PM Vishwakarma Yojana
1. The scheme is implemented by the Ministry of Rural Development.
2. It provides finance and skill assistance to artisans and craftspeople in India.
Which of the statements given above is/are correct?
a. Only one b. Only two
c. Both 1 and 2 d. Neither 1 nor 2

35. How many of the following are the objectives of PM Surya Ghar Muft Bijli Yojana?
1. To provide free electricity to 5 crore households, up to 300 units of electricity per month.
2. To produce renewable electricity of 1,000 billion units.
3. Installation of 30GW of solar capacity through residential rooftop solar system.
How many of the above statements are correct?
a. Only one b. Only two c. All three d. None

36. With reference to Uniform Civil Code, Consider the following statements:
1. Article 44 of the Indian constitution deals the Uniform civil code.
2. Civil matters like marriage, divorcé comes under the state list.
3. Recently, Himachal Pradesh is the first state to pass a law on Uniform civil code.
How many of the statements given above is correct?
a. Only one b. Only two c. All three d. None

37. Consider the following statements regarding the Sixth Schedule of the constitution:
1. It is applicable to the states of Assam, Meghalaya, Tripura and Manipur.
2. It empowers the Governor to create Autonomous District Councils in the sixth schedule states.
Which of the statements given above is correct?
a. only 1 b. Only 2 c. Both 1 and 2 d. Neither 1 nor 2

38. Section 499 and Section 500 of Indian penal code are seen in news:
a. Curfew regulations b. Detention of convicts
c. Marriage disputes d. defamation

39. Consider the following statements regarding bail provisions:
1. An interim bail petition can be filed by those who fear arrest in non-bailable offense.
2. Anticipatory bail is granted for a short period before the hearing for the grant of regular bail.
3. Regular bail is granted to a person who has been arrested or in a police academy.
How many statements given above are correct?
a. only one b. only two c. All three d. None

ANSWERS

			13. b	19. c	25. d	31. c	37. c
			14. a	20. b	26. c	32. b	38. d
1. b	5. b	9. a	15. d	21. c	27. d	33. b	39. a
2. c	6. d	10. c	16. a	22. c	28. b	34. b	
3. a	7. a	11. a	17. b	23. b	29. d	35. b	
4. c	8. c	12. c	18. b	24. c	30. a	36. a	

Prepared by
CSB Academy, Hyderabad

నిబ్బల్స్



బెడిసికొట్టిన నాటకం

ఒక ఊరిలో రాజారాం అనే దానగుణం కల వ్యక్తి ఉండేవాడు. ఆ ఊరిలో వారంతా అతని దాన గుణాన్ని పొగుడుతూ ఉండేవారు. అదే ఊరిలో ఉండే చలమయ్య అనే మరో వ్యాపారి ఎంగిలి చేతితో కాకిని తోలని పిసినారి. అతను తన దగ్గర పనిచేసే ఉద్యోగులకు సరిగా జీతాలు కూడా ఇచ్చేవాడు కాదు. ఎవరికీ ఒక పూట అన్నం పెట్టేవాడు కాదు ఆపదలో ఉండి ఎవరైనా సాయం అడిగితే ఎట్టి పరిస్థితుల్లోనూ చేసేవాడు కాదు. కానీ చలమయ్యకి రాజారాం లాగా మంచిపేరు సంపాదించుకోవాలని కోరిక. అతను ఒక రోజు తన నౌకరును పిలిచి, నేను ఏం చేసినా ఆ రాజారాం లాగా మంచిపేరు రావడం లేదు నేను కూడా అతనిలాగా గౌరవం పొందాలంటే ఏం చేయాలో ఉపాయం ఆలోచించాలి అన్నాడు దానికా నౌకరు. 'నా దగ్గర ఒక ఉపాయం ఉంది. ఆ రాజారాం మంచివాడే కానీ పెద్ద తెలివి గల వాడు మాత్రం కాదు. మీరు ఒక రోజు ఆ రాజారాంను భోజనానికి పిలవండి. అతను ఇక్కడ భోజనం చేస్తున్నపుడు నేను ఇంటి ముందు బిచ్చగాడిలా వేషం వేసుకుని వస్తాను మీరు నాకు డబ్బు దానం చేయండి. ఇదంతా చూసిన అతను ఊరిలోకి వెళ్లి మీ దానగుణం గురించి అందరి ముందు పొగిడి మీకు మంచి పేరుతెస్తాడు అతనే స్వయంగా చెబితే ఊరిలో అందరూ నమ్మేస్తారు' అన్నాడు. ఈ ఉపాయం బాగుందనుకున్న చలమయ్య ఐతే ఇపుడే రాజారాం ఇంటికి వెళ్లి రేపే మన ఇంటికి భోజనానికి ఆహ్వానించు అని తొందర పెట్టాడు. నౌకరు తన యజమాని చెప్పిన విధంగానే రాజారాం ఇంటికి వెళ్లాడు. అయ్యా మా యజమాని చలమయ్య గారు రేపు తమర్ని వారింటికి భోజనానికి రావల్సిందిగా పిలిచారు అని చెప్పాడు. దానికి రాజారాం అదేమిటయ్యా మీ యజమానికి నేనంటే పడదని విన్నాను. ఆయన ఎవరికీ పది పైసలు కూడా సాయం చేయడు కదా. అలాంటిది నన్ను ఇంటికి పిలవడం ఏమిటి అన్నాడు ఆశ్చర్యంగా. దానికా నౌకరు అయ్యా మా యజమాని మీ వలె దానగుణం కలవాడే కానీ.. ఆయన చేసేవన్నీ ఎవరికీ తెలియకుండా చేసే దానాలు తానుచేసే మంచి పనులను గురించి ఎవరూ బయట చెప్పడం పొగడటం ఆయనకు నచ్చదు. ఇంటి ముందుకు ఎవరు వచ్చి చేయిచాచి అడిగినా కనీసం వంద రూపాయలు ఇచ్చి పంపడం ఆయనకు అలవాటే అన్నాడు. సరే అన్న రాజారాం ఆ మర్నాడు చలమయ్య ఇంటికి వెళ్లాడు రాజారాంను చూసిన చలమయ్య.. అయ్యా తమరు వెంట నౌకరు ఐనా లేకుండా వచ్చారే అని అడిగాడు. దానికి రాజారాం మా నౌకరు అత్యవసరమైన పని మీద ఇంట్లోనే ఉండిపోయాడు వచ్చేస్తాడు లెండి అని చెప్పాడు ఆ మాటలు విన్న చలమయ్య రాజారాంతో మా నౌకరును మీతో నేను చేసే గుప్తదానాల గురించి అంతా చెప్పాడట కదా అలా నాకు అసలు నచ్చదు అన్నాడు. ఇద్దరూ అలా కబుర్లు చెప్పుకుంటూ భోజనం చేస్తూండగానే చలమయ్య ఇంటి ముందుకు ఒక యాచకుడు వచ్చి ధర్మం చేయండయ్యా అని అరిచాడు. చలమయ్య అతనికి నూరు రూపాయలు ఇచ్చిపంపేసాడు. ఆ వెంటనే మరో యాత్రికుడు.. మరొక పేదవాడు.. ఇలా వెంటవెంటనే పది మంది వచ్చి సాయం అడగగానే చలమయ్య అందరికీ సాయం చేయడం రాజారాంను ఆశ్చర్యపరిచింది. అంత వేగంగా తన నౌకరు అన్ని వేషాలు మార్చి రావడం తన మంచి పేరుకోసం తాపత్రయ పడటం అతనికి ఎంతో సంతోషాన్నిచ్చింది. కాసేపటి తర్వాత చలమయ్య నౌకరు తన మామూలు దుస్తుల్లో వచ్చి, అయ్యా ఇవాళ్టితో మీరు లక్ష రూపాయలు దానం చేసిన సందర్భంగా మీ పేరున గుడిలో అర్చన చేయించి ప్రసాదం తీసుకొచ్చాను ఇదిగో అని ప్రసాదం ఇచ్చాడు. అపుడు చలమయ్య అంత త్వరగా పది వేషాలు మార్చి ఎలా రాగలిగావు రా? ఇంతకీ ఏదీ మన సొమ్ము? వెయ్యి రూపాయలు అన ఆత్రుతగా అడిగాడు దానికి నౌకరు అయ్యా పది సారుల ఏమిటినేను వేషాలు మార్చి వచ్చి దానం తీసుకుననది ఐదు సార్లే ఇదిగోండి మీ దగ్గర తీసుకున్న ఐదు వందలు అంటూ ఐదు వందలు చేతిలో పెట్టాడు. అపుడు చలమయ్య నౌకరుతో నేను మొత్తం పది మందికి ఒక్కొక్కరికి వంద రూపాయల చొప్పున దానం చేసానని గుర్తు.. నువ్వేమో ఐదు సార్లే వచ్చాను అంటున్నావు. మరి మిగతా ఐదుసార్లు వచ్చి దానం పుచ్చుకున్నది ఎవరు అన్నాడు అయోమయంగా. వాడు మా నౌకరు అయి ఉంటాడులెండి మీ డబ్బు ఎక్కడికీ పోదు. మా నౌకరు కూడా నిజాయితీ పరుడే కాసేపట్లో మీ డబ్బు మీకు అంద జేస్తాడు మంచి చేయాలి కానీ మంచి పేరు కోసం అడ్డదారుల్లో ప్రయత్నించకూడదు చలమయ్య గారూ.. మీరు మీ నౌకరుతో కలసి ఆడిన నాటకం అంతా నాకు ముందే తెలుసు అని చెప్పి అక్కడి నుండితన నౌకరుతో వెళ్లాడు రాజారాం.

10 తేడాలు గుర్తించండి





దారి కనుక్కోండి



డైలీ సుడోకు - 329

6		7			9			
			4	8	7			
	5		6					
5	1					3	4	
	6	8				9	5	
	2	4					7	8
					4		9	
			7	9	2			
			8			6		7

సుడోకు - 328 సమాధానం

7	9	4	1	5	8	6	3	2
5	6	2	3	4	9	7	1	8
3	8	1	6	7	2	5	9	4
4	1	9	2	8	5	3	6	7
6	7	8	4	9	3	1	2	5
2	3	5	7	6	1	4	8	9
9	5	3	8	1	7	2	4	6
1	4	7	9	2	6	8	5	3
8	2	6	5	3	4	9	7	1

ప్రతి బాక్స్‌లో 9 గళ్లు ఉంటాయి. ఒక్కో బాక్స్‌ను 1 నుంచి 9 వరకు అంకెలతో పూరించాలి. అన్ని బాక్స్‌లనూ కలిపి చూస్తే నిలువుగా, అడ్డంగానూ ఏ లైనులోనూ ఒకసారి వాడిన అంకెను తిరిగి వాడకూడదు.